శనివారం 13-1-2024

సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 293

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసీ గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'



క్షిపణి ప్రయోగం సక్సెస్

దేశ సైనిక సంపత్తిని బలోపేతం చేసే కొత్త తరం ఆకాశ్‌–ఎన్‌జీ క్షిపణి ప్రయోగ పరీక్ష విజయవంతమైనట్లు రక్షణ శాఖ తెలిపింది.

- వివరాలు 6లో



ఎవరీ ఎర్ర సముద్రపు హౌతీలు?

ఎర్రసముద్రం మీదుగా ప్రయాణిస్తున్న అంతర్జాతీయ నరుకు రవాణా నౌకలపై దాడులకు పాల్పడుతున్న హౌతీ ఉగ్రవాద ముఠాలపై కథనం.

- వివరాలు 6లో



శుక్రవారం రాత్రి విద్యుత్ వెలుగుల్లో అటల్ సేతు..

- వివరాలు 6లో



'యాదాద్రి'లో ఎందుకీ జాప్యం?

- థర్మల్ విద్యుత్ కేంద్రంపై సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి ఫైర్
- ఒప్పందం ప్రకారం 2021 నాటికే పూర్తి కావాలి
- నామినేషన్ ప్రాతిపదికన పనులు బీహెచ్‌ఈఎల్‌కు ఎలా అప్పగించారు

- 3లో

టెట్.. ఇదేమి టెస్ట్!

అర్హత పరీక్షపై ఉపాధ్యాయ సంఘాల్లో భిన్నాభిప్రాయాలు



- అసలు పరీక్షే వద్దంటున్న కొన్ని సంఘాలు
- మొండిగా ముందుకెళితే ఉద్యమిస్తామంటూ హెచ్చరికలు
- కొత్తవారిని కలపకుండా అంతర్గత పరీక్షలు నిర్వహించాలంటున్న మరికొన్ని సంఘాలు.. వ్యతిరేకిస్తున్న 2012 తర్వాత నియమితులైన టీచర్లు
- విద్యాహక్కు చట్టం, కోర్టు ఆదేశాలతో తప్పనిసరిగా మారిన టెట్ నిర్వహణ
- టీచర్ పోస్టుకు, పదోన్నతులకు, మెగా డీఎస్సీకి ఒకదానితో ఒకటి లింక్
- విద్యాశాఖ అధికారుల అయోమయం
- సంక్లిష్ట సమస్యపై చర్చించి సీఎంకు నివేదించాలనే యోచన

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ టీచర్లకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహించడం విద్యాశాఖకు సవాల్‌గా మారింది. కోర్టు ఆదేశాల నేపథ్యంలో టెట్ పెట్టడం అనివార్యం కావడంతో ఇందుకు సంబంధించిన కసరత్తుపై అధికారులు దృష్టి సారించారు. అయితే దీనిపై ఉపాధ్యాయ వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. మొండిగా టెట్ పెట్టే ఆలోచన చేస్తే ఉద్యమించడానికి సిద్ధమంటూ కొన్ని సంఘాలు హెచ్చరిస్తున్నాయి. టెట్ తప్పనిసరి అనుకుంటే కొత్తవారితో కలిపి కాకుండా టీచర్ల వరకే అంతర్గత పరీక్ష నిర్వహించాలని మరికొన్ని సంఘాలు అంటున్నాయి. కానీ దీన్ని అంగీకరించేది లేదని 2012 తర్వాత నియమితులైన టీచర్లు స్పష్టం చేస్తున్నారు. అవసరమైతే కోర్టుకెళ్తామని చెబుతున్నారు. దీంతో విద్యాశాఖ గందరగోళంలో పడింది.

ఎన్ని లింకులో..: టెట్‌లో ఉత్తీర్ణులైన వారే టీచర్ పోస్టుకు అర్హులు. టెట్‌లో అర్హత సాధిస్తేనే ఇప్పటికే ఉన్న ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వడం సాధ్యమవుతుంది. ఈ మేరకు కేంద్రం నిబంధన విధించింది. పదోన్నతులు లభిస్తేనే విద్యాశాఖలో వాస్తవ ఖాళీలు తెలుస్తాయి. అప్పుడే మెగా డీఎస్సీ చేపట్టడం సాధ్యమవుతుంది. ఇలా ఒక దానికి మరొకటి లింక్ ఉండటంతో సమస్య కొలిక్కి వచ్చే పరిస్థితి కన్పించడం లేదు. మరోవైపు మెగా డీఎస్సీ నిర్వహిస్తామన్న ప్రభుత్వ హామీ విషయంలో నిరుద్యోగుల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. ఇలా సంక్లిష్టంగా మారిన

మిగతా 2వ పేజీలో ▶

ఎమ్మెల్సీలు.. నామినేటెడ్ జాబితా..



కాంగ్రెస్ హైకమాండ్ ఆమోదం కోసం ఢిల్లీకి రేవంత్

నేడు ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్, ముఖ్య నేతలతో భేటీ!

సీఎం హస్తిన పర్యటనతో ఆశావహుల్లో ఉత్కంఠ

రేపు మణిపూర్‌కు ముఖ్యమంత్రి..అదే రోజు దావోస్‌కు

సాక్షి, హైదరాబాద్/ సాక్షి, న్యూఢిల్లీ: శాసనమండలిలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీల ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల నేపథ్యంలో అభ్యర్థుల ఎంపిక కసరత్తును కాంగ్రెస్ వేగవంతం చేసింది. ఈ నెల 18 నామినేషన్ల దాఖలుకు తుది గడువు కావడంతో అధిష్టానం నుంచి ఆమోదం పొందేందుకు సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం ఢిల్లీ చేరుకున్నారు. ఈ నెల 14న దావోస్ పర్యటనకు వెళ్తున్న నేపథ్యంలో ఆలోపే అభ్యర్థుల పేర్లను ఖరారు చేసి, హైకమాండ్ ఆమోదముద్ర వేయించాలని ముఖ్యమంత్రి భావిస్తున్నట్టు పార్టీ వర్గాలు వెల్లడించాయి. రెండు ఎమ్మెల్సీ స్థానాలకు పార్టీ అభ్యర్థుల పేర్లతో పాటు

మిగతా 2వ పేజీలో ▶

టీఎస్‌పీఎస్సీ పోస్టులకు దరఖాస్తులు!

- చైర్మన్, సభ్యుల నియామకం కోసం సర్కారు ఆహ్వానం
- నామినేటెడ్ విధానం స్థానంలో తొలిసారి కొత్త పద్ధతి
- 18వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తుకు అవకాశం

- 2లో

'దళితబంధు' ఉంటుందా?

- త్రిశంకు స్వర్గంలో పథకం.. 11వేల మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.436.27 కోట్లు
- ఆ ఖాతాలు ఫ్రీజ్.. డబ్బులున్నా విత్ డ్రా చేసుకోలేని స్థితి

- 8లో

'కారు' వెళ్లింది షెడ్డుకు కాదు.. సర్వీసింగ్‌కే

ప్రభుత్వ వ్యతిరేకతను అంచనా వేయలేకపోవడం వల్లే ఓటమి

భువనగిరి బీఆర్‌ఎస్ సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు



- పదేళ్లలో పార్టీ కార్యకర్తల ఆర్థిక పరిస్థితిని పట్టించుకోలేక పోయాం
- దళితబంధు, రైతుబంధు కొందరికి ఇవ్వడాన్ని జనం జీర్ణించుకోలేదు
- కవిత అరెస్టు కాకపోవడానికి సుప్రీంకోర్టు జోక్యమే తప్పించి బీజేపీతో సంబంధాలు కాదు
- అమిత్ షాతో రేవంత్ భేటీ తర్వాతే ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పద్ధతి మారింది

8 లో

క్లుప్తంగా...

కృష్ణా ట్రిబ్యునల్-2 కేసు విచారణ వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ: కృష్ణా ట్రిబ్యునల్-2పై కేంద్రం నోటిఫై చేసిన నూతన విధివిధానాలను (టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్) సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. శుక్రవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. గత విచారణ సందర్భంగా బెంచ్ ఆదేశాల మేరకు కౌంటర్ దాఖలు చేసినట్టు విచారణలో కేంద్ర జలశక్తి శాఖ న్యాయవాదులు ధర్మాసనానికి వివరించారు. అయితే ఈ కౌంటర్‌కు రిజైండర్ దాఖలు చేసేందుకు సమయం ఇవ్వాలని ఏపీ ప్రభుత్వం తరఫు అడ్వొకేట్లు కోరగా, విచారణను ధర్మాసనం రెండువారాల పాటు వాయిదా వేసింది. గత ఏడాది అక్టోబర్ 6న రెండు రాష్ట్రాల మధ్య నీటి పంపకాలపై కృష్ణా ట్రిబ్యునల్-2 విచారణ కొనసాగించాలని కేంద్రం నూతన విధివిధానాలతో గెజిట్ జారీ చేసింది. కేంద్రం జారీచేసిన ఈ గెజిట్‌ను వ్యతిరేకిస్తూ ఏపీ ప్రభుత్వం గత ఏడాది నవంబర్‌లో సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌లో ప్రతివాదులుగా ఉన్న కేంద్రం, తెలంగాణ రాష్ట్రానికి సుప్రీంకోర్టు నోటీసులు ఇవ్వగా.. కేంద్ర జలశక్తి శాఖ స్పందించి కౌంటర్ దాఖలు చేసింది.

బీసీ కులగణన కేసు ఫిబ్రవరి 5కి వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: కులగణనపై రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. కులగణన, బీసీ రిజర్వేషన్ పెంపునకు సంబంధించి రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేయాలంటూ ఆర్.కృష్ణయ్య 2020లో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌తో పాటు మరికొన్ని పిటిషన్లను శుక్రవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం విచారించింది. బిహార్ ప్రభుత్వం చేపట్టిన ఓ సర్వే పిటిషన్‌ను ఈ పిటిషన్ల నుంచి డీట్యాగ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్.కృష్ణయ్య పిటిషన్‌తో పాటు ఇతరులు దాఖలు చేసిన అన్ని పిటిషన్లపై విచారణను ఫిబ్రవరి 5వ తేదీకి సుప్రీంకోర్టు వాయిదా వేసింది.

వివేకానందుడే స్ఫూర్తి కావాలి: రాజాసింగ్



సాక్షి, హైదరాబాద్: యువతకు స్ఫూర్తి ప్రదాత, దేశ ప్రతిష్టను విశ్వవ్యాప్తం చేసిన చైతన్యమూర్తి స్వామి వివేకానంద బాటలో ప్రతి ఒక్కరూ ముందుకెళ్లాలని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ కోరారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి రాజాసింగ్ పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. వేడుకల్లో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండల లక్ష్మీనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి గొట్టాల ఉమరాణి, బండారి శాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 11న ఖమ్మంలో విద్యా, వైజ్ఞానిక సభలు

టీపీటీఎఫ్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఖమ్మంలో రాష్ట్ర స్థాయి ద్వితీయ విద్యా, వైజ్ఞానిక మహాసభలను ఫిబ్రవరి 11, 12 తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ప్రకటించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న తీరు, పేద విద్యార్థులకు, ఉపాధ్యాయ వర్గానికి జరుగుతున్న నష్టాన్ని ఈ సభల్లో చర్చించనున్నట్టు సంఘం నేతలు తెలిపారు. ప్రభుత్వాలు కొత్త విద్యా విధానం పేరుతో ప్రైవేటు వ్యవస్థలను బలోపేతం చేస్తున్న వైనంపై కూడా చర్చిస్తామన్నారు. శుక్రవారం జరిగిన టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను సంఘం అధ్యక్షుడు వై.అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి వివరించారు. ఖమ్మంలో జరిగే సభల్లో పలువురు జాతీయ, రాష్ట్రస్థాయి వక్తలు పాల్గొంటారని తెలిపారు.

‘టీఎస్‌పీఎస్సీ’కి దరఖాస్తులు

చైర్మన్, సభ్యుల నియామకం కోసం సర్కారు ఆహ్వానం

- నామినేటెడ్ విధానానికి స్వస్తి పలికిన కొత్త ప్రభుత్వం
- 18వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తుకు అవకాశం
- ప్రకటన జారీ చేసిన సీఎస్ శాంతికుమారి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) చైర్మన్, సభ్యుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త విధానానికి తెరలేపింది. రాజ్యాంగబద్ధమైన ఈ పోస్టులకు ఇప్పటివరకు అర్హత కలిగిన వ్యక్తులను నామినేటెడ్ పద్ధతిలో నియమిస్తుండగా..తొలిసారిగా దరఖాస్తు విధానాన్ని కొత్త సర్కారు ప్రవేశపెట్టింది. దరఖాస్తులు ఆహ్వానిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి, అర్హతలు ఉన్నవారు ఈనెల 18వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుందని సీఎస్ పేర్కొన్నారు. www.telangana.gov.in వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పూరించిన దరఖాస్తును secy-ser-gad@telangana.gov. in ఈమెయిల్ ద్వారా సమర్పించాలని స్పష్టం చేశారు.



మూడు పేజీల దరఖాస్తు

టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యుల పోస్టుల భర్తీ కోసం రాష్ట్ర ప్రభుత్వం మూడు పేజీల దరఖాస్తును రూపొందించింది. విద్యార్హతలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో పనిచేసిన ఉద్యోగి అయితే నియామకం వివరాలు, విధులు, సాధించిన విజయాలు తదితర పూర్తి సమాచారాన్ని పొందుపరచాలి. అకడమిక్, మేనేజ్‌మెంట్, న్యాయశాస్త్రం, శాస్త్ర సాంకేతిక రంగం, హ్యుమానిటీస్ లేదా వారి పనిని గుర్తించే రంగానికి సంబంధించిన వివరాలను, నిర్వహించిన బాధ్యతలకు సంబంధించిన పూర్తి వివరాలను సమర్పించాల్సి ఉంటుంది. తమ ప్రత్యేకతలు, విజయాలను 200 పదాల్లో వివరించాలి. పూర్తి వివరాలకు నోటిఫికేషన్ చూడాలని సీఎస్ తెలిపారు.

మరో సభ్యురాలి రాజీనామా

టీఎస్‌పీఎస్సీ సభ్యురాలు సుమిత్ర ఆనంద్ తనోబా శుక్రవారం తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా లేఖను గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు పంపించారు. ఆరేళ్ల పాటు కొనసాగాల్సిన తాను రెండున్నరేళ్లకే రాజీనామా చేస్తున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల టీఎస్‌పీఎస్సీలో నెలకొన్న పరిస్థితులు, ప్రభుత్వ మార్పు నేపథ్యంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.

సెర్చ్ కమిటీ ద్వారా పరిశీలన

చైర్మన్, మెంబర్ పోస్టులకు వచ్చిన దరఖాస్తుల పరిశీలనకు రాష్ట్ర ప్రభుత్వం సెర్చ్ కమ్ స్క్రీనింగ్ కమిటీని ఏర్పాటు చేయనుంది. ఈ కమిటీ దరఖాస్తులను పరిశీలించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పిస్తుంది. ప్రభుత్వ ప్రతిపాదనల మేరకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 316 ప్రకారం టీఎస్‌పీఎస్సీ చైర్మన్, మెంబర్‌లను గవర్నర్ నియమిస్తారు. ఆర్టికల్ 316 ప్రకారం టీఎస్‌పీఎస్సీ నిబంధనలకు లోబడి దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది.

పత్తి రైతుల ఆందోళన

- ఆదిలాబాద్ మార్కెట్‌లో కొన్ని గంటల పాటు నిలిచిన కొనుగోళ్లు
- పేరుకుపోయిన బేళ్లు.. ట్రాన్స్‌పోర్టర్ల సమ్మె

సాక్షి, ఆదిలాబాద్: సీసీఐ, వ్యాపారులు పత్తి కొనుగోళ్లు చేయకపోవడంతో కొన్ని గంటలపాటు ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ స్తంభించింది. జిన్నింగ్ మిల్లుల్లో స్థలం లేకపోవడంతో తాము పత్తి కొనలేమంటూ వారు చేతులెత్తారు. దీనిపై రైతులకు ఏ సమాచారం లేకపోవడంతో శుక్రవారం మార్కెట్‌కు పెద్ద ఎత్తున రైతులు పత్తి బండ్లతో వచ్చారు. ఉదయం కొద్దిమంది నుంచి పత్తి కొనుగోలు చేసి, ఆపై నిలిపివేశారు. దీంతో రైతులు ఆందోళనకు దిగారు. ఒక్కసారిగా ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ట్రాన్స్‌పోర్టర్లు, వ్యాపారులతో అధికారులు సమావేశమై సయోధ్య కుదర్చడంతో మధ్యాహ్నం నుంచి తిరిగి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి.

సమ్మెను సాకుగా చూపుతూ

ఆదిలాబాద్‌లో ఇప్పటివరకు వ్యాపారులు 3 లక్షల క్వింటాళ్లకు పైగా, సీసీఐ 8 లక్షల క్వింటాల పత్తిని కొనుగోలు చేసింది. జిన్నింగ్ మిల్లుల్లో పత్తిని బేళ్లుగా మార్చి భారీ వాహనాల ద్వారా తమిళనాడుకు తరలిస్తారు. అయితే ఆదిలాబాద్‌లో నాలుగు రోజులుగా ట్రాన్స్‌పోర్టర్లు పత్తి బేళ్లు లిఫ్ట్ చేయడం లేదని సీసీఐ, వ్యాపారులు ఆరోపిస్తున్నారు.



ఆదిలాబాద్ మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లు నిలిచిపోవడంతో బారులుతీరిన పత్తి వాహనాలు

నూతన రవాణా చట్టాన్ని నిరసిస్తూ సమ్మెలో భాగంగా తాము ట్రాన్స్‌పోర్ట్ చేయడం లేదని అసోసియేషన్ నేతలు చెబుతున్నారు. దీంతో జిన్నింగ్ మిల్లుల్లో పెద్ద ఎత్తున నిల్వలు పేరుకపోయాయి. ఈ పరిస్థితుల్లో పత్తి కొనుగోళ్లు నిలిపివేయడమే రైతుల ఆందోళనకు దారితీసింది.

సయోధ్య కుదిర్చినా..

ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి ట్రాన్స్‌పోర్టర్లు, వ్యాపారులను చర్చలకు పిలిచారు. రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దన్నారు. దీంతో మధ్యాహ్నం నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. అయితే ఈనెల 14 నుంచి 17 వరకు పత్తి కొనుగోళ్లు చేయమని సీసీఐ ప్రకటించింది. జిన్నింగ్ మిల్లుల్లో నిల్వలు పేరుకుపోవడంతోనే తాము కొనుగోలు చేయలేమని మార్కెటింగ్ అధికారులకు వారు స్పష్టం చేశారు. దీంతో పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు.

కాగజ్‌నగర్ కాటన్ మిల్లులో అగ్ని ప్రమాదం

రూ.2 కోట్ల విలువైన పత్తి దగ్ధం

రెబ్బెన(ఆసిఫాబాద్): కుమురంభీం జిల్లా రెబ్బెన మండలంలోని కాగజ్‌నగర్ కాటన్ మిల్లులో శుక్రవారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. రూ.2 కోట్ల విలువైన పత్తి అగ్నికి ఆహుతైంది. ఈ ఘనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం మధ్యాహ్నం తర్వాత మిల్లులోకి పత్తి లోడుతో వచ్చిన ట్రాక్టర్ ఇంజిన్ స్టార్ట్ చేసే క్రమంలో నిప్పురవ్వలు చెలరేగాయి. క్షణాల్లోనే మిల్లు ఆవరణలో ఉన్న పత్తితో పాటు బేళ్లకు అంటుకోవటంతో పెద్దమొత్తంలో మంటలు వ్యాపించాయి. అక్కడ ఉన్న వారు వెంటనే ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాల్లోని ఫైరింజన్లకు సమాచారం అందించగా.. ఘటనా స్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. అప్పటికే 2,300 క్వింటాళ్ల పత్తితో పాటు, 94 పత్తి బేళ్లు కాలిపోయాయని మిల్లు నిర్వాహకులు తెలిపారు.



మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

టెట్.. ఇదేమి టెస్ట్!

▶ మొదటి పేజీ తరువాయి

ఈ సమస్యపై త్వరలో చర్చించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఆ తర్వాత ముఖ్యమంత్రికి ఓ నివేదిక ఇచ్చే యోచనలో ఉన్నారు.

టీచర్లలో సిలబస్ ఆందోళన

టెట్ రాయాల్సిన చాలామంది ఉపాధ్యాయుల్లో ఆందోళన కన్పిస్తోంది. ఇప్పుడున్న సిలబస్ ప్రకారం పరీక్ష రాయడం కష్టమని వారు భావిస్తున్నారు. సర్వీస్‌లో ఉన్న టీచర్లు దశాబ్దాల తరబడి ఏదో ఒక సబ్జెక్టును మాత్రమే బోధిస్తున్నారు. మేథ్స్ చెప్పే టీచర్‌కు సైన్స్, సైన్స్ చెప్పే టీచర్‌కు మేథ్స్‌లో అవగాహన ఉండే అవకాశం లేదు. అన్ని సబ్జెక్టులపై పట్టు ఉంటే తప్ప టెట్ అర్హత పొందడం కష్టం. ఇప్పటి యువకులతో పరీక్షలో పోటీ పడలేమని భావిస్తున్నారు. ఈ కారణంగానే టెట్ అనివార్యమైతే సులభంగా ఉండే డిపార్ట్‌మెంటల్ పరీక్ష మాదిరి ప్రత్యేకంగా నిర్వహించాలని కోరుతున్నారు. జనరల్ అభ్యర్థులకు 150 మార్కులకు 90 మార్కులు వస్తేనే అర్హత లభిస్తుంది. కాగా కోచింగ్ తీసుకున్నప్పటికీ బీఈడీ అభ్యర్థులు రాసే పేపర్-2లో ఓసీలు 5% మాత్రమే అర్హత సాధిస్తుండటం గమనార్హం.

టెట్ ఎంతో కీలకం

కేంద్ర ప్రభుత్వం 2010లో విద్యా హక్కు చట్టాన్ని తెచ్చింది. దీని ప్రకారం టీచర్‌గా పనిచేయాలనుకునే వారు టెట్ ఉత్తీర్ణులై ఉండాలి. ఆ అర్హత ఉంటేనే పదోన్నతి పొందడానికి కూడా అర్హులు. దీని అమలుకు సంబంధించి నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్స్ ఎడ్యుకేషన్ 2012లో ఆదేశాలు జారీ చేసింది. అయితే 2012 కన్నా ముందు ఎక్కడా టెట్ లేదనే అభిప్రాయంతో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టెట్ తప్పనిసరి నుంచి మినహాయింపు ఇచ్చింది. ఇదే 2022 వరకు కొనసాగుతూ వచ్చింది. కాగా 2022లో పదోన్నతులు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధం కావడంతో సమస్య మొదలైంది. టెట్ అర్హత ఉన్న టీచర్లు కోర్టును ఆశ్రయించారు. దీంతో పదోన్నతులకు టెట్ తప్పనిసరి అని కోర్టు తీర్పు చెప్పింది. ఫలితంగా టెట్ పరీక్ష నిర్వహించడం విద్యాశాఖకు అనివార్యమైంది. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 1.03 లక్షల మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. వీరిలో 2012 కన్నా ముందు నియమితులైన వారు 80 వేల మంది ఉంటారు. మిగతా వాళ్ళంతా టెట్ అర్హత ఉన్నవాళ్ళే. కాగా పదోన్నతులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని విద్యాశాఖ మరోసారి కోరినప్పటికీ నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్స్ ఎడ్యుకేషన్ అంగీకరించలేదు.

టెట్‌పై ఉద్యమిస్తాం



ఏళ్ళ తరబడి బోధించే ఉపాధ్యాయుడికి టెట్ తప్పనిసరి చేయడం సహేతుకం కాదు. ఈ చట్టం తెచ్చినప్పుడే వ్యతిరేకించాం. ఈ ఒక్కసారైనా టెట్ లేకుండా పదోన్నతులు ఇవ్వాలి. కానీ టెట్‌నే కొలమానంగా భావిస్తే మాత్రం ఉద్యమిస్తాం.

\- పి.నాగిరెడ్డి
(టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి)

ప్రభుత్వమే ఆలస్యం చేసింది



టెట్‌పై ప్రభుత్వమే ఆలస్యం చేసింది. ఈ కారణంగానే పదోన్నతులు రాకుండా ఆగిపోయాయి. శాఖపరమైన టెట్ నిర్వహిస్తే ఇప్పటికే ఉపాధ్యాయులు అర్హత సాధించే వాళ్ళు. టెట్ లేకుండా ముందుకెళ్ళడం కష్టమే. కాబట్టి ఉపాధ్యాయులు దీనికి సిద్ధపడాల్సిందే.

\- చావా రవి
(టీఎస్‌యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి)

డిపార్ట్‌మెంటల్ పరీక్షలా..



టెట్ అర్హత పొందకుండా పదోన్నతులు పొంద డం కష్టమే. అయితే దీర్ఘకాలంగా పనిచేస్తున్న టీచర్లకు టెట్ పరీక్ష అంతర్గతంగా నిర్వహించాలి. ఇతర విద్యార్థులతో కాకుండా వేరుగా చేపట్టాలి. దీన్నో డిపార్ట్‌మెంటల్ టెస్ట్‌లా చేపడితే మేలు.

\- పింగిలి శ్రీపాల్‌రెడ్డి
(పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు)

స్వామి వివేకానంద బాటలో నడవాలి

- మంత్రులు పొన్నం, జూపల్లి
- ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో స్వామి వివేకానంద జయంతి వేడుకలు



ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో స్వామి వివేకానంద జయంతి వేడుకల్లో మంత్రులు జూపల్లి, పొన్నం తదితరులు

సాక్షి, న్యూఢిల్లీ: భారతదేశ గౌరవాన్ని ప్రపంచానికి తెలియజేసిన మహానుభావుడు స్వామి వివేకానంద అని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కొనియాడారు. అటువంటి గొప్ప వ్యక్తి బాటలో నేటి యువతరం నడవాల్సిన అవసరం ఉందని చెప్పారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్‌లు వివేకానంద చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం మంత్రులు మాట్లాడుతూ.. స్వామి వివేకానంద చిన్నతనంలోనే అనేక విషయాలపై పట్టు సాధించిన వ్యక్తి అని అన్నారు.

పొన్నంకు క్రిబ్‌కో చైర్మన్ సన్మానం..

ఢిల్లీ వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్ క్రిబ్‌కో చైర్మన్ చంద్రపాల్‌సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మంత్రిని శాలువాతో సత్కరించారు. తెలంగాణలో సహకార రంగం అభివృద్ధికి కృషి చేస్తామని చంద్రపాల్ సింగ్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

నకిలీ మందుల సమాచారం ఇవ్వండి

డీసీఏ డైరెక్టర్ జనరల్ వీబీ కమలాసన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ప్రజారోగ్యానికి పెనుముప్పుగా మారిన నకిలీ డ్రగ్స్ పై సమాచారం ఇవ్వాలని డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్(డీసీఏ) డైరెక్టర్ జనరల్ వీబీ కమలాసన్‌రెడ్డి కోరారు. ప్రజాదరణ పొందిన ప్రముఖ కంపెనీల బ్రాండ్‌లను పోలి ఉండేలా కొన్ని మోసపూరిత కంపెనీలు నకిలీ మందులను తయారుచేసి మార్కెట్‌లో విక్రయిస్తున్నట్టు తెలిపారు. ఇందుకు గత కొద్ది రోజులలో డీసీఏ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన దాడుల్లో గుర్తించిన మందులే ఉదాహరణగా ఆయన శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నకిలీ మందులు వ్యాధిని నయం చేయడంలో విఫలం కావడమే కాకుండా కాలక్రమేణా, రోగికి వినాశకరమైన పరిణామాలను సృష్టిస్తాయని తెలిపారు.

అనుమానం వచ్చినా ఫోన్ చేయండి

నకిలీ మందులను గుర్తించినా, నకిలీ అనే అనుమానం వచ్చినా స్థానిక డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ లేదా అసిస్టెంట్ డైరెక్టర్, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్‌కు తెలియజేయాలని సూచించారు. వివరాల కోసం డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్, తెలంగాణ వెబ్‌సైట్ https://dca.telangana.gov.inలో ‘కీ కాంటాక్ట్స్’ విభాగంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. డీసీఏ టోల్ ఫ్రీ నంబర్ 18005996969లో అన్ని పని దినాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.00 వరకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. మెడికల్ షాపుల్లో డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ (పేరు, సంప్రదించాల్సిన నంబర్, చిరునామా) వివరాలు, డీసీఏ టోల్ ఫ్రీ నంబర్‌తో కూడిన ‘పోస్టర్’ని ప్రదర్శిస్తున్నట్టు తెలిపారు.

ఆ కోడి వేలం ఆగింది

‘సాక్షి’ కథనంతో స్పందించిన బ్లూక్రాస్ సొసైటీ

- సినీనటి అమల చొరవతో వేలాన్ని అడ్డుకున్న ఎన్జీవో



కోడిని బ్లూక్రాస్ ప్రతినిధులకు అప్పగించిన కరీంనగర్ ఆర్టీసీ అధికారులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కోడి వేలంపాట నిలిచిపోయింది. కరీంనగర్-2 ఆర్టీసీ డిపోలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు వేలం జరగాల్సి ఉంది. అయితే ‘సాక్షి’దినపత్రికలో వచ్చిన కథనానికి ప్రముఖ సినీనటి, బ్లూక్రాస్ సొసైటీ వ్యవస్థాపకురాలు అక్కినేని అమల స్పందించారు. వెంటనే వేలంపాటను ఆపి కోడిని రక్షించాలని కరీంనగర్ బ్లూక్రాస్ సొసైటీ సభ్యులను ఆదేశించారు. కోడి వేలంపాట నిర్వహణ వన్యప్రాణి నిబంధనలకు విరుద్ధమని, తక్షణమే వేలంపాట ఆపాలని ‘‘ప్రివెన్షన్ ఆఫ్ క్రూయెల్టీ టు యానిమల్స్ (కేస్ అండ్ మెయింటెనెన్స్ ఆఫ్ కేస్ ప్రాపర్టీ యానిమల్స్) రూల్స్ 2017’’ప్రస్తావిస్తూ కరీంనగర్ డిపో-2 అధికారులకు బ్లూక్రాస్ ప్రతినిధి తూము నారాయణ లేఖ అందించారు. దీంతో లేఖను తీసుకున్న ఆర్టీసీ అధికారులు వారికి కోడిని అప్పగించారు. కోడిని సాయంత్రానికి హైదరాబాద్‌కు తరలించాల్సి ఉన్నా, చీకటి పడటంతో శనివారం ఉదయం మాదాపూర్ బ్లూక్రాస్ సొసైటీకి తరలిస్తామని నారాయణ వెల్లడించారు.

సాక్షి ఎఫెక్ట్

నాన్న గుర్తు.. కోడిని ఇవ్వకపోతే చచ్చిపోతా



ఆ కోడి తనదంటూ నెల్లూరు జిల్లా కావలికి చెందిన వల్లెపు మహేశ్ శుక్రవారం వీడియో విడుదల చేశాడు. తాను సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలంలో మేస్త్రీ పని చేయిస్తున్నానని ఈ క్రమంలో కోడిని తీసుకొని ఈ నెల 8న తాను కరీంనగర్ నుంచి వరంగల్‌కు ప్రయాణి స్తున్న క్రమంలో బస్సులో మర్చిపోయానని, తన కోడి ని తనకు అప్పగించాలని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ కార్యాలయాన్ని ఆశ్రయించాడు. తన తండ్రి గుర్తుగా పెంచుకుంటున్న కోడిని తనకు ఇవ్వాలని కోరాడు. తాను కోడిని పెంచిన సమయంలో తీసిన ఫొటోలు, వీడియోలు వారికి షేర్ చేశాడు. అయితే ఎండీ అందుబాటులో లేకపో వడంతో కరీంనగర్ అధికారులను సంప్రదించాడు. వారు కోడిని బ్లూ క్రాస్ సొసైటీకి అప్పగించామని చేతులెత్తేశారు. కోడిని తనకు ఇవ్వకపోతే కరీంనగర్ డిపో ఎదుట ధర్నా చేస్తానని, అవసరమైతే డిపో ఎదుట ప్రాణాలు తీసుకుంటానని ‘సాక్షి’తో స్పష్టం చేశాడు.

ఏఐజీలో ముగిసిన ఏషియన్ మెడ్‌టెక్ ఇన్నోవేషన్ సదస్సు

సాక్షి, హైదరాబాద్: వైద్యశాస్త్రంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఏఐజీ హాస్పిటల్స్ నిర్వహిస్తున్న ఏషియన్ మెడ్‌టెక్ ఇన్నోవేషన్ సమ్మిట్-2024 శుక్రవారం ముగిసింది. దాదాపు 30కిపైగా మెడ్‌టెక్ సంస్థలు ఈ సదస్సులో పాల్గొన్నాయి. సదస్సు ముగింపు కార్యక్రమంలో భాగంగా ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ ఎ.నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ...ఈ సదస్సు ద్వారా ఆరోగ్య సంరక్షణ చర్యలు మరింత విజయవంతంగా ముందుకు తీసుకెళ్లగలిగామన్నారు. ఈ సదస్సును ఇకపై వార్షిక కార్యక్రమంలా నిర్వహిస్తామన్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటామని, ఇందుకు మెడ్‌టెక్ సంస్థల సహకారాన్ని తీసుకుంటామన్నారు. మెడ్‌టెక్ రంగంలో సరికొత్త ఆవిష్కరణలను ప్రోత్సహిస్తామని వివరించారు.

ఎమ్మెల్సీలు.. నామినేటెడ్ జాబితా..

▶ మొదటి పేజీ తరువాయి

నామినేటెడ్ పోస్టుల భర్తీకి సంబంధించి కూడా కొందరి పేర్లతో కూడిన జాబితాను సీఎం ఢిల్లీకి తీసుకెళ్లినట్లు సమాచారం. కాగా ఈ విషయమై శనివారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, అగ్రనేత సోనియాగాంధీ, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌లతో భేటీ అవుతారని తెలిసింది. పలువురు కేంద్ర మంత్రులను కూడా ఆయన కలుస్తారని సమాచారం.

ఆ ఇద్దరు ఎవరో..?

రెండు ఎమ్మెల్సీ స్థానాల కోసం పార్టీలో అంతర్గతంగా చాలామంది పోటీ పడుతుండగా, సీఎం ఢిల్లీ వెళ్లడంతో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ ఇప్పటికే సీఎం రేవంత్ అభిప్రాయాన్ని తీసుకుని అధిష్టానానికి నివేదించారు. రెండురోజుల క్రితం ఢిల్లీ వెళ్లిన డిప్యూటీ సీఎం భట్టి అభిప్రాయం కూడా పార్టీ పెద్దలు తీసుకున్నారు. కాగా ఈ స్థానాల కోసం ఎస్సీ, బీసీ, మైనారిటీ సామాజికవర్గానికి చెందిన నేతల పేర్లను కాంగ్రెస్ అధిష్టానం పరిశీలిస్తోంది. అద్దంకి దయాకర్, మహేశ్‌కుమార్‌గౌడ్, మాజీ మంత్రి షబ్బీర్ అలీ, ఫిరోజ్‌ఖాన్, అజారుద్దీన్‌తో పాటు చిన్నారెడ్డి, పటేల్ రమేశ్ రెడ్డి తదితరులు ఎమ్మెల్సీ పదవిని ఆశిస్తున్నారు.

నామినేటెడ్ పోస్టులకు పోటీ

పదుల సంఖ్యలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ కార్పొరేషన్ల చైర్మన్ల పదవులకు నామినేట్ అయ్యేందుకు పలువురు ఆశావహులు పోటీపడుతున్నారు. అయితే వీటిలో ప్రధానమైన కార్పొరేషన్ల విషయంలో, ఇటీవలి ఎన్నికల్లో పోటీకి అవకాశం దక్కని నాయకులు, పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తున్నట్టు సమాచారం.

గవర్నర్ కోటాలో ప్రొఫెసర్ కోదండరాం?

గవర్నర్ కోటాలో ఉన్న రెండు ఎమ్మెల్సీ పదవులు, ఎమ్మెల్యే నారాయణరెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల కోటా స్థానం భర్తీపై కూడా హైకమాండ్ దృష్టి సారించినట్లు తెలుస్తోంది. గవర్నర్ కోటాలో ప్రొఫెసర్ కోదండరాం పేరు ఖాయమైనట్లు ప్రచారం జరుగుతుండగా, మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజక వర్గం నుంచి మాజీ మంత్రి చిన్నారెడ్డికి అవకాశం ఇవ్వాలని భావిస్తున్నట్టు తెలిసింది.

రాహుల్‌తో కలిసి ఇంఫాల్‌కు సీఎం

మణిపూర్ రాజధాని ఇంఫాల్ నుంచి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపడుతున్న ‘భారత్ జోడో న్యాయ్ యాత్ర’ప్రారంభం కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొననున్నారు. ఈ నెల 14న ఢిల్లీ నుంచి రాహుల్‌తో కలిసి ఆయన ఇంఫాల్ వెళతారు. యాత్ర ప్రారంభం తర్వాత తిరిగి ఢిల్లీకి చేరుకుని అదేరోజు సాయంత్రం దావోస్‌కు బయలుదేరి వెళ్తారు. పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఉన్నతాధికారులు సీఎం వెంట వెళ్తారు.

ఇదండీ సంగతి



అల్‌రెడీ ఆ పని చేశారుగా సార్! మళ్లీ ఎందుకూ!

76 కిమీ.. రూ.14వేల కోట్లు

విశాఖ లైట్‌మెట్రో కారిడార్‌కు ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

సాక్షి, విశాఖపట్నం: మహా విశాఖ మరింత అభివృద్ధి చెందేందుకు ఏపీ కేబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో లైట్‌మెట్రోకు సంబంధించిన ఉత్తర్వులను ఆ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసింది. 76 కిలోమీటర్ల మేర నాలుగు కారిడార్లతో నిర్మించనున్న తొలి విడత ప్రాజెక్టుకు రూ.14,309 కోట్లు వ్యయమవుతుందని తెలిపింది. పీపీపీ విధానంలో చేపట్టబోయే ఈ ప్రాజెక్టులో ప్రభుత్వాల వాటా 40 శాతం కాగా, టెండరు దక్కించుకున్న సంస్థ 60 శాతం భరించనున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నెల 17న కేంద్ర ప్రభుత్వానికి డీపీఆర్‌ను అందించేందుకు కావల్సిన పూర్తి డాక్యుమెంట్లను సిద్ధంచేసే పనిలో ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ అధికారులు నిమగ్నమయ్యారు.

76.90 కి.మీ. మేర ప్రాజెక్టు..: మొత్తం 76.90 కిమీ మేర లైట్‌మెట్రో ప్రాజెక్టు పట్టాలెక్కనుంది. మొత్తం 54 స్టేషన్లు నిర్మించాలని నిర్ణయించారు. హెవీ మెట్రోతో పోల్చిచూస్తే.. లైట్ మెట్రో ద్వారా నిర్మాణ వ్యయంలో 20 శాతం, వార్షిక నిర్వహణలో 15 శాతం భారం తగ్గనున్న కారణంగా ప్రభుత్వం లైట్‌మెట్రో వైపే మొగ్గు చూపింది. మెట్రో రైలు రాకతో ట్రాఫిక్ సమస్య తీరడంతో పాటు సమయం కూడా ఆదా అవుతుంది. ఒక మెట్రో రైలు వెళ్తే ఎనిమిది బస్సులు వెళ్లినట్లు సమానం. ఒకసారి వెళ్తే మెట్రోలో 400 మంది ప్రయాణించగలరు.



ప్రాజెక్టు గడువు ఎనిమిదేళ్లు..: పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ)-వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) విధానంలో విశాఖ మెట్రో ప్రాజెక్టు నిర్మిస్తున్నట్లు జీఓలో స్పష్టంచేశారు. మొత్తం ప్రాజెక్టు విలువ రూ.14,309 కోట్లు అవుతుందని పేర్కొన్నారు. ఇందులో ప్రభుత్వం తరఫున రూ.5,723.6 కోట్లు భరించాల్సి ఉండగా ప్రైవేట్ డెవలపర్ వీజీఎఫ్ కింద 60శాతం అంటే రూ.8,585.4 కోట్లు భరిస్తూ పనులు ప్రారంభించనుంది. టెండర్లు దక్కించుకున్న సంస్థ ఎనిమిదేళ్లలో ప్రాజెక్టును పూర్తిచేయాల్సి ఉంటుంది. ప్రాజెక్టు దక్కించుకున్న మూడేళ్లకు తొలిమార్గంలో ప్రయాణికులకు మెట్రో సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంటుందని జీఓలో స్పష్టంచేశారు. 30 ఏళ్ల పాటు సదరు నిర్మాణ సంస్థకు ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్‌ఎం) ద్వారా నిర్వహించాల్సి ఉంటుందని, ఈ సమయంలో ప్రాజెక్టు ద్వారా వచ్చే ఆదాయాన్ని సదరు సంస్థ ఆర్జిస్తుందని డీపీఆర్‌లో తెలిపారు.

క్లుప్తంగా...

యాసంగికి సాగునీరు విడుదల చేయాలి

- కోయినా డ్యాం నుంచి నీటిని తేవాలనే నిర్ణయం అనాలోచితం
- మీడియా సమావేశంలో మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టును పదేపదే ప్రస్తావిస్తున్న రేవంత్ ప్రభుత్వం రాష్ట్రంలోని ఇతర ప్రాజెక్టులపై దృష్టి పెట్టి యాసంగికి సాగునీటిని విడుదల చేయాలని మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. యాసంగిలో ధాన్యం దిగుబడి తగ్గుతుందని వ్యవసాయశాఖ అంచనా వేస్తోందని.. ఒకవేళ దిగుబడి తగ్గితే రాష్ట్ర ప్రభుత్వమే అందుకు బాధ్యత వహించాలన్నారు. తెలంగాణభవన్‌లో శుక్రవారం పోచారం మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 40 రోజులవుతున్నా గత ప్రభుత్వంపై ఆరోపణలు మినహా యాసంగికి సాగునీటి విడుదలపై ఆలోచన చేయడం లేదని చెప్పారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టులో 150 టీఎంసీల నీరు ఉందని, కనీసం ఆ జలాలను తాగునీటికైనా వాడుకోవాలన్నారు. అందుబాటులో ఉన్న సాగర్ జలాలను పక్కన పెట్టి 1,300 కిలోమీటర్ల దూరంలోని కోయినా డ్యాం(మహారాష్ట్ర) నుంచి నీటిని తేవాలనే నిర్ణయం అనాలోచితమైనదిగా పేర్కొన్నారు. కోయినా నుంచి 30 టీఎంసీలు విడుదల చేస్తే రాష్ట్రానికి కనీసం 3 టీఎంసీలు కూడా చేరవన్నారు. రాష్ట్రం ఏర్పడిన కొత్తలో 37 లక్షల టన్నులుగా ఉన్న ధాన్యం ఉత్పత్తి 3.5 కోట్ల టన్నులకు చేరిందని, గతంలో నిజాంసాగర్, సింగూరు ప్రాజెక్టు పరిధిలో రెండు పంటలకు నీరిచ్చిన సందర్భాలు ఉన్నాయని పోచారం చెప్పారు. ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని రిజర్వాయర్లలో ఉన్న 27 నుంచి 30 టీఎంసీల నీళ్లతో 3 లక్షల ఎకరాల వరకు సాగునీరు అందించవచ్చన్నారు. ధాన్యం కొరత ఏర్పడితే దానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని, అన్నపూర్ణగా పేరొందిన తెలంగాణ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేయవద్దని పోచారం సూచించారు.

ఓట్ల కోసమే బీజేపీ మత రాజకీయాలు: మల్లు రవి



సాక్షి, హైదరాబాద్: ఓట్ల కోసం బీజేపీ మతరాజకీయాలు చేస్తోందని, ప్రశ్నించినవాళ్లపై ఈడీ, ఐటీ పేరిట దాడులు చేయిస్తోందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి ఆరోపించారు. శుక్రవారం ఇక్కడ మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. 60 ఏళ్లలో స్వాతంత్ర్య ఫలాలను దేశ ప్రజలకు ఇచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ కృషి చేసిందని గుర్తుచేశారు. మాజీ సీఎం కేసీఆర్ కుటుంబ సంక్షేమం కోసమే బీఆర్ఎస్ పార్టీ పనిచేసిందని, అందుకే ప్రజలు దానిని పక్కన పెట్టారని ధ్వజమెత్తారు. రాములునాయక్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీకి ఇవే చివరి ఎన్నికలని, రానున్న అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలువు ఖాయమని జోస్యం చెప్పారు.

రాముడి డీఎన్ఏ కాంగ్రెస్‌లో..

సాక్షి, హైదరాబాద్: రాముడి డీఎన్ఏ కాంగ్రెస్‌లో ఉందని, రావణుడి డీఎన్ఏ బీజేపీలో ఉందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ ధ్వజమెత్తారు. ఆయన శుక్రవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ రాముడి పేరుతో బీజేపీ లబ్ధి పొందడానికి కుట్ర చేస్తోందని విమర్శించారు. అయోధ్యలో రాముడి దేవాలయం పూర్తి కాకముందే ఎందుకు ప్రారంభిస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ డీఎన్ఏలో హిందూ వ్యతిరేకత ఉందన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు.

రేవంత్‌కు ప్రజాదరణ.. బీఆర్ఎస్‌కు అక్కసు

సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డికి వస్తున్న ప్రజాదరణ చూసి బీఆర్ఎస్ నేతలు తట్టుకోలేక విమర్శలు చేస్తున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ అహంకారాన్ని ప్రజలు తిరస్కరించారని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజాపాలన సాగుతోందని ప్రజలు భావిస్తున్నారని చెప్పారు.

'డబ్బులు కట్టించుకున్నారు... గొర్రెలు ఇవ్వలేదు'

సాక్షి, హైదరాబాద్: గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గొర్రెల పంపిణీ పథకం కోసం డీడీలు కట్టినా ఇప్పటివరకు గొర్రెలు పంపిణీ చేయలేదని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కలి ఐలయ్య యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండో విడతలో గొర్రెల పంపిణీ పథకం కోసం రాష్ట్ర వ్యాప్తంగా 82వేల మంది గొల్ల కురుమలు రూ.359 కోట్లు ఖజానాకు జమ చేశారని, అప్పుడు ఇప్పుడు అని దాటవేస్తూ ఇప్పటివరకు పంపిణీ చేయలేదని వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర పశు సంవర్ధకశాఖ డైరెక్టర్ రాంచందర్‌కు ఐలయ్య వినతి పత్రం సమర్పించారు. గొర్రెలు వస్తాయని అప్పు చేసి తమ వాటా డబ్బులు చెల్లించి గొల్ల కురుమలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు.

'యాదాద్రి'లో ఎందుకీ జాప్యం?

- ఒప్పందం ప్రకారం 2021 నాటికే పూర్తి కావాలి
- నామినేషన్ ప్రాతిపదికన పనులు బీహెచ్‌ఈఎల్‌కు ఎలా అప్పగించారు
- థర్మల్ విద్యుత్ కేంద్రంపై సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫైర్

సాక్షి, హైదరాబాద్: యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మాణం ఇంకా ఎందుకు పూర్తి కాలేదంటూ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. 'బీహెచ్‌ఈఎల్‌తో జరిగిన ఒప్పందం ప్రకారం 2020 అక్టోబర్ నాటికి 2 యూనిట్లు, 2021 అక్టోబర్ నాటికి 3 యూనిట్ల నిర్మాణం పూర్తి కావాలి. మొత్తంగా 4 వేల మెగావాట్ల విద్యుదుత్పత్తి ప్రారంభం కావాలి. కానీ ఇంత జాప్యం జరగడానికి కారణాలు ఏమిటి? కాంపిటీటివ్ బిడ్డింగ్ విధానంలో టెండర్లు ఆహ్వానించకుండా..నామినేషన్ పద్ధతిలో బీహెచ్‌ఈఎల్‌కు పనులు ఎందుకు అప్పగించారంటూ' భట్టి ప్రశ్నించారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంపై శుక్రవారం ఆయన రాష్ట్ర సచివాలయంలో ఇంధనశాఖ కార్యదర్శి సయ్యద్ అలీ ముర్తుజారిజ్వీతో కలిసి బీహెచ్‌ఈఎల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. థర్మల్ కేంద్రం నిర్మాణానికి జెన్‌కో రూపొందించిన అంచనాలు, బీహెచ్‌ఈఎల్ కోట్ చేసిన రేటు, ధరల విషయంలో బీహెచ్‌ఈఎల్‌తో జరిగిన సంప్రదింపులు, అగ్రిమెంట్ విలువ వంటి అంశాలపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఇంధనశాఖ కార్యదర్శిని భట్టి విక్రమార్క ఆదేశించారు. రూ.34,500 కోట్ల అంచనాలతో యాదాద్రి విద్యుత్ కేంద్రం నిర్మాణానికి 2015 జూన్ 6న ఒప్పందం చేసుకోగా, 2017 అక్టోబర్‌లో వర్క్‌ఆర్డర్ జారీ చేశారని, ఈ అగ్రిమెంట్ ప్రకారం 2021 నాటికి పనులన్నీ ఎందుకు పూర్తి కాలేదు ? అని ఆయన మండిపడ్డారు. ఇంకా విద్యుదుత్పత్తి ఎందుకు ప్రారంభం కాలేదని ప్రశ్నించారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రులు భట్టి, శ్రీధర్‌బాబు తదితరులు

సకాలంలో బిల్లులు ఇవ్వకపోవడమే కారణం: బీహెచ్‌ఈఎల్

రూ.34,500 కోట్ల పనుల్లో బీహెచ్‌ఈఎల్‌కు అప్పగించిన పనుల విలువ ఎంత అని భట్టి అడగ్గా.. రూ.20,444 కోట్లు విలువ చేసే పనులు బీహెచ్‌ఈఎల్‌కు అప్పగించారని, మిగిలిన పనులు జెన్‌కో, ఇతర సంస్థలు చేపట్టాయని బీహెచ్‌ఈఎల్ అధికారులు వివరించారు. తమకు ఇచ్చిన పనుల్లో రూ.15,860 కోట్లు విలువ చేసే పనులు పూర్తి చేశామని, రూ.14,400 కోట్ల బిల్లుల చెల్లింపులు జరిగాయన్నారు. రూ.1,167 కోట్ల బిల్లులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. గత ప్రభుత్వం చెల్లింపులు ప్రతినెలా చేయలేదని, ఒక్క మార్చి(2023) నెలలోనే 91 శాతం చెల్లింపులు జరిపిందన్నారు. నిధులు సకాలంలో చెల్లించకపోవడంతో తాము కూడా సబ్ కాంట్రాక్టర్లకు చెల్లింపులు చేయలేకపోయామని, దీంతో పనులు సజావుగా జరగలేదన్నారు. పర్యావరణానికి సంబంధించిన మరికొన్ని అనుమతులు ఏప్రిల్ 2024 నాటికి తీసుకొస్తే..సెప్టెంబర్ 2024 నాటికి రెండు యూనిట్లు, డిసెంబర్ 2024 లోగా మరో రెండు యూనిట్లు, 2025 మే నాటికి మిగిలిన ఒక యూనిట్‌ను పూర్తిచేసి విద్యుత్ ఉత్పత్తి ప్రారంభిస్తామని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బీహెచ్‌ఈఎల్ అధికారులు వివరించారు. ఈ సమావేశంలో బీహెచ్‌ఈఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కొప్పు సదాశివమూర్తి, డైరెక్టర్ తజీందర్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్లలో పూర్తి చేయాలి

- నల్లగొండ జిల్లాల్లో ప్రాజెక్టులపై అధికారులకు మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి ఆదేశం
- 'ఉదయ సముద్రం' మొదటి దశ పనులను వచ్చే ఏడాదికల్లా పూర్తిచేసి సాగునీరివ్వాలి
- ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులను యుద్ధప్రాతిపదికన చేయాలి



సమీక్ష సమావేశంలో మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పెండింగ్ పనులను వచ్చే రెండేళ్లలోగా పూర్తి చేయాలని మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రాజెక్టులపై శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. లక్ష ఎకరాలకు సాగునీరు అందించే ఉదయసముద్రం, బ్రహ్మణవెల్లంల ఎత్తిపోతల పథకాల కింద కాల్వలతో పాటు ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఎస్ఎల్‌బీసీ కాల్వలను పూర్తి చేసినప్పటికీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం కనీసం నిర్వహణ కూడా చేపట్టలేదని విమర్శించారు. 10 ఏళ్లుగా నిర్వహణ లేకపోవడంతో చెట్లు, పూడికతో నిండిపోయాయన్నారు. సత్వరమే నిర్వహణ పనులు చేపట్టాలని, బెడ్, సైడ్ లైనింగ్ పనులను ఈ ఏడాదే పూర్తి చేయాలని ఆదేశించారు. ఉదయ సముద్రం ప్రాజెక్టు కింద తొలి దశలో 50 వేల ఎకరాలకు, రెండవ దశలో మరో 50 వేల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో భూసేకరణ, కాల్వల నిర్మాణం పనులు పూర్తి చేయాలని కోరారు. ఉదయ సముద్రం మొదటి దశ భూసేకరణకు రూ.100 కోట్లు, పనుల కోసం మరో రూ.100 కోట్లను సత్వరంగా విడుదల చేస్తామని, పనులు నిర్విరామంగా కొనసాగించాలని కోరారు. వచ్చే ఏడాదిలో పనులు పూర్తి చేసి 50 వేల ఎకరాలకు సాగునీరు అందించాలని ఆదేశించారు.

గత ప్రభుత్వం అన్యాయం చేసింది..: కోమటిరెడ్డి

గత ప్రభుత్వం నల్లగొండ సాగునీటి ప్రాజెక్టులకు తీరని అన్యాయం చేసిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. పనులు చివరి దశలో ఉన్న ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును తీవ్ర నిర్లక్ష్యం చేసిందన్నారు. అసెంబ్లీలో తాను ఎన్నో మార్లు మాట్లాడినా ఆనాటి ముఖ్యమంత్రి కనీసం స్పందించలేదన్నారు. సమీక్షలో నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్‌సీ మురళీధర్ రావు, చీఫ్ ఇంజనీర్ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీలు

- ప్రతీ జిల్లా కేంద్రంలో నైపుణ్య శిక్షణ కేంద్రం
- జాతీయ యువజనోత్సవాల్లో ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడి

సాక్షి, హైదరాబాద్: యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కోసం ప్రతీ జిల్లాకో నైపుణ్య శిక్షణ కేంద్రంతో పాటు స్కిల్ యూనివర్సిటీల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. వచ్చే ఐదేళ్లలో మానవ వనరుల అభివృద్ధిలో తెలంగాణను నంబర్‌వన్ స్థానానికి చేరేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ రంగంలో రెండు లక్షల ఉద్యోగాలతో పాటు ప్రైవేటులోనూ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పన ప్రయత్నాలను ముమ్మరం చేస్తామన్నారు. సికింద్రాబాద్‌లోని యువజన సర్వీసుల డైరెక్టర్ కార్యాలయంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఉద్యోగమేళాను మంత్రి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో నైపుణ్యాన్ని వెలికితీసేందుకు స్కిల్ యూనివర్సిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. కృత్రిమ మేధస్సులో డిగ్రీ చదువుతున్న వారి కోసం ప్రత్యేక నైపుణ్య కోర్సును అందుబాటులోకి తెస్తామన్నారు. హైదరాబాద్‌తో పాటు జిల్లా కేంద్రాల్లోనూ జాబ్‌మేళా ఏర్పాటు చేస్తామన్నారు. సెట్విన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో ప్రిన్సిపల్ కార్యదర్శి సవ్యసాచి ఘోష్, సెట్విన్ ఎండీ వేణుగోపాల్ పాల్గొన్నారు.



స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): తెలంగాణలో ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం రవీంద్రభారతిలో బీసీ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 193వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళా ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను ప్రదానం చేశారు. అనంతరం కృష్ణయ్య మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి మెగా డీఎస్సీని ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 25 వేల ఉపాధ్యాయ పోస్టులు, 16 వేల విద్యా వలంటీర్లు, 10 వేల సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నిరుద్యోగ సంఘం జేఏసీ చైర్మన్ నీల వెంకటేశ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ లింగయ్య యాదవ్, బి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితురాలి ఎడబాటును తట్టుకోలేకే..

నిప్పంటించుకుని యువతి ఆత్మహత్య

- సీసీ కెమెరాలు, సెల్‌ఫోన్ నంబర్ ఆధారంగా దర్యాప్తు
- ఎట్టకేలకు కేసును ఛేదించిన పోలీసులు
- మృతురాలు మల్లేపల్లివాసి తహసీన్ బేగంగా గుర్తింపు

అనుమానాస్పద స్థితిలో యువతి మృతిచెందిన కేసును పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. మొదట హత్యగా అనుమానించి.. ఆరు బృందాలతో దర్యాప్తు చేపట్టారు. నాలుగు రోజులు శ్రమించి సీసీ ఫుటేజీ, సెల్‌ఫోన్ ఆధారంగా ఆమెది హత్య కాదు.. ఆత్మహత్య అని తేల్చారు. కలిసి చదువుకున్న స్నేహితురాలితో ఏర్పడిన ప్రేమబంధం దూరమవుతుందనే మనస్తాపంతోనే సదరు యువతి ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించారు.

మొయినాబాద్: మండల పరిధిలోని బాకారం శివారు డ్రీమ్ వ్యాలీ రోడ్డు పక్కన ఈ నెల 8న కాలుతున్న మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మంటలు ఆర్పారు. అప్పటికే మృతదేహం గుర్తు పట్టలేనంతగా కాలిపోయింది. దీంతో క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు మొదలు పెట్టారు.

ఆరు బృందాలుతో దర్యాప్తు...

రాజేంద్రనగర్ అడిషనల్ డీసీపీ రేష్మి పెరుమాళ్, చేవెళ్ల ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి, మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పరిసరాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. సమీపంలోని రైతులతో మాట్లాడినా వారికి ఎలాంటి క్లూస్ లభించలేదు. దీంతో రాజేంద్రనగర్ సీసీఎస్, మొయినాబాద్, శివరాంపల్లి, మైలార్‌దేవ్‌పల్లి పీఎస్‌ల నుంచి ఆరు బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు.



తహసీన్ బేగం మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)

సీసీ ఫుటేజీ ఆధారంగా

ఘటన జరిగిన రోజు మధ్యాహ్నం 1:43 గంటలకు టీఎస్ 13 యూసీ 1565 నంబరు ఆటో ఎనికేపల్లి నుంచి బాకారం వైపు వెళ్లి తిరిగి వచ్చినట్లు, సోలార్ విల్లాస్ వద్ద ఉన్న సీసీ ఫుటేజీల్లో పోలీసులు గుర్తించారు. అదే ఆటో వెంటనే డ్రీమ్‌వ్యాలీ రిసార్ట్స్ గేటు ముందు నుంచి యూటర్న్ తీసుకుని వెళ్లినట్లు సీసీ ఫుటేజీల్లో గుర్తించారు. ఆటో నంబర్ ఆధారంగా మెహిదీపట్నంలో ఆటో డ్రైవర్ సయ్యద్ వాసిమ్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేశారు.

పథకం ప్రకారమే..

నగరంలోని మల్లేపల్లికి చెందిన తహసీన్ బేగం (22) ఈ నెల 8న ఉదయం 11.30 గంటలకు మొయినాబాద్‌లోని డ్రీమ్‌వ్యాలీ రిసార్ట్‌కు వెళ్లేందుకు.. మల్లేపల్లిలో రూ.1,100కు సయ్యద్ వాసిమ్ ఆటోను మాట్లాడుకుంది. ఆటో ఎక్కి మురాద్‌నగర్‌లోని తన స్నేహితురాలు రాహిల్ ఇంటికి వెళ్లింది. మధ్యాహ్నం 12.10 గంటలకు మరో స్నేహితురాలు ఇంటికి వెళ్లి.. అంతకు ముందురోజే అక్కడ తెచ్చిపెట్టుకున్న 5 లీటర్ల పెట్రోల్ డబ్బాను ఓ బ్యాగులో పట్టుకుని ఆటో ఎక్కింది. మధ్యాహ్నం 1.43 గంటలకు రిసార్ట్ గేటు వద్దకు వెళ్లగానే.. యూటర్న్ తీసుకోవాలని చెప్పి.. కొద్ది దూరం వెళ్లగానే ఆటో దిగి డ్రైవర్‌కు డబ్బులిచ్చి పంపించింది. మధ్యాహ్నం 1.53 నిమిషాలకు రాహిల్‌కు ఫోన్ చేసి మాట్లాడి ఆ తర్వాత స్విచ్ఛాఫ్ చేసింది. అనంతరం డబ్బాలో తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుని నిప్పంటించుకుంది.

విషయం తెలిసిందిలా..

ఘటనా స్థలంలో సగం కాలిన స్థితిలో దొరికిన సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు.. తహసీన్ చివరి కాల్ రాహిల్‌తో మాట్లాడినట్లు గుర్తించారు. ఆమెను విచారించగా విషయాలన్నీ బయటపడ్డాయి. కేసును ఛేదించిన పోలీసు సిబ్బందిని రాజేంద్రనగర్ అడిషనల్ డీసీపీ రేష్మి పెరుమాళ్, చేవెళ్ల ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి అభినందించారు.

ఆత్మహత్యకు కారణమిదే..

మృతురాలు తహసీన్ బేగం మెహిదీపట్నంలోని మదీనా కళాశాలలో డిగ్రీ పూర్తి చేసింది. ఈ సమయంలో స్నేహితురాలు రాహిల్‌తో సాన్నిహిత్యం ఏర్పడింది. ఇది ఇద్దరి మధ్య ప్రేమగా మారింది. విషయం ఇంట్లో తెలియడంతో ఇరు కుటుంబాల వారు మందలించి ఇరువురినీ దూరం చేశారు. స్నేహితురాలి ఎడబాటును తట్టుకోలేని తహసీన్ ఆరు నెలల క్రితం బ్లేడుతో కోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించింది. ఇటీవల రాహిల్‌కు పెళ్లి సంబంధాలు చూస్తున్నారని తెలియడంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. ఆత్మహత్యకు ఒకరోజు ముందే పెట్రోల్ తీసుకుని తన స్నేహితురాలు గదిలో పెట్టింది. ఎందుకని అడగగా బంకులు బంద్ చేస్తున్నారని, బండిలో పోసుకునేందుకని నమ్మించింది.

హబీబ్‌నగర్ పీఎస్ వద్ద ఉద్రిక్తత

సాక్షి, సిటీబ్యూరో/నాంపల్లి: హబీబ్‌నగర్ పోలీసుల నిర్లక్ష్యంతోనే తహసీన్ చనిపోయిందని ఆరోపిస్తూ బాధిత కుటుంబ సభ్యులు శుక్రవారం ఠాణా ఎదుట ఆందోళనకు దిగారు. 'ఈ నెల 8న ఉదయం 10:30 గంటలకు బయటకు వెళ్లిన తన సోదరి తహసీన్ తిరిగి రాలేదని, రెండు రోజుల పాటు బంధువులు, తెలిసిన వారిని వాకబు చేసినా ఆచూకీ దొరకలేదని.. అజర్ ఈ నెల 10న హబీబ్‌నగర్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ సమయంలో తహసీన్ ఫొటో కూడా ఇచ్చారు. ఇన్‌స్పెక్టర్ టి.రాంబాబు బందోబస్తులో ఉండగా.. ఫిర్యాదును స్వీకరించిన కింది స్థాయి సిబ్బంది వివరాలను ఎస్ఐ భానుప్రకాశ్‌కు చెప్పారు. దీనిపై వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాల్సిందిగా ఆదేశించాల్సి ఉండగా పోలీసులు పట్టించుకోలేదు. యువతి ఫొటో ఉన్నప్పటికీ ఆధార్ కార్డు జత చేయలేదనే కారణంగా వివరాలను క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్‌లోనూ (సీసీటీఎన్ఎస్) అప్‌లోడ్ చేయలేదు. యువతి ఆధార్ కార్డు తీసుకుని రాత్రి 8 గంటల ప్రాంతంలో రావాలని, అప్పటికి ఇన్‌స్పెక్టర్ వస్తారని సలహా ఇచ్చారు. అలా వెళ్లిన అజర్ మళ్లీ ఠాణాకు రాకపోవడంతో.. ఫిర్యాదు విషయాన్ని అటు ఇన్‌స్పెక్టర్ కానీ, ఇటు ఎస్ఐ కానీ పట్టించుకోలే'దని ఆవేదన వ్యక్తంచేశారు. దీంతో సిటీ కొత్వాల్ శ్రీనివాసరెడ్డి వచ్చి పరిస్థితితో పాటు ఉదంతం పూర్వాపరాలను పరిశీలించారు. ఆయన వెళ్లిన వెంటనే నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ ఠాణా వద్దకు చేరుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీనికి తోడు ఎంఐఎం కార్యకర్తలు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అదనపు బలగాలను మోహరించారు. విషయం తెలుసుకున్న డీసీపీ చైతన్య, ఆసిఫ్‌నగర్ ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి హుటాహుటిన పీఎస్ వద్దకు చేరుకున్నారు. ఎమ్మెల్యేకు పరిస్థితి వివరించడతో విషయం సద్దుమణిగింది.

నిర్లక్ష్యానికి వేటు..

ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన హబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌కు ఉన్నతాధికారులు చార్జ్ మెమో జారీ చేయగా.. ఎస్ఐ భానుప్రకాశ్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు వేశారు.

అయోధ్యకు 1,265 కేజీల లడ్డూ

నగరంలోని శ్రీరామ్ కేటరర్స్‌కు దక్కిన అవకాశం



లడ్డూ తయారీకి శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర పంపిన లేఖ

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లోని శ్రీరామ్ కేటరర్స్‌కు అరుదైన అవకాశం దక్కింది. ఈ నెల 22న అయోధ్యలో రామాలయ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేకంగా లడ్డూ తయారు చేసే భాగ్యం కల్పించారు. ఈ మేరకు లడ్డూ తయారీకి అనుమతులిస్తూ శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర.. శ్రీరామ్ కేటరింగ్‌కు లేఖ పంపింది. ఇంతటి అదృష్టం దక్కడం తన పూర్వజన్మ సుకృతమని నిర్వాహకులు నాగభూషణం రెడ్డి తెలిపారు.

1,265 కిలోల లడ్డూ..

ఈ నెల 22న అయోధ్య రామాలయ ప్రారంభోత్సవం కోసం తాము 1,265 కిలోల లడ్డూ తయారీ చేయనున్నట్లు శ్రీరామ్ కేటరింగ్ ఎండీ నాగభూషణం రెడ్డి తెలిపారు. సంక్రాంతి రోజున లడ్డూ తయారీ మొదలుపెట్టి 17వ తేదీ కి పూర్తి చేస్తామన్నారు. అదే రోజు ప్రత్యేక పూజల అనంతరం రోడ్డు మార్గాన అయోధ్యకు తీసుకెళ్లనున్నట్లు ఆయన తెలిపారు.

పరిశ్రమల శాఖ డైరెక్టర్‌గా మల్సూర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ (టీఎస్ఎండీసీ) వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జి.మల్సూర్‌ను పరిశ్రమల శాఖ డైరెక్టర్‌గా బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం రాష్ట్ర మైన్స్, జియాలజీ విభాగం ముఖ్య కార్యదర్శిగా పనిచేస్తున్న మహేశ్ దత్ ఎక్కాకు టీఎస్ఎండీసీ వైస్ చైర్మన్, ఎండీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నియంత్రిద్దాం

రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ



సాక్షి, హైదరాబాద్: ఒకసారి మాత్రమే వినియోగించే ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా నియంత్రిద్దామని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాలకు నివాసయోగ్యమైన వాతావరణాన్ని, పరిసరాలను అందించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. ప్రభుత్వాలు పచ్చదనం పెంపునకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నాయని, ఈ ఉద్యమానికి ప్రజలు సైతం మద్దతు పలకడం మంచి పరిణామమని పేర్కొన్నారు. అయితే నిత్య జీవితంలో ప్లాస్టిక్ వాడకాన్ని కూడా వీలైనంతగా తగ్గించాలని, ఈ దిశగా ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల అనేక అనర్థాలున్నాయని, అవగాహన లేకుండా విపరీతంగా వాడుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలతో మన పరిసరాలు, గాలి, నీరు కలుషితం అవుతున్నాయని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయంలోని తన కార్యాలయంతోపాటు నివాసంలోనూ వీలైనంతగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నియంత్రించాలని ఆమె నిర్ణయించారు. ప్లాస్టిక్ బాటిళ్లకు బదులుగా గాజు బాటిళ్లను లేకుంటే స్టీల్ వస్తువుల వాడకాన్ని పెంచాలని సూచించారు. ఈ మేరకు మంత్రి సురేఖ శుక్రవారం ఒక వీడియో సందేశాన్ని కూడా విడుదల చేశారు.



దేనిని మనస్సు చేత తెలుసుకోలేమో, కానీ ఏది మనస్సునే తెలుసుకోగలదో అదే బ్రహ్మ.
దేనిని కళ్లతో చూడలేమో, కానీ ఏదైతే కళ్లకే చూపును ప్రసాదిస్తుందో అదే బ్రహ్మ.
– కేనోపనిషత్తు

సాక్షి
శనివారం, 13 జనవరి 2024

దక్షిణాఫ్రికా సాహసం!

నిలదీయటానికీ, నేరాన్ని వేలెత్తి చూపటానికీ సంపన్న రాజ్యమే కానవసరం లేదని, గుప్పెడు ధైర్యం, నిటారైన వెన్నెముక వుంటే చాలని దక్షిణాఫ్రికా నిరూపించింది. గాజా అనే ఒక చిన్న ప్రాంతాన్ని గుప్పిట బంధించి గత మూడు నెలలుగా సామూహిక జనహననం సాగిస్తున్న ఇజ్రాయెల్‌ను అంతర్జాతీయ న్యాయస్థానం(ఐసీజే)కు ఈడ్చి సవాలు విసిరింది. అమెరికాతో సహా అగ్రరాజ్యాల అండదండలున్న ఇజ్రాయెల్ ఈ పరిణామానికి జడిసి తన దారుణ మారణకాండను వెంటనే ఆపుతుందనుకోవటానికి లేదు. వెస్ట్ బ్యాంక్‌లో అక్రమ భద్రతా నిర్మాణాలను తొలగించాలని ఐసీజే 2004లో ఇచ్చిన తీర్పునే అది బేఖాతరు చేస్తోంది. కానీ వినతులతో, వేడుకోళ్లతో సరిపెడుతూ అంతకుమించి మరేమీ చేయని, మాట్లాడని ప్రపంచ దేశాలకు దక్షిణాఫ్రికా తీసుకున్న వైఖరి చెంపపెట్టు. ఆ పిటిషన్‌కు విచారణార్హత ఉందో లేదో నిర్ణయించటానికి దక్షిణాఫ్రికా వాదనలు విన్న న్యాయస్థానం శుక్రవారం ఇజ్రాయెల్ సంజాయిషీని తెలుసుకుంది. అయితే విచారణ పూర్తయి తీర్పు రావటానికి ఏళ్లకేళ్లు పడుతుంది. ఈలోగా జాతిహననం, విధ్వంసం నిలిపివేయాలంటూ అత్యవసర ఉత్తర్వులివ్వాలని దక్షిణాఫ్రికా కోరుతోంది. గత మూడు నెలలుగా గాజాపై సాగిస్తున్న ఏకపక్ష దాడుల్లో 23,000 మంది పౌరులు మరణించగా లక్షలాదిమంది గాయపడ్డారు. మృతుల్లో పదివేల మంది వరకూ మహిళలు, పసివాళ్లున్నారని గాజా ఆరోగ్యశాఖ ప్రకటించింది. ప్రాణాలతో మిగిలిన 20 లక్షలమంది పౌరులు నిరాశ్రయులై ఆకలితో అలమటిస్తున్నారు. వ్యాధుల బారిన పడుతున్నారు. 70 శాతం ఇళ్లు, 50 శాతం భవంతులు బాంబు దాడుల్లో పూర్తిగా నాశనమయ్యాయి. ఇప్పటికే అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసీసీ) ఇజ్రాయెల్, హమాస్‌లపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది. జరిగిన జనహననం వెనకున్న ఉన్నత స్థాయి వ్యక్తులెవరో, వారి యుద్ధ నేరాలేమిటో అది ఆరా తీస్తుంది. దేశాల మధ్య తలెత్తే వివాదాలను శాంతియుత పరిష్కారం అన్వేషించటం ఐసీజే పని. ఇజ్రాయెల్ చేష్టలను అంతర్జాతీయ సమాజం చూస్తూ ఊరుకోబోదని చెప్పటమే దక్షిణాఫ్రికా చర్య వెనకున్న ఉద్దేశం.

ఇజ్రాయెల్ చరిత్ర గమనించినవారికి ఆ దేశంపై జినోసైడ్ (జాతిని తుడిచిపెట్టడం) నిందారోపణ రావటం ఆశ్చర్యం కలిగించేదే. ఎందుకంటే అనేక దేశాల్లో నిరాదరణకూ, ఊచకోతకూ గురై చెట్టుకొకరూ, పుట్టకొకరూ అయిన యూదులకు రెండో ప్రపంచ యుద్ధానంతరం అగ్రరాజ్యాల చొరవతో ఇజ్రాయెల్ పేరిట ప్రత్యేక దేశం ఏర్పడింది. ఇప్పుడు అదే దేశంపై జనహనన ఆరోపణలు రావటం ఒక వైచిత్రి. జనవిధ్వంసానికి వ్యతిరేకంగా 1948లో కుదిరిన అంతర్జాతీయ ఒడంబడికపై ఇజ్రాయెల్ కూడా సంతకం చేసింది. కానీ దాన్ని గౌరవించిన సందర్భం లేదు. నిజానికి తానే బాధిత దేశాన్నని ఇజ్రాయెల్ అంటున్నది. అక్టోబర్ 7న తన భూభాగంలోకి చొరబడిన హమాస్ ఉగ్రవాదులు 1,200 మందిని కాల్చిచంపి, 240 మందిని బందీలుగా పట్టుకున్నారని, అందుకే తాము దాడులు చేయాల్సివస్తోందని ఇజ్రాయెల్ వాదన. నిజమే... అమాయక పౌరులను భయపెట్టడం, హతమార్చటం నాగరిక ప్రపంచంలో ఏ ఒక్కరూ సమర్థించరు. తమకు అన్యాయం జరిగిందనుకుంటే శాంతియుతంగా పోరాడి సాధించుకోవాలి తప్ప హింసతో, బలప్రయోగంతో ఎదుర్కొనటం పూర్తిగా తప్పు. అలాంటి చర్యల వల్ల లక్ష్యం సిద్ధించదు సరిగదా... రాజ్యహింసకు లక్షలాదిమంది అమాయకులు బలవుతారు. అయితే హమాస్ చేతుల్లో మరణించిన పౌరులకు ప్రతిగా అవతలిపక్షం నుంచి ఎంతమందిని బలితీసుకుంటే తన దాహం చల్లారుతుందో ఇజ్రాయెల్ చెప్పగలదా? దాడులకు కారకులైనవారిని పట్టుకోవటం, చట్టప్రకారం శిక్షించటం అనే ప్రక్రియను కాలదన్ని విచక్షణారహితంగా యుద్ధవిమానాలతో బాంబుల మోతమోగించటం... హమాస్‌తో సంబంధం లేని సాధారణ పౌరుల ప్రాణాలకూ, ఆస్తులకూ ముప్పు కలిగించటం ఎంతవరకూ న్యాయం? నిజానికి పాలస్తీనా సమస్యకు శాంతియుత పరిష్కారం వెదికేందుకు జరిగిన ప్రతి యత్నాన్నీ అడ్డుకున్నది ఇజ్రాయెలే. ఒక దేశమంటూ లేకుండా, అత్యంత దుర్భరమైన బతుకులీడుస్తున్న పౌరులను దశాబ్దాలుగా అణచివేయటంవల్ల సమస్య ఉగ్రరూపం దాలుస్తుందని ఆ దేశం గ్రహించలేకపోవటం దిగ్భ్రాంతి కలిగిస్తుంది. ఇజ్రాయెల్‌కు అండదండలందిస్తున్న అమెరికాకు దక్షిణాఫ్రికా చర్య మింగుడుపడటం లేదు. ఇజ్రాయెల్‌కు నచ్చజెప్పి దాడులు ఆపించివుంటే అంతర్జాతీయంగా అమెరికా ప్రతిష్ఠ పెరిగేది. ఆ విషయంలో పూర్తిగా విఫలమై దక్షిణాఫ్రికాను నిందించటం అర్థరహితం.

జాత్యహంకార పాలకులపై పోరాడి విముక్తి సాధించిన దక్షిణాఫ్రికాకు ఆదినుంచీ ప్రపంచ వ్యాప్తంగా బలహీనులపై బలవంతులు సాగించే దుండగాలను వ్యతిరేకించటం సంప్రదాయం. దానికి అనుగుణంగానే ఇజ్రాయెల్‌పై పిటిషన్ దాఖలు చేసింది. రెండేళ్లుగా ఉక్రెయిన్‌పై దురాక్రమణ యుద్ధం సాగిస్తున్న రష్యా తనకు మిత్రదేశమే అయినా దాని చర్యను దక్షిణాఫ్రికా తూర్పారబట్టింది. ప్రస్తుతం ఐసీజేలో వున్న 15 మంది న్యాయమూర్తుల ఫుల్‌బెంచ్ దక్షిణాఫ్రికా పిటిషన్‌ను విచారిస్తుంది. నిబంధనల ప్రకారం దక్షిణాఫ్రికా, ఇజ్రాయెల్ కొత్తగా చెరొక న్యాయమూర్తినీ నామినేట్ చేయొచ్చు. గాజాలో జరిగింది జాతి విధ్వంసమేనని నిరూపించటం ఐసీజే నిబంధనల ప్రకారం కొంత కష్టమేనని నిపుణులంటున్నారు. అయితే పిటిషన్ విచారణ క్రమంలో జాతి విధ్వంస పోకడలపై జరిగే చర్చవల్ల ప్రపంచ ప్రజానీకానికి వర్తమాన స్థితిగతులపై అవగాహన ఏర్పడుతుంది. దోషులెవరో, శిక్ష ఎవరికి పడాలో తేటతెల్లమవుతుంది.

భారత దౌత్యనీతికి సవాళ్లు

విశ్లేషణ



కమడోర్ సి. ఉదయ భాస్కర్

ఇరుదేశాల మిలిటరీ సంబంధాలు పునరుద్ధరించాలని చెప్పడం ద్వారా అమెరికా, చైనా తమ మధ్య అంతరం తగ్గిందన్న సంకేతాన్ని పంపాయి. అమెరికా దగ్గరవుతున్న నేపథ్యంలో రష్యా మనకు దూరమవుతున్నట్లు గతేడాది కొన్ని అపోహలు ప్రచారంలోకి వచ్చాయి. అయితే, రష్యాతో మన సంబంధాలు గాఢమైనవి. పైగా... తాజాగా భారత్, రష్యా సంబంధాల్లో సరికొత్త అధ్యాయం మొదలైన భావన కలిగింది. రష్యా, చైనా, అమెరికా మధ్య సంబంధాలు బహుముఖమైనవి మాత్రమే కాదు, సంక్లిష్టమైనవి కూడా. ఈ మూడింటి మధ్య సంబంధాల్లో వచ్చే మార్పుల ప్రభావం భారత్‌పై కచ్చితంగా ఉంటుంది. ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానం విషయంలో భారత్ అటు రష్యాపైనా, ఇటు అమెరికాపైనా ఆధారపడి ఉంది. కానీ, అగ్రదేశాల సరసన నిలవాలన్న భారత ఆకాంక్ష నెరవేరాలంటే దేశ సైనిక సామర్థ్యం ఇతరులపై ఆధారపడేలా ఉండరాదు.

భారతదేశం గొప్ప ఆత్మవిశ్వాసంతో 2024లోకి అడుగుపెట్టింది. కొత్త ఏడాది తొలి వారంలోనే ఆదిత్య–ఎల్1 విజయవంతంగా సూర్యుడి హాలో కక్ష్యలో ప్రవేశించడం, ఉత్తర అరేబియా సముద్రంలో పైరేట్లను తరిమికొట్టేందుకు భారత నేవీ నాటకీయమైన తీరులో ఆపరేషన్లు చేపట్టడం, అన్నీ శుభసూచనలే. 2023–24లో జీడీపీ వృద్ధి రేటు ఆరోగ్యకరమైన రీతిలో దాదాపు 7.3 శాతం వరకూ ఉండవచ్చునని జాతీయ గణాంక శాఖ ప్రకటించిన విషయమూ సంతోషకరమైన సమాచారమే. అన్నింటికీ మించి భారత్ విజయాలను గుర్తిస్తూ, చైనా వార్తా పత్రిక 'గ్లోబల్ టైమ్స్' ఒక కథనమూ ప్రచురించింది. భారత్ చాలా వేగంగా సామాజిక, ఆర్థిక వృద్ధి సాధిస్తోందని ఇందులో అభిప్రాయపడింది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో వ్యూహాత్మక శక్తిగా భారత్ ఎదుగుతోందని కొనియాడింది.

రెండూ ముఖ్యమే!

అయితే, ఈ విజయాలను ఆస్వాదించే క్రమంలో మనం గత ఏడాది ఆఖరులో జరిగిన కొన్ని అవాంఛనీయ ఘటనల గురించి మరచిపోరాదు. అంతర్జాతీయ స్థాయిలోనే కాకుండా... ప్రాంతీయంగానూ ఇతర దేశాలతో మన సంబంధాలను తీవ్రంగా ప్రభావితం చేయగల ముఖ్యమైన సంఘటనలు అవి. వ్యూహాత్మక లక్ష్యాలను కాపాడుకోవడంలో, సవాళ్లను ఎదుర్కోవడంలో భారత్ సత్తాను ప్రశ్నించే అవకాశమూ వీటికి ఉంది.

భారత విదేశీ వ్యవహారాల విధానాన్ని స్థూలంగా పరిశీలిస్తే... అమెరికాకు దగ్గరవడం... అదే సమయంలో రష్యాకు నెమ్మదిగా దూరంగా జరగడం అని అనిపిస్తుంది. ఉక్రెయిన్, రష్యా యుద్ధం నేపథ్యంలో భారత్ మౌనం వహించడం ఈ భావనకు మరింత బలం చేకూరుస్తోంది. అయితే సూక్ష్మస్థాయిలో అర్థం చేసుకోవాల్సిందేమిటి అంటే... భారత్ అటు రష్యాపైనా, ఇటు అమెరికాపైనా ఆధారపడి ఉందీ అని. ఇరు దేశాలూ మన మిలిటరీకి అవసరమైన ఆయుధాలు, టెక్నాలజీలు అందిస్తున్నాయి. ఈ పరిమితుల దృష్ట్యానే భారత్ తన వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తిని వ్యక్తం చేయలేకపోతోంది. మరీ ముఖ్యంగా పొరుగుదేశం చైనాను దృష్టిలో ఉంచుకున్నప్పుడు.

అయితే 2023 చివరి నాటికి అంతర్జాతీయ వ్యవహారాల్లో పరిస్థితులు కొంచెం వేగంగా మారిపోయాయి. వాటి ప్రభావం ఈ ఏడాది మనపై కచ్చితంగా పడనుంది. నవంబరులో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య శాన్‌ఫ్రాన్సిస్కోలో 'ఏపీఈసీ' సమావేశాల్లో కీలకమైన చర్చలు జరిగాయి. ప్రపంచంలోని రెండు అగ్రరాజ్యాల మధ్య ఏర్పడ్డ ప్రతిష్టంభన కొద్దిగా తొలగిన సూచనలు కనిపించాయి. ఇక డిసెంబరు చివరివారంలో భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్. జైశంకర్ రష్యా వెళ్లి, ఆ దేశ విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సెర్గీ లావరోవ్‌తో సమావేశమయ్యారు. ప్రచ్ఛన్న యుద్ధ కాలం మాదిరిగానే రష్యాతో భారత్ తన సంబంధాలను దృఢతరం చేసుకునేందుకు నిబద్ధమై ఉందని జైశంకర్ రష్యా మంత్రి సెర్గీకి నొక్కి చెప్పినట్లు వార్తలొచ్చాయి.



రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావరోవ్‌తో భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్

సంక్లిష్టం... బహుముఖం...

రష్యా, చైనా, అమెరికా మధ్య సంబంధాలు బహుముఖమైనవి మాత్రమే కాదు... చాలా సంక్లిష్టమైనవి కూడా. ఈ మూడింటి మధ్య సంబంధాల్లో వచ్చే మార్పుల ప్రభావం భారత్‌పై కచ్చితంగా ఉంటుంది. ప్రపంచ స్థాయిలో మన ప్రస్థానాన్ని, దిశను మార్చేయగల శక్తి వీటి సొంతం. ఈ సంబంధాల్లోనూ అమెరికా– చైనా మధ్య ఉన్నవి మరింత కీలకం. బైడెన్, జిన్ పింగ్ ఇటీవలి శిఖరాగ్ర సమావేశం సందర్భంగా కొన్ని అంశాలపై స్థూలంగా ఏకాభిప్రాయానికి రాగలిగారు. ఇరు దేశాల మధ్య ఉన్న విభేదాలు ఇందుకు అడ్డు కాకపోవడం ఇక్కడ చెప్పుకోవాల్సిన విషయం. ఇరుదేశాల మిలిటరీల మధ్య సంబంధాలు పునరుద్ధరించాలని చెప్పడం ద్వారా అమెరికా, చైనా రెండూ తమ మధ్య అంతరం తగ్గిందన్న సంకేతాన్ని పంపాయి. రష్యా–ఉక్రెయిన్, ఇజ్రాయెల్–గాజా యుద్ధాలకు సమీప భవిష్యత్తులో ఒక అర్థవంతమైన పరిష్కారం లభించగలదన్న ఆశ సమీప భవిష్యత్తులో కనబడని నేపథ్యంలో, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో దేశాలకు ఊరటనిచ్చే అంశమిది. స్థానిక పరిస్థితులు, ఉన్న పరిమితులను దృష్టిలో ఉంచుకుని ఇరువురు నేతలు తమ మధ్య అంతరాలను పక్కనబెట్టి ఈ రకమైన రాజీకి వచ్చి ఉండవచ్చు.

చైనా–అమెరికా మధ్య మిలిటరీ స్థాయిలో యుద్ధం లేదా చిన్నపాటి ఘర్షణ చోటు చేసుకున్నా దాని విపరిణామాలు తీవ్రంగా ఉండేవి. కాబట్టి తాత్కాలికంగానైనా ఈ ఉపశమనం దక్కడం ముఖ్యమైన విషయం అవుతుంది. తైవాన్ విషయంలో ఇరు దేశాలు మెత్తపడిందేమీ లేకున్నా భారత్ దృష్టిలో మాత్రం చైనా–అమెరికా మధ్య వైరం కొంతైనా తగ్గడం ఎంతో కీలకమైంది.

సొంతంగా ఎదిగినప్పుడే...

అమెరికా ఇండో–పసఫిక్ వ్యూహంలో భారత్ ప్రధాన భాగస్వామి అన్న అంచనా ఉంది. మరి చైనా– అమెరికా మధ్య సంబంధాలు మెరుగుపడటం భారత్‌కు ఏమైనా నష్టం చేకూరుస్తుందా? అవకాశమైతే ఉంది. పైగా ద్వైపాక్షిక స్థాయిలో ఇరు దేశాల మధ్య గత ఏడాది చివరిలో కొన్ని అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. తమ పౌరుడు ఒకరిని చంపేందుకు భారత్ కుట్ర పన్నిందని అమెరికా ఆరోపించింది. ఈ కోణంలో చూస్తే భారత్ మీద అమెరికాకు కొంత అసంతృప్తి ఉన్నట్లు స్పష్టమవుతుంది.

1970లలో హెన్రీ కిసింజర్ అమెరికా విదేశాంగ మంత్రిగా ఉండగా, అప్పటి అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ చైనాతో సంబంధాలను మెరుగుపరచుకునే ప్రయత్నం చేశారు. ఇది కాస్తా భారత్, యునైటెడ్ సోవియట్ రిపబ్లిక్ మధ్య బంధాలు గట్టిపడేలా చేసింది. సోవియట్ వారసురాలిగా కొనసాగిన రష్యాతో ఆ సంబంధాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. భారత త్రివిధ దళాలకు రష్యా ప్రధాన ఆయుధ సరఫరాదారుగా మారింది. అమెరికా దగ్గరవుతున్న నేపథ్యంలో రష్యా మనకు దూరమవుతున్నట్లు 2023లో కొన్ని అపోహలైతే ప్రచారంలోకి వచ్చాయి. అయితే, తాజాగా కూడా భారత్, రష్యా సంబంధాల్లో సరికొత్త అధ్యాయం ఒకటి మొదలు కానున్నట్లు తెలుస్తోంది.

భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని కాంక్షిస్తోంది. అలాగే అగ్రరాజ్యాల సరసన నిలవాలని కూడా ఆశిస్తోంది. అయితే మిలిటరీ విషయాల్లో విదేశాలపై ఆధారపడుతూంటే భారత్ ఆశలు, ఆకాంక్షలు నెరవేరడం కష్టం. అమెరికా, రష్యా, చైనా తమ స్వప్రయోజనాల కోసం ప్రయత్నించినా ద్వైపాక్షిక స్థాయిలో దగ్గరి సంబంధాలు కలిగి ఉండటం మనకు అవసరం. మన రాజకీయ, దౌత్య చతురతకు ఇది నిజంగానే ఒక సవాలు!

వ్యాసకర్త సొసైటీ ఫర్ పాలసీ స్టడీస్ డైరెక్టర్
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఎందుకీ అభద్రత?



'అన్నపూరణి' సినిమాతో సమస్య ఉన్నవాళ్లు తమ టీవీ ఆపేసుకోవచ్చు, అకౌంట్ డీయాక్టివేట్ చేసుకోవచ్చు, ఇతరులకు చూడొద్దని చెప్పొచ్చు. అంతేగానీ చట్టపరమైన చర్య తీసుకుంటామనడం, వేదికలను క్షమాపణ చెప్పేలా చేయడం, సినిమాను తొలగించేలా ఒత్తిడి చేయడం బెదిరింపు అవుతుంది. ఇదేనా హిందూ–రైట్ మాట్లాడే భావ స్వేచ్ఛ?

– హార్దిక్ రాజ్‌గోర్, రచయిత

మేధో దంపతులు



ఈ 'ఇంటెలి జెన్స్'లో 'ఆర్టిఫీషియల్' ఏమీ లేదు. ఎవరిమధ్య అయినా ప్రేమ ప్రేమే. నూతన దంపతులు సామ్ ఆల్ట్‌మాన్, ఆలివర్ ముల్హెరిన్‌కు నా హృదయ పూర్వక శుభాకాంక్షలు. వాళ్ల ప్రేమ ఎప్పటికీ నిలుచుగాక! ('ఓపెన్ ఏఐ' సీఈఓ సామ్ తన బాయ్‌ఫ్రెండ్‌ను వివాహమాడారు.)

– రామ్ గోపాల్ వర్మ, దర్శకుడు

టాలెంట్‌ను గుర్తిద్దాం!



నేను ఎప్పుడూ ఏ ఆటా ఆడలేదు. కానీ నన్ను చూసినవాళ్లు నా శక్తిని గుర్తించి మద్దతిచ్చారు. దానివల్ల నా జీవితం మారిపోయింది. కానీ గ్రామాల్లో ఎందరికో అలాంటి అవకాశాలు రావు. 'జాతీయ యువజన దినోత్సవం' రోజున నేను అలాంటి గ్రామీణ చిన్నారికి మద్దతిస్తానని వాగ్దానం చేస్తున్నాను. మీరూ అది చేయాలని కోరుకుంటున్నాను.

– శీతల్ దేవి, పారా–ఆర్చర్

కపటం



అంతర్జాతీయ న్యాయస్థానంలో ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా దక్షిణాఫ్రికా వాదనలను 'బీబీసీ' చూపించలేదు. ఇజ్రాయెల్ ప్రతివాదనను మాత్రం చూపుతోంది. పాశ్చాత్య మీడియా కపటానికి అంతులేదు.

– అద్వైద్, క్రానికలర్

తగిన పేరు




ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండి, అందరినీ కలిసిన రాజకీయవేత్త (మాజీ ప్రధాని) అటల్ బిహారీ వాజ్‌పేయి. అందుకే, వంతెనకు 'అటల్ సేతు' అని పేరుపెట్టడం సరిగ్గా సరిపోతుంది.

– రమేశ్ శ్రీవత్స్, వ్యాఖ్యాత

ఇన్ బాక్స్

సాహితీ చలివేంద్రం

అక్కడొక దృశ్యం. మనమడి చేతిలో బొమ్మ తుపాకీ. తాతకు గురి పెట్టి ఉంది. తాత భయపడుతున్నాడు. కాదు... భయం నటిస్తున్నాడు. 'కాల్చకు రా బాబూ' అంటూ బతిమాలుతున్నాడు. మనమడు కుదరదన్నాడు. 'ఢామ్మ'ని పేల్చేశాడు. తాత నిజంగానే గుండె పట్టుకుని ఉన్నపళంగా అమాంతం కింద పడి పోయాడు. మనమడు గెంతు లేసుకుంటూ, చప్పట్లు కొట్టుకుంటూ కిలకిలా నవ్వుతున్నాడు. కాసేపటికి తాత కళ్ళు తెరచి నెమ్మదిగా లేచాడు. అక్కడే ఉన్న కొడుకు 'ఎందుకు నాన్నగారూ... నిజంగానే పడి పోయారు. మీకేమైనా దెబ్బ తగిలితే... బాధ పడాలి కదా' అన్నాడు. 'ఒరేయ్... వాడికి నిజంగా కాల్చిన అనుభూతి నేను అలా పడినప్పుడే వస్తుంది రా... అంతా వాడి ఆనందం కోసమే...' అని సమాధానం చెప్పాడు. ఆ తాత మధునాపంతుల సూరయ్య శాస్త్రి. ఈ సంఘటన ఆయన భావుక ప్రపంచం ఎంత ఆచరణాత్మకమైనదో తెలియజేస్తుంది.



మధునాపంతుల సూరయ్య శాస్త్రి

మధునాపంతుల సూరయ్య శాస్త్రి ఆంధ్రపురాణ కర్త మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి సోదరుడు. మహాభారత రచనలో నన్నయకు నారాయణభట్టు సాయం చేసినట్టు చరిత్రను కావ్యంగా మలిచే క్రమంలో తన అన్నగారికి సూరయ్యశాస్త్రి ఎంతో తోడ్పాటునందించారు. స్వయంగా 'దేవీనవతి' కావ్యాన్ని వెలయించారు. తెలుగు పండితుడిగా ఉద్యోగం చేశారు. చుట్టుపక్కల పలు గ్రామాలకు ఏభై ఏళ్ళుగా ఆయుర్వేద వైద్యునిగా సేవలందించారు.

మధునాపంతుల సూరయ్య శాస్త్రి 1924 నవంబరు 15వ తేదీన జన్మించారు. ఈ నెల 14 తేదీన కుటుంబసభ్యులు శత జయంతి వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా డా॥ జీవీ పూర్ణచందు, డా॥ యనమదల మురళీకృష్ణలకు ప్రతిభా పురస్కారాలు, పలువురికి ఆత్మీయ సత్కారాలు అందజేస్తారు.

– దాట్ల దేవదానం రాజు । 94401 05987
(రేపు మధునాపంతుల సూరయ్య శాస్త్రి శత జయంతి వేడుక)

ఎగిరిపోతున్న పందెం కోళ్ళు

అభిప్రాయం



పి. విజయబాబు

ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న కోడిపందాల సీజన్ వచ్చేసింది! కోడిపందాలు ఆటలో వెన్నెల కంటికి 'మాంచి పేరు' ఉంది. మాంచి అంటే మంచివాడని కాదు. పందేలాటలో ఎత్తులు, జిత్తులు వేసి ప్రత్యర్థులను చిత్తు చేయడంలో వెన్నెల కంటిని మించినోళ్లు ఎవరూ లేరని ప్రతీతి. కానీ కొంత కాలంగా ఆయన ఆటలు సాగడం లేదు. అయితే ఈసారి ఏమైనా సరే పందెం గెలవాలని మళ్లీ ఎత్తులు, జిత్తులు మొదలు పెట్టాడు.

తన దగ్గర ఉన్న కోళ్లను 'తయారీకి' సిద్ధం చేయాలనే ఆలోచన అలా ఉంచి, ప్రత్యర్థుల కోళ్ళని ముందుగా లాగేసుకుంటే గెలుపు తేలికవుతుందని ఒక బలుపు ఆలోచన వచ్చింది. భార్య గౌరి, "మన దగ్గర ఉన్న కోళ్లు మంచి పౌరుషంతో ఉన్న కోళ్లేగా మావా?" అన్నది.

"ఓసి పిచ్చి మొహమా! పక్కోడి కోడిని లాగేసుకోవడంలో ఉండే మజా నీకేం తెలుసు?" అన్నాడు. "చాల్లే సంబడం. మా అయ్య కాడ కోళ్లన్నీ లాగేసుకున్నప్పుడే నీ కథ ఏంటో తెలిసినాది. ఇప్పుడు నాకేదో కొత్తగా కథలు సెప్తావేటి?" అన్నది.

"ఛస్! మా యప్పగారి బొట్టే ... సాల్లే ఊరుకో!" అంటూ సున్నితంగా గద్దించాడు. "ఏటి నోరు లేస్తున్నాది? సంటోడికి చెప్పనా?" అంది కళ్ళెర్రజేసి చూస్తూ.

"ఆడే సరైనోడు అయితే నాకెందుకు ఈ తిప్పలు? వెళ్లి నీ పని చూసుకో!" అంటూ అక్కడ నుంచి విసురుగా వెళ్ళిపోయాడు వెన్నెల కంటి.

వెన్నెలకంటి చూపులు ఎంతసేపు పక్క దొడ్లో కోళ్ల మీదే!

పందెం కోళ్ళలో మంచి జాతి కోళ్ళు ఉంటాయి. అవి బరిలోకి దిగితే తిరుగు ఉండదు. ముఖ్యంగా పందెం కోళ్లల్లో పేరు ఉన్న జాతులు... నెమలి, డేగ, నల్ల డేగ, కాకి నెమలి, చేతువా, పర్లా, కుక్కిరాయి, సవల, రసంగి, మైలా, ఫింగలా, పెట్టమర్రి మొదలైనవి. ఇలాంటి పౌరుషం గల జాతి కోళ్ళు పక్కింటి ఆసామి దగ్గర దండిగా ఉన్నాయి. తన దగ్గర కూడా కొన్ని మామ దగ్గర నుంచి లాక్కున్నవి ఉన్నాయి. అయితే వాటి వయసు పైబడింది. వాటికే కాదు తనకు కూడా వయసు పైబడి చూపు కూడా బాగా మందగించింది. ఆమధ్య తనకు చూపు పోయే ప్రమాదం ఉందని, చర్మం చిట్లి పోతుందని, కిడ్నీలు కూడా పాడై పోతాయని కిట్టయ్య, రావుడు, సాంబయ్య గగ్గోలు పెట్టేసారు. దాంతో కంటికి ఆపరేషన్ చేయించు కున్నాడు. కానీ చూపే కాదు మెదడు కూడా మొద్దు మారిపోయింది. అయినా ఆశ చావదు. ఏమైనా సరే ఈసారి పక్కింటి ఆసామిని దెబ్బ కొట్టి గెలవాలి. ఇదే వెన్నెల కంటి లక్ష్యం. ఆ జాతి కోళ్లను కొన్నైనా కొట్టేయగలిగితే.. వెన్నెల కంటికి ఇదే ధ్యాస. పక్కింటి ఆసామి దొడ్లో కొన్ని కోళ్లు స్వేచ్ఛగా తిరగటం గమనించాడు. తన దగ్గర ఉన్న దాణ వాటికి విసిరేయడం మొదలుపెట్టాడు. మెల్లగా అవి తన దగ్గరకు చేరాయి. ఎత్తు ఫలించింది అనుకున్నాడు.



వెన్నెలకంటి చేస్తున్న పనికి అతని దగ్గర ఉన్న జాతి కోళ్ళు గుర్రుగా చూసాయి.

అదలా ఉంటే, అయ్య తెలివికి సంటోడు,పెంచుకుంటున్న బుడ్డోడు మురిసి పోయారు.

పందానికి సమయం దగ్గర పడుతోంది. ఆర్భాటంగా పందెం కోళ్ళని బండి ఎక్కించాడు వెన్నెల కంటి.

కిట్టయ్య, రావుడు, సాంబయ్య, డప్పులు వాయించడం మొదలుపెట్టారు. బండి కదిలింది. చంటోడు ఎర్రని లాలిపప్ నోట్లో పెట్టుకుని, డప్పు వాయిద్యాలకు అనుగుణంగా ఎగురుతున్నాడు. బుడ్డోడు పూనకం వచ్చినట్టు ఊగిపోతున్నాడు. సరిగ్గా బండి కదిలే సమయానికి, కోళ్ల నాణ్యత తెలిసిన శంకరయ్య" వచ్చి, "వెన్నెల కంటీ! నీకు వయసుతో పాటు చూపే కాదు, బుద్ధి కూడా మందగించింది. నువ్వు కమ్మేసిన పక్కింటి కోళ్లు పందానికి పనికిరావని వది లేసిన కోళ్లు... నీ దగ్గర ఉన్న కోళ్ళని సరిగా చూసుకోకుండా నీ దృష్టి అంతా వాటి మీద పెట్టావ్! ఇక పో నీ పని అయిపోయిందిలే!" అంటూ అక్కడి నుంచి కదిలి వెళ్ళిపోయాడు.

సరిగ్గా అదే సమయంలో తమ పక్కన ఉన్న కోళ్ల ఉనికిని భరించలేని జాతి కోళ్ళు ఒక్కొక్కటిగా బండిలోంచి పక్కింటి ఆసామి దొడ్లోకి దూకేయడం మొదలు పెట్టాయి. ఈ హఠాత్పరిణామానికి విస్తుపోయాడు వెన్నెలకంటి. "ఇదేంటి సీన్ రివర్స్ అవు తోంది?" అని కంగారు పడటం మొదలు పెట్టాడు. కానీ ఇవేవీ పట్టనట్టు భజన పరులు మాత్రం డప్పులు వాయిస్తూనే ఉన్నారు. ఇదంతా దూరం నుంచి గమ నిస్తున్న శంకరయ్య "పందెం సమయం సమీపించే సరికి ఇంకెన్ని కోళ్ళు ఎగిరిపోతాయో?" అని తనలో తను గొణుక్కున్నాడు.

వ్యాసకర్త సీనియర్ సంపాదకులు

భోగి పేరు ఎందుకంటే...

ఆస్తికులకు అన్ని మాసాలూ భగవత్ప్రసాదాలే అయినా, ధనుర్మాసమంటే ప్రత్యేక ప్రీతి. సౌరమాన కాల గణన ప్రకారం ధనుర్మాసం మార్గశిర మాసం. మార్గశిరం భక్తులకే కాదు, భగవంతుడికి కూడా ఇష్టమైన మాసం. దక్షిణ భారతంలో చలి గరిష్ఠ తీవ్రతతో ఉండేది ధనుర్మాసంలో. ఈ మాసమంతా, రోజూ బ్రహ్మ ముహూర్తంలో లేచి, శరీర క్లేశం సహించి, భగవదారాధన చేయడం భక్తుల నిష్ఠకూ భక్తి తత్పరతకూ గీటురాయి. ఇంటి ముంగిట కంటికి విందుగా రంగవల్లులతో సృజనాత్మకత ప్రకటించడం, గొబ్బెమ్మలను అలంకరించడం, తెలతెలవారుతుండగా దేవాలయ దర్శనం చేసి స్వామికి నమస్కరించడం, చవు లూరే వేడి ప్రసాదాలు ఆరగించడం అదనపు ఆనందాలు. భోగి పండగ ధనుర్మాసానికీ, ధనుర్మాస వ్రతాలకూ ఉద్యాపన సమయం. దక్షిణాయనానికి ముగింపు రోజు.



జ్యోతిర్మయం

ధనుర్మాసానికీ ఆండాళ్ తల్లికీ అవినాభావ సంబంధం. భూదేవి అవతారమైన గోదాదేవి ధనుర్మాస వ్రతం నిష్ఠగా జరిపినందుకు మెచ్చి, ఆమె వల్లభుడైన శ్రీరంగనాథుడు ఆమెకు స్వప్నంలో సాక్షాత్కరించి, ఆమె కోరుకొన్న అన్ని భోగాలలోనూ ఆమెను ఓలలాడించిన కారణంగా, 'భోగి' రోజుకు ఆ పేరు వచ్చిందని పెద్దల మాట. **యస్మిన్ దినే సర్వ భోగాన్ / శ్రీ గోదా బుభుజే, తతః,/ 'భోగి'–ఇతి నామ తస్య–ఆసీత్, / దివసస్య తదా అనఘ** – ఏ దినాన శ్రీ గోదాదేవి సమస్త భోగాలు అనుభవించిందో, అప్పటినుంచి, ఆ రోజుకు, ఆ కారణంవల్ల 'భోగి' అనే పేరు ఏర్పడింది. అందుకే భోగి పండగనాడు శ్రీరంగ క్షేత్రంలో శ్రీగోదా రంగనాథ కల్యాణం అంగరంగ వైభవంగా జరుగుతుంది. ఆ విధంగా చూస్తే, రంగనాథుడినే వలచి వలపించుకొన్న ఆముక్త మాల్యద ఆండాళ్ తల్లి అనన్య భక్తిని స్మరించుకొనే సందర్భం కావడం భోగి పండగ ముఖ్య విశిష్టత.

భోగి పండగ ముగ్గుల పండగ. 'భోగి మంట'ల పండగ. పిల్లలకు 'భోగి పళ్ళు' పోసి, దృష్టి దోషాలు తొలగించి, పిల్లల చేతే పేరంటాళ్లను సత్కరింపజేసి, ఆశీర్వాదాలిప్పించే అందమైన పండగ. చనుదెంచుతున్న సంక్రాంతి లక్ష్మికి సహర్షంగా సమర్పించే స్వాగత తోరణం భోగి పండగ. భోగి, సంక్రాంతి పండగల ఆనవాయితీలు, రేపటి పౌరులకు తమ ప్రాచీన సంస్కృతి పట్ల కుతూహలాన్నీ గౌరవాన్నీ పెంచడమే కాక, భవిష్యజ్జీవితంలో నెమరు వేసుకొనేందుకు ఎన్నెన్నో తీపి జ్ఞాపకాలను మిగులుస్తాయి. అందరికీ భోగి పండగ శుభాకాంక్షలు!

– ఎం. మారుతి శాస్త్రి
(రేపు భోగి పండగ)



గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** శు.విదియ ప.2.30 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** శ్రవణం సా.4.24 వరకు, తదుపరి ధనిష్ఠ, **వర్జ్యం:** రా.8.09 నుండి 9.37 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.36 నుండి 8.06 వరకు, **అమృతఘడియలు:** ఉ.6.34 నుండి 8.04 వరకు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 6.38, **సూర్యాస్తమయం:** 5.39.



యెమెన్‌లో దాడుల కోసం సైప్రస్ స్థావరం నుంచి టేకాఫ్ తీసుకున్న ఆర్ఏఎఫ్ టైఫూన్ యుద్ధ విమానం

బ్రిటన్ అమెరికా దాడులు

హౌతీలపై బాంబుల వర్షం

వాషింగ్టన్: హౌతీ ఉగ్రవాద ముఠాపై అమెరికా, బ్రిటన్ విరుచుకుపడ్డాయి. మిలిటెంట్ల ఆవాసాలు, ఆయుధాగారాలపై ఆ దేశాల సంయుక్త దళాలు గురు, శుక్రవారాల్లో భారీగా బాంబు దాడులు జరిపాయి. యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, ఫైటర్ జెట్ల ద్వారా ఏకకాలంలో తోమహాక్ క్షిపణులు తదితరాలు ప్రయోగించి పలు లక్ష్యాలను ఛేదించినట్టు అమెరికా అధికార వర్గాలు తెలిపాయి. వీటిలో యెమన్ రాజధాని సనా, ఎర్రసముద్రంలో హౌతీల కంచుకోట హుదాయ్దా వంటివి కూడా ఉన్నట్టు వివరించాయి. అక్కడి తీర ప్రాంత రాడార్ సైట్లతో పాటు డ్రోన్, మిసైళ్ల నిల్వ, ప్రయోగ కేంద్రాలను తాజా దాడుల్లో ధ్వంసం చేసినట్టు ప్రకటించాయి. ఎర్రసముద్రంలో ఉగ్ర మూకల దాడులను సహించబోమనేందుకు ఈ దాడులు తాజా రుజువని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ పేర్కొన్నారు. ఎర్రసముద్రంలో అంతర్జాతీయ రవాణా నౌకలపై హౌతీల మతిలేని దాడికి చరమగీతం పాడి తీరతామన్నారు. అందుకోసం మరిన్ని తీవ్ర చర్యలకు కూడా వెనకాడబోమని ఆయన స్పష్టం చేశారు. ''చరిత్రలోనే తొలిసారిగా యాంటీ షిప్ బాలిస్టిక్ మిసైళ్లను హౌతీలు ప్రయోగిస్తున్నారు. ఇది అంతర్జాతీయ వర్తకానికి, నౌకలకు, నావికులకే గాక అమెరికా రక్షణ సిబ్బందికి కూడా ప్రమాదకరంగా మారింది'' అంటూ మండిపడ్డారు.

పరిస్థితులు ఉద్రిక్తం

సనాలో శుక్రవారం తెల్లవారుజామున కనీసం నాలుగు భారీ పేలుళ్లు సంభవించాయని స్థానిక జర్నలిస్టులు వెల్లడించారు. నగర పశ్చిమాన రేపు ప్రాంతంలో కూడా ఐదుకు పైగా భారీ పేలుళ్లు జరిగినట్టు చెబుతున్నారు. అక్కడికి దక్షిణాన ఉన్న తైజ్, ధమర్ వంటి నగరాలపై కూడా దాడులు జరిగాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అమెరికా హెచ్చరికల నేపథ్యంలో కొద్ది రోజుల పాటు దాడులకు దూరంగా ఉన హౌతీలు గత మంగళవారం ఉన్నట్టుండి భారీగా విరుచుకుపడటం తెలిసిందే. ఎర్రసముద్రంలోని నౌకలపైకి పెద్ద సంఖ్యలో క్షిపణులు ప్రయోగించాయి. అమెరికా, బ్రిటన్ యుద్ధ నౌకలు, ఫైటర్ జెట్లు తక్షణం స్పందించాయి. 18 డ్రోన్లను, రెండు మిసైళ్లు, ఒక యాంటీ షిప్ మిసైల్‌ను నేలకూల్చాయి. గురువారం కూడా గల్ఫ్ ఆఫ్ ఏడెన్‌లో ఒక నౌకపైకి హౌతీలు షిప్ విధ్వంసక బాలిస్టిక్ మిసైల్‌ను ప్రయోగించారు. అది గురి తప్పడంతో భారీ నష్టం తప్పింది. దాంతో పరిస్థితిపై మంగళవారమే బైడెన్ అత్యవసర సమీక్ష జరిపారు. హౌతీలపై దాడులను తీవ్రతరం చేయాల్సిందిగా ఆదేశాలిచ్చారు. మరోవైపు బ్రిటన్ రాయల్ ఎయిర్ ఫోర్స్ కూడా హౌతీలపై పెద్దపెట్టున దాడులు జరిపిందని ప్రధాని రిషీ సునాక్ ప్రకటించారు. తమ సంయుక్త దాడులకు నెదర్లాండ్స్, కెనడా, బెహ్రాయిన్ దన్నుగా నిలిచాయన్నారు. దాడులకు స్వస్తి పలకాలని ఆస్ట్రేలియా, డెన్మార్క్, జర్మనీ, నెదర్లాండ్స్, బహ్రాయిన్, న్యూజిలాండ్, దక్షిణ కొరియా తదితర దేశాలు కూడా ఇప్పటికే హౌతీలను హెచ్చరించాయి. ఎర్రసముద్రంలో నౌకల భద్రత నిమిత్తం 22 దేశాలతో కలిసి 'ఆపరేషన్ ప్రాస్పరిటీ గార్డియన్' పేరిట కొత్త సముద్ర రక్షణ మిషన్‌కు అమెరికా తాజాగా తెరతీసింది. ఇందులో భాగంగా నౌకల రక్షణార్థం అమెరికా తదితర దేశాల యుద్ధ నౌకలు ఎర్రసముద్ర జలాల్లో నిరంతరం గస్తీ కాస్తున్నాయి.

ఎవరీ ఎర్రసముద్రపు హౌతీలు!

హమాస్‌కు దన్నుగా అరాచకం

ఇజ్రాయెల్ లక్ష్యంగా ఎర్రసముద్రంలో నౌకలపై దాడులు

అంతర్జాతీయ సరుకు రవాణాపై తీవ్ర ప్రభావం

ఎర్రసముద్రం కొంతకాలంగా అల్లకల్లోలంగా మారింది. ఇరాన్ దన్నుతో హౌతీ ఉగ్రవాద ముఠాలు రెచ్చిపోతున్నాయి. ఆ మార్గం గుండా ప్రయాణిస్తున్న అంతర్జాతీయ సరుకు రవాణా నౌకలపై విచ్చలవిడి దాడులతో బెంబేలెత్తిస్తున్నాయి. యెమన్‌లో అత్యధిక భాగాన్ని నియంత్రిస్తున్న ఈ ఉగ్రవాద ముఠా సముద్ర దాడులు అంతర్జాతీయ సమాజానికి పెను సవాలుగా మారాయి. ఒకవిధంగా అంతర్జాతీయ వర్తకమే తీవ్రంగా ప్రభావితమవుతోంది. ఇంతకూ ఎవరీ హౌతీలు? వీళ్లెందుకిలా ఉన్నట్టుండి సముద్ర సవాళ్లకు దిగినట్టు...?

- సాక్షి, నేషనల్ డెస్క్

గత అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై పాలస్తీనాలోని హమాస్ ఉగ్రవాదులు మెరుపుదాడికి దిగి కనీవినీ ఎరగని రీతిలో బీభత్సం సృష్టించడం తెలిసిందే. అందుకు ప్రతీకారంగా హమాస్ నిర్మూలనే లక్ష్యంగా పాలస్తీనాపై పూర్తిస్థాయి యుద్ధానికి ఇజ్రాయెల్ తెర తీసింది. హమాస్‌కు దన్నుగా హౌతీల ఆగడాలు అప్పటినుంచే పెచ్చరిల్లాయి. ఇజ్రాయెల్ వైపు ప్రయాణిస్తున్న ప్రతి నౌకనూ లక్ష్యం చేసుకుంటామని హౌతీలు హెచ్చరించారు. కానీ వాస్తవానికి ఇజ్రాయెల్‌తో ఏ సంబంధమూ లేని నౌకలను కూడా వదిలిపెట్టడం లేదు. కొద్ది రోజులుగానైతే కనిపించిన నౌక మీదల్లా విచ్చలవిడిగా దాడులకు దిగుతూ కల్లోలం సృష్టిస్తున్నారు. సమీపంలోని నౌకలపై డ్రోన్లు, సుదూరాల్లో ఉన్నవాటిపై ఏకంగా బాలిస్టిక్ మిసైళ్లు ప్రయోగిస్తూ గుబులు రేపుతున్నారు. గత నవంబర్, డిసెంబర్ మాసాల్లో ఎర్రసముద్రంపై నౌకలపై హౌతీల దాడులు ఏకంగా 500 శాతం పెరిగిపోయాయి! వీటికి ఇరాన్ సహకారం కూడా పుష్కలంగా ఉందని అమెరికా ఆరోపిస్తోంది. మిత్ర రాజ్యాలతో కలిసి హౌతీల స్థావరాలపై కొద్ది రోజులుగా అమెరికా పెద్దపెట్టున క్షిపణి దాడులకు దిగుతోంది.

యెమన్ సాయుధ ముఠా..!

హౌతీలు యెమన్‌కు చెందిన సాయుధ ముఠా. 1990ల్లో నాటి దేశాధ్యక్షుడు అలీ అబ్దుల్లా సలే అవినీతిని ఎదిరించేందుకంటూ పుట్టుకొచ్చారు. అక్కడి షియా ముస్లిం మైనారిటీల్లో జైదీలనే ఉపతెగకు చెందినవారు. వీరి ఉద్యమ వ్యవస్థాపక నేత హుసేన్ అల్ హౌతీ పేరిట ఆ పేరు వచ్చింది. ఈ ముఠాను తొలుత అన్సర్ అల్లా (దేవ పక్షపాతులు)గా పిలిచేవారు...

- హౌతీలను అణచేసేందుకు సౌదీ అరేబియా సాయంతో సలే 2003లో విఫలయత్నం చేశాడు.
- యెమెన్ ప్రభుత్వంపై 2014 నుంచీ వీళ్లు తీవ్ర స్థాయిలో పోరాడుతున్నారు. ఫలితంగా పదేళ్లుగా దేశం అంతర్యుద్ధంతో అట్టుడికిపోతోంది.
- సౌదీ, యూఏఈ, ఇతర అరబ్ దేశాలన్నీ యెమన్ ప్రభుత్వానికి దన్నుగా ఉన్నా హౌతీలు ఎదిరించి నిలుస్తున్నారు.
- ఈ పోరాటంలో ఇప్పటికే ఏకంగా 3.5 లక్షల మంది దాకా బలైనట్టు అంచనా!
- అల్లర్లకు తాళలేక అర కోటి మందికి పైగా పొట్ట చేత పట్టుకుని యెమన్ నుంచి వలస బాట పట్టారని ఐరాస పేర్కొంది.
- అమెరికా, ఇజ్రాయెల్, పాశ్చాత్య దేశాలకు వ్యతిరేకంగా ఇరాన్, పాలస్తీనా, హెజ్బొల్లా గ్రూపు తదితరాలతో కలిసి 'ప్రతిఘటన శక్తులు'గా హౌతీలు తమను తాము చెప్పుకుంటారు.
- వీరికి లెబనాన్‌కు చెందిన హెజ్బొల్లా గ్రూపు అండదండలు పుష్కలంగా ఉన్నాయి. అది వీరికి 2014 నుంచీ ఆయుధాలను, పూర్తిస్థాయి సాయుధ శిక్షణను అందిస్తూ వస్తోంది.
- ఇరాన్ కూడా హౌతీలకు పూర్తిగా దన్నుగా నిలుస్తోందని చెబుతారు. ముఖ్యంగా వారికి బాలిస్టిక్ మిసైళ్లను సమకూర్చింది ఇరానేనని అమెరికా రక్షణ శాఖ వర్గాలు అనుమానిస్తున్నాయి.
- 2019లో తమ చమురు క్షేత్రాలపై దాడులకు హౌతీలు వాడిన డ్రోన్లు, క్షిపణులను కూడా ఇరానే అందజేసిందని సౌదీ ఆరోపిస్తూ ఉంటుంది.
- గాజాపై యుద్ధం మొదలు పెట్టినప్పటి నుంచీ ఇజ్రాయెల్‌పై హౌతీలు పదేపదే బాలిస్టిక్ మిసైళ్లు, డ్రోన్లతో దాడులు చేస్తూనే ఉన్నారు.



పెను ప్రభావం...

ఆసియా, యూరప్ మధ్య సముద్ర రవాణాకు ఎర్రసముద్రమే అత్యంత దగ్గరి దారి. అంతేగాక అంతర్జాతీయ సముద్ర వర్తకంలో కనీసం 15 శాతానికి పైగా ఎర్రసముద్రం మీదుగా మధ్యధరా సముద్రం, సూయజ్ కాల్వ గుండానే సాగుతుంది. ఈ నేపథ్యంలో అక్కడ హౌతీల మతిలేని దాడుల ప్రభావం అంతర్జాతీయ వర్తకంపై భారీగా పడుతోంది...

- ఎర్రసముద్రం గుండా ప్రయాణించే నౌకలకు బీమా ప్రీమియాన్ని కంపెనీలు పది రెట్లకు పైగా పెంచాయి!
- మెడిటెరేనియన్ షిపింగ్ కంపెనీ, మార్క్స్, హపాగ్–లాయిడ్, బ్రిటిష్ పెట్రోలియం వంటి పలు కంపెనీలు ప్రత్యామ్నాయ సముద్ర మార్గాలను ఎంచుకుంటున్నాయి.
- దాంతో అంతర్జాతీయ సరుకు రవాణా వ్యవస్థ తీవ్రంగా ప్రభావితమవుతోంది.
- అటు దాడులు, ఇటు బీమా వ్యయాలకు దడిచి పెద్ద రవాణా కంపెనీలన్నీ ఎర్రసముద్రం మార్గానికి ఓ నమస్కారం అంటున్నాయి.
- వెరసి ఇదంతా రవాణా వ్యయాలు బాగా పెరిగేందుకు కారణమవుతోంది.
- అంతర్జాతీయంగా చమురుతో పాటు నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగేలా కన్పిస్తున్నాయి.

హౌతీల చెరలోనే యెమన్

నిజానికి రాజధాని సనాతో పాటు యెమన్ అత్యధిక భాగం హౌతీల వశంలోనే ఉంది. ప్రజల నుంచి పన్నులు వసూలు చేయడమే గాక వారు సొంత కరెన్సీని కూడా ముద్రిస్తున్నారు! ఇక యెమన్‌లోని ఎర్రసముద్ర తీర ప్రాంతం మొత్తాన్నీ హౌతీలే నియంత్రిస్తున్నారు. ఇప్పుడదే ఆ మార్గం గుండా అంతర్జాతీయ సరుకు రవాణాకు పెను సవాలుగా మారింది. 2010 నాటికే ఈ ముఠాకు కనీసం లక్ష పై చిలుకు సాయుధ బలమున్నట్టు ఐరాస అంచనా వేసింది.

మందిర నిర్మాణానికి మోదీని ఎంచుకున్న విధి

వాజ్‌పేయీ లేకపోవడం నాకు వేదన కలిగిస్తోంది: అద్వానీ

న్యూఢిల్లీ: అయోధ్యలో రామ మందిర నిర్మాణానికి విధి నరేంద్ర మోదీని ఎంచుకుందని బీజేపీ కురువృద్ధ నేత ఎల్‌కే అద్వానీ (96) పేర్కొన్నారు. 'రాష్ట్ర ధర్మ' ప్రత్యేక మ్యాగజీన్‌కు రాసిన వ్యాసంలో ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. అయోధ్యలో రామ మందిరం నిర్మాణం కోసం 33 ఏళ్ల క్రితం తాను చేపట్టిన రథయాత్రను ప్రస్తావించారు. ఆలయ ప్రారంభ సమయానికి మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి లేకపోవడం వేదన కలిగిస్తోందన్నారు. ''నాటి రథయాత్ర ఆసాంతం ప్రధాని మోదీ నాతో పాటే ఉన్నారు. అప్పట్లో ఆయన గురించి ఎవరికీ పెద్దగా తెలీదు. కానీ ఆ శ్రీరాముడే ఆలయ పునర్నిర్మాణం కోసం ఆయన్ను ఎంచుకున్నారు. విగ్రహ ప్రతిష్ఠాపన ద్వారా ప్రతి పౌరుడికి మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్నారు'' అన్నారు. రామాలయ కలను సాకారం చేసి తన లక్ష్యాన్ని నెరవేర్చుతున్నందుకు మోదీకి ధన్యవాదాలన్నారు.

ఆకాశ్–ఎన్‌జీ క్షిపణి ప్రయోగం విజయవంతం

న్యూఢిల్లీ: దేశ సైనిక సంపత్తిని బలోపేతం చేసే కొత్త తరం ఆకాశ్–ఎన్‌జీ క్షిపణి ప్రయోగ పరీక్ష విజయవంతమైనట్లు రక్షణ శాఖ తెలిపింది. ఒడిశాలోని చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుంచి శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఈ ప్రయోగం చేపట్టామని వెల్లడించింది. 80 కిలోమీటర్ల రేంజ్ కలిగిన ఈ క్షిపణి తక్కువ ఎత్తులో హైస్పీడ్‌తో వెళ్లే మానవ రహిత లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించినట్లు వివరించింది. ఈ ప్రయోగంతో యూజర్ ట్రయల్స్‌కు మార్గం సుగమమైనట్లు రక్షణ శాఖ తెలిపింది. ఇందులో దేశీయంగా రూపొందించిన రేడియో ఫ్రీక్వెన్సీ సీకర్, లాంచర్, మల్టీ ఫంక్షన్ రాడార్, కమాండ్ కంట్రోల్ కమ్యూనికేషన్ వ్యవస్థను వినియోగించినట్లు ఒక ప్రకటనలో పేర్కొంది. డీఆర్‌డీవో సీనియర్ అధికారులు, భారత వైమానిక దళం, భారత్ డైనమిక్స్ లిమిటెడ్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ ఉన్నతాధికారులు ప్రయోగాన్ని స్వయంగా తిలకించారు. ఆకాశ్–ఎన్‌జీ ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తి చేసిన డీఆర్‌డీవో, వైమానిక దళం తదితర విభాగాలను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసించారు.

మావోయిస్ట్ కీలక నేత బెంగాల్‌లో అరెస్ట్

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ పోలీసులు వాంటెడ్ మావోయిస్ట్ నేత సవ్యసాచి గోస్వామి అలియాస్ కిశోర్(55)ను అరెస్ట్ చేశారు. ఆయన తలపై రూ.10 లక్షల రివార్డు ఉంది. జార్ఖండ్ సరిహద్దులకు సమీపంలోని అడవుల్లో గోస్వామిని పట్టుకున్నట్లు పోలీసు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. బఘ్ముండి పోలీస్‌స్టేషన్ పరిధిలోని చౌనియా గ్రామం వద్ద ఆయన ఉన్నట్లు తెలియడంతో గురువారం రాత్రి దాడి చేసి అరెస్ట్ చేశామన్నారు. ఆయన నుంచి ఒక పిస్టల్, నిషేధిత సాహిత్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎన్ఐఏ మోస్ట్ వాంటెడ్ జాబితాలో గోస్వామి ఒకరు, ఆయన్ను పట్టించిన వారికి రూ.10 లక్షల బహుమానం ఇస్తామని పోలీసు శాఖ ప్రకటించింది. బంకురా, పురులియా, ఝార్‌గ్రామ్, పశ్చిమ్ మేదినీపూర్ జిల్లాల్లో మావోయిస్ట్ పార్టీని బలోపేతం చేసేందుకు, నిధుల సేకరణకు ఆయన ప్రయత్నాలు చేస్తున్నట్లు పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. గోస్వామి అరెస్టును అతిపెద్ద విజయంగా ఆయన పేర్కొన్నారు. 'కిశోర్‌దా'గా మావోయిస్టులు పిలుచుకునే గోస్వామి దక్షిణ 24 పరగణాల జిల్లా సోడెపూర్ రోడ్ ప్రాంతానికి చెందిన వారు. ఇటీవలే ఆయన మావోయిస్ట్ పార్టీ 'ఈస్టర్న్ రీజినల్ బ్యూరో ఇన్‌చార్జి'గా బాధ్యతలు చేపట్టారు. గతంలో పోలీసులు పలుమార్లు అరెస్ట్ చేశారు.

ఎన్నికల సంఘ బాధ్యతలను మేము తీసుకోబోం

పీటీఐ గుర్తు వివాదంపై పాక్ సుప్రీంకోర్టు

ఇస్లామాబాద్: మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ సారథ్యంలోని పాకిస్తాన్ తెహ్రీక్– ఇ–ఇన్సాఫ్ (పీటీఐ)కు బ్యాట్ గుర్తు కేటాయింపు వివాదంపై ఆ దేశ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల సంఘం విధుల్లో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోలేదని సీజేపీ జస్టిస్ క్వాజీ ఫయీజ్ ఇసా పేర్కొన్నారు. పార్టీలో సంస్థాగత ఎన్నికలు నిర్వహించనందున పీటీఐకి ఎన్నికల గుర్తు బ్యాట్‌ను కేటాయించేందుకు ఎన్నికల సంఘం నిరాకరించడం, దానిపై రాజకీయ దుమారం రేగడం తెలిసిందే. దీనిపై పీటీఐ పెషావర్ హైకోర్టును ఆశ్రయించగా, ఊరట లభించింది. అనంతరం ఎన్నికల సంఘం నిర్ణయాన్ని పెషావర్ హైకోర్టు తప్పుపట్టింది. బ్యాట్ గుర్తును పునరుద్ధరించాలంటూ ఇటీవలే ఆదేశాలు జారీ చేసింది. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఎన్నికల సంఘం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. విచారణ సందర్భంగా సీజేపీ జస్టిస్ ఇసా పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ''రాజ్యాంగ, చట్టబద్ధమైన సంస్థ విధుల మధ్య చాలా స్పష్టమైన విభజన రేఖ ఉంది. ఈసీ తన బాధ్యతలను నిర్వరిస్తున్నప్పుడు న్యాయవ్యవస్థకు అత్యున్నత ప్రతినిధిగా మేమెలా జోక్యం చేసుకోగలం? అదెలా సరైన చర్య అవుతుంది? ఎన్నికల సంఘం రాజ్యాంగ సంస్థ. రాజకీయ పార్టీల వ్యవహారాలను నియంత్రించడం, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరపడం'' అని ఆయన పేర్కొన్నారు





నాసిక్‌లోని శ్రీ కాలారామ్ ఆలయం వద్ద మోదీ శ్రమదానం. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు



అటల్ సేతుపై ప్రధాని మోదీ

వారసత్వ రాజకీయాలకు ముగింపు పలకాలి

నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు

నాసిక్: దేశంలో వారసత్వ రాజకీయాల ప్రభావాన్ని తగ్గించాల్సిన బాధ్యత యువతరంపై ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. అందుకోసం వారంతా వెంటనే ఓటర్లుగా నమోదు చేసుకుని ఎన్నికల ప్రక్రియలో చురుగ్గా పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. ''మన దేశపు 21వ శతాబ్దపు యువత అత్యంత అదృష్టవంతులని పేర్కొన్నారు. అమృత కాలంలో దేశాన్ని ఉన్నత శిఖరాలకు చేర్చే అద్భుత అవకాశం వారికి లభించింది'' అన్నారు. మహారాష్ట్రలో నాసిక్‌లోని తపోవన్ మైదానంలో శుక్రవారం 27వ 'నేషనల్ యూత్ ఫెస్టివల్'ను మోదీ ప్రారంభించారు. స్వామి వివేకానంద, ఛత్రపతి శివాజీ తల్లి జిజాబాయి విగ్రహాల వద్ద నివాళులర్పించారు. మాదక ద్రవ్యాలకు, అసభ్య పదజాలానికి దూరంగా ఉండాలని యువతకు సూచించారు.

యువతకు కర్తవ్య కాలం

రాబోయే 25 ఏళ్ల అమృత కాలం యువతకు 'కర్తవ్య కాలం' అని మోదీ ఉద్ఘాటించారు. యువత ఓటు ద్వారా రాజకీయ అభిప్రాయాలను వ్యక్తం చేస్తే దేశానికి మేలు జరుగుతుందన్నారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో వారు ఎంతగా పాల్గొంటే దేశ భవిష్యత్తు అంత గొప్పగా ఉంటుందన్నారు. వారసత్వ రాజకీయాల ప్రభావమూ అంతగా తగ్గిపోతుందన్నారు. అరబిందో, వివేకానంద గొప్పతనాన్ని, వారు అందించిన సేవలను ప్రస్తావించారు.

నాసిక్ రామకుండ్‌లో పూజలు

మోదీ శుక్రవారం మహారాష్ట్రలో నాసిక్‌లోని శ్రీ కాలారామ్ మందిరాన్ని దర్శించుకున్నారు. రామ్‌కుండ్ వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అంతకముందు నగరంలో రోడ్ షోలో పాల్గొన్నారు. తర్వాత గోదావరి తీరంలోని రామ్‌కుండ్ వద్ద సంప్రదాయ తలపాగా ధరించి పూజలు చేశారు. జల పూజ, హారతిలో పాలుపంచుకున్నారు. అఖిల భారతీయ స్వామి సమర్థ్ గురుకుల పీఠం అధినేత అన్నాసాహెబ్ మోరే, కైలాస్ మఠాధిపతి స్వామి సంవిదానంద సరస్వతి, తుషార్ బోసలేను కలుసుకున్నారు. తర్వాత పంచవటిలోని ప్రఖ్యాత కాలా రామ్ మందిరంలో పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మోదీ శ్రమదానం చేశారు. చీపురు చేతపట్టి పరిసరాలను చెత్తాచెదారం ఊడ్చేశారు. దళితులకు ఆలయ ప్రవేశం కల్పించాలని డిమాండ్ చేస్తూ 1930 మార్చి 2న ఇదే మందిరంలో అంబేడ్కర్ తన అనుచరులతో కలిసి నిరసన చేపట్టారు. మహారాష్ట్ర పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ శుక్రవారం రూ.30,000 కోట్ల పై చిలుకు విలువైన పలు ప్రాజెక్టులను ప్రారంభించారు.

'అటల్ సేతు' ప్రారంభం

ముంబై: 21.8 కిలోమీటర్లతో అత్యంత పొడవైన సముద్ర వారధి 'అటల్ బిహారీ వాజ్‌పేయి సెవ్రీ–నవా షివా అటల్ సేతు'ను మోదీ శుక్రవారం ప్రారంభించారు. 'వికసిత్ భారత్'కు ఈ సేతు ఒక ప్రత్యక్ష నిదర్శనమని చెప్పారు. ఈ ఆరు లేన్ల బ్రిడ్జి మహారాష్ట్రలో దక్షిణ ముంబై–నవీ ముంబైని అనుసంధానిస్తుంది.

ప్రధాని మోదీ 11 రోజుల ప్రత్యేక అనుష్ఠానం

న్యూఢిల్లీ: అయోధ్యలో రామమందిర ప్రాణప్రతిష్ఠ శుక్రవారం నుంచి 11 రోజుల అనుష్ఠానం ప్రారంభించినట్టు ప్రధాని మోదీ వెల్లడించారు. ''నాకు చాలా ఉద్వేగంగా ఉంది. జీవితంలో తొలిసారిగా ఇలాంటి భావాలు నా మదిలో వెల్లువెత్తుతున్నాయి. వాటిని అనుభూతి చెందగలను తప్ప మాటల్లో వ్యక్తీకరించలేను. అయోధ్యలో రామ మందిర ప్రారంభోత్సవం ప్రపంచవ్యాప్తంగా భారతీయులందరికీ, రామ భక్తులకు పవిత్ర సందర్భం. గొప్ప వేడుక. ఈ అరుదైన సందర్భానికి ప్రత్యక్ష సాక్షిని కావడం నా అదృష్టంగా భావిస్తున్నా. బాలరాముడి ప్రాణప్రతిష్ఠకు భారతీయులందరి తరఫున ప్రాతినిధ్యం వహించడానికి భగవంతుడు నన్ను సాధనంగా ఎంచుకున్నాడు. నన్ను ఆశీర్వదించాలని ప్రజలను కోరుతున్నా'' అని పేర్కొన్నారు. అనుష్ఠానంలో భాగంగా మోదీ నిత్యం సూర్యోదయానికి ముందే మేల్కొంటారు. యోగా, ధ్యానం అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సాత్వికాహారమే స్వీకరిస్తారు.

వేలానికి తొలి పోస్టల్ స్టాంప్

ప్రపంచంలోనే మొదటిదని భావిస్తున్న 180 ఏళ్ల నాటి పోస్టల్ స్టాంప్ వేలానికి వచ్చింది. ఒక పెన్నీ ముఖ విలువతో కూడిన దీనికి దాదాపు రూ.20 కోట్ల (25 లక్షల డాలర్ల) దాకా పలకవచ్చని భావిస్తున్నారు. 1850 మే 2 నాటి తేదీ ఉన్న ఈ నల్ల రంగు స్టాంప్‌ను పెన్నీ బ్లాక్ స్టాంప్‌గా పిలుస్తారు. ఇంగ్లండ్‌లో బెడ్లింగ్టన్ పట్టణానికి చెందిన విలియం బ్లెంకిన్‌స్లోప్ అనే వ్యక్తికి అక్కడికి 300 మైళ్ల దూరంలోని లండన్ నుంచి పంపిన లెటర్‌పై దీన్ని అంటించారు. ఇలా స్టాంపులంటించడం ద్వారా పోస్టేజీ చార్జీలను ముందుగానే చెల్లించే పద్ధతి అప్పటిదాకా ఉండేది కాదు. లెటర్లను అందుకునే వాళ్లే పోస్ట్‌మాన్‌కు పోస్టేజీ రుసుము చెల్లించేవాళ్లు. వాళ్లు గనక లెటర్లను తీసుకునేందుకు నిరాకరిస్తే పోస్టల్ శాఖకు నష్టమే మిగిలేది. దీనికి చెక్ పెట్టేందుకు సర్ రోలాండ్ హిల్ ఈ పెన్నీ బ్లాక్ పోస్టల్ స్టాంప్‌ను రూపొందించాడు. ప్రఖ్యాత వేలం సంస్థ సోత్‌బీ ఫిబ్రవరిలో దీన్ని వేలం వేయనుంది. ప్రపంచ సమాచార వ్యవస్థలోనే విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టిన ఈ పోస్టల్ స్టాంప్ వేలానికి రావడం ఎంతో ఎక్సైటింగ్‌గా ఉందని సోత్‌బీ గ్లోబల్ హెడ్ రిచర్డ్ ఆస్టిన్ అన్నారు.



- సాక్షి, నేషనల్ డెస్క్

అయోధ్య రాముడికి 2.5 కిలోల విల్లు

లక్నో: శ్రీరాముడు అనగానే గుర్తొచ్చే రూపం విల్లు బాణం ధరించిన నిండైన విగ్రహం. ఈ నెల 22న అయోధ్యలోని భవ్య మందిరంలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ జరుగనుంది. ఆలయంలో కొలువుదీరే రామయ్యకు బహూకరించడానికి తమిళనాడు రాజధాని చెన్నైలో విల్లు, బాణాలు సిద్ధమవుతున్నాయి. ప్రధాన విగ్రహానికి ఈ విల్లు, బాణాలు అలంకరిస్తారు. 2.5 కిలోల బరువైన ఈ విల్లు తయారీకి ఇతర లోహాలతోపాటు దాదాపు 700 గ్రాముల 23 క్యారెట్ బంగారం ఉపయోగిస్తున్నట్లు అయోధ్యలోని అమావా రామ మందిర్ ట్రస్టీ శయన్ కునాల్ చెప్పారు. వాల్మీకి రామాయణంలో వర్ణించినట్లుగానే విల్లుతోపాటు బాణాలు తయారు చేయిస్తున్నట్లు తెలిపారు. రాముడు ఉపయోగించిన వేర్వేరు బాణాల వర్ణన వాల్మీకి రామాయణంలో ఉందన్నారు. చెన్నైలో సిద్ధమవుతున్న విల్లు, బాణాలు త్వరలో అయోధ్యకు చేరుకుంటున్నాయని వెల్లడించారు. ఈ నెల 19న శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టుకు వీటిని అందజేస్తామని చెప్పారు.

రామ భక్తులు అయోధ్యకు ఎప్పుడైనా వెళ్లొచ్చు

న్యూఢిల్లీ: శ్రీరాముడిపై విశ్వాసం ఉన్న వారు అయోధ్యలోని ఆలయానికి ఎప్పుడైనా వెళ్లవచ్చని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. ఈ నెల 22వ తేదీన అయోధ్యలో జరగనున్న ప్రతిష్ఠాపన కార్యక్రమానికి వెళ్లరాదన్న కాంగ్రెస్ నిర్ణయం కుట్రలో భాగమంటూ బీజేపీ చేసిన ఆరోపణలపై ఖర్గే మీడియా ఎదుట ఈ మేరకు స్పందించారు. బీజేపీ కుట్రలో తాము చిక్కుకోమని అంటూ ఆయన.. అధిక ధరలు, నిరుద్యోగం వంటి ప్రజల సమస్యలపై కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు. 'అయోధ్యలో జరగనున్న ఉత్సవానికి సంబంధించి ఈ నెల 6వ తేదీనే స్పష్టం చేశాం. శ్రీరామునిపై నమ్మిక ఉన్న వారు రేపు, ఎల్లుండి ఎప్పుడైనా అయోధ్య వెళ్లొచ్చు. ఈ విషయమై బీజేపీ మాపై దాడి చేయడం సరికాదు. విమర్శలు చేయడం బీజేపీ కుట్రే. అందుకే ఇదే అంశాన్ని బీజేపీ పదేపదే ప్రస్తావిస్తోంది'అని ఖర్గే చెప్పారు. కాంగ్రెస్ ఏ మతాన్ని, ఏ గురువును ఎన్నడూ అవమానించలేదన్నారు.

కాంగ్రెస్‌పై బీజేపీ విమర్శలు

రాముడిని వ్యతిరేకించడం కాంగ్రెస్ సంప్రదాయమంటూ బీజేపీ దుయ్యబట్టింది. ఇందుకు సంబంధించిన 35 సెకన్ల వీడియోను, రామ విరోధి కాంగ్రెస్ అంటూ పోస్టర్‌ను విడుదల చేసింది. అందులో, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ వివిధ సందర్భాల్లో చేసిన వ్యాఖ్యలు..'గత జన్మపై నమ్మకం లేకుంటే శ్రీరాముడిని ఎలా నమ్ముతావు?, రామసేతు ఒక భ్రమ, శ్రీరాముడి ఉనికిని ప్రశ్నించడం, అయోధ్యపై సుప్రీంకోర్టును ప్రశ్నించడం, విగ్రహ ప్రతిష్ఠాప కార్యక్రమ ఆహ్వానాన్ని తిరస్కరించడం' వంటివి ప్రస్తావించింది.

లండన్ మేయర్ ఎన్నికల బరిలో ఇద్దరు భారత సంతతి వ్యాపారవేత్తలు

లండన్: ప్రతిష్ఠాత్మక లండన్ మేయర్ పదవికి భారత సంతతికి చెందిన ఇద్దరు వ్యాపారవేత్తలు పోటీ పడనున్నారు. మే 2వ తేదీన జరగనున్న ఈ ఎన్నికలో వీరిద్దరూ స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దిగేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. దీంతో, 2016 నుంచి లండన్ మేయర్‌గా కొనసాగుతున్న పాక్ సంతతికి చెందిన సాదిక్ ఖాన్‌కు గట్టి పోటీ ఎదురుకానుంది. ఢిల్లీలో జన్మించిన తరుణ్ గులాటి(63) స్ట్రాటజిక్ అడ్వైజర్‌గా లండన్‌లో 20 ఏళ్లుగా పనిచేస్తున్నారు. గత ఏడాది డిసెంబర్‌లో భారత్ పర్యటన సమయంలో తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. అదేవిధంగా, ప్రాపర్టీ వ్యాపారి శ్యామ్ భాటియా(62) మేయర్ ఎన్నికల బరిలో నిలవనున్నట్లు తాజాగా ప్రకటించారు. గులాటి ఎన్నికల ట్యాగ్ లైన్ 'విశ్వాసం–అభివృద్ధి'కాగా, భాటియా 'అంబాసిడర్ ఆఫ్ హోప్'ట్యాగ్‌లైన్‌తో ముందుకు వెళ్తున్నారు.

నేడు 'ఇండియా' కూటమి వర్చువల్ భేటీ

న్యూఢిల్లీ: ప్రతిపక్ష ఇండియా కూటమి కీలక నేతలు ఈ నెల 13న సమావేశం కానున్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో సీట్ల పంపిణీ అంశం, కూటమి బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలను చర్చించనున్నారు. శనివారం ఉదయం వర్చువల్‌గా జరిగే ఈ సమావేశంలో టీఎంసీ చీఫ్ మమతా బెనర్జీ పాల్గొనడం లేదు. పలు కార్యక్రమాల్లో ఆమె బిజీగా ఉన్నారని కూటమి నేతలు అంటున్నారు. నితీశ్ కుమార్‌కు ఇండియా కూటమి కన్వీనర్ బాధ్యతలివ్వాలంటూ జేడీయూ కోరుతుండగా, టీఎంసీ ఈ ప్రతిపాదనను తిరస్కరిస్తోంది. ఈ అంశంపైనా నేటి సమావేశంలో నేతలు చర్చించనున్నారు.

క్లుప్తంగా...

యాదాద్రిలో వైభవంగా కూడారై ఉత్సవం



గోదాదేవికి పూజలు చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలను అర్చకులు పాంచరాత్ర ఆగమశాస్త్రానుసారం నిర్వహిస్తున్నారు. శుక్రవారం 27వ రోజు పూర్త యిన సందర్భంగా అర్చకులు శ్రీరంగ నాథుడు, గోదాదేవికి కూడారై పాశురాన్ని పఠించే పర్వాన్ని జరిపించారు. ఉత్సవంలో భాగంగా 108 గంగాళాల్లో శ్రీస్వామివారికి, గోదాదేవికి పాలతో ఉడికించిన అన్నం నైవేద్యంగా సమర్పించారు. గోదాదేవికి ఐదు రోజుల నీరాటోత్సవంలో భాగంగా శ్రీస్వామి వారి కల్యాణసేవతోపాటు అమ్మవారి పల్లకీసే వను తిరు, మాఢ వీధుల్లో ఊరేగించారు.

మిర్చి ధర స్థిరీకరణకు చర్యలు

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల



మిర్చి నాణ్యత, ధరపై ఉన్నతాధికారులను ఆరా తీస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం వ్యవసాయం: మిర్చి ధర స్థిరంగా ఉం డేలా సమగ్ర చర్యలు చేపట్టాలని వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. కొద్ది రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా మిర్చి ధరలు పతనమవుతూ రైతులు నష్టపోతున్న నేపథ్యా న.. శుక్రవారం మంత్రి ఖమ్మం మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్లను రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరె క్టర్ లక్ష్మీబాయితో కలిసి పరిశీలించారు. పలు వురు రైతులు మిర్చి ధర నానాటికీ పడిపోతోం దని ఆవేదన వ్యక్తం చేయగా.. పంట నాణ్య తగా ఉన్నా ధరలో వ్యత్యాసాలు ఎందుకు వస్తున్నాయని మంత్రి అధికారులను ప్రశ్నిం చారు. ఈ విషయంలో సమగ్ర అధ్యయనం చేయాలని ఆదేశించారు. అయితే, నాణ్యత ప్రమాణాల ఆధారంగానే వ్యాపారులు ధర నిర్ణయిస్తారని అధికారులు వివరించారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడు తూ మిర్చి ధర అంశంలో రైతులు నష్టపోకుం డా చర్యలు తీసుకుంటున్నామని, వ్యాపారు లతో చర్చిస్తామని తెలిపారు. మార్కెట్లలో దళారులు, లైసెన్స్ లేని వారు కొనుగోలు చేస్తే చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

చాక్లెట్ ప్యాకెట్లలో రూ.6 కోట్ల విలువైన వజ్రాలు

శంషాబాద్: అక్రమంగా తరలిస్తున్న రూ.6 కోట్ల పైచిలుకు విలువ చేసే వజ్రాలను డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అధికారుల కథనం ప్రకారం.. ఈ నెల 10న అర్ధరాత్రి హైదరాబాద్ శంషాబాద్ విమానా శ్రయానికి ఇద్దరు ప్రయాణికులు దుబాయ్ వెళ్లడానికి వచ్చారు. ముందస్తు సమాచారం మేరకు డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు అక్కడ తనిఖీలు చేశారు. దుబాయ్ వెళ్లే ఇద్దరు ప్రయాణికుల వద్ద బ్యాగేజీలో చాక్లెట్ ప్యాకెట్లలో దాచిన వివి ధ రకాల రంగు రాళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు భారత కరెన్సీలో 9.83 లక్షల విలువ చేసే విదేశీ కరెన్సీని, రూ. లక్ష దేశీయ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. ల్యాబ్‌కు పంపిన రంగు రాళ్లను వజ్రాలుగా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిం దితులను రిమాండ్‌కు తరలించారు.

ప్రభుత్వాస్పత్రిలో గర్భిణీకి ఎమ్మెల్యే శస్త్రచికిత్స



శిశువును కుటుంబ సభ్యులకు అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

అచ్చంపేట రూరల్: ఆయన వృత్తిరీత్యా వైద్యుడే అయినప్పటికీ ప్రస్తుతం ఎమ్మెల్యే హోదాలో ఉన్నారు. ప్రతినిత్యం బిజీగా గడిపే అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ శుక్ర వారం ఇక్కడి ప్రాంతీయ ఆస్పత్రిలో గర్భిణీకి కాన్పుచేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం జీలుగుపల్లికి చెందిన ప్రసన్న మొద టికాన్పు కోసం ఆస్పత్రికి వెళ్లేందుకు కుటుం బసభ్యులతో కలిసి అచ్చంపేట ఆర్టీసీ బస్టాండ్ వద్దకు వచ్చింది. అయితే బస్టాండ్ ఆవరణలో ఆర్టీసీ ఉద్యోగులు ఏర్పాటు చేసిన సమావేశం లో ఉన్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణను ప్రసన్న కుటుంబసభ్యులు గమనించారు. ఆయన వద్దకు వెళ్లి తమ బీద పరిస్థితిని వివరించారు. ఎమ్మెల్యే స్పందించి అచ్చంపేటలోని ప్రాం తీయ ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. అనం తరం అక్కడి వైద్య సిబ్బంది సహాయంతో గర్భిణీకి ఆపరేషన్ చేసి ఆడశిశువుకు పురుడు పోశారు. తల్లి, శిశువు ఆరోగ్యంగా ఉన్నారని, ప్రతిఒక్కరూ ప్రభుత్వ ఆస్పత్రిలోని వైద్యసేవ లను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అన్నారు.

రెండేళ్లలోనే కొత్త వరి వంగడాలు

- ‘స్పీడ్ ఫ్లవర్’పేరిట స్పీడ్ బ్రీడింగ్ ప్రొటోకాల్‌ను అభివృద్ధి చేసిన ‘ఇరి’
- కొత్త వంగడం రూపకల్పనకు సాధారణంగా 6–7 ఏళ్లు అవసరం..
- ఇక మహా అయితే 2 ఏళ్లు చాలు!
- స్వర్ణ, సాంబ మసూరి వంటి దీర్ఘకాలిక రకాలపై కూడా పరిశోధనలు విజయవంతం
- క్లైమెట్ ఛేంజ్‌తో సత్వరమే కొత్త వంగడాల తయారీకి మార్గం సుగమం



(సాక్షి సాగుబడి డెస్క్): సంప్రదాయ ప్రజనన (బ్రీడింగ్) పద్ధతిలో ఓ కొత్త వరి వంగడం రూపొందించడానికి 6–7 సంవత్సరాలు పడుతుంది. క్లైమెట్ ఛేంజ్ వల్ల వాతావరణం లో వస్తున్న పెనుమార్పులకు దీటుగా తట్టుకునే వంగడాలు రూపొందించడం శాస్త్రవేత్తలకు ఇంత సుదీర్ఘకాల పరిమితి పెద్ద సవాలుగా మారింది. ఈ నేపథ్యంలో ఏడాదిన్నర నుం చి 2 ఏళ్లలోనే సరికొత్త వంగడాన్ని రూపొందించేందుకు అను వైన వినూత్న స్పీడ్ బ్రీడింగ్ పద్ధతిని ఫిలిప్పీన్స్ మనీలాలోని అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ (ఇరి) అభివృద్ధి చేసిం ది. భారతీయ, జపాన్ వరి రకాలతో పాటు ఏ దేశంలో వం గడాలతోనైనా రెండేళ్లలోనే కొత్త వంగడం రూపొందించటం సాధ్యమేనని ‘ఇరి’పరిశోధనల్లో తేలింది. ‘ఇరి’ప్రధాన కార్యాలయంతో పాటు వారణాసిలో ‘ఇరి’దక్షిణాసియా పరి శోధనా స్థానంలో కూడా సాంబ వంటి అనేక రకాలతో రెండే ళ్లలోనే ‘ఇరి’శాస్త్రవేత్తలు విజయవంతంగా కొత్త వంగడాలను రూపొందించారు.

కృత్రిమ వెలుగుల మధ్య ప్రయోగాలు

నియంత్రిత వాతావరణంలో ప్రత్యేక గదుల్లో కృత్రిమ వెలు గుల మధ్య వరి ప్రయోగాలు చేయటం స్పీడ్ బ్రీడింగ్‌లో ముఖ్యభాగం. కాంతి తీవ్రత, ఉష్ణోగ్రత, తేమ, పోషకాల స్థాయి నిర్దేశిత ప్రమాణాల ప్రకారం ఇస్తారు. కుండీలలో పెరిగే వరి మొక్కలకు స్థూల, సూక్ష్మ పోషకాలను పిచికారీల ద్వారా అందిస్తున్నారు. ఈ స్పీడ్ బ్రీడింగ్ క్రమంలో వేగంగా పూత దశకు ఎదగటం అనేది మరో ముఖ్యాంశం. సాధా రణంగా స్వల్పకాలిక, దీర్ఘకాలిక వరి రకాలు 58 నుంచి 127 రోజుల మధ్య సహజంగా పూతకు వస్తాయి. అయితే, స్పీడ్ బ్రీడింగ్ పద్ధతిలో రాత్రి, పగలు అని తేడా లేకుండా కృత్రిమ వెలుగుల మధ్య పెరిగే వరి మొక్కలు, వాటి సహజ కాల పరిమితితో నిమిత్తం లేకుండా, 60 రోజుల లోపలే అన్ని రకాలూ ఒకేసారి పూతకు వస్తున్నాయి. ఇలా త్వరగానే ఏ వరి రకమైనా కోతకు వస్తున్నాయి. అందువల్లనే ఈ స్పీడ్ బ్రీడింగ్ ప్రొటోకాల్ ద్వారా జరిపే పరిశోధనలకు ‘స్పీడ్ ఫ్లవ ర్’అని ‘ఇరి’పేరుపెట్టింది.

ఏడాదికి నాలుగైదు పంటలు

ఈ విధంగా ఏడాదికి 1–2 పంటలకు బదులు నాలుగైదు పంటలు పండిస్తున్నారు. నియంత్రిత వాతావరణంలో అనుకున్నన్ని రోజుల్లో పంట నూర్పిడికి వస్తోంది. వారణా సిలోని ఇరి దక్షిణాసియా ప్రాంతీయ పరిశోధనా స్థానంలో 198 వరి రకాలను పెంచినప్పుడు అన్నీ 60 రోజుల్లోనే పూతకు రావటం విశేషం.

స్వర్ణ, సాంబ మసూరి సహా..

వారణాసిలోని దక్షిణాసియా ఇరి పరిశోధనా స్థానం సంచాలకులు డా. సుధాంశు సింగ్ మాట్లాడుతూ.. క్రాసింగ్, ఇన్‌బ్రీడింగ్ కార్యకలాపాలను వేగవంతం చేయడానికి స్పీడ్ బ్రీడింగ్ ప్రొటోకాల్ ఉపయోగపడుతోంది. క్షేత్రస్థాయిలో 6–7 సంవత్సరాల సమయం పట్టే పని ఇప్పుడు 1.5–2 ఏళ్లలోనే పూర్తవుతోందని వ్యాఖ్యానించారు. స్పీడ్ ఫ్లవర్ పరిశోధన కార్యక్రమంలో స్వల్పకాలిక రకాలైన కో–51, ఐఆర్64, మధ్యకాలిక రకాలైన సర్జూ–52, డిఆర్ఆర్ ధాన్ 44, దీర్ఘకాలిక రకాలైన స్వర్ణ, సాంబ మసూరి రకాలు సైతం చక్కని ఫలితాలు వచ్చాయని, రెండేళ్లలోనే కొత్త వంగడాలను అభివృద్ధి చేయటం సాధ్యమేనని తేలిందని సుధాంశు సింగ్ చెప్పారు. ఏడాదిలో స్వర్ణ వరిని వరుసగా 5.1 పంటలు, సాంబ మసూరిని 4.9 పం టలు వరుసగా సాగు చేయటం ఈ పద్ధతిలో సాధ్యపడిందని పేర్కొన్నారు.

– డాక్టర్ సుధాంశు సింగ్

ఇది శాస్త్రపరంగా పెద్ద ముందడుగు..

''అధికోత్పత్తినిచ్చే, వాతావరణ మార్పుల్ని తట్టుకునే, పోషకాల పరంగా మెరుగైన సరికొత్త వరి వంగడాలను అతి తక్కువ కాలంలోనే రూపొందించడానికి అవకాశం దొరికింది ప్పుడు. వరికి జన్యుసుసంపన్నత చేకూరడానికి, ప్రపంచ మానవాళికి ఆహార భద్ర తను అందించడానికి ఇది ఉపయోగకరం'అంటున్నారు పరిశోధకుల బృందం సారథి డాక్టర్ వికాస్ కుమార్ సింగ్. ''ఈ పరిశోధనా ప్రాజెక్టుకు భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి సౌజన్యంతో కేంద్ర బయోటెక్నాలజీ శాఖ ఆర్థిక తోడ్పాటు ఉంది. సమీప కాలంలోనే మన వ్యవసాయ విశ్వవిద్యాల యాల్లోని రైస్ బ్రీడర్లకు కూడా స్పీడ్ బ్రీడింగ్ సదుపాయాలు అం దుబాటులోకి వస్తాయని ఆశించవచ్చు.'అని వెల్లడించారు.

– డాక్టర్ వికాస్‌కుమార్ సింగ్

విద్యార్థిని అనుమానాస్పద మృతి

- హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారంటూ తండ్రి ఫిర్యాదు



రాథోడ్ దీప్తి

హసన్‌పర్తి: హనుమకొండ జిల్లా హసన్‌పర్తి శివారులోని ఓ విద్యాసంస్థలో బీఎస్సీ అగ్రికల్చర్ చదువుతున్న విద్యార్థిని అనుమానాస్పదంగా మృతి చెందింది. అయితే తన కూతురును హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని మృతురాలి తండ్రి రాథోడ్ మోహన్‌సింగ్ ఆరోపించారు. ఈ మేరకు హసన్‌పర్తి ఠాణాలో ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం కండెపల్లికి చెందిన రాథోడ్ మోహన్‌సింగ్ (డిప్యూటీ కలెక్టర్, మైనారిటీ కార్పొరేషన్ అధి కారి, నిర్మల్) కూతురు రాథోడ్ దీప్తి(19) కళాశాల హాస్టల్ లోనే ఉంటూ అగ్రికల్చర్ బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. శుక్రవారం దీప్తి కళాశాల హాస్టల్‌లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందు కున్న పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీ ఎంకు తరలించారు.

ఉరి వేసుకున్నట్టు సమాచారం ఇవ్వలేదు

దీప్తి ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని, గురువారం సాయంత్రం తాను ఫోన్‌లో మాట్లాడినట్టు తం డ్రి మోహన్‌సింగ్ పేర్కొన్నారు. ఉదయం తన భార్య ఫోన్ చేస్తే త్వరగా ఎంజీఎంకు రమ్మ న్నారే తప్ప ఆత్మహత్య చేసుకున్న విషయం చెప్పలేదన్నారు. మృతదేహాన్ని కిందకు దింపిన సమయంలో సెక్యూరిటీ సిబ్బందితోపాటు మరికొంతమంది మగవారు ఉన్నట్టు స్పష్టమ వుతోందన్నారు. కిందకు దింపినప్పుడు తహసీల్దార్, పోలీసులకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని ప్రశ్నించారు. దీప్తిపై అత్యాచారం, ఆపై హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరి స్తున్నారని మృతురాలి తండ్రి మోహన్‌సింగ్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. 11,12 తేదీల్లో సీసీ ఫుటేజీ సేకరించాలని పోలీసులను కోరారు. దీప్తి మృతిపై సమగ్ర విచారణకు పలు విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. టీజీ వీపీ, టీఎస్ఎఫ్, గిరిజన శక్తి మోర్చ సంఘాలు ఆ విద్యాసం స్థ ఎదుట ఆందోళన నిర్వహించాయి. యూనివర్సిటీ గుర్తిం పు రద్దు చేయాలని డిమాండ్ చేశాయి. దీప్తి మృతిపై సమగ్ర విచారణ జరుపుతున్నట్టు హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ గోపి తెలి పారు. కాజీపేట ఏసీపీ డేవిడ్ రాజు ఆధ్వర్యంలో ఈ విచా రణ కొనసాగుతుందన్నారు. ఆత్మహత్య చేసుకున్న గదిని సీజ్ చేసినట్టు తెలిపారు.

మామా అల్లుళ్లపై గొడ్డలితో దాడి

- మామ మృతి, అల్లుడి పరిస్థితి విషమం
- నిర్మల్ శివారులో ఘటన
- కుమారుడి ప్రేమ వ్యవహారమే కారణమా?



బుచ్చన్న

నిర్మల్ రూరల్: నిర్మల్ శివారులోని బంగల్‌పేట్‌లో శుక్రవారం సాయం త్రం ఇద్దరిపై గుర్తుతెలియని వ్యక్తు లు గొడ్డలితో దాడి చేయగా ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీ సుల కథనం ప్రకారం... మండలం లోని అనంతపేట గ్రామానికి చెం దిన బుచ్చన్న(65), తన అల్లుడు వెంకటేశ్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై నిర్మల్ ఆస్పత్రికి బయల్దేరారు. మధ్యలో గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌ను ఆపారు. రెప్ప పాటులో గొడ్డలితో ఇద్దరి పై దాడిచేశారు. బుచ్చన్న ముఖంపై వేటు పడడంతో ఘటనా స్థలంలోనే చనిపోయాడు. వెంకటేశ్ కడుపులో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అం దించారు.

ఇటీవలే కుమారుడి ప్రేమ వివాహం

వ్యవసాయం చేసుకునే బుచ్చన్నకు భార్య, ముగ్గురు కుమా రులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమారుడు ఇటీ వలే ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈ ప్రేమ వివాహమే దాడికి కారణమన్న చర్చ గ్రామంలో జరుగుతోంది. ఇతర కారణాలపైనా పోలీసులు విచారణ చేస్తున్నారు. దాడికి పాల్పడిన ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది.

ఆడపిల్ల పుట్టిందని అమ్మేశారు

శిశుసంక్షేమ శాఖ అధికారుల ఫిర్యాదుతో వెలుగులోకి..



నిందితుల అరెస్ట్‌ను చూపుతున్న పోలీసులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): పుట్టిన నాలుగురోజులకే ఆడ శిశువును అమ్మేశారు. అయితే ఈ విషయం ఆలస్యంగా చూసింది. నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మం డలం రంగండ్ల గ్రామానికి చెందిన ఆంగోతు సేవ– జ్యోతి దంపతులకు ఒక కొడుకు, కూతురు ఉన్నారు. జ్యోతి గత సంవత్సరం సెప్టెంబర్ 16న నల్లగొండ జిల్లా కేంద్ర ఆస్ప త్రిలో మరో ఆడశిశువుకు జన్మనిచ్చింది. అయితే ఇద్దరు ఆడపిల్లలను సాకే స్తోమత లేదని పుట్టిన శిశువును అమ్ముతామని ఆదే ఆస్పత్రిలో పనిచేస్తున్న స్వీపర్ ఈసం వరమ్మకు చెప్పారు. సంతానం లేక ఇబ్బంది పడుతున్న నాంపల్లి మండలం పసునూరుకు చెందిన బత్తుల సైదులు– కవిత దంపతులకు వరమ్మ ఈ విషయాన్ని చేరవే సింది. దీంతో వారు సెప్టెంబర్ 20న సేవ–జ్యోతి దంపతు లకు రూ1.50 లక్షలు ఇచ్చి ఆ శిశువును తీసుకెళ్లారు. కాన్పు తర్వాత పాప కనిపించకపోవడంతో గ్రామస్తులకు అను మానం వచ్చి అంగన్‌వాడీ టీచర్‌కు చెప్పారు. ఆమె చైల్డ్ వెల్ఫేర్ అధికారి దృష్టికి తీసుకెళ్లగా, పోలీసులకు ఫిర్యాదు చేశారు.పోలీసులు విచారించగా, అసలు విషయం వెలుగు చూసింది. దీంతో సేవ–జ్యోతి దంపతులతోపాటు, ఆడశిశు వును కొన్న సైదులు–కవిత దంపతులు, స్వీపర్ వరమ్మను శుక్రవారం అరెస్టు చేశారు. ఆడశిశువును నల్లగొండలోని శిశు గృహకు తరలించారు.

‘సూపర్ ఖడ్గం’ పురుగు మందుపై నిషేధం

సాక్షి, హైదరాబాద్: సంగారెడ్డి జిల్లాలోని మెసర్స్ త్రికామ్ ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్ ఉత్పత్తి చేస్తున్న లాంబ్డాసైహాలోత్రిన్ 5%ఇసి, బ్యాచ్ నంబర్ 2309ఎస్‌కే05 అనే సూపర్ ఖడ్గం పురుగుమందును నిషేధిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పురుగుమందును చండీగఢ్‌లోని ప్రాంతీయ పురుగుమం దుల పరీక్షా ప్రయోగశాలలో పరీక్షిం చగా నాసిరకమైనదని తేలిందని వ్యవసాయ శాఖ కమిషనర్ తెలిపారు. దీంతో ఈ పురుగుమందు విక్రయాన్ని, నిల్వను నిలిపివేసినట్లు స్పష్టం చేశారు. ఈ విషయాన్ని రైతులు గమ నించి పైన పేర్కొన్న బ్యాచ్ నంబర్‌తో కూడిన సూపర్ ఖడ్గం పురుగు మందును రైతులు కొనుగోలు చేయొద్దని సూచించారు.

ఐపీఎస్ నవీన్‌కుమార్ కొడుకుపై కేసు

- మాజీ ఐఏఎస్ భన్వర్‌లాల్ ఇంటి వ్యవహారంలో ఆయన భార్యను బెది రించిన సాహిత్
- పోలీసులకు ఫిర్యాదు చేసిన భన్వర్ లాల్ భార్య మణిలాల్
- సాహిత్‌కు నోటీసులు జారీ చేసిన దర్యాప్తు అధికారులు



పోలీసుల అదుపులో సాహిత్ భట్

సాక్షి, హైదరాబాద్/బంజారాహిల్స్: మాజీ ఐఏఎస్ అధికారి భన్వర్‌లాల్ ఇంటిని కబ్జా చేయడానికి ఐపీఎస్ అధికారి నవీన్‌కుమార్ నకిలీ పత్రాలతో ప్రయత్నించిన కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న నవీన్‌కు మార్ భట్ కుమారుడు సాహిత్‌పై కూడా జూబ్లీహిల్స్ ఠాణాలో కేసు నమోదైంది. దర్యాప్తు అధికారులు శుక్ర వారం సాహిత్‌కు నోటీసులు జారీ చేశారు. మరోపక్క భన్వర్‌లాల్ భార్య మణిలాల్ ఫిర్యాదుతో హైదరా బాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌లో నమోదైన కేసు విచా రణకు నవీన్‌కుమార్ శుక్రవారం గైర్హాజరయ్యారు. దీం తో ఈ అంశాన్ని కోర్టు దృష్టికి తీసుకువెళ్లాలని పోలీ సులు నిర్ణయించారు. భన్వర్‌లాల్‌కు జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్‌లో సొంత ఇల్లు ఉంది. ఆయన పదవీ విరమణ చేయకముందే ఇంటిని నవీన్‌కుమార్ సోదరుడు సాంబశివరావు అద్దెకు తీసుకున్నారు. 2019లో భన్వర్‌లాల్ పదవీ విరమణ చేయడంతో తమ ఇల్లు ఖాళీ చేసి అప్పగించాల్సిందిగా సాంబశివ రావును కోరగా, ఆయన స్పందించలేదు. ఆ ఇంట్లో ఐపీఎస్ అధికారి నవీన్‌కుమార్ కూడా ఎలాంటి రెం టల్ అగ్రిమెంట్ లేకుండా ఉన్నారు. నాటకీయ పరి ణామాల నేపథ్యంలో వీరిద్దరితో పాటు సాంశివరావు భార్య రూపా డింపుల్ నకిలీ పత్రాలు సృష్టించి, భన్వర్‌లాల్‌తో పాటు ఆయన భార్య మణిలాల్ సంత కాలు ఫోర్జరీ చేసి ఇంటిని కబ్జా చేయాలని చూశారు. మణిలాల్ ఫిర్యాదు మేరకు గతేడాది నవంబర్ 17న సీసీఎస్ పోలీసులు దీనిపై కేసు నమోదు చేశారు. గత నెల 22న సాంబశివరావు దంపతులను అరెస్టు చేశారు. నవీన్‌కుమార్‌కు గత నెల 27న నోటీసులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో నవీన్‌కుమార్ ఆ ఇం టిని ఖాళీ చేసి వెళ్లిపోయారు.

బౌన్సర్లతో బెదిరింపు..

ఇదిలా ఉండగా.. జూబ్లీహిల్స్ రోడ్డు నం .72లోని ప్రశాసన్‌నగర్‌లో ఉన్న తమ ఇంట్లోకి వెళ్లేందుకు భన్వర్‌లాల్ సన్నాహాలు చేసుకుం టున్నారు. అందులో భాగంగా ఆయన భార్య మణిలాల్ గురువారం సాయంత్రం అక్కడకు వెళ్లి కొన్ని మరమ్మతులు చేయించేందుకు ప్రయత్నించారు. అప్పటికే ఆ ఇంటి వద్ద ఉన్న సాహిత్ ఇద్దరు బౌన్సర్లతో కలసి బీభత్సం సృ ష్టించారు. మణిలాల్ ఉండగానే ఇంటి లోపలి నుంచి గడియ పెట్టడంతో పాటు అతి సమీపం నుంచి బెదిరిస్తూ మాట్లాడారు. చాలాసేపు నిర్బంధించినంత పని చేశారు. దీం తో తీవ్ర భయభ్రాంతులకు గురైన ఆమె జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా సాహిత్ భట్ తదితరులపై పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం అతడిని అదుపులోకి తీసుకుని నోటీసులు జారీ చేశారు.

క్లుప్తంగా...

నా కుమారుడు పోటీలో ఉంటారు: గుత్తా సుఖేందర్‌రెడ్డి

- నల్లగొండ లేదా భువనగిరి లోక్‌సభ స్థానం నుంచి పోటీ
- రేవంత్ నెలరోజుల పాలనపై ఇప్పుడే మాట్లాడలేం



నల్లగొండ టూటౌన్: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో తన కుమారుడు అమిత్‌రెడ్డి బరిలో ఉంటారని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. నల్లగొండ లేదా భువనగిరి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తారని వెల్లడించారు. శుక్రవారం నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ... 14 లోక్‌సభ స్థానాలు గెలుస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అనడం సహజమేనన్నారు. శాసనమండలిపై సీఎం చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ ప్రజాస్వామ్యంలో ఏ వ్యవస్థను కూడా చులకనగా చూడరాదని తెలిపారు. రేవంత్‌రెడ్డి నెల రోజుల పరిపాలనపై ఇప్పుడే ఏమీ మాట్లాడలేమని చెప్పారు. ఏ ప్రభుత్వమైనా మంచి పనులు చేస్తే స్వాగతిస్తామని చెప్పారు. వచ్చే వేసవిలో తాగునీటి సమస్య వచ్చే అవకాశం ఉన్నందున ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, మిషన్ భగీరథకు సంబంధించిన పెండింగ్ పనులను పూర్తి చేయాలని కోరారు.

దళారీ వ్యవస్థను తెచ్చే పనిలో కాంగ్రెస్

మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి విమర్శ



సాక్షి, హైదరాబాద్: సంక్షేమ పథకాల అమలులో దళారీ వ్యవస్థను తీసుకొచ్చే పనిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని మాజీ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి ధ్వజమెత్తారు. ప్రజాపాలన పేరిట దరఖాస్తులు స్వీకరించినా తదుపరి కార్యాచరణపై నేటికీ స్పష్టత లేదని విమర్శించారు. గతంలోనూ పలు సందర్భాల్లో కాంగ్రెస్ దివాళాకోరుతనాన్ని చూపిందని అన్నారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజలు కోరుకున్న రీతిలో బీఆర్‌ఎస్ పనిచేస్తుందని, పార్టీ అధినేత కేసీఆర్ ప్రతిరోజూ కొంతమంది కార్యకర్తలతో ఫోన్‌లో మాట్లాడుతున్నారని జగదీశ్‌రెడ్డి తెలిపారు. క్షేత్ర స్థాయిలో జరుగుతున్న ప్రొటోకాల్ ఉల్లంఘనలను పార్టీ ప్రజాప్రతినిధులు తమ దృష్టికి తెచ్చారని, బీఆర్‌ఎస్ కార్యకర్తలపై దాడులను తీవ్రంగా పరిగణిస్తున్నామని అన్నారు.

బీఆర్‌ఎస్ భేటీలకు విరామం

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 3వ తేదీ నుంచి వరుసగా జరుగుతున్న బీఆర్‌ఎస్ లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశాలకు నాలుగు రోజులు విరామం ప్రకటించారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు భేటీలు నిలిపివేసినట్లు పార్టీ ప్రకటించింది. ఈ నెల 17వ తేదీ నుంచి సమావేశాలు తిరిగి ప్రారంభమవుతాయని తెలిపింది. ఇప్పటి వరకు ఆదిలాబాద్, కరీంనగర్, చేవెళ్ల, పెద్దపల్లి, నిజామాబాద్, జహీరాబాద్, ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్, భువనగిరి లోక్‌సభ సెగ్మెంట్ల సమావేశాలు జరిగాయి. 17న నాగర్‌కర్నూల్, 18న మహబూబ్‌నగర్, 19న మెదక్, 20న మల్కాజిగిరి, 21న సికింద్రాబాద్, హైదరాబాద్, 22న నల్లగొండ సన్నాహక సమావేశాలు జరుగుతాయి.

రెండు లక్షల ఉద్యోగాలకు జాబ్ కేలండర్ ప్రకటించాలి

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి డిమాండ్



సాక్షి,హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల ఉద్యోగాలకు జాబ్ కేలండర్ వెంటనే ప్రకటించాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ...కేసీఆర్ ప్రభుత్వం ఉద్యోగాలు భర్తీ చేయలేదని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపణలు చేస్తున్నారన్నారని, వాస్తవంగా 1.60 లక్షల ఉద్యోగాలు భర్తీ చేశామనే విషయం తెలుసుకోవాలని తెలిపారు. రాష్ట్ర ఉద్యోగులకు నాలుగో తేదీన జీతాలు ఇచ్చామని చెబుతున్న ప్రభుత్వం ప్రతీ నెల అదే విధంగా ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాల పునాదుల మీద ఏర్పడిందన్నారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల మాజీ ఇన్‌చార్జ్ మాణిక్యం ఠాగూర్ తమపై వేసిన పరువు నష్టం దావాకు కోర్టులోనే సమాధానం ఇస్తామని, కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేసిన వ్యాఖ్యలనే తాము చెప్పామని కౌశిక్ రెడ్డి తెలిపారు.

ప్రియాంక జన్మదిన వేడుకలు

సాక్షి, హైదరాబాద్: ఏఐసీసీ అగ్రనేత ప్రియాంకగాంధీ జన్మదిన వేడుకలను శుక్రవారం గాంధీభవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతరావు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి, ఉపాధ్యక్షుడు చామల కిరణ్ కుమార్‌రెడ్డి, ఏఐసీసీ మీడియా పరిశీలకులు సుజాత పాల్, నిజాముద్దీన్, చరణ్ తదితరులు పాల్గొన్నారు. బేగంపేట దేవనార్ అంధుల పాఠశాల విద్యార్థులతో కలిసి ప్రియాంక గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలందరికీ పుస్తకాలను పంపిణీ చేశారు.

'కారు' వెళ్లింది.. సర్వీసింగ్‌కే..

- ప్రభుత్వ వ్యతిరేకతను అంచనా వేయలేకపోవడం వల్లే ఓటమి
- పార్టీలో సంస్థాగత లోపాలు, నేతలకు గుర్తింపు దక్కకపోవడానికి నాదే బాధ్యత
- భువనగిరి బీఆర్‌ఎస్ సమావేశంలో కేటీఆర్ కీలక వ్యాఖ్యలు



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్‌కు ఓటమి కొత్తకాదని, ఈ ఓటమి కేవలం స్పీడ్ బ్రేకర్ లాంటిదేనని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె తారక రామారావు వ్యాఖ్యానించారు. పదేళ్ల పాటు విరామమెరుగకుండా పనిచేసిన కారు మరింత స్పీడ్‌గా పనిచేసేందుకు సర్వీసింగ్‌కు మాత్రమే పోయిందని, షెడ్డులోకి పోలేదంటూ బీఆర్‌ఎస్ శ్రేణులకు ధైర్యం నూరిపోశారు. పరిపాలన మీద దృష్టి పెట్టి పార్టీని పట్టించుకోలేదనీ, ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమి పాలుకావడానికి పూర్తి బాధ్యత తనదేనని పేర్కొన్నారు. పార్టీలో సంస్థాగత నిర్మాణం జరగలేదని, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి సరైన గుర్తింపును ఇవ్వలేకపోయామనీ, అందుకు కూడా తనదే పూర్తి బాధ్యతన్నారు. పది రోజులుగా జరుగుతున్న బీఆర్‌ఎస్ లోక్‌సభ సన్నాహక సమావేశాల్లో భాగంగా జరిగిన సమీక్షల్లో పార్టీ ఓడిపోవడానికి ప్రధానంగా గుర్తించిన కారణాలను కేటీఆర్ వివరించారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం జరిగిన భువనగిరి లోక్‌సభ సెగ్మెంట్ బీఆర్‌ఎస్ సన్నాహక సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు.

ఓటరుకు, కార్యకర్తకు మధ్య లింకు తెగింది

'నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే కేంద్రంగా పార్టీని నడపడం సరికాదని, గత పదేళ్లలో పార్టీ కార్యకర్తల ఆర్థిక పరిస్థితిని కూడా పట్టించుకోలేదనే అభిప్రాయం వ్యక్తమైంది. ప్రభుత్వానికి పథకాలకు నడుమ కార్యకర్తల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారుడికే ప్రయోజనం చేకూరడంతో ఓటరుకు, కార్యకర్తకు నడుమ లింకు తెగిందని పలువురు నేతలు చెప్పారు. 'ఆరు లక్షలకు పైగా రేషన్ కార్డులు ఇచ్చినా, ప్రతీ నియోజకవర్గంలో 15వేలకు పైగా కొత్త రేషన్ కార్డులు ఇచ్చినా జనంలోకి తీసుకెళ్లలేక పోయాం. వందలో ఒకరికి రేషన్‌కార్డు రాకున్నా నెగెటివ్ ప్రచారం జరిగింది. దళితబంధు కొందరికే రావడంతో అర్హత కలిగిన ఇతరులు అసహనంతో పార్టీకి వ్యతిరేకమయ్యారు. దళితబంధు ఇవ్వడంపై ఇతర కులాల్లో వ్యతిరేకత ఏర్పడింది' అని సమీక్షలో అభిప్రాయం వ్యక్తమైంది. 'రైతుబంధు అందరికీ వర్తింప చేసినా ఎక్కువ విస్తీర్ణం కలిగిన భూస్వాములకు లబ్ధి జరగడాన్ని సామాన్య రైతు ఒప్పుకోలేదని తేలింది. పార్టీ పట్ల ప్రజల్ల నెలకొన్న వ్యతిరేకతను సరిగ్గా అంచనా వేయలేకపోవడంతోనే అధికారానికి దూరమైనట్లు విశ్లేషణలో తేలింది' అని కేటీఆర్ వెల్లడించారు. సమీక్షల్లో భాగంగా వస్తున్న అభిప్రాయాలను ఏరోజుకారోజు పార్టీ అధినేత కేసీఆర్‌కు నివేదిస్తున్నట్లు కేటీఆర్ తెలిపారు.

ప్రజలు తప్పు చేశారనడం సరైంది కాదు

బీఆర్‌ఎస్‌ను ఓడించడం ద్వారా ప్రజలు తప్పు చేశారంటూ అక్కడక్కడా పార్టీ నాయకులు అంటున్నారు. రెండు పర్యాయాలు మనల్ని గెలిపించింది ప్రజలే. ఇకపై అలాంటి వ్యాఖ్యలు చేయొద్దు'అని కేటీఆర్ పార్టీ నేతలకు హితవు పలికారు. ''సంయమనం పాటించాలని కేసీఆర్ సూచించినా కాంగ్రెస్ బీఆర్‌ఎస్‌ను రెచ్చగొట్టి హామీల నుంచి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తోంది. అసెంబ్లీ వేదికగా మన నేతలు కాంగ్రెస్ విమర్శలను తిప్పికొట్టారు. స్వయంగా కేసీఆర్ అసెంబ్లీకి వస్తే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించలేరు.ఆర్టీసీలో ఉచిత ప్రయాణంతో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, నష్టపోతున్న ఆటో డ్రైవర్ల సమస్యకు ప్రభుత్వం పరిష్కారం చూపించాలి.''అని కేటీఆర్ పేర్కొన్నారు.

బీజేపీతో పొత్తు ప్రసక్తే లేదు

''బీజేపీతో బీఆర్‌ఎస్ పార్టీకి ఎన్నడూ పొత్తు లేదు, భవిష్యత్తులోనూ ఉండదు. కవిత అరెస్టు కాకపోవడానికి సుప్రీంకోర్టు జోక్యమే తప్ప బీజేపీతో సంబంధాలు కారణం కాదు. కాంగ్రెస్ బీజేపీ కుమ్మక్కై బీఆర్‌ఎస్‌ను దెబ్బతీయాలని చూశాయి. కాంగ్రెస్ బీజేపీ కుమ్మక్కు వల్లే రెండు ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు వేర్వేరుగా ఎన్నికలు జరిగేలా నోటిఫికేషన్ ఇచ్చారు. అమిత్ షాతో రేవంత్ భేటీ తర్వాతే ఎమ్మెల్సీ ఉప ఎన్నికల నిర్వహణ పద్ధతి మారింది. ఎమ్మెల్సీ ఉపఎన్నికల తీరుపై హైకోర్టుకు వెళ్లినా నిరాశ తప్పలేదు. రాజకీయం కోసం బీజేపీ మతాన్ని వాడుకుంటోంది. మేము కూడా యాద్రాద్రి అక్షింతలను నల్లగొండ, భువనగిరిలో పంచితే గెలిచే వాళ్లమేమో. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రొటోకాల్ ఉల్లంఘనలు సీరియస్‌గా తీసుకుంటూ తప్పుడు కేసులు ఎదుర్కొంటాం' అని కేటీఆర్ వెల్లడించారు.

అర్హులనే ఎంపిక చేయండి

- ఐదు గ్యారంటీల డేటా ఎంట్రీలో డూప్లికేషన్ లేకుండా చూడాలి
- అధికారులకు మంత్రివర్గ ఉపసంఘం ఆదేశం
- ఓటీపీ అడిగేది లేదని స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: ప్రజాపాలన కార్యక్రమం కింద ఐదు గ్యారంటీలకు దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన లబ్ధిదారులనే ఎంపిక చేయాలని, ఇందుకు పటిష్ట విధానాన్ని అనుసరించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి డి.శ్రీధర్‌బాబు ఆదేశించారు. ప్రజాపాలనపై భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రి శ్రీధర్ బాబుతో ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో సమావేశమై చర్చించింది. ప్రజాపాలన కింద వచ్చిన దరఖాస్తులెన్ని? ఎన్ని దరఖాస్తుల డేటా ఎంట్రీ పూర్తైంది? ఏ గ్యారంటీకి ఎన్ని దరఖాస్తులొచ్చాయి? అనేది అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఐదు గ్యారంటీల అమలు కార్యాచరణ ప్రణాళికను అధికారులు మంత్రులకు వివరించారు. డేటా ఎంట్రీలో డూప్లికేషన్ జరగకుండా సీజీజీ, ఐటీ శాఖలతో ఇతర అన్ని శాఖలు సమన్వయం చేసుకోవాలని మంత్రులు ఆదేశించారు. ఎలాంటి లోపాలు లేని డేటాను సిద్ధం చేయాలన్నారు.

ఓటీపీ అడగం

ప్రజాపాలన దరఖాస్తుల డేటా ఎంట్రీ కోసం దరఖాస్తుదారుల నుంచి ఓటీపీలను ప్రభుత్వం అడగదని, ఓటీపీ అడిగే విధానమే ప్రక్రియలో లేదని మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. సైబర్ నేరస్తులు దరఖాస్తుదారులకు ఫోన్ చేసి ఓటీపీ అడిగితే ఇవ్వరాదని, వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రజాపాలనకు ప్రజల నుంచి పెద్ద ఎత్తున వచ్చిన స్పందనను జీర్ణించుకోలేక కొంతమంది దురుద్దేశపూర్వకంగా రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు.

రూ.600 కోట్లు మంజూరు చేయించా

ఎంపీ బండి సంజయ్



చిగురుమామిడి (హుస్నాబాద్): కేంద్ర రహదారుల మౌలిక సదుపాయాల నిధుల (సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్) కింద రాష్ట్రానికి రూ.600 కోట్లు మంజూరు చేయించానని, ఇందులో రూ.219 కోట్లు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి కేటాయించినట్లు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ పేర్కొన్నారు. శుక్రవారం చిగురుమామిడి మండలంలోని సుందరగిరి–ఇందుర్తి, ఇందుర్తి–హుస్నాబాద్ రోడ్డు విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. సుందరగిరి–ఇందుర్తి పనుల జాప్యంపై ఆరా తీశారు. ముందుకుసాగడం లేదని స్థానికులు చెప్పడంతో అధికారులు, కాంట్రాక్టర్లను పిలిచి, హెచ్చరించారు. ఇకపై పనుల్లో జాప్యం జరిగితే సహించనని, మార్చిలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందుర్తి గ్రామంలో నిర్వహించిన 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర'కు హాజరై, కేంద్ర పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. హుస్నాబాద్ బీజేపీ ఇన్‌చార్జి బొమ్మ శ్రీరాం చక్రవర్తి, రాష్ట్ర నాయకుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పైడిపెల్లి శ్రీనివాస్, ఎంపీడీవో ఎం.నర్సయ్య, ఇందుర్తి, గునుకులపల్లె సర్పంచ్‌లు అమూల్య, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

జెన్‌కో హెచ్‌ఆర్ డైరెక్టర్ రాజీనామా

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో) హెచ్‌ఆర్ విభాగం డైరెక్టర్ ఎస్.అశోక్‌కుమార్ రాజీనామా చేశారు. తొమ్మిదేళ్లుగా ఆయన ఈ పదవిలో కొనసాగారు. రాష్ట్ర ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి, జెన్‌కో, ట్రాన్స్‌కో సంస్థల ఇన్‌చార్జ్ సీఎండీ సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీని కలవడానికి శుక్రవారం ఉదయం సచివాలయానికి వెళ్లగా, సాయంత్రం వరకు అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని తెలిసింది. దీంతో అశోక్‌కుమార్ అక్కడికక్కడే రాజీనామా లేఖ రాసి ఇచ్చేశారని జెన్‌కోలో చర్చ జరుగుతోంది. విద్యుత్ సంస్థల డైరెక్టర్లు, ఇతర అధికారుల పట్ల రిజ్వీ కఠినంగా వ్యవహరిస్తున్నారని, అందరి ముందు చివాట్లు పెడుతున్నారని ఉద్యోగులు అంటున్నారు. ఈ క్రమంలో అశోక్‌కుమార్ రాజీనామా చేసినట్టు సమాచారం. అశోక్‌కుమార్ రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది.

'దళితబంధు' ఉంటుందా?

త్రిశంకు స్వర్గంలో పథకం.. 11వేల మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.436.27 కోట్లు

- ఆ ఖాతాలు ఫ్రీజ్.. డబ్బులున్నా విత్ డ్రా చేసుకోలేని స్థితి
- 119 నియోజకవర్గాల్లో రెండో జాబితాలో 1.31లక్షల మంది
- పథకం సలహాదారులకు నేటికీ రూ.లక్షల్లో జీతాలు, రాజభోగాలు
- అసలు పథకం కొనసాగుతుందా.. లేదా?
- సందిగ్ధంలోలబ్ధిదారులు...



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దళితబంధు పథకం అమలు ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లోని దాదాపు 11,108 మంది లబ్ధిదారులు తమ ఖాతాల్లో ఆరునెలలుగా ఉన్న సుమారు రూ.436.27 కోట్ల డబ్బును విత్ డ్రా చేసుకోలేని స్థితిలో ఉన్నారు. మరోవైపు రెండో జాబితాలో ప్రతీ నియోజకవర్గానికి 1100 మంది లబ్ధిదారుల చొప్పున ఎన్నికలకు ముందు 1.31 లక్షల మంది దళితులతో జాబితాను నాటి ప్రభుత్వం రూపొందించింది. ఈలోపు ఎన్నికల ప్రక్రియ మొదలుకావడంతో పథకాన్ని తాత్కాలికంగా నిలిపివేసింది. తాజాగా కొలువుదీరిన ప్రభుత్వం ఇప్పటివరకూ ఆ పథకంపై ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో వీరందరిలోనూ పథకం అమలుపై తీవ్రమైన ఆందోళన నెలకొంది.

11వేలమందికి చెందిన.. రూ.436.27 కోట్లు !

పథకంలో ఎంపికైన కుటుంబానికి రూ.10 లక్షలు ఆర్థిక సాయం, లబ్ధిదారులు ఎంచుకున్న రంగంలో నైపుణ్య శిక్షణ, వారి చేత వ్యాపారాలు ప్రారంభించే లక్ష్యంతో 2021 ఆగస్టు 16న అప్పటి సీఎం కేసీఆర్ ఆ పథకానికి శ్రీకారం చుట్టారు. కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలం శాలపల్లి వేదికగా ఈ పథకాన్ని ఆరంభించారు. హుజురాబాద్ నియోజకవర్గాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంచుకుని 18వేలమంది దళితులను పథకాన్ని ఎంపిక చేశారు. వీరిలో 11,315 మంది లబ్ధిదారులకు రూ.10 లక్షల చొప్పు న ఇవ్వగా.. మిగిలిన వారికి రూ.10 లక్షలలోపు ఆర్థిక సాయం అందజేశారు. దళితబంధు పథకాన్ని ప్రభుత్వం తొలిదశలో తొలుత రెండురకాలుగా అమలు చేసింది. ఒకటి సాచురేషన్ (ఎంపిక చేసుకున్న ప్రాంతంలో) మోడ్, రెండోది టార్గెట్ మోడ్ (నియోజకవర్గాల వారీగా) విధానం. ఇందులో టార్గెట్ మోడ్‌లో 11,387 మంది లబ్ధిదారులు ఎంపికయ్యారు. వారిలో 1413 మందికి రూ.126.66 కోట్లను అప్పటి ప్రభుత్వం ఖాతాల్లో వేసింది. సాచురేషన్ పద్ధతిలో మొత్తం 26,395 మందికి పథకాన్ని వర్తింపజేసింది. అందులో 9695 మందికి 309 కోట్లను విడుదల చేసింది. ఈ రెండు విధానాల్లో కలిపి 11,108 మంది ఖాతాల్లో మొత్తం రూ.436.27 కోట్లను ప్రభుత్వం ఖాతాల్లో వేసినా.. వారికి విత్‌డ్రా చేసుకునే వీలు మాత్రం ఇవ్వలేదు.

రెండో జాబితాలో దయనీయం..

టార్గెట్ మోడల్‌లో పథకం ప్రారంభించిన ప్రభుత్వం మొత్తంగా 33 జిల్లాల్లో 119 మంది నియోజకవర్గాల్లో 1,31,500 మంది లబ్ధిదారులను రెండోదశలో ఎంపిక చేసింది. వారికి పథకం కోసం అన్ని అర్హతలు ఉన్నాయని తేల్చింది. లబ్ధిదారులకు జారీ చేసేందుకు హార్డ్ కాపీలు కూడా సిద్ధం చేసింది. వీరి కోసం రూ.749 కోట్లు కూడా ఇచ్చేందుకు ప్రతిపాదనలు రూపొందించింది. కానీ, ఈలోపు ఎన్నికల కోడ్ రావడంతో ఎంపికైన 1,31,500 మంది లబ్ధిదారులకు ఆఖరునిమిషంలో డబ్బులు రాకుండా నిలిచిపోయాయి. దాంతో ఈ పథకం అమలుపై కలవరం నెలకొంది.

సలహాదారులకు రాజభోగాలు

వివిధ విభాగాలలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నామినేట్ చేసిన రిటైర్డ్ ఉద్యోగులను, నాయకులను రాజీనామా చేయిస్తోన్న కొత్త ప్రభుత్వం దళిత బంధులో నామినేటెడ్ పోస్టుల వంక కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. దళిత బంధు కోసం ఇద్దరిని నామినేటెడ్ విధానంలో నెలకు రూ.2.50లక్షల చొప్పున వేతనాలు, వారికి ఐదుగురు సెర్ప్ సిబ్బందిని రిసోర్స్ పర్సన్ల (ఆర్పీ)లుగా నియమించింది. వీరికి రూ.60 వేల నుంచి రూ.70వేల వరకు ఇస్తున్నారని సమాచారం. వీరు రాష్ట్రవ్యాప్తంగా దళిత బంధు పథకం అమలు తీరును పర్యవేక్షించి సంతృప్తి వ్యక్తం చేస్తేనే నిధులు విడుదలవుతాయి. ఆరు నెలలుగా దళితబంధు ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయినా వీరిని కొత్త ప్రభుత్వం కూడా ఇంకా కొనసాగిస్తోంది. వీరు జిల్లాల్లో పర్యటించిన సందర్భాల్లో.. ఆయా జిల్లాల్లో ఎస్సీ కార్పొరేషన్ అధికారులకు ఖర్చుల పేరిట చుక్కలు చూపిస్తున్నారన్న విమర్శలున్నాయి. వీరికి కారు, డ్రైవర్, ఆఫీస్ బాయ్, ట్రావెల్ అలవెన్సు తదితరాలు అదనంగా కావడం కొసమెరుపు.

వెంటనే జమ చేయాలి



మొదటి విడతగా విడుదలైన నిధులతో వ్యాపారాలు ఏర్పాటు చేసుకొని నిర్వహించుకుంటున్నాం. ఏడాదిన్నర అవుతున్నా రెండో విడుత ఇవ్వాల్సిన మిగతా మొత్తం మా ఖాతాల్లో జమ చేయలేదు. అధికారులను అడిగితే దాటవేస్తున్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే రెండో విడుత నిధులను విడుదల చేసి మా ఖాతాల్లో జమ చేయాలి.

– పర్లపల్లి రాజు, దళితబంధు లబ్ధిదారుడు, హుజూరాబాద్

నిధుల కోసం ఎదురుచూస్తున్నాం



దళితబంధు పథకంలో మొదటి విడతలో వచ్చిన నిధులతో మినీ సూపర్‌మార్కెట్ నిర్వహిస్తున్నాం. రెండో విడత నిధులు ఇవ్వకపోవడంతో అప్పులు తెచ్చి దుకాణాన్ని నడిపించాల్సి వస్తోంది. రెండో విడత డబ్బుల కోసం ఎదురు చూస్తున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం మలి విడత డబ్బులు విడుదల చేసి ఆదుకోవాలి.

– గజ్జల అంజయ్య, లబ్ధిదారుడు, హుజూరాబాద్

నస్పూర్ మున్సిపల్ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం


నస్పూర్, బెల్లంపల్లి: మంచిర్యాల జిల్లా నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్‌పై కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. కలెక్టర్ సంతోష్ ఆదేశాల మేరకు ప్రిసైడింగ్ అధికారి, మంచిర్యాల ఆర్డీవో రాములు శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. మొత్తం 25మంది సభ్యులకు గాను 19మంది హాజరయ్యారు. అవిశ్వాసం నెగ్గడానికి 2/3వంతు సభ్యుల మద్దతు అంటే 17మంది సభ్యులు అవసరం కాగా.. 19మంది మద్దతు తెలిపారు. దీంతో చైర్మన్‌పై అవిశ్వాసం నెగ్గినట్లు ఆర్డీవో ప్రకటించారు.

బెల్లంపల్లిలో వీగిన అవిశ్వాసం

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్‌చైర్మన్ బత్తుల సుదర్శన్‌పై కౌన్సిలర్లు ప్రతిపాదించిన అవిశ్వాసం కోరం లేక వీగిపోయింది. ఓటింగ్ నిర్వహణకు శుక్రవారం మున్సిపల్ సమావేశం ఏర్పాటు చేయగా.. బీఆర్‌ఎస్‌కి చెందిన 20మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. కోరం ఉండాలంటే మరో ఇద్దరు కౌన్సిలర్లు మద్దతు తెలపాల్సి ఉండగా.. మరికొంత సమయం కావాలని హాజరైన సభ్యులు కోరారు. మధ్యాహ్నం వరకు సమావేశాన్ని ప్రిసైడింగ్ అధికారి హరికృష్ణ వాయిదా వేశారు. అప్పటికీ కోరం లేకపోవడంతో చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌లపై అవిశ్వాసం వీగిపోయినట్లు ఆర్డీవో ప్రకటించారు. కాగా, కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు 11మంది, బీఆర్‌ఎస్, బీజేపీతో కలిపి మొత్తం 13మంది అవిశ్వాస పరీక్షకు దూరంగా ఉండడంతో వీగిపోయింది.

'అవిశ్వాసం'పై స్టేకు హైకోర్టు నిరాకరణ

భువనగిరి, కాగజ్‌నగర్ మున్సిపాలిటీల వ్యవహారంలో ప్రతివాదులకు నోటీసులు



సాక్షి, హైదరాబాద్: భువనగిరి, కాగజ్‌నగర్ మున్సిపాలిటీ చైర్మన్‌లతో పాటు భువనగిరి వైస్‌చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానాల ప్రక్రియపై స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. కౌంటర్‌లు దాఖలు చేయాలని ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ విచారణను వాయిదా వేసింది. తమపై కౌన్సిలర్లు అవిశ్వాసం ప్రకటిస్తూ నోటీసులు ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ భువనగిరి మున్సిపాలిటీ చైర్మన్ ఆంజనేయులు, వైస్ చైర్మన్ కిష్టయ్య, కాగజ్‌నగర్ చైర్మన్ సద్దాం హుస్సేన్ వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. అవిశ్వాస ప్రక్రియను నిలిపేసేలా జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్లపై న్యాయమూర్తి జస్టిస్ టి.వినోద్‌కుమార్ ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల వాదనలపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించిన ధర్మాసనం.. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. కాగా, అవిశ్వాసం ద్వారా తనను నల్లగొండ మున్సిపల్ చైర్మన్ పదవి నుంచి తొలగించడాన్ని సవాల్ చేస్తూ మాజీ చైర్మన్ సైదిరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కూడా జస్టిస్ టి.వినోద్‌కుమార్ ధర్మాసనం విచారించింది. సైదిరెడ్డికి అనుకూలంగా స్టే ఇచ్చేందుకు కోర్టు నిరాకరించింది.

'చెన్నమనేని పౌరసత్వం' కేసులో తీర్పు రిజర్వు

సాక్షి, హైదరాబాద్: తన పౌరసత్వాన్ని రద్దు చేస్తున్నట్టు కేంద్ర హోంశాఖ ప్రకటించడాన్ని సవాల్ చేస్తూ వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ 2019లో దాఖలు చేసిన పిటిషన్‌లో హైకోర్టు తీర్పు రిజర్వు చేసింది. చెన్నమనేని రమేశ్ 2009లో భారత పౌరసత్వం పొందారు. ఆ తర్వాత వరుసగా నాలుగుసార్లు అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచారు. రమేశ్ ద్వంద్వ పౌరసత్వం కలిగి ఉన్నారని 2018లో వేములవాడలో ఆయనపై పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్ (ప్రస్తుత ఎమ్మెల్యే) హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై అప్పటి నుంచి విచారణ కొనసాగుతోంది. ఈ క్రమంలోనే చెన్నమనేని పౌరసత్వాన్ని రద్దు చేస్తున్నట్టు కేంద్ర హోంశాఖ ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ 2019లో చెన్నమనేని మరో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. చెన్నమనేని పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాస నం శుక్రవారం మరోసారి విచారణ చేపట్టింది. గత విచారణ సందర్భంగా రమేశ్ గతేడాది అంతర్జాతీయ ప్రయాణ వివరాలు సమర్పించాలని న్యాయమూర్తి కేంద్రాన్ని కోరడంతో ఆ మేరకు వివరాలిచ్చారు. అంతకుముందు ఏఎస్‌జీ నరసింహశర్మ, ఆది శ్రీనివాస్ తరఫు సీనియర్ న్యాయవాది రవికిరణ్‌రావు వాదనలు విన్న ధర్మాసనం తీర్పు రిజర్వు చేసింది.

ప్రజావాణిలో భూకబ్జాలపై ఫిర్యాదులు

హైదరాబాద్ (లక్డీకాపూల్): బీఆర్‌ఎస్ హయాంలో కల్వకుంట్ల కుటుంబ సంబంధీకులు కోట్ల విలువైన భూమిని స్వాహా చేశారని కొందరు బాధితులు ఫిర్యాదు చేశారు. శుక్రవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు పలు సమస్యలకు సంబంధించి దరఖాస్తులు సమర్పించారు. ధరణి, భూ కబ్జా, ఉద్యోగం, వేతనాలు తదితర అంశాలపై 1,872 అర్జీలు అందాయి. రంగారెడ్డి జిల్లా కొత్తూరులో పద్మశాలి వీవర్స్ సొసైటీకి చెందిన కోట్లాది రూపాయల విలువైన 180 ఎకరాల భూమిని చీటింగ్, ఫోర్జరీలతో కల్వకుంట్ల కుటుంబ సంబంధీకులకు సేల్ డీడ్ చేశారని సొసైటీ సభ్యులు రమేష్ భారత, చింత మోహన్, పురుషోత్తంలు తమ ఫిర్యాదులో ఆరోపించారు. కాగా బేగంపేట పాటిగడ్డలో తమ 3.10 గుంటల భూమిని కల్వకుంట్ల కుటుంబ సన్నిహితులు స్వాహా చేశారంటూ స్థానిక జన చైతన్య సంఘం అధ్యక్షుడు ఆలగుంట జంగయ్య, కార్యదర్శి నర్సింహులు మరో ఫిర్యాదులో ఆరోపించారు. మరోవైపు శంకరపల్లి మండలం రామంతపురంలోని సర్వే నం.47, 48లలో ఉన్న 3 ఎకరాల భూమి రికార్డును కొందరు తమ ప్రమేయం లేకుండానే మాయం చేసి కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని బాధిత రైతులు నరేంద్రరెడ్డి, దామోదర్ రెడ్డి ఫిర్యాదు చేశారు. మూసీ నది పరివాహక ప్రాంతంలో శివాజీ బ్రిడ్జి క్రింద గత 30 ఏళ్ళుగా జీవిస్తున్న 127 ర్యాగ్ పికర్ కుటుంబాలకు ప్రైవేటు కిరాయి గుండాల వేధింపుల నుండి రక్షణ కల్పించాలని డీబీఎఫ్ నేత పి.శంకర్ కోరారు.

ప్రజాభవన్ వద్ద ఉద్రిక్తత

తమ డిమాండ్ల సాధనకు నిరుద్యోగులు, మధ్యాహ్న భోజన కార్మికులు నిరసనకు దిగడంతో ప్రజాభవన్ వద్ద స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. వెంటనే ఉద్యోగాల భర్తీ చేపట్టాలని నిరుద్యోగులు డిమాండ్ చేయగా, పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ మిడ్ డే మీల్స్ కార్మికులు ఆందోళన చేపట్టారు.


సర్పంచ్‌ల పదవీ కాలాన్ని జూన్ వరకు పొడిగించాలి

- తక్షణమే పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి తెలంగాణ రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం విజ్ఞప్తి

హిమాయత్‌నగర్: రాష్ట్రంలో గ్రామ పంచాయతీ సర్పంచుల పదవీ కాలం ఈ నెల 31వ తేదీతో ముగుస్తున్న నేపథ్యంలో వారి పదవీ కాలాన్ని జూన్ వరకు పొడిగించాలని తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేసింది. ఉప సర్పంచుల జాయింట్ చెక్ పవర్‌ను తక్షణమే రద్దు చేసి, ప్రభుత్వ గ్రామ కార్యదర్శికి చెక్ పవర్‌ను కల్పించాలని కోరింది.ఈ మేరకు సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించామని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్ వెంకటేష్ యాదవ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు జి.రవీందర్ గౌడ్ వెల్లడించారు. శుక్రవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే ప్రభుత్వం విడుదల చేయాలని, గత ప్రభుత్వ హయంలో ఆర్థికంగా నష్టపోయి ఆత్మహత్యలకు పాల్పడ్డ సర్పంచ్‌ల కుటుంబాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సర్పంచ్‌ల గౌరవ వేతనాన్ని రూ. 6,500 నుంచి 20 వేలకు పెంచాలని, పదవీ కాలం పూర్తయిన సర్పంచ్‌లకు పెన్షన్ విధానం అమలు చేయాలని కోరినట్టు తెలిపారు. తమ డిమాండ్లపై సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని, మంత్రి సీతక్కతో చర్చించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని వారు చెప్పారు.

తప్పుడు ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకోండి

- తెలంగాణ దేవాదాయ అర్చక, ఉద్యోగ జేఏసీ విజ్ఞప్తి
- పోలీసులకు ఫిర్యాదు



దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న జేఏసీ ప్రతినిధులు

సుల్తాన్‌బజార్ (హైదరాబాద్): దేవాదాయ శాఖలోని అర్చక ఉద్యోగులకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ జీతాలపై ఓ దిన పత్రికలో వచ్చిన 'కొత్త పేర్లు– డబ్బులు వసూళ్లు'అనే వార్తను తెలంగాణ దేవాదాయ అర్చక, ఉద్యోగ జేఏసీ తీవ్రంగా ఖండించింది. శుక్రవారం బొగ్గులకుంటలోని దేవాదాయ, ధర్మాదాయ కమిషనరేట్ వద్ద ఆందోళన నిర్వహించిన అనంతరం తమపై తప్పుడు ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నారాయణగూడ పోలీస్ స్టేషన్‌లో జేఏసీ బృందం ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ పరశురామ్ రవీంద్రచార్యులు, అర్చక ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాండూరి కృష్ణమాచారి, వర్కింగ్ ప్రెసిడెంట్ అగ్నిహోత్రం చంద్రశేఖర శర్మలు మాట్లాడారు. కొందరు కావాలనే తమ సంఘాన్ని దెబ్బతీసేందుకు ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయమై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలువనున్నట్లు జేఏసీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు బండారి జగపతి, శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పెద్ద స్కాం

కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ పెద్ద స్కామ్ అని, కమీషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టును రీడిజైన్ చేశారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆరోపించారు. ఆయన శుక్రవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ, బీసీ, మైనారిటీ బంధుల పేరుతో ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్ హడావుడి చేసిందని ఎద్దేవా చేశారు. ఎస్సీ సబ్‌ప్లాన్‌ను ఎస్సీ డెవలప్‌మెంట్ ఫండ్‌గా మార్చి నిధులు మళ్లించారని ఆరోపించారు. నిధుల దారి మళ్లింపు అంశం చర్చకు రాకుండా చేసేందుకే దళితబంధు స్కీంను తెర పైకి తెచ్చారని నిప్పులు చెరిగారు. ఎన్నికల్లో ప్రజలు ఓడించినా బీఆర్‌ఎస్‌కు ఇంకా జ్ఞానోదయం కాలేదని, ఓటమిని అంగీకరించే పరిస్థితిలో కేటీఆర్ లేడన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు డిపాజిట్లు రావని జోస్యం చెప్పారు. బీఆర్‌ఎస్ అభ్యర్థులను మార్చడం కాదు.. నాయకున్ని మార్చాలని ప్రజలు నిర్ణయించారని జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు.

ముగ్గురికి కరోనా



కరీంనగర్‌టౌన్: కరీంనగర్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో శుక్రవారం పలువురికి ఆర్‌టీపీసీఆర్ పరీక్షలు నిర్వహించగా ముగ్గురికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యిందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.వీరారెడ్డి తెలిపారు. రాష్ట్రంలో ఒమిక్రాన్ సబ్ వేరియంట్ జేఎన్-1 విస్తరిస్తున్నందున ప్రజలు కోవిడ్ నిబంధనలు పాటించాలని సూచించారు.

పత్తి ధర రూ.6,700



జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ పత్తి మార్కెట్‌లో శుక్రవారం క్వింటాల్ పత్తి ధర రూ.6,700 పలికింది. శని, ఆదివారాలు సాధారణ, సోమ, మంగళవారాల్లో సంక్రాంతి సందర్భంగా సెలవులని మార్కెట్ కార్యదర్శి రెడ్డి నాయక్ తెలిపారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0/17.6

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో చలి తీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఆర్పీలకు దక్కని 'గౌరవం'

- వేతనాల కోసం కలెక్టర్‌కు వినతి



కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం ఇస్తున్న ఆర్పీలు

కరీంనగర్ కార్పొరేషన్: పట్టణాల్లో మహిళా సంఘాలకు వారే పెద్ద దిక్కు.. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రచారం చేయాలి.. అలాంటి ఆర్పీ(రిసోర్స్ పర్సన్స్)లకు ప్రభుత్వం నుంచి వచ్చే గౌరవం వేతనం కోసం 7 నెలలుగా ఎదురుచూస్తున్నారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పరిధిలో కరీంనగర్ నగరపాలక సంస్థలో దాదాపు 150 మంది ఆర్పీలు పని చేస్తున్నారు. డివిజన్‌కు ఇద్దరు, ముగ్గురు చొప్పన మహిళా సంఘాల కార్యకలాపాలు నిర్వహిస్తుంటారు. ఆయా సంఘాల సభ్యులు రుణాలు తీసుకునేలా, చెల్లించేలా చూస్తారు. పొదుపును అలవర్చుకునేలా అవగాహన కల్పిస్తారు. అంగన్‌వాడీ, ఆశవర్కర్లతోపాటు ఆర్పీలు క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాలను పర్యవేక్షిస్తారు. ఇటీవల ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాల్లో 8 రోజులు సేవలందించారు.

రూ.4 వేల నుంచి రూ.6 వేలకు పెంపు

2007 నుంచి ఆర్పీలకు నెలకు రూ.4 వేల గౌరవ వేతనం ఇస్తున్నారు. గత అక్టోబర్ నుంచి ఈ మొత్తాన్ని రూ.6 వేలకు పెంచుతూ గత ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కానీ, గతేడాది జూన్ నుంచి సెప్టెంబర్ వరకు పాత వేతనం, అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు కొత్త వేతనం అందలేదు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

తమకు ఏడు నెలల గౌరవ వేతనం ఇప్పించాలని ఆర్పీల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు మానుకోట సునీత కోరారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి, వినతిపత్రం అందించారు. అంతకుముందు నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీనివాస్‌ను కలిసి, విన్నవించారు. వీఎల్ఆర్, స్త్రీనిధి నిధుల నుంచి కాకుండా ప్రభుత్వమే బడ్జెట్ కేటాయించి, ప్రతినెలా జీతం చెల్లించాలన్నారు. ఆర్పీలకు డ్రెస్ కోడ్ అమలు చేసి, రూ.10 లక్షల ఆరోగ్య బీమా, రూ.10 లక్షల ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలని కోరారు. గౌరవ వేతనం పెంచాలని, జాబ్‌చార్ట్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి శ్రీమతి, లక్ష్మి, శంకరి, రమాదేవి, మంజుల, దేవేంద్ర, దివ్య పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో రంగవల్లుల పోటీలు



రంగవల్లులను పరిశీలిస్తున్న జడ్జి వెంకటేశ్

హుజూరాబాద్: పట్టణంలోని కోర్టు సముదాయాల ఆవరణలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని శుక్రవారం న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీలు నిర్వహించారు. మహిళా న్యాయవాదులు, కోర్టు మహిళా సిబ్బంది ఆకట్టుకునేలా రంగవల్లులు వేశారు. వాటిని సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్ పరిశీలించారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి అలేఖ్య, సెకండ్ అడిషనల్ జూనియర్ జడ్జి జి.స్వాతి, న్యాయవాదుల సంఘం బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

'అమ్మకు ఓ జత చెప్పులు కొనాలి' ఆవిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న కవులు

కరీంనగర్‌కల్చరల్/సప్తగిరికాలనీ: లేదాళ్ల రాజేశ్వరావు రచించిన 'అమ్మకు ఓ జత చెప్పులు కొనాలి' పుస్తక పరిచయ సభను శుక్రవారం భవానీ సాహిత్యవేదిక ఆధ్వర్యంలో కరీంనగర్ ఫిలింభవన్‌లో నిర్వహించారు. తెలుగు విశ్వవిద్యాలయం సాహిత్య పురస్కార గ్రహీత డాక్టర్ కాంచనపల్లి గోవర్ధనరాజు పుస్తకాన్ని ఆవిష్కరించి, మాట్లాడారు. అంతర్మథనంలోనే కవిత్వం ఆవిష్కరించబడుతుందన్నారు. అనంతరం అన్నవరం దేవేందర్, సంగనభట్ల చిన్న రామకృష్ణయ్య, గోపగాని రవీందర్, నూటెంకి రవీంద్ర మాట్లాడారు. అన్నాడి గజేందర్‌రెడ్డి పుస్తక పరిచయం చేశారు. అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కవులు, రచయితలు పాల్గొన్నారు.

అమాత్యుడిపైనే 'ఆర్టీసీ' ఆశలు

- మూడు పీఆర్‌సీలు, డీఏలు పెండింగ్
- అందని రుణాలు
- నామమాత్రంగా సంక్షేమ బోర్డులు
- ఉద్యోగుల ఇబ్బందులు
- కరీంనగర్‌వాసే రవాణా శాఖ మంత్రి కావడంతో చొరవ చూపుతారని చర్చ
- ఉమ్మడి జిల్లాలో 11 డిపోలు





కరీంనగర్:

తమకు మంచిరోజులు వచ్చేనా? గత ప్రభుత్వంలో నిషేధించబడ్డ యూనియన్లు పురుడు పోసుకునేనా? కొత్త ప్రభుత్వంలో సమస్యలు పరిష్కారమయ్యేనా? తదితర ప్రశ్నలు ఆర్టీసీ ఉద్యోగుల నుంచి వస్తున్నాయి. సమస్యల పరిష్కారానికి గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన సంక్షేమ బోర్డులు నామమాత్రంగా మారాయి. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటవడంతో ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కారమవుతాయని ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాకు చెందిన రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఏ మేరకు చొరవ చూపుతారోనని కొండంత ఆశతో ఎదురుచూస్తున్నారు.

వివిధ స్థాయిల్లో సంక్షేమ బోర్డులు

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి గత ప్రభుత్వం రాష్ట్ర, జిల్లా, డిపో స్థాయిలో ఉద్యోగ సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేసింది. రాష్ట్రస్థాయిలో ఏర్పాటైన బోర్డులో ప్రతీ డిపో నుంచి, ప్రధాన కార్యాలయం నుంచి ఇద్దరు చొప్పున ఉద్యోగులు మొత్తం 202 మందిని సభ్యులుగా తీసుకున్నారు. బోర్డు సమావేశం డిపో పరిధిలో వారానికోసారి, రీజియన్ పరిధిలో నెలకోసారి, కార్పొరేషన్ పరిధిలో మూడు నెలలకోసారి జరుగుతుంది. సంక్షేమ బోర్డు సూచించిన సమస్యలపై తక్షణ చర్యలు తీసుకునేందుకు బస్‌భవన్‌లో ప్రత్యేకంగా ఒక అధికారిని కూడా నియమించారు.

సమ్మెలు, ధర్నాలు చేసే పరిస్థితి లేదు

ఆర్టీసీలో సంఘాలను నిషేధించడంతో ఇదివరకటిలా సమ్మెలు, ధర్నాలు చేసి యాజమాన్యంపై ఒత్తిడి పెంచే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో ఆందోళన చేస్తే తమ ఉద్యోగానికి ఎక్కడ ఎసరు వస్తుందోనన్న భయంతో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. సమస్యలు పరిష్కరిస్తాయనుకున్న సంక్షేమ బోర్డులు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో ఉద్యోగులు అసంతృప్తితో ఉన్నారు.

2019లో 52 రోజుల సమ్మె

తమ సమస్యల పరిష్కారానికి ఆర్టీసీ కార్మికులు 2019 అక్టోబర్ 5 నుంచి 52 రోజులపాటు సమ్మె చేశారు. ప్రభుత్వం వారిని చర్చలకు పిలిచి, పలు హామీలు ఇచ్చింది. ఆర్టీసీ కార్మికులు ఉండరని, అందరూ ఉద్యోగులేనని, సమస్యల పరిష్కారానికి సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. ఈ నేపథ్యంలో 2020 జనవరి 1 నుంచి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 11 డిపోల్లో సంక్షేమ బోర్డులు ఏర్పాటయ్యాయి. ఉద్యోగులు తమ సమస్యలను రాతపూర్వకంగా బోర్డుల దృష్టికి తీసుకువెళ్లేందుకు ప్రత్యేకంగా బాక్సులు ఏర్పాటు చేశారు. కానీ, పలు డిపోల్లో ఇవి డీఎం కార్యాలయం సమీపంలో ఉండటంతో లేఖలు వేసేందుకు ఉద్యోగులు జంకుతున్నారు. నెలకోసారి నామమాత్రంగా సమావేశాలు నిర్వహించి, సంతకాలు తీసుకొని పంపిస్తున్నారని, తమ సమస్యలు వినడం లేదని ఉద్యోగులు వాపోతున్నారు.

అమలు కాని హామీలు

సమ్మె విరమణ తర్వాత మహిళా సిబ్బంది కోసం విశ్రాంతి భవనాలు ఏర్పాటు చేశారు. కానీ, సరైన ప్రణాళిక లేకుండా నిర్మించడంతో అవి నిరుపయోగంగా మారాయి. మహిళా సిబ్బందికి రాత్రి 8 గంటల్లోపు విధులు ముగించాలన్న నిబంధన ఎక్కడా అమలు కావడం లేదు. మూడు పీఆర్‌సీలు, డీఏలు పెండింగ్‌లో ఉండటం, రుణాలు అందకపోవడంతో ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. నూతన నియామకాలు లేకపోవడంతో వయసు పైబడిన ఉద్యోగులపై పని ఒత్తిడి పెరిగి అనారోగ్యం బారిన పడుతున్నారు. ఉద్యోగ విరమణ పొందినవారికి ఏడాదిన్నరైనా సెటిల్‌మెంట్ చేయకపోవడంతో డిపోల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు.

విలీన ప్రక్రియ పూర్తి చేయాలి



ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియ పూర్తి చేయాలి. ఇందుకోసం అధికారులతో కూడిన కమిటీ వేసి, యూనియన్లకు ప్రాతినిధ్యం కల్పించాలి. ఉద్యోగులకు ప్రభుత్వ ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలి. వెల్ఫేర్ కమిటీలను రద్దు చేసి, కార్మిక సంఘాలను అనుమతించాలి. పేరుకుపోయిన డీఏలు, పీఆర్‌సీలు, పెండింగ్ బిల్లులన్నింటినీ క్లియర్ చేయాలి. – జక్కుల మల్లేశంగౌడ్, టీఎస్ ఆర్టీసీ స్టాఫ్ వర్కర్స్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు



కోడి వేలం ఆగింది

కరీంనగర్‌లో బస్సులో దొరికిన కోడి పుంజును శుక్రవారం మధ్యాహ్నం వేలం వేస్తున్నామని ఆర్టీసీ అధికారులు ప్రకటించారు. దీనిపై 'సాక్షి' ప్రధాన పత్రికలో వచ్చిన వార్తకు ప్రముఖ సినీనటి, బ్లూక్రాస్ సొసైటీ వ్యవస్థాపకురాలు అక్కినేని అమల స్పందించారు. వేలంపాటను ఆపి, కోడిని రక్షించాలని బ్లూక్రాస్ సొసైటీ కరీంనగర్ సభ్యులను ఆదేశించారు. కోడి వేలంపాట వన్యప్రాణి నిబంధనలకు విరుద్ధమని, తక్షణమే ఆపాలని స్థానిక బ్లూక్రాస్ ప్రతినిధి తూము నారాయణ అధికారులకు లేఖ అందించారు. దీంతో వారు కోడిని ఆయనకు అప్పగించారు.

– సాక్షి ప్రతినిధి, కరీంనగర్

– వివరాలు మెయిన్‌లో..

వివేకానందుని స్ఫూర్తితో రాణించాలి

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్
- యువతకు యువ సేవా పురస్కార్ అవార్డులు అందజేత



సీఐటీడీ కేంద్రంలో పరిశీలిస్తున్న ఎంపీ సంజయ్



వివేకానందుని విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎంపీ సంజయ్

కరీంనగర్ స్పోర్ట్స్/కరీంనగర్‌టౌన్ : భారత జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ అన్నారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా జ్యోతినగర్ శివ థియేటర్ చౌరస్తాలో, నెహ్రూ యువకేంద్రంలో జరి గిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. వివేకానందుని విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. అనంతరం యువతకు యువ సేవా పురస్కార్ అవార్డులు అందజేశారు. వివేకానందుని స్ఫూర్తితో అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. ఆయన ఆశయాలను పీఎం మోదీ ఏడాదికి 10 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారని తెలిపారు. స్టార్టప్ ఇండియాతో యువకులే సొంతంగా సంస్థలను పెట్టుకొని, ఇతరులకు ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలన్నా రు. మద్యం, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. మహారాష్ట్రలోని నాసిక్ నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేషనల్ యూత్ ఫెస్టివల్‌ను ఉద్దేశించి ప్రసంగించడంతో చాలాసేపు తిలకించారు. ఎన్‌వైకే అధికారులు, డీవైఎస్‌వో, కార్పొరేటర్లు, బీజేపీ నాయకులు, యువ సేవా పురస్కార్ నిర్వాహకులు పాల్గొన్నారు.

త్వరలో సీఐటీడీ విస్తరణ కేంద్రం ప్రారంభం

కరీంనగర్‌లో సీఐటీడీ(సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్) విస్తరణ కేంద్ర భవ న నిర్మాణం పూర్తయ్యింది. తరగతి గదులకు అవసరమైన కంప్యూటర్లు, ఫర్నిచర్, వర్క్‌షాప్‌కు అవసరమైన యంత్రాలను తీసుకువచ్చారు. కరీంనగర్ ఉజ్వల పార్క్ సమీపంలోని పాత శాతవాహన యూనివర్సిటీ క్యాంపస్ స్థలంలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని ఎంపీ సంజయ్ శుక్రవారం సందర్శించారు. వర్క్‌షాప్ గదులను, ఫర్నిచర్‌ను పరిశీలించారు. అడ్మిషన్లు ఎప్పటినుంచి తీసుకుంటారని, ఏయే కోర్సులను ప్రవేశపెడుతున్నారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం కరీంనగర్‌లో సీఐటీడీ విస్తరణ కేంద్ర ఏర్పాటుకు రూ.20.40 కోట్లు కేటాయించిందని తెలిపారు. త్వరలో తరగతులు ప్రారంభం కానున్నాయని అన్నారు. డిగ్రీ, ఇంజినీరింగ్, డిప్లొమా, ఐటీఐ విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగాలకు అవసరమైన కోర్సులను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. వీటిని పూర్తి చేసినవారికి అనేక సంస్థలు ప్లేస్‌మెంట్ కల్పించే అవకాశాలున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీడీ అధికారులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్

- కలెక్టర్ పమేలా సత్పతి



నివాళి అర్పిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్‌స్పోర్ట్స్: దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తి యువత చేతుల్లోనే ఉందని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శుక్రవారం నెహ్రూ యువ కేంద్రంలో నిర్వహించిన స్వామి వివేకానంద 161 జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. 1893 సెప్టెంబర్ 11న చికాగోలో ప్రపంచ మతాల సమ్మేళనంలో స్వామి వివేకానంద సూక్తులతో కూడిన ఉపన్యాసం చేసి, మన దేశ గొప్పదనాన్ని ప్రపంచానికి చాటి చెప్పారన్నారు. యువత దేశంలో విద్యనభ్యసించి విదేశాలకు వెళ్లి ఉద్యోగాలు చేస్తున్నారని, అలా వెళ్లకుండా దేశాభివృద్ధికి పాటుపడాలన్నారు. ఉపన్యాస పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెమోంటోలు ప్రదానం చేశారు. నెహ్రూ యువ కేంద్ర కోఆర్డినేటర్ ఎం.వెంకటరాంబాబు, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి రాజవీరు, డీఆర్‌డీఏ శ్రీలత, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి అనిల్‌ప్రకాష్, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి నేతనియల్, డీటీడబ్ల్యూవో జనార్దన్, ప్రోగ్రాం అధికారి రవీందర్ తదితరులున్నారు.

ఓటరు దినోత్సవానికి ఏర్పాట్లు చేయండి

కరీంనగర్ అర్బన్: 14వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జిల్లా, బూత్ స్థాయిలో ఘనంగా జరుపుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి ప్రకటనలో పేర్కొన్నారు. జనవరి 25న నిర్వహించనున్న ఓటర్ల దినోత్సవం రోజున 'నథింగ్ లైక్ ఓటింగ్.. ఐ ఓట్ ఫర్ ష్యూర్' నినాదాలతో ప్రతి ఒక్కరితో ఓటరు ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. పోలింగ్ బూత్‌లలో నిర్వహించే కార్యక్రమాల్లో కొత్త ఓటరుగా నమోదైన వారికి ఎపిక్ కార్డులు అందించడంతో పాటు సత్కరించాలని సూచించారు.

జిల్లా కోర్టులో వివేకానందుని జయంతి

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టులో స్వామి వివేకానంద జయంతిని శుక్రవారం నిర్వహించారు. బార్ అసోసియేషన్ ప్రధాన క్యాదర్శి లింగంపల్లి నాగరాజు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వాల మహేందర్, కార్యవర్గ సభ్యులు శ్రీధర్‌రావు, శ్రీకాంత్, ఆంజనేయులు, రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్వోబీపై ఎంపీ వ్యాఖ్యలు శుద్ధ అబద్ధం



మాట్లాడుతున్న మేయర్ సునీల్‌రావు

- మాజీ ఎంపీ వినోద్‌కుమార్ చొరవ వల్లే బ్రిడ్జి మంజూరు
- రాష్ట్ర వాటా రూ.28 కోట్లు
- మేయర్ వై.సునీల్‌రావు

కరీంనగర్: ఆర్వోబీలో కేంద్ర ప్రభుత్వ సొంత నిధులు నయాపైసా లేవని, రూ.155 కోట్లలో రాష్ట్ర వాటా రూ.28 కోట్లు ఉన్నాయని, మిగతావి సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ నుంచి కేటాయించారని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. శుక్రవారం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్వోబీని కేంద్ర నిధులతో అభివృద్ధి చేస్తున్నామని ఎంపీ బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు శుద్ధ అబద్ధమని తెలిపారు. ఆయన ఎప్పుడూ నిజాలు మాట్లాడరని, పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రానికి రావాల్సిన సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ రూ.4 వేల కోట్లు ఇవ్వకుండా ఆపారన్నారు. ఈ నిధుల నుంచే తీగలగుట్టపల్లి ఆర్వోబీకి కేటాయించారని పేర్కొన్నారు. తీగలగుట్టపల్లిని మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ మంత్రి గంగుల కమలాకర్ కరీంనగర్ నగరపాలక సంస్థలో కలపకపోతే రైల్వే నిబంధనల ప్రకారం ఆర్వోబీ వచ్చేది కాదన్నారు. ఎంపీగా వినోద్‌కుమార్ కేంద్ర ప్రభుత్వానికి చాలాసార్లు వినతిపత్రాలు ఇచ్చారని, ఆయన చొరవ వల్లే ఆర్వోబీ మంజూరైందని తెలిపారు. ఎంపీగా ఐదేళ్లలో కరీంనగర్‌కు ఎన్ని నిధులు తెచ్చారో చెప్పాలే తప్ప ఆర్వోబీలో తన ప్రమేయం లేకున్నా కేంద్రం నుంచి నిధులు తెచ్చానని అనడం సరికాదన్నారు. బీఆర్ఎస్ కార్పొరేటర్లు మాధవి, కల్యాణి, బుచ్చిరెడ్డి, ఐలేందర్ యాదవ్, జయశ్రీ, శ్రీనివాస్, రాజశేఖర్, రాములు, సాగర్, నాంపల్లి శ్రీనివాస్, పద్మ, శ్రీదేవి, నర్మద, వినోద, స్వప్న, మాలతి, నాయకులు కొంపెల్లి శ్రీనివాస్, అనిల్, హమీద్ తదితరులు పాల్గొన్నారు.

దొంగలున్నారు.. జాగ్రత్త

- తాళం వేసిన ఇళ్లే టార్గెట్
- నగదు, ఆభరణాలు, వాహనాలు, కార్యాలయాల రికార్డులు మాయం
- సంక్రాంతి వేళ జర భద్రం
- నగరంలో గల్లీగల్లీ గస్తీ తిరుగుతున్న బ్లూకోల్ట్స్ పోలీసులు



గాంధీరోడ్డులో చోరీ జరిగిన ఇంట్లో వస్తువులు (ఫైల్)

కరీంనగర్ క్రైం: నగరంలో వివిధ ప్రాంతాల్లో చోరీలతో దొంగలు భయానక వాతావరణం సృష్టిస్తున్నారు. నగదు, ఆభరణాలు, వాహనాలు, కొత్తగా వివిధ కార్యాలయాల్లో రికార్డులను సైతం ఎత్తుకెళ్తున్నారు. కరీంనగర్‌లోని గాంధీరోడ్డు ప్రాంతంలో ఇటీవల ఓ ఇంటి తాళం పగులగొట్టి, రూ.7 వేలు, రూ.8 వేల విలువైన బంగారాన్ని చోరీ చేశారు. పోలీసులు క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌తో కలిసి, ఆధారాలు సేకరించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు. లక్ష్మీనగర్‌లో పార్కింగ్ చేసిన కారు ను దుండగులు చోరీ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా విచారణ జరుపుతున్నారు. కొన్ని రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తి అర్ధరాత్రి కరీంనగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో చొరబడి, రికార్డు గదిలోని పలు రికార్డులు ఎత్తుకెళ్లినట్లు సీసీ ఫుటేజీ ద్వారా తెలిసింది. రిజిస్ట్రేషన్ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేస్తున్నారు. సీసీ ఫుటేజీలో నిందితుడి ముఖం సరిగా కనిపించకపోవడంతో పట్టుకోవడం అలస్యమవుతున్నట్లు తెలిసింది.

పండుగల సందర్భాల్లోనే అనేకం..

గతంలో వివిధ పండుగల సందర్భాల్లో తాళం వేసిన ఇళ్లలోనే దొంగతనాలు జరిగిన ఘటనలు అనేకం ఉన్నాయి. ప్రస్తుతం సంక్రాంతి పండుగ నేపథ్యంలో శుక్రవారం నుంచి 6 రోజులు విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. దీంతో నగరంలో ఉండే ప్రజలు సొంత, అద్దె ఇళ్లకు తాళాలు వేసి, పిల్లలను తీసుకొని, సొంత గ్రామాలకు వెళ్తున్నారు. బ్లూకోల్ట్స్ పోలీసులు నగరంలోని గల్లీగల్లీలో రేయింబవళ్లు గస్తీ తిరుగుతున్నారు.

పోలీసుల సూచనలు..

- పండుగకు ఊరెళ్తే ఇంట్లోని నగదు, విలువైన వస్తువులు, ఆభరణాలు వెంట తీసుకెళ్లాలి.
- ఇరుగుపొరుగు వారికి చెప్పి, వెళ్లాలి.
- గ్రామాలకు వెళ్లేవారు ఇంట్లో ఏదో ఒక గదిలో లైటు వేసి ఉంచాలి.
- బీరువా తాళాలను ఇంట్లో ఉంచరాదు.
- ఆరుబయట వాహనాలకు హ్యాండిల్ లాక్‌తోపాటు వీల్ లాక్ వేయాలి.
- వాచ్‌మెన్, లేదా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం మంచిది.
- వీలైతే హోం అలారం సిస్టం ఏర్పాటు చేసుకోవాలి.
- బైక్‌లు, కార్లను ఇంటి ఆవరణలో పార్కింగ్ చేయాలి.
- ఎవరైనా అనుమానంగా కనిపిస్తే 100కు కాల్ చేయాలి. లేదంటే ఠాణాలో సమాచారం ఇవ్వాలి.

పలువురు సీఐల బదిలీ

కరీంనగర్ క్రైం: మల్టీజోన్-1లో పలువురు సీఐలు బదిలీ అయ్యారు. కె.సృజన్‌రెడ్డిని కరీంనగర్ సీఎస్‌బీ-2 నుంచి సీఎస్‌బీ-1 సీఐగా, బి.స్వామిని కాగజ్‌నగర్ టౌన్ నుంచి జగిత్యాల సీఐగా, సీహెచ్.నటేశ్ జగిత్యాల నుంచి ఐజీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని, కె.నాగేశ్వర్‌రావు జగిత్యాల ఎస్‌బీ నుంచి మల్యాల సీఐగా, బి.కోటేశ్వర్ మల్యాల నుంచి సీఎస్‌బీ-2 సీఐగా, జి.వెంకటేశ్వర్లు సీసీఎస్ జగిత్యాల నుంచి జగిత్యాల ఎస్‌బీకి, జి.సతీశ్ మంథని నుంచి ధర్మపురికి, రమణమూర్తి ధర్మపురి నుంచి ఐజీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని, బి.రఘుపతి డీసీఆర్‌బీ సిరిసిల్ల నుంచి సిరిసిల్ల టౌన్ సీఐగా, బి.ఉపేందర్ సిరిసిల్ల టౌన్ నుంచి ఐజీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని, డి.రాజిరెడ్డి డీసీఆర్‌బీ జగిత్యాల నుంచి భైంసా టౌన్ సీఐగా బదిలీ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

గ్రూప్స్ ఉచిత శిక్షణ

కరీంనగర్: కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్-1, 2, 3, 4 ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ రవికుమార్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని డిగ్రీ ఉత్తీర్ణులు కులం, ఆదాయం, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఈ నెల 20లోగా bcstudycircle.cgg. gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.5 లక్షలలోపు ఉండాలన్నారు. వివరాలకు ఫోన్ నంబర్ 0878-2268686, బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

పవర్ కట్ ప్రాంతాలు

కొత్తపల్లి(కరీంనగర్): శనివారం కరీంగనర్‌లోని అంబేద్కర్‌నగర్, వావిలాలపల్లి, బ్యాంక్ కాలనీ, టవర్ సర్కిల్, వాటర్‌వర్క్స్, భగత్‌నగర్, ముకరంపుర, విఘ్నేశ్వరకాలనీ, ఎస్‌జీవోస్ కాలనీ, ఎర్రగుట్టపల్లి, కట్టరాంపూర్, అంబేద్కర్ స్టేడియం, కలెక్టర్ కాంప్లెక్స్, బస్టాండ్, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్, ఎస్ఐసీ ఆఫీస్, తిరుమల్‌నగర్, గణేశ్‌నగర్, హనుమాన్‌నగర్, దోబీవాడ, కమాన్, ఉజ్వల పార్కు, భగత్‌నగర్, పద్మనగర్, రాంనగర్, మంకమ్మతోట, సంతోష్‌నగర్, వినాయకనగర్, కుర్మవాడ, శ్రీహరినగర్, పీటీసీ, మార్కెండేయనగర్, ప్రగతినగర్, శివనగర్, రాజీవ్ పార్క్, పాత లేబర్ అడ్డ, ఆదిత్య అపార్ట్‌మెంట్, సిద్ధార్థ స్కూల్, వాసర హాస్పిటల్, పారమిత స్కూల్, శివనగర్, సప్తగిరికాలనీ, బతుకమ్మ కాలనీ, హస్నాపూర్‌కాలనీ, టెలిఫోన్ క్వార్టర్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-1, 2 ఏడీఈలు నరేందర్, సుధీర్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ట్రినిటి విద్యార్థి



రోహిత్‌ను అభినందిస్తున్న చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి

కరీంనగర్: సిద్దిపేట జిల్లా కొండపాక సోషల్ వెల్ఫేర్ (బాలికల) స్కూల్‌లో ఈనెల 13,14వ తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ట్రినిటి కళాశాల విద్యార్థి ఎ.రోహిత్ ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు నారాయణ తెలిపారు. శుక్రవారం కళాశాలలో జరిగిన సమావేశంలో రోహిత్‌ను ట్రినిటి కళాశాలల వ్యవస్థాపకుడు దాసరి మనోహర్‌రెడ్డి, చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కె.సంపత్, అధ్యాపకులు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

క్యాంపస్ డ్రైవ్‌లో 'శ్రీచైతన్య' విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

తిమ్మాపూర్(మానకొండూర్): మండలంలోని మహాత్మానగర్‌లో గల శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాల ఎంబీఏ- 2024 బ్యాచ్‌కు చెందిన నలుగురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. హెచ్‌డీఎఫ్‌సీ ఇన్సూరెన్స్ కంపెనీ ఇటీవల నిర్వహించిన ఆన్‌లైన్ క్యాంపస్ డ్రైవ్‌లో ఎగ్జిక్యూటివ్ ట్రైనీ ఉద్యోగాలకు ఎంపికయ్యారని విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు వార్షిక వేతనం రూ.4.75 లక్షలు ఉంటుందని కంపెనీ ప్రతినిధి పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఎంపికైన విద్యార్థులు కంపెనీలో ఉద్యోగ నియామకాలకు కట్టుబడి ఉండాలన్నారు. ఈసందర్భంగా విద్యార్థులను సీడీసీ ఇన్‌చార్జి టి.వినయ్ తదితరులు అభినందించారు.

18 నుంచి డీసెట్ రెండో విడత వెబ్ ఆప్షన్స్‌కు అవకాశం

తిమ్మాపూర్(మానకొండూర్): డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్‌లో ఉత్తీర్ణులై ఇప్పటికే సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసుకున్న విద్యార్థులకు ఈనెల 18 నుంచి 22 వరకు రెండో విడత వెబ్ ఆప్షన్ ఎంపికకు అవకాశం కల్పిస్తున్నట్లు డైట్ ప్రిన్సిపాల్ మొండయ్య తెలిపారు. మొదటి విడతలో సీటు పొంది స్లైడ్ కావాలనుకునే వారు కూడా ఆప్షన్ పెట్టుకోవచ్చని పేర్కొన్నారు. ఇక ఇప్పటికే సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసుకున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా విద్యార్థులు ఈనెల 17న ఎల్‌ఎండీ కాలనీలోని డైట్ కళాశాలకు రావాలని సూచించారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఇల్లందకుంట(హుజూరాబాద్): మండల కేంద్రంలో లింగారెడ్డి అనే వ్యక్తి ఎడ్లబండిలో 17 క్వింటాళ్ల బియ్యాన్ని కొత్తపల్లి నుంచి ఇల్లందకుంట వైపు తీసుకెళ్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సదరు బియ్యాన్ని మండలకేంద్రంలోని సీతారామాంజనేయ రైస్‌మిల్లుకు తరలిస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ అధికారులు గుర్తించారు. మిల్లులో రికార్డులు తనిఖీ చేశారు. దాడుల్లో ఓఎస్డీ ప్రభాకర్, డీఎం రజినీకాంత్, జిల్లా సివిల్ సప్లై అధికారి సురేశ్‌రెడ్డి, ఎస్సై రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

చిరుత కదలికలపై నిఘా

- సత్తక్కపల్లి అటవీప్రాంతంలో మూడు ట్రాప్ కెమెరాలు ఏర్పాటు
- గండి హనుమాన్ ఆలయ సమీపంలో రహదారి దాటుతూ వెళ్లినట్లు అధికారులకు సమాచారం



అటవీప్రాంతంలో ట్రాప్ కెమెరాలు బిగిస్తున్న అధికారులు

మెట్‌పల్లిరూరల్(కోరుట్ల): మెట్‌పల్లి మండలం సత్తక్కపల్లి శివారు ప్రాంతంలో చిరుత కదలికలపై అటవీశాఖ అధికారులు నిఘా పెట్టారు. శుక్రవారం గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో మూడు ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశారు. మరోమారు పలు చోట్ల గాలింపు చేపట్టగా చిరుత సంచరించినట్లు ఎక్కడా పాదముద్రలు కనిపించలేదు. మొన్నటి వరకు తిరిగిన ప్రాంతంలో సైతం పాదముద్రలు కనిపించకపోవడంతో ఈ ప్రాంతంలోనే ఉందా.. లేదా వేరే చోటుకు వెళ్లిందా అని అనుమానిస్తున్నారు. అటవీప్రాంతంలో గస్తీ కాస్తున్న సమయంలోనే జిల్లా సరిహద్దు శివారులోని గండి హనుమాన్ ఆలయ సమీపంలో ఓ దాబా దాటిన తర్వాత జాతీయ రహదారిని దాటుతూ అటవీ ప్రాంతం వైపు చిరుత వెళ్లినట్లు అక్కడున్న వారి ద్వారా అధికారులకు సమాచారం అందినట్లు తెలిసింది. దీంతో కమ్మర్‌పల్లి అటవీ ప్రాంతంలోకి చిరుత వెళ్లినట్లు భావిస్తున్నామని ఓ అధికారి తెలిపారు. కార్యక్రమంలో మెట్‌పల్లి ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని అధికారులు పాల్గొన్నారు.

పతంగి ఎగరేస్తున్నారా.. విద్యుత్ తీగలతో జాగ్రత్త

- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): సంక్రాంతి పండుగ సందర్భంగా పతంగులు ఎగరేసేటప్పుడు విద్యుత్ తీగలతో జాగ్రత్త వహించాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు విద్యుత్ సంస్థ పరిధి 18 జిల్లాల్లోని ప్రజలు పతంగులు ఎగరేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని కోరుతూ శుక్రవారం ప్రకటన విడుదల చేశారు.

- విద్యుత్ తీగలు, సెల్‌ఫోన్ టవర్‌లు ఉన్న చోట గాలిపటాలు ఎగురేయొద్దు.
- విద్యుత్ తీగలు, స్తంభాలు, చెట్లపై పతంగులు పడితే తీసుకునే ప్రయత్నం చేయొద్దు. గాలిపటాల కోసం రోడ్ల వెంట పరుగులు పెట్టవద్దు.
- ఇంటి డాబాలపై విద్యుత్ లైన్లు ఉన్న చోట పతంగులు ఎట్టి పరిస్థితుల్లో ఎగరేయకూడదు. పిల్లలు డాబాల మీదికి వెళ్లకుండా తల్లిదండ్రులు, పెద్దవారు తప్పకుండా చూడాలి.
- ఆరుబయట ఖాళీ ప్రదేశాలు, మైదానాల్లో మాత్రమే పతంగులు ఎగరేయాలి. పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలి.
- పతంగుల కోసం ఒక మిద్దెపై నుంచి మరో మిద్దె పైకి దూకి ప్రమాదాన్ని తెచ్చుకోకూడదు.
- ఏవైనా ప్రమాదాలు జరిగిన వెంటనే సంబంధిత విద్యుత్ అధికారులకు తెలియజేయాలి.
- వినియోగదారులు ఎప్పటికప్పుడు విద్యుత్ పట్ల అప్రమత్తంగా ఉంటూ పండగను ఆనందంగా జరుపుకోవాలని కోరారు.

బోయినపల్లిలో కార్యదర్శుల ఘర్షణ

ఎంపీవో ఎదుటే వాదులాట



తెగిన బంగారు గొలుసు చూపిస్తున్న కార్యదర్శి శేఖర్

బోయినపల్లి(చొప్పదండి): ప్రజాపాలన దరఖాస్తుల గల్లంతు విషయంలో ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు ఎంపీవో ఎదుటే ఘర్షణ పడ్డ సంఘటన శుక్రవారం బోయినపల్లి మండల పరిషత్‌లో చోటుచేసుకుంది. సెలవులో ఉన్న మర్లపేట గ్రామపంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్ బాధ్యతలను నర్సింగాపూర్ పంచాయతీ కార్యదర్శి శేఖర్‌కు అప్పజెప్పారు. మర్లపేటలో వచ్చిన ప్రజాపాలన దరఖాస్తుల వివరాల ఆన్‌లైన్ త్వరగా పూర్తి చేయించాలనే ఉద్దేశంతో గతంలో ఉన్న కార్యదర్శి లక్ష్మణ్‌కు అప్పజెప్పారు. రెండు కౌంటర్ల డాటా ఎంట్రీ పూర్తి చేశానని, మర్లపేట 3వ కౌంటర్‌లో 73 దరఖాస్తులు కనిపించడం లేదని లక్ష్మణ్ ఎంపీవో గంగాతిలక్‌తోపాటు, మర్లపేట ఇన్‌చార్జి కార్యదర్శి శేఖర్‌కు తెలిపాడు. క్యాష్‌బుక్ సైతం కనిపించడం లేదని పేర్కొన్నాడు. తాను మొత్తం దరఖాస్తులు ఇచ్చినట్లు శేఖర్ చెప్పాడు. ఈక్రమంలో శుక్రవారం తహసీల్దార్ ఆఫీస్‌కు వెళ్లిన ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ రవీందర్‌కు ఎంట్రీ చేసిన ఫామ్స్ కట్టల అడుగున మర్లపేట 3వ కౌంటర్‌కు సంబంధించిన 73 దరఖాస్తులు కనిపించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. మధ్యాహ్నం ఎంపీడీఓ కార్యాలయంలో లక్ష్మణ్, శేఖర్ ఇద్దరు కార్యదర్శులతో ఎంపీఓ గంగాతిలక్ మాట్లాడే క్రమంలో ఘర్షణకు దిగారు. ఇంతలో లక్ష్మణ్, శేఖర్ కాలర్ పట్టుకోగా.. అతని మెడలోని బంగారు గొలుసు తెగింది. అక్కడే ఉన్న ప్రజాప్రతినిధులు, అధికారులు ఇద్దరిని సముదాయించి అక్కడి నుంచి పంపించారు. ఈ విషయమై ఎంపీడీవో రాజేందర్‌రెడ్డిని వివరణ కోరగా పంచాయతీ కార్యదర్శుల మధ్య గొడవ జరిగిన విషయం తెలిసిందని, పూర్తి వివరాలు ఎంపీవోతో తెలుసుకుని విచారణ చేపడతామన్నారు. దరఖాస్తులు మొత్తం భద్రంగా ఉన్నాయని ఆన్‌లైన్‌లో డాటా ఎంట్రీ చేశారని తెలిపారు.

ఆర్టీసీ రిటైర్డు ఉద్యోగుల ధర్నా



ధర్నా చేస్తున్న రిటైర్డు ఉద్యోగులు

కరీంనగర్: బకాయిలు, పీఎఫ్, ఇతరత్రా సమస్యలు పరిష్కరించాలని ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయం ఎదుట శుక్రవారం రిటైర్డు ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నేషనల్ పెన్షనర్స్ జిల్లా అధ్యక్షుడు వంగ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, పెన్షనర్లకు రావాల్సిన డీఏ, భార్యాభర్తలకు మెడికల్ సదుపాయం, పీఎఫ్ కటింగ్ డబ్బులు రిటైర్డు ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పీఎఫ్ కమిషనర్ తానయ్యకు వినతిపత్రం సమర్పించారు. రిటైర్డు ఉద్యోగులు గడప కోటేశ్‌కుమార్, తిరుమలరెడ్డి, వెంకట్‌రెడ్డి, సురభి శంకరయ్య, ఎఎం రెడ్డి, లక్ష్మణ్, రాజు, నారాయణ, రాంచంద్రం, పాషా, రాములు, మహేశ్, ఎండీ రహమొద్దీన్, మల్లయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో రామాలయం అర్చకుడి మృతి

- భారీ ఎత్తున తరలివచ్చిన గ్రామస్తులు, మండలవాసులు



వేణుగోపాలచార్యులు (ఫైల్)

తిమ్మాపూర్(మానకొండూర్): మండల కేంద్రంలోని రామాలయం ప్రధాన అర్చకుడు ఆచి వేణుగోపాలచార్యులు(68) ఉరఫ్ పెద్దయ్యగారు గుండెపోటుతో శుక్రవారం మధ్యాహ్నం మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. వేణుగోపాలచార్యులు 50 ఏళ్లగా గ్రామంలో పురోహితుడిగా పనిచేస్తున్నాడు. దాదాపు గ్రామంలోని ప్రతీ కుటుంబంలో వివాహాలతోపాటు శుభకార్యాలు ఇతడి చేతుల మీదుగానే జరిగేవి. అంతేకాకుండా గ్రామంలో శ్రీరామ విద్యాలయం ఏర్పాటు చేసి చాలామంది విద్యార్థులను ప్రయోజకులుగా చేశారు. వారం రోజులుగా గ్రామంలో అయోధ్య అక్షింతలు గడపగడపకూ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కానీ రాములవారి అర్చకుడు మరణించడం అందర్నీ కలచివేసిందని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

మందలింపే కారణమా?

రామాలయం సమీపంలో 4 గుంటల స్థలాన్ని కొనుగోలు చేసేందుకు గ్రామస్తులంతా ఏకం కావాలని స్థానిక సర్పంచ్ నిర్ణయించారు. ఓ వ్యక్తి నుంచి రూ.18 లక్షలకు కొనుగోలు చేసేందుకు ధర నిర్ణయించారు. ఈ క్రమంలో శుక్రవారం 11 గంటలకు ఆలయ సమీపంలో సభ ఏర్పాటు చేసి విధివిధానాలు మాట్లాడుకున్నారు. అనంతరం అర్చకుడు వేణుగోపాలచార్యులు ఆలయంలో సరిగా పూజలు నిర్వహించడం లేదని కొంతమంది ఆరోపించారు. కొద్దిపాటి వాగ్వాదం జరిగినట్లు కూడా ఆరోపణలు వినిపించాయి. దానికి బదులుగా అర్చకుడు నిష్ఠతో పూజలు చేస్తున్నానని, ఏ సమయంలో పడితే ఆ సమయంలో పూజలు చేయకూడదని వారికి సమాధానం ఇచ్చారు. భక్తులు అవసరమైతే తనను సంప్రదించాలని పేర్కొన్నారు. అనంతరం సమావేశం కొనసాగింది. సమావేశం కొనసాగుతుండగానే వేణుగోపాలచార్యులు తనకు అస్వస్థతగా ఉందని, మాత్రలు వేసుకోవాలని ఇంటికెళ్లారు. అనంతరం గంటలోపే గుండెపోటుతో మరణించారు. సాయంత్రం అర్చకుడి ఇంటికి గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కొంతమంది అన్న మాటలకు మనోవేదనకు గురై చనిపోయాడనే గుసగుసలు కూడా గ్రామంలో వినిపించాయి. గ్రామ పెద్ద, అందరి శ్రేయోభిలాషి అయిన వేణుగోపాలచార్యులు చనిపోవడం చాలా బాధాకరమని ఎంపీపీ కేతిరెడ్డి వనితాదేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి బలవన్మరణం



కనుకయ్య (ఫైల్)

బోయినపల్లి(చొప్పదండి): ఆర్థిక ఇబ్బందులతో మండలంలోని నీలోజిపల్లి గ్రామానికి చెందిన గుండ్ల కనుకయ్య (47) శుక్రవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై మహేందర్ వివరాల ప్రకారం.. కనుకయ్య అప్పు చేసి నీలోజిపల్లి ఆర్‌అండ్‌ఆర్‌కాలనీలో ఇల్లు నిర్మించుకున్నాడు. భార్యకు చెప్పకుండా అప్పు చేశాడు. దీంతో ఇంట్లో గొడవలు అయ్యాయి. రెండునెలల కింద ఉపాధి కోసం కరీంనగర్ వెళ్లి ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ భార్యాపిల్లలతో అక్కడే ఉంటున్నారు. ఆర్థిక ఇబ్బందుల బాధతో మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి కనుకయ్య నీలోజిపల్లిలోని ఇంటికి ఒక్కడే వచ్చాడు. అప్పులు ఎలా తీర్చాలనే మనోవేదనతో ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య మంగ, కుమారులు ఆదిత్య, నిఖిల్ ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మనస్తాపంతో యువకుడు..

సిరిసిల్లటౌన్: ఇంటికి పెద్దదిక్కులైన తాత, నానమ్మలు చనిపోయిన మనస్థాపంతో ఓ యువకుడు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు. జిల్లా కేంద్రంలోని సర్దార్‌నగర్‌కు చెందిన సామల వీరేందర్(24) తాత, నానమ్మలు రెండేళ్ల క్రితం చనిపోయారు. అప్పటి నుంచి మనస్థాపంతో ఉంటున్న వీరేందర్ గురువారం రాత్రి ఇంట్లోనే ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని చనిపోయాడు. మృతుడు తల్లి సామల రమ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిరిసిల్ల టౌన్ సీఐ బి.ఉపేందర్ తెలిపారు. మృతుడి తండ్రి కూడా చాలా రోజుల క్రితమే చనిపోయాడు.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

- మున్నూరుకాపు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్ల హరిశంకర్



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న హరిశంకర్

కరీంనగర్‌స్పోర్ట్స్: క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్ల హరిశంకర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ కళాశాల క్రీడా మైదానంలో మున్నూరుకాపు జర్నలిస్ట్ ఫోరం, పటేల్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి పటేల్ క్రికెట్ లీగ్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు మానసిక, శారీరక ఎదుగుదలకు దోహదం చేస్తాయని అన్నారు. క్రీడా స్ఫూర్తితో ఆడి, గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. మున్నూరుకాపు జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కొత్త లక్ష్మణ్ మాట్లాడుతూ, మున్నూరుకాపుల్లో స్నేహభావం పెంపొందించాలని ఉద్దేశంతో క్రికెట్ పోటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు 20 జట్లు పాల్గొన్నాయని, గెలుపొందిన వారికి శనివారం బహుమతులు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రముఖ ఇంజినీర్ కోల అన్నారెడ్డి, గంగాధర జెడ్పీటీసీ పుల్కం నరసయ్య, జర్నలిస్టు ఫోరం జిల్లా అధ్యక్షుడు వేల్పుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సూదుల వెంకటరమణ, కోశాధికారి తోట రమణ, ఉపాధ్యక్షులు సుమ, బండి రఘు, గంగాధర్, కార్యవర్గ సభ్యులు రాచమల్ల సుగుణాకర్, మధు తదితరులు పాల్గొన్నారు.

షాపులపైకి దూసుకెళ్లిన ట్రక్కు

- సింగరేణి రిటైర్డ్ కార్మికుడికి గాయాలు
- పలు వాహనాలు, రెండు దుకాణాలు ధ్వంసం



షాపులపైకి దూసుకెళ్లి ఆగిన ట్రక్కు

గోదావరిఖని(రామగుండం): గోదావరిఖని బస్టాండ్ సమీపంలో రాజీవ్ రహదారిపై అదుపుతప్పిన ట్రక్కు దుకాణాలపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో సింగరేణి రిటైర్డ్ కార్మికుడికి గాయాలు కావడంతోపాటు పలు వాహనాలు ధ్వంసం అయ్యాయి. వన్‌టౌన్ ఎస్‌ఐ సౌజన్య కథనం ప్రకారం.. శుక్రవారం వేకువజామున ఎన్టీపీసీ వైపు నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న ట్రక్కు గోదావరిఖని బస్‌డిపో దాటిన తర్వాత అదుపుతప్పి ఎడమ వైపు వేగంగా దూసుకెళ్లింది. ఆ సమయంలో టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై కూర్చుని టీ తాగుతున్న సింగరేణి రిటైర్డ్ కార్మికుడు చొప్పరి మధునయ్యను ఢీకొట్టడంతో చేయి, కాలు విరిగాయి. అక్కడే ఉన్న మోటార్ సైకిల్, మున్సిపల్ చెత్తవాహనం, టిఫిన్ సెంటర్, మిర్చి బండిపైకి దూసుకెళ్లి ట్రక్కు ఆగిపోయింది. అయితే నిత్యం రద్దీగా ఉండే ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. బాధితుడి కుమారుడు చొప్పరి అజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

బాధ్యుడిపై చర్య తీసుకోవాలి: ఎమ్మెల్యే

ప్రమాదానికి బాధ్యుడైన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. అన్నివిధాలా ఆదుకుంటామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట మేయర్ బంగి అనిల్‌కుమార్, కమిషనర్ ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



ఇటీవల కల్వర్టు పైనుంచి కిందపడిన కృష్ణ

ధర్మపురి: ఓ యువకుడు ఆస్పత్రిలో చికిత్సపొందుతూ గురువారం రాత్రి మృతిచెందినట్లు ఎస్సై దత్తాత్రి తెలిపారు. వివరాలు.. బుగ్గారం మండలం గోపులా పూర్ గ్రామానికి చెందిన కండ్ల కృష్ణ (38) కొద్దిరోజుల నుంచి తన భార్య గంగజల గ్రా మం తుమ్మెనాలలో ఉంటూ ధర్మపురిలోని ఓ గ్యాస్ ఏజెన్సీలో పని చేస్తున్నాడు. ఈనెల 1న నేరెల్ల గ్రామ శివారులో కల్వర్టుపై కూర్చొని ఉండగా మూర్ఛవ్యాధితో కింద ప డటంతో తీవ్ర గాయాలైనాయి. వెంటనే హైదరా బాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కూతుర్లు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వెల్గటూర్‌లో వృద్ధుడు..



లచ్చయ్య(ఫైల్)

వెల్గటూర్(ధర్మపురి): చికిత్స పొందుతూ ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం .. మండల కేంద్రానికి చెందిన గట్ల లచ్చయ్య (62) ఇటీవల అయ్యప్ప మాల ధరించాడు. అల్పాహారం నిమిత్తం వెల్గటూర్‌లోని ఓ భక్తుడి ఇంటికి వెళ్లాడు. అల్పాహారం ముగించుకొని రాత్రి సమయంలో మెట్లు దిగుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే జగిత్యాల ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ నిమ్స్‌లో చేర్పించగా చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి భార్య అనసూర్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్వేత తెలిపారు.

కిట్స్‌లో ముందస్తు సంక్రాంతి



వేడుకల్లో అధ్యాపకులు తదితరులు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు అంబరాన్నంటాయి. ఈసందర్భంగా కళాశాల డైరెక్టర్ కె.శంకర్ మాట్లాడుతూ, అన్ని పండుగలు పర్యావరణం, జీవావరణశాస్త్రం, ఐక్యత గురించి పాఠాలు నేర్పుతాయన్నారు. సుసంపన్నమైన సంప్రదాయాలు, సంస్కృతి, వారసత్వాన్ని రక్షించేందుకు యువతరం ఉత్సవాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. అనంతరం ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఈశ్వరయ్య, స్టూడెంట్స్ యాక్టివిటీ సెంటర్ కోఆర్డినేటర్లు డాక్టర్ ఎ.కొమురయ్య, సీఎస్ఈ విభాగాధిపతి కల్లెం రవీంద్రబాబు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఎస్సైతో దురుసు ప్రవర్తన

- మద్యం మత్తులో బీజేపీ నేత హంగామా



ట్రాఫిక్ ఎస్సైతో వాగ్వాదం చేస్తున్న నాగరాజు

జ్యోతినగర్(రామగుండం): మద్యం మత్తులో ట్రాఫిక్ ఎస్సైపై దురుసుగా ప్రవర్తించిన సప్ప నాగరాజు, మేకల నారాయణలపై ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి. మేడిపల్లి సెంటర్‌లో ట్రాఫిక్ ఎస్సై ఉదయ్‌కిరణ్ తన సిబ్బందితో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ చేపట్టారు. అటుగా వచ్చిన ఇద్దరిని నిలిపి బ్రీత్ అనలైజర్‌తో పరీక్షించేందుకు యత్నించారు. అందుకు నాగరాజు నిరాకరించాడు. అంతేకాదు.. ఎస్సైతోపాటు విధినిర్వహణలోని నిర్వహణలో ట్రాఫిక్ సిబ్బంది, ఓ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధిపై నాగరాజు, మేకల నారాయణ దురుసుగా ప్రవర్తించడంతోపాటు దూషించారు. ఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై జీవన్.. నిందితులను పోలీసుస్టేషన్‌కు తరలించారు. తనపై దురుసుగా ప్రవర్తించడం, దూషించడంతోపాటు విధి నిర్వహణను ఆటంకపరిచాడని ఎస్సై ఉదయ్‌కిరణ్ చేసిన ఫిర్యాదు మేరకు నాగరాజు, నారాయణపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.

నూతన వాహన చట్టం రద్దయ్యేవరకు పోరాటం



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసేందుకు ర్యాలీగా వెళ్తున్న లారీ డ్రైవర్లు

కరీంనగర్: కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన వాహన చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సీఐటీయు ఆధ్వర్యంలో కార్మికులు తెలంగాణ చౌక్ నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకొని ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన చట్టంలోని సెక్షన్ డ్రైవర్ల మీద కక్ష సాధింపు చర్యలకు ఉపక్రమించిందని ఆరోపించారు. జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి మాట్లాడుతూ, కొత్త చట్టం ప్రకారం ప్రమాదాలకు కారణమైన డ్రైవర్లకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.పది లక్షల జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. నూతన వాహన చట్టం రద్దయ్యే వరకు కార్మిక లోకం రాజీలేని పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ జిల్లా అధ్యక్షుడు పున్నం రవి, లారీ డ్రైవర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు ఎస్‌కే ఆరీఫ్ మోహినాయుద్దీన్, ఇసుక టిప్పర్ డ్రైవర్ల యూనియన్ నాయకులు నరేశ్, అభిలాష్, జై ఇండియన్ డ్రైవర్స్ అసోసియేషన్ జిల్లా ఇన్‌చార్జి చందు, రెడ్మేడ్ కాంక్రీట్ వాహన డ్రైవర్స్ రామచంద్రన్, నాయకులు పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో చైన్ అపహరణ



బాధితురాలు రుద్రారపు పోచవ్వ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని జిల్లెల్ల గ్రామంలో చైన్‌స్నాచార్లు రెచ్చిపోయారు. బైక్‌పై వచ్చి వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లారు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు. జిల్లెల్ల గ్రామానికి చెందిన రుద్రారపు పోచవ్వ(65) రేషన్ షాపునకు వెళ్తుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు పోచవ్వ మెడలోంచి మూడు తులాల బంగారు గొలుసును లాక్కెళ్లారు. ఈ ఘటనలో పోచవ్వ మెడకు స్వల్పంగా గాయమైంది. గ్రామంలోని సీసీ కెమెరాలలో బైక్‌పై వెళ్తున్న చైన్‌స్నాచర్ల దృశ్యాలు రికార్డయ్యాయి. బైక్‌పై ఒక పురుషుడు, ఒక మహిళ ఉన్నారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.



బైక్‌పై వచ్చి చైన్ దొంగలించిన కేటుగాళ్లు (సీసీ ఫుటేజీ)

కానిస్టేబుళ్లకు గాయాలు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్ రాజీవ్ రహదారిపై శుక్రవారం సాయంత్రం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. మంచిర్యాల జిల్లాకు చెందిన కానిస్టేబుళ్లు మహేందర్‌కు కుడి చేతి మణికట్టుకు, కల్యాణ్‌కు కుడి చేతికి, ఎల్కలపల్లి గ్రామానికి చెందిన సాయిరాంకు ఎడమ కాలుకు గాయాలయ్యాయి. వారిని 108 వాహనం ద్వారా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

ఆర్టీసీ డ్రైవర్ ఇంట్లో చోరీ



బాధితుడి ఇల్లు

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్‌లో దొంగలు హల్‌చల్ సృష్టించారు. గడిచిన ఆరు నెలల్లో ఒకే వీధిలో మూడు దొంగతనాలకు పాల్పడి పోలీసులకు సవాల్ విసిరారు. బాధితుడి వివరాల ప్రకారం.. ముస్తాబాద్‌కు చెందిన ఆర్టీసీ డ్రైవర్ బిట్ల వెంకటేశ్ కుటుంబీకులు గురువారం పక్క ఊరు మద్దికుంటలో బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లారు. ఇదే అదనుగా భావించిన దొంగలు అర్ధరాత్రి వెంకటేశ్ ఇంటి తలుపులను పగలగొట్టి లోనికి ప్రవేశించారు. బీరువాలో ఉన్న రూ.60వేల నగదు, 8 తులాల బంగారు, 20 తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు వెంకటేశ్ ఆవేదన వ్యక్తం చేశాడు. క్లూస్‌టీం అధికారులు ఆధారాలు సేకరించగా, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోర్న్ వీడియోలు పంపిస్తున్న వ్యక్తి రిమాండ్

కోనరావుపేట(వేములవాడ): పోర్న్ వీడియోలు పంపిస్తున్న వ్యక్తిని పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ కిరణ్‌కుమార్ తెలిపారు. కోనరావుపేటలోని ఠాణాలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మండలంలోని రామన్నపేటకు చెందిన మహ్మద్ రజాక్ ఏడాది క్రితం చిన్నపిల్లల పోర్న్ వీడియోలు డౌన్‌లోడ్ చేసి, ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చేశాడు. అతనిపై హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కోనరావుపేట శివారులో శుక్రవారం అరెస్ట్ చేశారు. పోక్సో కేసు నమోదు చేశారు. ఏఎస్సై రఘుపతిరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

విద్యానగర్(కరీంనగర్): జనవిజ్ఞాన వేదిక, సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం కలెక్టర్ పమేలా సత్పతి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి శంకర్, రాష్ట్ర కార్యదర్శి రామరాజుతోపాటు దేవేందర్, స్వామి, సంపతి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి ప్రాధాన్యం ఇవ్వాలి


మాట్లాడుతున్న పెద్దింటి రామకృష్ణ

కరీంనగర్: నూతన ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యం ఇవ్వాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ అన్నారు. శుక్రవారం నగరంలోని సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. విద్యారంగానికి అధిక నిధులు కేటాయిస్తూ విద్యార్థులందరికీ ఉచిత బస్‌పాస్ సౌకర్యం కల్పించాలని కోరారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్, మెస్‌చార్జీలు సకాలంలో ఇవ్వకపోతే పోరాటం తప్పదన్నారు. విద్యారంగంలోని ఖాళీలను భర్తీ చేసి ఉచిత నాణ్యమైన విద్య అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్, కార్యదర్శి బత్తుల రాజు, తిరుపతి, భోగం అర్జున్, రాజు, మనివర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

21న పారమితలో 'విజ్ కిడ్ టాలెంట్ అవార్డు' టెస్ట్

కొత్తపల్లి: పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో 5వ తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఈనెల 21వ తేదీన విజ్ కిడ్ టాలెంట్ అవార్డు టెస్ట్ నిర్వహిస్తున్నట్లు పారమిత విద్యాసంస్థల చైర్మన్ ఇ.ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల్లో సమగ్ర అభివృద్ధిని, నేర్చుకోవాలనే ఆసక్తిని, ఆరోగ్యకరమైన పోటీ స్ఫూర్తిని పెంపొందించడానికి దోహదపడుతుందన్నారు. అదే విధంగా విద్యార్థుల్లో గణితం, సైన్స్ ప్రతిభను వెలికితీసే సదుద్దేశంతో ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన మొదటి ఇద్దరు విద్యార్థులకు రూ.2.40 లక్షల పారితోషికం అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరింత సమాచారం కోసం 8106292424 నంబర్‌కు కాల్ చేయాలని పేర్కొన్నారు.

ప్రియాంకగాంధీ జన్మదిన వేడుకలు



కరీంనగర్ కార్పొరేషన్: ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ జన్మదినం సందర్భంగా శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నగర కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఖమ్రొద్దీన్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, జీడీ రమేశ్, తమ్మడి ఎజ్రా, మ్యాకల నర్సయ్య, పెద్దిగారి తిరుపతి, జ్యోతిరెడ్డి, బషీర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మేయర్ సునీల్‌రావు


వివేకానంద జయంతి ఉత్సవాల్లో మున్సిపల్ చైర్మన్ రాజు, కౌన్సిలర్లు


కరీంనగర్ ఎంపీడీవో కార్యాలయంలో..


ఎస్సారార్ కళాశాలలో..

స్వామి వివేకానందకు నివాళి


నివాళి అర్పిస్తున్న విద్యార్థులు


బుట్టి రాజారామ్ కాలనీలో..


కమాన్‌పూర్‌లో..


దుప్పట్లు పంపిణీ చేస్తున్న బ్లడ్ డోనర్స్ ట్రస్టు సభ్యులు

కరీంనగర్/కరీంనగర్‌స్పోర్ట్స్/కరీంనగర్‌సిటీ/కరీంనగర్‌రూరల్/కొత్తపల్లి: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవాన్ని పలు సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వివేకనందుడి విగ్రహం, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. యువతకు వివేకానందుడు స్ఫూర్తి ప్రదాత అని, ఆదర్శంగా తీసుకొని సన్మార్గంలో పయనించాలని సూచించారు.

- జ్యోతినగర్‌లోని శివ థియేటర్ చౌరస్తాలో గల వివేకానంద విగ్రహానికి తెలంగాణ యువజన సమితి జిల్లా శాఖ ఆధ్వర్యంలో మేయర్ సునీల్ రావు పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లాలో విశిష్ట సేవలు అందించిన యువతకు యువసేవా పురస్కార్–2024 అవార్డులు అందజేశారు. తెలంగాణ యువజన సమితి జిల్లా అధ్యక్షుడు సత్తినేని శ్రీనివాస్, జిల్లా కన్వీనర్ వొద్నాల రాజు, కోకన్వీనర్ నాగరాజు, యువజన విభాగం ప్రతినిధులు అభిషేక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.
- ఎస్సారార్ ప్రభుత్వ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కళాశాల సెమినార్ హాల్‌లో ప్రిన్సిపాల్ కె.రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ టి.రాజయ్య, టీజీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.
- ఏబీవీపీ నగర శాఖ శాఖ ఆధ్వర్యంలో జ్యోతినగర్‌లో గల వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శాతవాహన యూనివర్సిటీ గ్రౌండ్‌లో క్రీడలు ప్రారంభించారు. పూర్వ ఏబీవీపీ క్షేత్ర సంఘటన మంత్రి రామ్మోహన్, ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు రామకృష్ణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మాల్యాల రాకేశ్, శాతవాహన యూనివర్సిటీ రిజిస్టర్ వరప్రసాద్ పాల్గొన్నారు.
- సామాజిక సమరసత వేదిక కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు, అటెండర్లకు అల్పాహారం అందించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తుమ్మల రమేశ్ రెడ్డి, పుల్లూరి రామారావు, రాజేందర్ రెడ్డి, మధుసూదన్ రావు, నర్సింగం, తదితరులు పాల్గొన్నారు.
- 22వ డివిజన్ బుట్టి రాజారామ్ కాలనీలో వివేకానంద చిత్రపటానికి కటకం లోకేష్ పూలమాలలు వేసి నివాళి అర్పించి మాట్లాడారు. రామటంకి అవినాష్, జక్కుల నిఖిల్, సింహాచలం ప్రణయ్ కుమార్, కాంపెల్లి సందీప్, గడ్డం సందీప్ పాల్గొన్నారు.
- సరస్వతీనగర్‌లోని కపిల్ బాలకుటీర్‌లో హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వివేకానంద జీవిత విషయాలను తెలియజేసే పుస్తకాలను పంపిణీ చేశారు. సంస్థ వ్యవస్థాపకుడు సాగర్, శ్రీనివాస్, బాలకుటీర్ ఇన్‌చార్జి వకుల దేవి పాల్గొన్నారు.
- కొత్తపల్లిలోని వివేకానంద విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ రాజు సహా కౌన్సిలర్లు, యువజన సంఘాల సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కౌన్సిలర్లు వాసాల రమేశ్, సత్యనారాయణరెడ్డి, సంఘం అధ్యక్షుడు హరీశ్, నాయకులు చంద్రశేఖర్, స్వర్గం నర్సయ్య, కొప్పుల హరిప్రసాద్, శివకుమార్, బైరి శశిన్, సత్యం తదితరులు పాల్గొన్నారు.
- కరీంనగర్ మండల పరిషత్ కార్యాలయంలో వివేకానందుడి చిత్రపటానికి ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్యతోపాటు పలువురు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వైస్ ఎంపీపీ వేల్పుల నారాయణ, ఎంపీడీవో ఎస్.దివ్యదర్శన్‌రావు, సూపరింటెండెంట్ సంపత్‌కుమార్, పీఆర్ ఏఈ రమణారెడ్డి, మాజీ సర్పంచ్ రుద్ర రాము కార్యదర్శులు పాల్గొన్నారు.
- నగరంలో పుట్‌పాత్‌లపై నిద్రించే వారికి కరీంనగర్ బ్లడ్ డోనర్స్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. బ్లడ్ డోనర్స్ సభ్యులు మౌనిక జ్యోతి, నేహా, ది ఫుడ్ ది హంగ్రీ స్వమక్ యువత పాల్గొన్నారు.
- నగరంలోని గాంధీరోడ్‌లో గల వృద్ధుల, వికలాంగుల హాస్టల్‌లో సదా మీ సేవలో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు బెజగం మధు, ప్రధాన కార్యదర్శి చిందం, వెంకటేష్, కోశాధికారి సంతోష్, కార్యవర్గ సభ్యులు, నవీన్, దైద తిరుపతి, సతీశ్‌కుమార్ పాల్గొన్నారు.


పురస్కారాలు అందుకున్న అనూప్‌కుమార్, స్వప్న


సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో..


పండ్లు పంపిణీ చేస్తున్న సదా మీసేవ సంస్థ సభ్యులు

కొత్త రైతులకు పెట్టుబడి సాయం

- కరీంనగర్ మండలంలో 349 మందికి అవకాశం
- ముగిసిన దరఖాస్తుల స్వీకరణ
- రైతుబంధు మంజూరుపై హర్షం

కరీంనగర్‌రూరల్: యాసంగి సీజన్ రైతుబంధు పెట్టుబడి సాయం పొందడానికి ప్రభుత్వం కొత్త రైతులకు అవకాశం కల్పించింది. కొత్తగా వ్యవసాయ భూములను కొనుగోలు చేసి పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులు దరఖాస్తు చేసుకునేందుకు ఇచ్చిన గడువు శుక్రవారంతో ముగిసింది. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో మాదిరిగానే ఎకరానికి రూ.5 వేల చొప్పున కరీంనగర్ మండలంలోని 12,387 మంది రైతులకు రూ.8,94,585,74 మంజూరు చేసింది. గతనెల 12 నుంచి ఎకరాం లోపున్న రైతుల నుంచి ప్రారంభించి విడతల వారీగా రైతులందరికీ బ్యాంకుఖాతాల్లో పెట్టుబడి సాయం జమ చేస్తోంది. అయితే 497 మంది రైతుల బ్యాంకు ఖాతా వివరాలు అందుబాటులో లేకపోవడంతో రైతుబంధు సాయం మంజూరు కావడంలేదని అధికారులు తెలిపారు.


ఎలబోతారంలో దరఖాస్తు తీసుకుంటున్న ఏఈవో

349 మంది కొత్త రైతులకు అవకాశం

కరీంనగర్ మండలంలో కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులు 349 మంది ఉన్నారు. అత్యధికంగా దుర్శేడ్‌లో 53, నగునూరు 52, చామనపల్లి 42, బొమ్మకల్ 33, మొగ్దుంపూర్‌లో 30 మంది కొత్త రైతులున్నారు. రైతుబంధు సాయం పొందడానికి కొత్త రైతులందరూ దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం గతనెల 14 నుంచి ఈనెల 12వరకు గడువు ఇచ్చింది.

దరఖాస్తులు ఆన్‌లైన్

కొత్త రైతుల పట్టాదారు, బ్యాంకు ఖాతా పాసుపుస్తకం, ఆధార్‌కార్డు వివరాలను ఏఈవోలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఏఈవోల వద్ద మొత్తం 258 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. పాత రైతులు 165, కొత్త రైతులు 87 దరఖాస్తులున్నాయి.

– బి.సత్యం, కరీంనగర్ మండల వ్యవసాయాధికారి


భగతనగర్ వేంకటేశ్వరాలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

వైభవం.. కూడారై ఉత్సవం

ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం పలు ఆలయాల్లో శ్రీవైష్ణవ సాంప్రదాయాల ప్రకారం కూడారై ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాయసాన్ని నివేదన చేసి పాశురాన్ని చదివారు. పాయస పాత్రలను వితరణ చేశారు. మంకమ్మతోట వేంకటేశ్వరాలయం, జెడ్పీ క్వార్టర్స్‌లోని వేంకటేశ్వరాలయం, విద్యానగర్ వేంటేశ్వరస్వామి ఆలయం, దుర్శేడ్‌లోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో కూడారై ఉత్సవం జరిపారు. సప్తగిరికాలని కోదండ రామాలయంలో ఆలయ చైర్మన్ కె.గౌతంరావు పాల్గొనగా.. దుర్శేడ్ శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో మాజీ ఉప సర్పంచ్ కోరుకంటి వేణుమాధవరావు, నందాల తిరుపతి, బుర్ర శ్రీనివాస్, తోట తిరుపతి, అశోక్, రాంచంద్రం, గౌద నర్సయ్య, కుమార్, రాజ్‌కమల్, హరీశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. – కరీంనగర్‌కల్చరల్/కరీంనగర్‌రూరల్


దుర్శేడ్‌లోని వేణుగోపాలస్వామి ఆలయంలో..

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు


బహుమతులు అందజేస్తున్న డీఎంహెచ్‌వో


ప్యారడైజ్ హైస్కూల్‌లో..


డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో..

కరీంనగర్/కరీంనగర్‌స్పోర్ట్స్/కొత్తపల్లి: కరీంనగర్: హనుమాన్‌నగర్‌లోని బతుకమ్మ గద్దె వద్ద 10వ డివిజన్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. విజేతలకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితాదేవి, న్యాయవాది రేణుకలు బహుమతులు అందజేశారు. డివిజన్ కమిటీ అధ్యక్షుడు సుభాష్, ప్రధాన కార్యదర్శి శివ, పాపయ్య, ప్రభాకర్, రాజేశ్, తిరుపతి, రవి, చంద్రమౌళి, తిరుమలయ్య, రేణుక, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

ప్యారడైజ్ హైస్కూల్‌లో..

కొత్తపల్లి: రేకుర్తిలోని ప్యారడైజ్ హైస్కూల్‌లో శుక్రవారం తల్లీ కూతుళ్ల ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలను పాఠశాల చైర్మన్ డా.పి.ఫాతిమా రెడ్డి ప్రారంభించి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతికి చాలా ప్రాముఖ్యత ఉందని, ఇంటి ఎదుట ముగ్గులు వేసి లక్ష్మీదేవిని ఆహ్వానించడం అనాదిగా వస్తోందన్నారు. ప్రిన్సిపాల్స్ వసంత, ఎ.మధు, ఇన్‌చార్జి కె.శ్రీనివాస్‌రెడ్డి, సంధ్య, ఉపాధ్యాయులు, మహిళలు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ వన్‌టౌన్ పరిధిలో శుక్రవారం ఒక గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం వన్‌టౌన్ సమీపంలోని మెడికల్ షాపు వద్ద గుర్తు తెలియని వ్యక్తి కిందపడిపోయి ఉన్నాడు. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి వయస్సు 50 ఏళ్లు ఉంటుందని, మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు తెలిసిన వారు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

గంజాయి పట్టివేత

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం జరిపిన దాడుల్లో గంజాయి కలిగి ఉన్న ముగ్గురు నిందితులను పట్టుకున్నారు. ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ నాగేశ్వర్‌రావు వివరాల ప్రకారం.. కరీంనగర్ రూరల్ ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో వినయ్, యాదగిరి, ఉపేందర్ అనే వ్యక్తులు 1,726 గ్రాముల ఎండు గంజాయి కలిగి ఉండడంతో వారిని పట్టుకొని ఎక్సైజ్ రూరల్ స్టేషన్‌లో అప్పగించారు. దీంతో అర్బన్ స్టేషన్ పరిధిలో గంజాయి అలవాటు పడిన వినియోగదారులను బైండోవర్ చేయడానికి వారిని అప్పగించారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది మోసిన్, కుమార్, ఖాసింబి, కమలాకర్, కమలుద్దీన్, సంతోష్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

గంగాధర: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేశామని ఎస్సై వుల్ల అభిలాశ్ తెలిపారు. రామడుగు నుంచి గంగాధర మండలం గట్టుభూత్కూర్‌కు ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నామని డ్రైవర్లపై కేసు నమోదు చేశామన్నారు.

వ్యవసాయ బకాయిలు @ 72 లక్షలు

- బిల్లుల వసూలుకు ప్రత్యేక చర్యలు

కరీంనగర్‌రూరల్: వ్యవసాయ విద్యుత్ బిల్లుల బకాయిలు పేరుకుపోతున్నాయి. వ్యవసాయ విద్యుత్ మోటారు కనెక్షన్‌కు అధికారులు నెలకు రూ.30చొప్పున ఏడాదికి రూ. 360 బిల్లు వసూలు చేస్తున్నారు. కస్టమర్ చార్జీల బకాయిలను రైతులు ప్రతి ఏడాది డిసెంబరులో చెల్లిస్తారు. కరీంనగర్ రూరల్ డివిజన్‌లో మొత్తం వ్యవసాయ కనెక్షన్లు 8,586 ఉన్నాయి. విద్యుత్ బిల్లుల బకాయిలు రూ.84 లక్షలుండగా బిల్లుల వసూళ్లకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. డిసెంబరు నెలాఖరు వరకు అధికారులు రూ.11.42లక్షల బిల్లు వసూలు చేశారు. ఇంకా రూ.72.58లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నెలాఖరువరకు వసూలు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. గ్రామాలవారీగా సిబ్బందికి టార్గెట్ నిర్ణయించి వసూలు చేస్తున్నారు. బకాయిలున్న రైతులను కలిసి బిల్లు చెల్లించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. వ్యవసాయ బిల్లు చెల్లించకుంటే ఇంటి విద్యుత్ కనెక్షన్ తొలగిస్తామని హెచ్చరిస్తున్నారు. రైతులు సకాలంలో విద్యుత్ బకాయిలు చెల్లిస్తే మెరుగైన సేవలందిస్తామని ఏడీఈ కె.రాజు తెలిపారు.



ఇంటింటికీ రాములోరి అక్షింతలు

గంగాధర: మండలంలోని కొండన్నపల్లి గ్రామంలో అయోధ్య రాములోరి అక్షింతలను శుక్రవారం ఇంటింటికీ పంపిణీ చేశారు. ముందుగా స్థానిక దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఊరేగింపుతో ఇంటింటికి వెళ్లి అక్షింతలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రేండ్ల జమున, రేండ్ల శ్రీనివాస్ గ్రామస్తులు పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని కోరటపల్లి గ్రామంలో రామ భక్తులు రాములోరి అక్షింతల ఊరేగింపు, పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మేకల ప్రభాకర్‌యాదవ్, ఎడవెల్లి లక్ష్మీకాంతరెడ్డి, జూపాక మునీందర్, పలువురు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని గొల్లపల్లిలో శ్రీరామక్షేత్రతీర్థ ట్రస్ట్ బాధ్యులు అక్షింతలు పంపిణీ చేశారు. మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు.

సాగునీరు అందించాలి

వీణవంక: కల్వల ప్రాజెక్టు ద్వారా చివరి ఆయకట్టుకు సాగునీరు అందించాలని వీణవంక సర్పంచ్ నీల కుమారస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం గ్రామంలోని రైతులతో కలిసి ప్రాజెక్టును సందర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో నెల రోజుల్లోనే రైతులు రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి వచ్చిందని, సాగునీరు లేక ఒక్కో రైతు వాగులో బావులు తవ్వడం జరుగుతోందని ఆరోపించారు. మండలంలో వేల ఎకరాలకు సాగునీరందించే కల్వల ప్రాజెక్టు కూలిపోయి ఇన్ని రోజులు గడిచినా కాంగ్రెస్ నాయకులు ఒక్కసారి సందర్శించలేదన్నారు. గత ప్రభుత్వం మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేసినప్పటికీ పనులు ప్రారంభించకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి సాగునీరు అందించాలని, లేదంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.


భగవతి పాఠశాలలో..


ఎస్ఆర్ఎం కళాశాలలో విద్యార్థినులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్

ముందస్తు సంక్రాంతి వేడుకలు


విద్యాసంస్కార్ మాంటిస్సోరీ పాఠశాలలో..

కరీంనగర్‌సప్తగిరికాలనీ: కరీంనగర్‌లోని పలు విద్యాసంస్థల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణాన్ని అందంగా పతంగులతో ముస్తాబు చేశారు. పలువురు విద్యార్థులు వివిధ రంగుల సంప్రదాయ దుస్తులతో హాజరయ్యారు. సంక్రాంతి పండుగ చాలా విశిష్టమైనదని, ప్రత్యేకంగా రైతుల శ్రేయస్సును సూచిస్తుందని ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థులకు పండుగ విశిష్టతను వివరించారు. విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ముగ్గుల పోటీలు సైతం నిర్వహించారు. భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. వేడుకల్లో విద్యాసంస్థల అధినేతలు, కరస్పాండెంట్లు, డైరెక్టర్లు, ప్రిన్సిపాల్స్, వైస్ ప్రిన్సిపల్‌లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎం కళాశాలలో..

కొత్తపల్లి:కొత్తపల్లి మండలం చింతకుంట శివారులోని ఎస్ఆర్ఎం ఎంబీఏ, ఎంసీఏ కళాశాలలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో విద్యార్థినులు ఆకర్షణీయమైన ముగ్గులు వేసి ఆకట్టుకున్నారు. ప్రశంసాపత్రాలు అందజేశారు. కళాశాల చైర్మన్ ఎం.తిరుపతిరెడ్డి, ప్రిన్సిపాల్ సి.వెంకటేశ్వర్‌రావు, ఎంబీఏ ఇన్‌చార్జి ఎండి ఖ్వాజా మొయినొద్దీన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యావాలీ పాఠశాలలో..


సాధన స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో..

'బీసీ సంక్షేమ శాఖను ప్రక్షాళన చేయాలి'

కరీంనగర్: బీసీ సంక్షేమ శాఖను ప్రక్షాళన చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేశిపెద్ది శ్రీధర్‌రాజు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెద్దపెల్లి సహాయ సంక్షేమ శాఖ అధికారికి మంచిర్యాల జిల్లా బీసీ సంక్షేమ అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారని, రెండు జిల్లాలకు ఒకరే జిల్లా అధికారిగా వ్యవహరించడం నిబంధనలకు విరుద్ధమన్నారు. ఇలాంటి ఘటనలు ఎన్నో చోటు చేసుకున్నాయని, రాష్ట్రస్థాయి కార్యాలయంలోని అధికారులు ఇష్టారాజ్యంగా డిప్యూటేషన్లు ఇచ్చుకుంటూ బీసీ సంక్షేమ శాఖను అవినీతి మయంగా మార్చారని ఆరోపించారు. బీసీ సంక్షేమ శాఖకు కమిషనర్ లేకపోవడం వల్ల కిందిస్థాయి ఉద్యోగులు ఆడిందే ఆటగా పాడిందే పాటగా తయారైందని విమర్శించారు. బీసీ సంక్షేమ శాఖకు పూర్తిస్థాయి కమిషనర్‌ను నియమించాలని, గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ జరిపించి బీసీ సంక్షేమ శాఖను కాపాడాలని కోరారు.

యావజ్జీవం తప్పదు!



ఏ లెక్కన చూసినా శిక్ష నుంచి చంద్రబాబు తప్పించుకోలేరు

- చుట్టుముట్టిన స్కిల్, ఫైబర్‌నెట్, అసైన్డ్ భూములు, ఐఆర్‌ఆర్, లిక్కర్, ఇసుక స్కాంలు
- అన్ని కుంభకోణాల ప్రధాన కుట్రదారు, లబ్ధిదారు ఆయనే
- సెక్షన్ 409 కింద ఒక్కో కేసులో యావజ్జీవ ఖైదుకు అవకాశం
- అవినీతి నిరోధక చట్టం కింద ఒక్కో కేసులో గరిష్టంగా పదేళ్ల జైలు
- అయినా ముందస్తు బెయిల్‌ను వక్రీకరిస్తున్న ఎల్లో మీడియా

ఆరు కేసుల్లోనూ శిక్ష తప్పదు

చంద్రబాబుపై ఐపీసీ సెక్షన్లు 120(బి), 166, 167, 418, 420, 465, 468, 471, 477(ఎ), 409, 201, 109 రెడ్‌విత్ 34, 37లతోపాటు అవినీతి నిరోధక చట్టం 13(2) రెడ్‌విత్ 13(1), (సి), (డి) కింద అభియోగాలు నమోదు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. వీటిలో అత్యంత కీలకమైనవది సెక్షన్ 409. ఆ సెక్షన్ కింద నేరం నిరూపితమైతే యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తారు. అవినీతి నిరోధక చట్టంలోని 13(2) రెడ్‌విత్ 13(1), (సి), (డి) కింద నేరం నిరూపితమైతే గరిష్టంగా పదేళ్ల వరకు జైలు శిక్ష పడుతుంది. ఒక్కో కేసులో గరిష్టంగా పదేళ్ల జైలు శిక్ష పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇక ఇతర సెక్షన్లు సరేసరి. ఈ ఆరు కేసుల్లో తీర్పులు వేర్వేరుగా వస్తాయి. నేరం నిరూపితమై శిక్షలు పడితే చంద్రబాబు వేర్వేరుగా శిక్షలు అనుభవించాల్సి వస్తుంది. ఇప్పటికే చంద్రబాబుకు 73 ఏళ్లు నిండుతున్నాయి. ఈ నేపథ్యంలో ఓసారి నేరం నిరూపితమై ఒక్కో కేసులో ఐపీసీ 409 సెక్షన్ కింద యావజ్జీవ కారాగార శిక్ష, అవినీతి నిరోధక చట్టం 13(2) కింద గరిష్టంగా పదేళ్ల కారాగార శిక్ష పడితే తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయో ఊహించుకోవచ్చు. ఇన్నర్ రింగ్ రోడ్, అసైన్డ్ భూముల కేసుల్లో లోకేశ్ కూడా నిందితుడిగా ఉన్నారు. నారాయణతోపాటు టీడీపీ ప్రభుత్వంలో మంత్రులుగా పని చేసిన వారు కూడా ఉన్నారు. వారంతా శిక్ష అనుభవించాల్సిందేనని నిపుణులు తేల్చి చెబుతున్నారు. ముఖ్యమంత్రిగా ఉంటూ అవినీతికి పాల్పడిన కేసుల్లో హర్యానా మాజీ సీఎం ఓమ్ ప్రకాశ్ చౌతాలకు 16 ఏళ్ల తర్వాత జైలు శిక్ష పడిన ఉదంతాన్ని ఉదాహరిస్తున్నారు. తాజాగా తమిళనాడులో మంత్రిగా చేసిన సెంథిల్ బాలాజీ, మద్యం కేసుల్లో ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాకు ఇప్పటికీ బెయిల్ రాకపోవడాన్ని కూడా ప్రస్తావిస్తున్నారు.

'చంద్రబాబు శాశ్వతంగా జైలు పక్షిగా మారక తప్పదు. ఒకట్రెండ్రోజులు ఆలస్యం కావచ్చు తప్ప, యావజ్జీవ కారాగార శిక్ష మాత్రం పక్కా'అని న్యాయ నిపుణులు తేల్చి చెబుతున్నారు. ఐపీసీ 409 సెక్షన్ కింద ఒక్కో కేసులో విడివిడిగా యావజ్జీవ కారాగార శిక్ష, పీసీ యాక్ట్ 13(బి) కింద ఒక్కో కేసులో గరిష్టంగా పదేళ్ల జైలు శిక్ష పడే అవకాశాలున్నాయని ఏకాభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

గత టీడీపీ ప్రభుత్వంలో బరితెగించి నిబంధనలను ఉల్లంఘించి, యథేచ్ఛగా అవినీతికి పాల్పడిన చంద్రబాబు బాగోతం కట్టలు కట్టలుగా బయట పడుతోంది. భారీ అవినీతి కుంభకోణాల కుట్రదారు, లబ్ధిదారులు చంద్రబాబు, ఆయన కుటుంబం, సన్నిహితులు, బినామీలేనని డాక్యుమెంటరీ ఆధారాలు, న్యాయ స్థానాల్లో నమోదు చేసిన కీలక సాక్షుల వాంగ్మూలాలు స్పష్టం చేస్తున్నాయి. స్కిల్ స్కామ్‌లో చంద్రబాబుపై అభియోగాలతో ఏకీభవిస్తూ ఏసీబీ న్యాయస్థానం జ్యుడిషియల్ రిమాండ్ విధించడాన్ని బట్టి చూస్తుంటే.. ఈ ఒక్క కేసు చాలు చంద్రబాబుకు యావజ్జీవ శిక్ష పడటానికి అని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. స్కిల్ స్కామ్ కేసులో బెయిల్ ఇస్తున్నప్పుడు గానీ.. తాజాగా మూడు కేసుల్లో హైకోర్టు ఇచ్చిన ముందస్తు బెయిల్ సందర్భంగా గానీ చంద్రబాబు అవినీతి చేయలేదని ఎక్కడా చెప్పలేదన్న విషయాన్ని నొక్కి వక్కాణిస్తున్నారు.

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో స్కిల్ కార్పొరేషన్, ఫైబర్‌నెట్, అసైన్డ్ భూములు, ఇన్నర్ రింగ్ రోడ్, మద్యం, ఇసుక కుంభకోణాలకు కర్త, కర్మ, క్రియ గత ముఖ్యమంత్రి చంద్రబాబే అని సీఐడీ దర్యాప్తులో పూర్తి ఆధారాలతో వెల్లడి కావడంతో ఆయనకు ఏ రకంగా చూసినా జీవిత ఖైదు తప్పదని న్యాయ నిపుణులు బల్ల గుద్ది చెబుతున్నారు. ముఖ్యమంత్రి హోదాలోనే ఆయన సర్వం తానై కుట్ర పన్నారు. అందుకోసం కేబినెట్‌కు తెలియకుండా చీకటి జీవోలు జారీ చేశారు. స్కిల్ ప్రాజెక్ట్, ఫైబర్ నెట్, బినామీల పేరుతో అసైన్డ్ భూములు పొందిన వారికి భూ సమీకరణ ప్యాకేజీ, మద్యం కొనుగోళ్లపై ప్రివిలేజ్ పన్ను.. జీఎస్టీ ఎత్తివేత, ఉచిత ఇసుక విధానం.. ఇలా అన్ని కుంభకోణాలకు మార్గం సుగమం చేసేందుకు గత టీడీపీ ప్రభుత్వం వేర్వేరు జీవోలను జారీ చేసింది. ఆ జీవోకు కూడా కేబినెట్ ఆమోదం లేకపోవడం చంద్రబాబు కుట్రను వెల్లడిస్తోంది. ఆ జీవోలకు సంబంధించిన నోట్ ఫైళ్లను కూడా మాయం చేయడం గమనార్హం. మాయం చేసిన నోట్ ఫైళ్లను సీఐడీ అధికారులు రిట్రీవ్ చేసి వెలుగులోకి తేవడంతో అన్ని కుంభకోణాల కుట్రలకు కీలక ఆధారాలు లభించాయి. చంద్రబాబు ముఠా గల్లంతు చేసిన అమరావతిలో అసైన్డ్ భూముల రికార్డులను సీఐడీ వెలికి తీసింది. స్కిల్ స్కామ్, ఫైబర్ నెట్ స్కామ్‌లలో కొల్లగొట్టిన నిధులు చంద్రబాబు నివాసానికే చేర్చిన అవినీతి నెట్‌వర్క్‌ను బ్యాంకు ఖాతాల వివరాలతోసహా ఛేదించింది. ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ మార్పులు, క్విడ్ ప్రో కో కింద చంద్రబాబు కరకట్ట నివాసం పొందడం, హెరిటేజ్ ఫుడ్స్‌కు భూములు దక్కడం, చంద్రబాబు, నారాయణ బినామీల పేరిట భూ సమీకరణ ప్యాకేజీ పొందడం మొదలైనవన్నీ రికార్డులతో సహా వెలుగులోకి వచ్చాయి. ఈ విధంగా చంద్రబాబు, లోకేశ్, నారాయణల పాత్రను స్పష్టం చేస్తూ పూర్తి డాక్యుమెంటరీ ఆధారాలు లభించాయి. మరోవైపు ఈ కుంభకోణాలంటికీ సూత్రధారి చంద్రబాబే అని కీలక సాక్షులు వాంగ్మూలాలు ఇచ్చారు. అది కూడా 164 సీఆర్‌పీసీ కింద న్యాయస్థానంలో వాంగ్మూలాలు నమోదు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. అసైన్డ్ భూములను అన్యాక్రాంతం చేయడం చట్ట విరుద్ధమని చెప్పినప్పటికీ చంద్రబాబు పట్టించుకోలేదని అప్పటి సీఆర్‌డీఏ ముఖ్య కార్యదర్శి, కమిషనర్, గుంటూరు జిల్లా కలెక్టర్ వాంగ్మూలాలు ఇచ్చారు. ఫైబర్‌నెట్, స్కిల్ స్కామ్‌లలో నిబంధనలకు విరుద్ధంగా నిధులు మంజూరు చేయొద్దని చెప్పినా చంద్రబాబు పట్టించుకోలేదని కీలక అధికారుల వాంగ్మూలాలు నమోదు చేశారు. షెల్ కంపెనీల ప్రతినిధులు కూడా అప్రూవర్‌గా మారి అదే విషయాన్ని చెప్పారు. ఇన్నర్ రింగ్ రోడ్ కేసులో కన్సల్టెన్సీ కంపెనీ, స్కిల్ స్కామ్‌కు సంబంధించి సీమెన్స్ కంపెనీ కూడా 164 సీఆర్‌పీసీ కింద వాంగ్మూలాలు నమోదు చేశాయి. అన్ని కుంభకోణాల్లో చంద్రబాబు ప్రధాన కుట్రదారు, ప్రధాన లబ్ధిదారు అనేదానికి అటు డాక్యుమెంటరీ ఆధారాలు, ఇటు కీలక సాక్షుల వాంగ్మూలాలు స్పష్టం చేస్తున్నాయి.

రిమాండ్‌కు పంపడమే తార్కాణం

చంద్రబాబు పాల్పడ్డ ఇన్ని కుంభకోణాలలో ఒక్క స్కిల్ స్కామ్‌ను పరిశీలిస్తే చాలు.. ఆయన అవినీతి బాగోతం తెలిసిపోతోంది. సీఐడీ పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి చంద్రబాబును అరెస్ట్ చేసిన అనంతరం విజయవాడ ఏసీబీ న్యాయ స్థానంలో హాజరు పరిచింది. ఆ సందర్భంగా దాదాపు 10 గంటలపాటు ఇరుపక్షాల వాదనలను విన్న తర్వాత ఆయనకు జ్యుడిషియల్ రిమాండ్ విధించాలని న్యాయమూర్తి ఆదేశించారు. దాంతోనే చంద్రబాబు 52 రోజులపాటు రిమాండ్ ఖైదీగా ఉన్నారు. అనంతరం అనారోగ్య కారణాలతోనే ఆయనకు బెయిల్ మంజూరు చేశారు.

ముందస్తు బెయిల్‌పై ఎల్లో మీడియా వక్రీకరణ

ఇన్నర్ రింగ్ రోడ్, మద్యం, ఇసుక కుంభకోణాల కేసుల్లో చంద్రబాబుకు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. కానీ ఆ సందర్భంగా కూడా ఆయన అవినీతికి ఆధారాలు లేవని న్యాయస్థానం చెప్ప లేదు. కేసు పూర్వాపరాల్లోకి ఇంకా తాము వెళ్లడం లేదని కూడా స్పష్టం చేసింది. కేవలం షరతులతోనే ముందస్తు బెయిల్ మంజూరు చేస్తున్నట్టు ప్రకటించింది. విచారణకు చంద్రబాబు సహకరించాలని.. విచారణకు పిలిస్తే వెళ్లాలని కూడా చెప్పింది. కానీ హైకోర్టు తీర్పుకు వక్రభాష్యం చెబుతూ చంద్రబాబుకు క్లీన్ చిట్ లభించినట్టుగా ఈనాడు, ఇతర ఎల్లో మీడియా హడావుడి చేయడం విస్మయ పరుస్తోంది. సీఐడీ సేకరించిన ఆధారాలతో నేరం రుజువు కావడం ఖాయమని న్యాయ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. నేరం నిరూపితమైన తర్వాత ఒక్కో కేసులో చంద్రబాబుకు యావజ్జీవ జైలు శిక్ష పడుతుందని కూడా తేల్చి చెబుతున్నారు.

'స్కిల్డ్' క్రిమినల్ చంద్రబాబే..!

స్కిల్ స్కామ్ కుట్రదారు, లబ్ధిదారు ఆయనే

- సీమెన్స్ ముసుగులో ప్రజాధనం లూటీ
- జర్మనీ కంపెనీకి తెలియకుండానే ప్రాజెక్టు
- రూ.370 కోట్ల ప్రాజెక్ట్ ఏకంగా రూ.3,300 కోట్లకు పెంపు
- తన ముఠాను మోహరించి నిధుల స్వాహా
- అధికారుల అభ్యంతరాలు బేఖాతరు చేస్తూ నిధుల విడుదల

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

పై కేసుల్లో నిందితులు వీరే

- నారా చంద్రబాబునాయుడు
- నారా లోకేశ్
- పొంగూరు నారాయణ
- కింజరాపు అచ్చెన్నాయుడు
- దేవినేని ఉమామహేశ్వరరావు
- కొల్లు రవీంద్ర
- పీతల సుజాత
- చింతమనేని ప్రభాకర్

చంద్రబాబు, లోకేశ్ దొంగలు



- కమీషన్ల కోసం పోలవరాన్ని వాడుకున్నారు
- ఎన్నికల ముందు మేమే రూ.150 కోట్లు ఇచ్చాం
- టీడీపీ 75 శాతం పూర్తి చేసిందనేది పచ్చి అబద్ధం
- ఆ పార్టీ ప్రజల కోసం కాదు... కుటుంబం కోసమే
- లోకేశ్ రాయలసీమలో ఎందుకు పోటీ చెయ్యడు?
- ఈ పార్టీలో ఉండలేను... రాజీనామా చేస్తున్నా
- చంద్రబాబు ఫొటో నేలకేసి కొట్టిన రాయపాటి రంగారావు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు, ఆయన కొడుకు లోకేశ్ దొంగలని, ఆ పార్టీ ఓ దిక్కుమాలిన పార్టీ అని మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు కుమారుడు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి రాయపాటి రంగారావు చెప్పారు. ఆయన శుక్రవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ.. చంద్రబాబు, లోకేశ్ ధన దాహానికి తమ కుటుంబం సర్వనాశనం అయిపోయిందని తెలిపారు. చంద్రబాబు, లోకేశ్‌కు డబ్బే ముఖ్యమని, మరేమీ అవసరం లేదని అన్నారు. ఇక టీడీపీలో ఉండలేనని స్పష్టం చేశారు. పార్టీకీ, పదవికి రాజీనామ రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ వెంటనే తన కార్యాలయంలో ఉన్న చంద్రబాబు ఫొటోను నేలకేసి కొట్టి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. 2014లో రాష్ట్రం విడిపోయినప్పుడు కాంగ్రెస్‌కు రాజీనామా చేసి టీడీపీలో చేరిన తాము ఆ పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేశామన్నారు. గత ఎన్నికలకు ముందు తమ నుంచి రూ. 150 కోట్లు తీసుకున్నారని తెలిపారు. లోకేశ్, చంద్రబాబునాయుడు ఎంతెంత తీసుకున్నారో తమ వద్ద లెక్కలున్నాయన్నారు. తండ్రి, కొడుకు ఒకరికి తెలియకుండా మరొకరు డబ్బులు తీసుకున్నారన్నారు. డబ్బులు తీసుకుని కూడా పోలవరం ప్రాజెక్టు విషయంలో తమను సర్వ నాశనం చేశారన్నారు. చంద్రబాబు కమీషన్ల కోసం పోలవరాన్ని వాడుకున్నారని చెప్పారు. సోమవారం పోలవారం అని చంద్రబాబు చెప్పడం ఉత్త బోగస్ అని అన్నారు. చంద్రబాబు ప్రతి సోమవారం పోలవరంపై సమీక్ష చేసింది కేవలం లంచాల కోసమేనని చెప్పారు. ప్రతి వారం డబ్బులు వసూలు చేశారని తెలిపారు. తమని హింసించి మరీ డబ్బులు వసూలు చేశారన్నారు. తమ ఆస్తులన్నీ బ్యాంకులో పెట్టుకున్నారని అన్నారు. డబ్బులు వాడుకుని మూడు సంవత్సరాల తర్వాత మమ్మల్ని ప్రాజెక్టు నుంచి తప్పించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు పనులు 75 శాతం పూర్తి చేసినట్లుగా చంద్రబాబు చెబుతున్నది పచ్చి అబద్ధమని స్పష్టం చేశారు.

టీడీపీ ఫక్తు వ్యాపార సంస్థ

తెలుగుదేశం రాజకీయ పార్టీయే కాదని, ఫక్తు వ్యాపార సంస్థ అని ఆరోపించారు. ఆ పార్టీ ఉంది ప్రజల కోసం కాదని, కేవలం వాళ్లు బాగుపడటం కోసమేనని చెప్పారు. లక్ష ఉద్యోగాలు తెచ్చామని, శ్రీసిటీ కట్టించామన్నారని, కియా కంపెనీ తెచ్చామని చంద్రబాబు పచ్చి అబద్ధాలు చెప్పారన్నారు. కియా కంపెనీ తెస్తే అనంతపురంలో ఎందుకు ఓడిపోయారని అన్నారు. లోకేశ్ రాయలసీమలో కాకుండా మంగళగిరి ఎందుకొచ్చాడని ప్రశ్నించారు. లోకేశ్‌కు ధైర్యం ఉంటే రాయలసీమలో పోటీ చేయాలని సవాల్ చేశారు. మంగళగిరిలో లోకేశ్‌ను ఓడిస్తానని చెప్పారు. తమ కుటుంబం 40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉందని, ఎవరినీ మోసం చేయలేదని తెలిపారు. తాను సత్తెనపల్లి సీటు అడిగినా, కన్నా లక్ష్మీనారాయణను నియమించారన్నారు. కన్నా నియామకంతో 83 ఏళ్ల తమ తండ్రి రాయపాటి సాంబశివరావు ఆవేదన చెందారన్నారు. 2014లో రాయపాటి సాంబశివరావు ఎంపీగా గెలిచాక కూడా టీడీపీలో అనేక అవమానాలు ఎదుర్కొన్నారని తెలిపారు. తామే కాదని, పార్టీని నమ్ముకున్న అనేకమంది అప్పుల్లో ఉన్నారని తెలిపారు. చనిపోయిన వారికి ఇన్సూరెన్స్ ఇస్తానని డబ్బులు వసూలు చేసిన లోకేశ్ ఎంతమందికి ఇచ్చారని నిలదీశారు. చంద్రబాబు జన్మభూమి కమిటీల పేరుతో రాష్ట్ర ప్రజలను దోచుకున్నారని ఆరోపించారు. రెండు, మూడు లక్షల కోట్లు ఖర్చు చేశామన్నారని, ఆ డబ్బులు ఎక్కడ ఖర్చు పెట్టారో చెప్పాలని డిమాండ్ చేశారు.

పేదల కోసం పని చేస్తున్న సీఎం వైఎస్ జగన్

ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం పనిచేస్తున్నారని రంగారావు చెప్పారు. కోవిడ్ సమయంలో ప్రజలు ఇబ్బంది పడకూడదని సీఎం జగన్ ఒక సంవత్సరం బడ్జెట్ మొత్తం ఖర్చు పెట్టారని చెప్పారు. ఆ రెండేళ్లు ఆంధ్రప్రదేశ్ జీడీపీ ఎక్కువగా ఉందని రిజర్వ్ బ్యాంక్ వెబ్‌సైటే చెబుతోందని తెలిపారు. అదే సమయంలో ఇతర రాష్ట్రాల్లో ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలు అందరికీ అందుతున్నాయన్నారు. జగన్ అంటే తమకు ఇష్టమని, ఆయన సీటు ఇస్తే పోటీ చేస్తానని చెప్పారు.

అధికారుల సంఘం ఎన్నికల కోలాహలం

- ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ
- ప్రిఫరెన్షియల్ పద్ధతి కోసం సంతకాల సేకరణ
- ప్రత్యేక వెబ్‌సైట్ ఏర్పాటు : ఎన్నికల అధికారి గురువయ్య



సింగరేణి కొత్తగూడెం ప్రధాన కార్యాలయం

గోదావరిఖని: సింగరేణి బొగ్గు గనుల సంస్థలో అధికారుల సంఘం ఎన్నికల కోలాహలం ప్రారంభమైంది. శుక్రవారం నుంచి ఈనెల 19వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణకు గడువు విధించారు. తొలిసారి సీక్రెట్ బ్యాలెట్ పద్ధతిన పోలింగ్ నిర్వహిస్తుండడంతో పోటీచేసేందుకు చాలామంది ఉత్సాహం చూపుతున్నారు. సంస్థవ్యాప్తంగా 2,213మంది అధికారులు ఉండగా, సింగరేణి, ఏరియా స్థాయిలో పోటీచేసేందుకు అవకాశం ఉంది. అయితే ప్యానెల్ వారీగా పోటీ చేస్తారా? లేక వ్యక్తిగతంగా పోటీ చేస్తారా? అనేది ఇంకా స్పష్టం కాలేదు. ఏరియాల వారీగా జీఎంలు నామినేషన్ల స్వీకరించడానికి ఏర్పాట్లు చేశారు. అభ్యర్థుల దరఖాస్తు ఫారాలను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేసేందుకు ప్రత్యేక వెబ్‌సైట్ రూపొందించారు. గతంలో ఏరియా వారీ కమిటీలను ఎన్నుకుని, ఆ కమిటీ సభ్యులు, అధ్యక్షులు కలిసి సింగరేణి స్థాయి అధికారుల సంఘం అధ్యక్షుడు, ఇతరులను చేతులెత్తే పద్ధతిన ఎన్నుకునేవారు. ఈసారి కోలిండియా మాదిరిగా సీక్రెట్ బ్యాలెట్ ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించారు. 11 ఏరియాలు, శ్రీరాంపూర్ థర్మల్‌పవర్ ప్రాజెక్టుతో కలిపి 12 ఏరియాలకు కమిటీలను ఆయా ఏరియాల్లో అధికారులు ఎన్నుకోవాల్సి ఉంటుంది. అలాగే సింగరేణిస్థాయి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఇతర పోస్టుల కోసం రెండోఓటు వేయాల్సి ఉంటుంది. ఈవిషయంలో స్పష్టమైన ఆదేశాలు కూడా జారీఅయ్యాయి. కార్పొరేట్‌లో అత్యధికంగా 450ఓట్లు ఉన్నాయి.

ప్రిఫరెన్షియల్ తరహాకోసం సంతకాల సేకరణ

సింగరేణి స్థాయి అధ్యక్షుడు, ప్రధాన పోస్టులకు 50శాతానికిపైగా ఓట్లు సాధించనవారికే ఇవ్వాలనే ఆలోచనలో అధికారులు ఉన్నారు. ప్రిఫరెన్షియల్ పద్ధతిన ఎన్నుకోవాలని కోరుతూ అధికారులు సంతకాల సేకరణ చేపట్టారు. ఈవిషయంలో ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

ప్రత్యేక వెబ్‌సైట్ ఏర్పాటు చేశాం

ఈసారి సింగరేణి అధికారుల సంఘం ఎన్నికలను పూర్తిపారదర్శకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. దీనికోసం ప్రత్యేకంగా వెబ్‌సైట్ ఏర్పాటు చేశాం. ఏరియా వారీగా వస్తున్న నామినేషన్లను స్వీకరించేందుకు జీఎంలను రిటర్నింగ్ అధికారులుగా నియమించాం. స్క్రూటినీ చేసే అధికారం కూడా వారికే ఇచ్చాం. ప్రతీ ఒక్కరు రెండు ఓట్లు వేయాలి. ట్రైయినీ ఎగ్జిక్యూటివ్‌కు పోటీచేసే అవకాశం లేదు. అలాగే ఓటుహక్కు కూడా లేదన్నారు. శుక్రవారం సింగరేణిస్థాయి అధ్యక్ష పదవి కోసం ఒక నామినేషన్ దాఖలు అయ్యింది.

– గురువయ్య, ప్రధాన ఎన్నికల అధికారి కార్పొరేట్ సేఫ్టీ జీఎం

గుట్టలెక్కి.. సేవలందించి





కంప్యూటర్లను నెత్తిన మోసుకుని వెళ్తున్న ఆపరేటర్లు

ఆదిలాబాద్‌రూరల్: మండల పరిధిలో గుట్టుపై ఉన్న గ్రామమది. అక్కడికి వెళ్లాలంటే సరైన రోడ్డు సౌకర్యం కరువు. జిల్లా కేంద్రం నుంచి కేవలం 12 కిలోమీటర్ల దూరమే ఉన్నప్పటికీ ఆ పల్లెకు చేరుకోవాలంటే ఇంద్రవెల్లి గుండా అదనంగా 40 కిలోమీటర్లు ప్రయాణించక తప్పదు. అలాంటి బుర్కి గ్రామంలోని ఆదివాసీలకు ఆధార్ సేవలను అందించేందుకు గాను కామన్ సర్వీస్ సెంటర్ జిల్లా మేనేజర్ రాహుల్, ఇద్దరు ఆపరేటర్లు మోహన్, గోపాల్‌తో కలిసి గుట్ట మార్గంలో ఐదు కిలోమీటర్లు కంప్యూటర్లను నెత్తిన మోసుకుంటూ వెళ్లారు. పీఎం జన్‌మాన్ స్కీంలో భాగంగా గ్రామంలో ఆధార్ శిబిరం నిర్వహించారు. అవసరమైన వారికి ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్స్, ఆరోగ్యశ్రీ కార్డుల జారీకి సంబంధించిన సమాచారాన్ని సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఆదివాసీల చెంతకే వెళ్లి సేవలందించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

కామాంధుడు..!

- కూతురుపైనే అఘాయిత్యం
- ఆదిలాబాద్‌లో ఘటన
- ఆలస్యంగా వెలుగులోకి..
- పోక్సో చట్టం కింద కేసు

ఆదిలాబాద్‌టౌన్: కూతురు భవిష్యత్తు కోసం పరితపిస్తూ ఆమెను కంటికి రెప్పలా చూసుకోవాల్సిన ఓ తండ్రి కామంతో కళ్లుమూసుకుపోయి క్రూర మృగంలా ప్రవర్తించాడు. 11 ఏళ్ల బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. విషయాన్ని ఆ చిన్నారి తల్లికి చెప్పడంతో బయటపడింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీంతో ఆమె ఆదిలాబాద్ టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. స్థానిక మార్కెట్ యార్డు సమీపంలోని ఓ కాలనీకి చెందిన వ్యక్తికి నలుగురు కూతుళ్లు సంతానం. ఈయన మహారాష్ట్రలోని కిన్వట్ ప్రాంతానికి చెందినవాడు. భార్యాభర్తలకు తరచూ గొడవలు జరగడంతో రెండేళ్లుగా ఆయన అత్తగారి ఊరైన ఆదిలాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. ఇటీవల ఇంట్లో కూతురుపై ఈ దారుణానికి ఒడిగట్టాడు. కొంతకాలంగా ఆ చిన్నారిని శారీరకంగా వేధింపులకు గురిచేస్తున్నట్లు తెలిసింది. అయితే విషయాన్ని ఆయన భార్య టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఈ నెల 7న ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు నిందితుడిని పట్టుకొని విచారిస్తున్నారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. శుక్రవారం రిమ్స్‌లో ఆ చిన్నారికి వైద్య పరీక్షలు నిర్వహించిన ట్లు తెలిసింది. ఈ విషయమై టూటౌన్ సీఐ అశోక్‌ను వివరణ కోరగా.. నిందితుడిని అరెస్టు చేశామని, రిమాండ్‌కు పంపించనున్నట్లు పేర్కొన్నారు.

ఓసీసీపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు

- ప్రభుత్వం సహా సంబంధిత శాఖలు, అధికారులకు నోటీసులు
- పర్యావరణం, వాతావరణం, నీటి కాలుష్యంపై కేసు వేసిన స్థానికుడు



కంపెనీ నుంచి వెలువడుతున్న పొగ

అన్నిరకాల నష్టం



కంపెనీ ద్వారా ఆదివాసీలు, స్థానికులకు లాభం జరుగుతుందని బయటి ప్రపంచం అనుకుంటుంది. అన్ని రకాలుగా నష్టం తప్పితే లాభం లేదు. చెరువులు, వాగులు, బోర్లు, పంటలు కలుషిత నీటితో నష్టపోతున్నా కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. ఆదివాసీల ప్రాణాలతో చెలగాటం ఆడుతూ వేల కోట్ల రూపాయలు లాభాలు తీసుకుంటున్న కంపెనీతో పర్యావరణ ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు, కోర్టులు, ప్రభుత్వాల దృష్టికి కంపెనీ ప్రారంభం నుంచి తీసుకెళ్తున్నా ప్రయోజనం లేదు. అందుకే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ను సంప్రదించిన న్యాయం జరుగుతుందని ఆశిస్తున్న.

– రొడ్డ రవికుమార్

కాసిపేట: మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం దేవాపూర్‌లోని ఓరియంట్ సిమెంటు కంపెనీ(ఓసీసీ) నుంచి వెలువడుతున్న నీటి, వాతావరణ కాలుష్యంపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ప్రభుత్వంతోపాటు సంబంధిత శాఖలు, అధికారులకు నోటీసులు జారీ చేసింది. మద్దిమాడ గ్రామానికి చెందిన గిరిజనుడు రొడ్డ రవికుమార్ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ సౌత్‌జోన్ చెన్నయ్‌లో నీటి, వాతావరణ కాలుష్యంపై పిటిషన్ వేయగా.. ఈ నెల 8న విచారణకు స్వీకరించింది. ఫిబ్రవరి 12న ట్రిబ్యునల్‌కు హాజరు కావాలని తెలంగాణ రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ, మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంటు, ఫారెస్టు అండ్ క్లైమెట్ చేంజ్ ఢిల్లీ, సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఢిల్లీ, తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అండ్ ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్, జిల్లా కలెక్టర్, ఓసీసీ చైర్మన్, సత్యవ్రత శర్మ మాన్యుఫాక్చరింగ్ హెడ్‌లకు నోటీసులు జారీ చేసింది. కలుషిత నీటి విడుదలతో వాగులు, చెరువులు, బావుల్లో కలిసి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని, కిడ్నీ వ్యాధులు, వెంట్రుకలు ఊడిపోవడం వంటి అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని పిటిషన్‌లో పేర్కొన్నారు.

నేడు నాగోబా మహాపూజకు శ్రీకారం

ఇంద్రవెల్లి: మెస్రం వంశీయుల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 9న నిర్వహించే నాగోబా మహాపూజకు నేడు శ్రీకారం చుట్టనునున్నారు. ఈమేరకు ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. పుష్యమాస ప్రారంభంతో శనివారం సాయంత్రం నెలవంకను చూసి మహాపూజకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. అలాగే ఈ నెల 14న మహాపూజ నిర్వహణపై ప్రచార రథం ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమాలకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి మెస్రం వంశీయులు హాజరుకావాలని ఆయన కోరారు.

నవ సమాజ నిర్మాతలు కవులు



నిర్మలను సన్మానిస్తున్న నారదాసు, తదితరులు

- మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు

కరీంనగర్‌కల్చరల్: ప్రజాపక్షం వహించే కవులు నవ సమాజ నిర్మాతలని మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు అన్నారు. 70వ దశకం నాటి పీడన, అణచివేతలకు కవి అలిశెట్టి ప్రభాకర్ అద్దం పట్టేలా రచనలు చేశారని పేర్కొన్నారు. తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఫిలింభవన్‌లో జరిగిన అలిశెట్టి పురస్కార ప్రదాన సభకు నారదాసు అతిథిగా హాజరై మాట్లాడారు. నేటి కవులు అలిశెట్టిని ఆదర్శంగా తీసుకుని రచనలు చేయాలని పిలుపునిచ్చారు. 2024కు గాను అలిశెట్టి ప్రభాకర్ సాహిత్య పురస్కారాన్ని కవయిత్రి తోట నిర్మలకు ప్రదానం చేశారు. అలిశెట్టి ప్రభాకర్ సతీమణి భాగ్యలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై నారదాసు లక్ష్మణ్‌రావుతో కలిసి పురస్కారం అందజేశారు. సభకు తెరవే జిల్లా అధ్యక్షుడు సీవీ కుమార్ అధ్యక్షత వహించారు. తోట నిర్మలరాణి కవిత్వాన్ని పెనుగొండ బసవేశ్వర్ విశ్లేషించారు. పాత్రికేయుడు జీఎస్ రవీంద్ర అలిశెట్టి స్మృతులను వివరించారు. సభలో తెరవే రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మల్లారెడ్డి, వెంకటేశ్వర్లు, దేవేందర్, నాగభూషణం, సంగ్రామ్, శంకరయ్య, ఉషశ్రీ, అంజయ్య, సుజాత, శ్రీనివాస్, వసంత, సరసిజ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు మద్దతివ్వండి



కరీంనగర్‌కార్పొరేషన్: సుప్రీంకోర్టులో ఈ నెల 17న ఎస్సీ వర్గీకరణపై విచారణ జరగనున్నందున రాష్ట్ర ప్రభుత్వం తరఫున సానుకూలత తెలపాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కోరారు. శుక్రవారం మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సహచర ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎస్సీ వర్గీకరణ అమలులో లేకపోవడం వల్ల విద్య, ఉద్యోగ, సంక్షేమ, రాజకీయరంగాల్లో మాదిగలకు, ఉప కులాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలిపారు. వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి మద్దతునిస్తోందని, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో 2004 డిసెంబర్ 10న అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణపై ఏకగ్రీవ తీర్మానం చేసి పంపించామన్నారు. అలాగే వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వం పక్షాన బలంగా వాదనలు వినిపించేలా న్యాయవాదిని నియమించాలని కోరారు.

సంక్రాంతి పండగ వస్తే ఊర్లోకి పాత బంధువులొస్తారు.
పండిన పంట నుంచి హక్కుగా తమ భాగం తీసుకుపోతారు.
హరిదాసులు, గంగిరెద్దుల వారు,
కొమ్మదాసరులు, జంగం దేవరలు,
పిట్టల దొరలు, గారడీ వాళ్లు...
వీరందరికీ సంక్రాంతి వస్తే సంవత్సరానికి సరిపడా సాయం.
సాటివారికి సాయం చేయడమే సంక్రాంతి.



సంక్రాంతి

ఊరికి బంధువులు

సంక్రాంతి అనగానే ఊళ్లోకి బంధువులే కాదు డూడూ బసవన్నలు కూడా వస్తారు. సంక్రాంతి అంటే తిని, తేన్చి, సంబరాలు చేసుకునే పండగ మాత్రమే కాదు... రైతు సౌభాగ్యానికీ పల్లె సౌభాగ్యానికీ సహకారం అందించిన అన్ని వర్గాల వారికీ పంపకాలు చేసే పండగ కూడా. సంక్రాంతి పండగ సమయంలో ఇంటికి పుట్లు కొద్దీ చేరిన ధాన్యం నుంచి రైతు తనకు సేవ చేసిన, సాయం చేసిన వర్గాల వారికి భాగం ఇస్తాడు. 'మేర' పంచుతాడు. పాలేర్లకి, సేద్యగాళ్లకి. పనివాళ్లకి వడ్లు పోస్తాడు. కొందరికి కొత్తబట్టలు పెడతాడు. అయితే వీరు కాకుండా ఊరి మీద హక్కుగా తమ వాటా కోసం వచ్చే సంప్రదాయ వృత్తికళకారులు వచ్చి ఊరిలో ఆడి, పాడి వినోదం పంచి తమ వడ్లు మూట గట్టుకుని పోతారు.

శ్రీమద్రమా రమణ...

'సద్గురుని కృపచే తారతమ్యము తరచి గనుమన్నా .... ధరణి లోపల మూఢమతులకు దొరుకుటకు బహు దుర్లభమ్మిది'.... అని పాడుతూ గురు కటాక్షం వలనే భక్తిని, ముక్తిని చేరుకోవాలని బోధిస్తూ వీధివీధిన తిరుగుతూ సంక్రాంతి శోభను తెస్తాడు హరిదాసు. పండగ రోజుల్లో దానికి ముందు ధనుర్మాసంలో హరిదాసు తిరగని ఊరు, వీధి ఎంతో బోసిపోతాయి. నెత్తిన అక్షయపాత్ర, భుజాన తంబూర, చేతిలో చిడతలతో 'శ్రీమద్రమా రమణ గోవిందా' అంటూ భిక్ష స్వీకరించా 'కృష్ణార్పణం' అంటూ మనం సంపాదించిన దానిలో కొంత పేదలకు అర్పణం చేయడం ద్వారా దేవునికి సమర్పణం చేసిన పుణ్యం పొందాలని సూచిస్తాడు హరిదాసు. ఒకప్పుడు పల్లెల్లో ప్రతి వీధి వాకిట్లో హరిదాసు కోసం గృహిణులు కాచుకుని ఉండేవారు. ఇప్పుడు పై అంతస్తుల్లో, అపార్ట్‌మెంట్ బాల్కనీల్లో నుంచి చూస్తూ కిందకు దిగడానికి బద్ధకిస్తున్నారు. హరిదాసు అక్షయపాత్రలో జారవిడిచే కాసిన్ని బియ్యం మన ఇంటి సంపదను అక్షయపాత్రగా మారుస్తాయి.

డూడూ బసవన్నలు

'గంగిరెద్దులా తల ఊపకు' అని అంటారు గాని దైవచిత్తానికి తల ఊపుతూ భారం అంతా నీదే అనుకోవడానికి మించిన వేరే సుఖం ఏముంటుంది? డూడూలు కొట్టే బసవన్నను యజమాని ముద్దుగా చూసుకున్నట్టే జీవుణ్ణి దేవుడు ముద్దుగా చూసుకుంటారు. గంగిరెద్దులు ఇంటి ముందుకొచ్చి సన్నాయి పాట వినిపిస్తే ఆ కళే వేరు.



రంగు రంగుల పాతబట్టలు ఇస్తే అవి బసవడి మూపురం మీదకు చేరుతాయి. కాసులిస్తే గంగిరెద్దులవాడి నల్లకోటు జేబులో చేరుతాయి. కాసిన్ని డబ్బులు ఎక్కువిస్తే గంగిరెద్దులు విన్యాసం చేస్తాయి. యజమాని ఛాతీ మీద సుతారంగా గిట్టలు ఆడిస్తాయి.

బుడబుడలు... కొమ్మదాసరులు

'అంబ పలుకు జగదంబ పలుకు' అంటూ డమరుకం వాయిస్తూ బుడబుక్కల వాళ్ళు వస్తారు సంక్రాంతికి. తలపాగా, కోటు, గొడుగు చేతబూని శుభాల భవిష్యత్తును చెబుతూ భిక్ష స్వీకరిస్తారు. వారు వేగంగా వాయించే డమరుకం గొప్ప శబ్ద విన్యాసం సృష్టిస్తుంది. వీరికి డబ్బు, వడ్లు, పాతబట్టలు ఇవ్వాల్సిందే. ఇక ఊరికి ఒకప్పుడు కొమ్మదాసరులు వచ్చేవారు. వీరు ఊరి మధ్యలోని చెట్టు కొమ్మెక్కి కూచుని కింద గుడ్డ పరిచి వచ్చేపోయేవారి మీద వ్యాఖ్యానం వినిపిస్తుండేవారు. తగిన సొమ్ము ముట్టజెప్తేనే దిగేవారు. కొయ్య తుపాకీతో పిట్టల దొరలు వస్తారు పెద్ద పెద్ద వాళ్లతో కలిసి తిరగాలనుకునే సామాన్యుడి కలలకు మాటల మలాం పూస్తారు. 'మేము స్నానం చేసిన సబ్బు నీళ్లతో పేద దేశాల వాళ్లు డ్యాములు కట్టుకున్నారు' అంటారు. 'మా ఇంట్లో కేజీ బంగారం కుక్క నాకిందని చెత్తకుప్పలో పడేశాం' అంటారు. 'మోదీ గారు పిలిచి పాకిస్తాన్ మీద యుద్ధానికి పొమ్మని ఆశ్రూపాయలు అడ్వాన్సు ఇచ్చారు' అంటారు. దుబాయ్ షేకుతో టిఫిని తిని అమెరికా ప్రెసిడెంట్‌తో లంచ్‌కు కూచోపోబోతున్నాం అంటారు. తర్వాత శంఖం ఊదుతూ జంగం దేవరలు వస్తారు. గారడీ వాళ్లు, కనికట్టు ప్రదర్శించేవాళ్లు... వరుస కడతారు. రైతు ఎవరినీ కాదనడు. అందరినీ ఆదరిస్తాడు.

ఇక సాయంత్రమైతే ఊళ్లో పాట కచేరీలు, డాన్సు ప్రోగ్రాములు ఉంటాయి. రకరకాల కళాకారులు దిగుతారు. సినిమా నాటకాలు ఒకప్పుడు వేసేవారు. సినిమాలు కూడా వేసేవారు. సంక్రాంతి సందేశం... సామూహిక ఉత్సవం. జీవితం సాటి మనుషులతో కలిసి మెలిసి సాగాలని చెప్తుంది. ఉన్నది పంచుకుని తినాలని చెప్తుంది. శ్రమ చేసి సమృద్ధితో జీవించమని చెబుతుంది. నలుగురూ కలిసి ప్రకృతి వనరులను ఫలవంతం చేసుకుని నలుగురూ వృద్ధి కావాలని కోరడమే సంక్రాంతి.

గృహశోభ

అలంకరణ మెండుగా.. మది నిండుగా..

ప్రకృతి పండగ. సంబరంగా జరుపుకోవాలంటే ఆ కళ కూడా మన ఇంటికి కొత్త కళాకాంతులు తీసుకురావాలి. అప్పుడే పండగ మరింత అందంగా, శోభాయమానంగా మారిపోతుంది. సంక్రాంతి రోజున ఇంటిని అందంగా తీర్చిదిద్దడానికి కొన్ని సంక్రాంతి అలంకరణలు ఇవి.



సంక్రాంతి, పొంగల్ ఈ రెండింటినీ హిందువులు చాలా ఉత్సాహంగా జరుపుకుంటారు. ఈ రోజున, ఇళ్లను అందంగా అలంకరించడానికి పోటీపడుతుంటారు. సంప్రదాయ పద్ధతులే కాకుండా, పొంగల్ లేదా మకర సంక్రాంతికి ఇంటిని అలంకరించుకోవడానికి అనేక ఇతర మార్గాలు ఉన్నాయి. వాటిలో ఇంటీరియర్ నిపుణులు అందిస్తున్న కొన్ని సూచనలు...

రంగుల రంగోలి

ఏ భారతీయ పండుగకైనా ఇంటి ముందు అందమైన రంగోలీ ముచ్చటగొలుపుతుంది. ముగ్గుల పండగగా పేరొందిన సంక్రాంతికి ఇంటి గుమ్మం వద్ద, పూజగది, పొంగల్ కోసం బయట రంగోలి డిజైన్లను రూపొందించడానికి మీ సృజనాత్మకతను చూపచ్చు. అందరూ వేసేదిగా కాదు అనుకుంటే వినూత్నమైన డిజైన్లను ప్రయత్నించవచ్చు. దీంతో పొరుగువారిని మించిపోవచ్చు.

ఆకులతో అందంగా..

పొంగల్, సంక్రాంతి అనేది శ్రేయస్సు వేడుక, ఈ థీమ్‌లో ఆకుపచ్చ రంగుదే అగ్రతాంబూళం. అందుకని, పొంగల్ రోజున మామిడి ఆకుల తోరణాలను ఇంటి ప్రవేశద్వారం వద్ద వేలాడదీయడం శుభప్రదమైనది. రంగు రంగు కాగితాలను ఉపయోగిస్తూ చేతితో పర్యావరణ అనుకూలమైన అలంకరణ చేయచ్చు.





అపార్ట్‌మెంట్‌ల కోసం ఇన్‌డోర్..

అందరూ అలంకరించుకోవడానికి విశాలమైన పచ్చికతో కూడిన పెద్ద బంగ్లాలలో నివసించరు. అనేక మంది పట్టణవాసులు పట్టణాలు, నగరాల్లోని అపార్ట్‌మెంట్లలో నివసిస్తున్నారు. కానీ ఇన్‌డోర్ డెకరేషన్ అవుట్‌డోర్‌లో చేసినట్లే ఆహ్వానించదగినదిగా ఉంటుంది. మీ గదిని ఆకులతో పాడవాటి చెరకుతో అలంకరించండి. బియ్యం పాలు, బెల్లం ఉడకబెట్టడాన్ని సూచించే మట్టి కుండలతో అలంకరించండి. సంక్రాంతి లేదా పొంగల్ జరుపుకోవడానికి మీకు పెద్ద బాల్కనీ లేదా తోట అవసరం లేదని గ్రహించాలి.



థీమ్ డెకరేషన్‌లో గాలిపటం

గాలిపటాల హంగామా ఈ పండగ ప్రత్యేకం. కాబట్టి, పేపర్ క్రాఫ్ట్‌తో రంగురంగుల గాలిపటాల తయారీ ఇంటికి ప్రత్యేకమైన అందాన్ని తీసుకు వస్తుంది. వీటిని తయారు చేయమని పిల్లలను ప్రోత్సహించవచ్చు. వాల్ హ్యాంగింగ్‌లను అందమైన అలంకరణలుగా ప్రయత్నించవచ్చు. కాగితంతో తయారు చేసిన సీతాకోకచిలుకలు, పువ్వులు, జంతువుల బొమ్మలు ఇంటీరియర్‌కు అదనపు ఆకర్షణను తీసుకువస్తాయి. మార్కెట్‌లో కూడా గాలిపటాలు అన్ని ఆకారాలు, పరిమాణాలలో లభిస్తాయి. బాల్కనీ అయితే గాలిపటాలను వేలాడదీయవచ్చు. లివింగ్ రూమ్‌లోని ఓ వాల్‌ని ఎంచుకుని రంగు రంగుల గాలిపటాలతో ఆకర్షణీయమైన అలంకరణ కోసం అతికించవచ్చు. వీటికి పువ్వులు, చెరకు డిజైన్‌లను కూడా జోడించవచ్చు.

వాల్ పేపర్స్

పొంగల్ అలంకరణ చిటికేసినంత సులువుగా నట్టింటికి రావాలంటే ఇప్పుడు అందమైన ఫెస్టివల్ వాల్ పేపర్లు, వాల్ డెకార్ బ్యాక్‌డ్రాప్స్ మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. నచ్చిన వాల్‌పేపర్‌ని ఎంచుకొని, డెకార్ చేయడమే తరువాయి.

పండగ పిండివంటలు

ఒక టేబుల్‌పైన కాగితం లేదా చెక్కతో తయారుచేసిన ఎడ్ల బండ్ల బొమ్మలు, అరిశెలు, సకినాలు, నువ్వుల లడ్డూలు.. వంటివి పలహారాల పేట్లు, కొయ్య బొమ్మలను ఉంచితే చాలు పండగ కళ వచ్చేసినట్టే.

ముగ్గు-ముచ్చట




భాగ్యలక్ష్మి రాజేశ్వర్
నిర్మల్

22 చుక్కలు
2 వచ్చేవరకు, సరి చుక్క



బి.సత్యవతీరెడ్డి
మౌలాలి,
హైదరాబాద్





12 చుక్కలు, 2 వరుసలు
2 వచ్చే వరకు, సరి చుక్క



సీహెచ్ ఇందుసాయి
సూళ్ళూరుపేట,
నెల్లూరు జిల్లా





డి. భానుమతి
పాకాల,
తిరుపతి జిల్లా


13 చుక్కలు
7 వచ్చేవరకు
సంధు చుక్క



సుమేధ దామోదర
మౌంటేన్ హౌస్,
కాలిఫోర్నియా రాష్ట్రం, అమెరికా

9 చుక్కలు
9 వరుసలు








ముమ్మడి దివ్య జ్యోతి
దమ్మాయిగూడ
హైదరాబాద్





కాంట చరిత
అరకు వ్యాలీ
విశాఖపట్నం జిల్లా

25 చుక్కలు
13 వచ్చేవరకు



గోకవరపు
సుహాసిని
సర్కిల్‌పేట,
మచిలీపట్నం

21 చుక్కలు 1 వచ్చే వరకు
(చుక్కలు చూసి పెట్టుకోవాలి)



కరివేపాకు నమిలి పారేయండి



కరివేపాకు అనగానే కూరలో కరివేపాకు, ఉప్మాలో కరివేపాకు... కరివేపాకులా తీసిపారేస్తావేంటి... ఇలాంటి డైలాగులే గుర్తుకొస్తాయి. దానికి తగ్గట్టే కూరలోనో, పప్పులోనో, ఉప్మాలోనో వచ్చే కరివేపాకును ఏరిపారేసే ఉల్లంఘనులే ఎక్కువ. అయితే అలా కాకుండా ఉదయాన్నే ఖాళీ కడుపుతో నాలుగు కరివేపాకు రెమ్మలను నమిలితే ఎన్నో ప్రయోజనాలున్నాయంటున్నారు ఆరోగ్యనిపుణులు. అవేంటో చూద్దాం...

తీసి పారేసినా, నమిలి పారేసినా తెలుగు వారి వంటకాల్లో కరివేపాకు వాడకం సర్వ సాధారణం. ఇది ఆహారానికి సువాసనను, రుచిని ఇవ్వడమే కాకుండా, అనేక ఆరోగ్య ప్రయోజనాలను కూడా కలిగిస్తుంది. భాస్వరం, కాల్షియం, ఇనుము, రాగి, విటమిన్లు, మెగ్నీషియం వంటి పోషకాలు ఎన్నో ఉన్న కరివేపాకును రోజూ ఉదయం ఒకటి రెండు రెమ్మలను దూసి వాటిని పచ్చిగానే నమిలి తినడం వల్ల కలిగే ప్రయోజనాలు...

1. **కంటికి మంచిది:** రోజూ పరగడుపునే కరివేపాకును తీసుకోవడం వల్ల కంటిశుక్లం లేదా అనేక ఇతర కంటి వ్యాధులు వచ్చే ప్రమాదాన్ని నివారించవచ్చు.

2. **జీర్ణ వ్యవస్థకు మంచిది:** ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో నాలుగైదు కరివేపాకులను నమిలి తినటం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. మలబద్ధకం, గ్యాస్, ఎసిడిటీతో సహా అన్ని ఉదర సమస్యల నుంచి ఉపశమనాన్నిస్తుంది.

3. **మధుమేహులకు మంచి మందు** పచ్చి కరివేపాకును నమలడం మధుమేహులకు చాలా మంచిది.

4. **ఇమ్యూనిటీ బూస్టర్** కరివేపాకులో యాంటీ ఫంగల్, యాంటీబయాటిక్ లక్షణాలు ఉండటం వల్ల రోగ నిరోధక వ్యవస్థ బలపడి ఇన్ఫెక్షన్ల బారిన పడకుండా కాపాడుతుంది.

5. **బరువును అదుపు చేస్తుంది:** కరివేపాకును నమలడం వల్ల బరువు తగ్గడంతోపాటు పొట్ట తగ్గుతుంది.

6. అతిసార, అజీర్తితో బాధపడుతున్న వారు భోజనం తర్వాత రెండు మూడు కరివేపాకులను తింటే ఆ సమస్యలు దూరమవుతాయి.

ఎన్ని ప్రయోజనాలున్నాయో చూశారు కదా మరి!



పోషకాల పిండివంటలు

సంక్రాంతికి మనం రకరకాల పిండివంటలు చేసుకుంటాం. అయితే అవన్నీ ఈ రుతువుకు తగినవనీ, శరీరానికి బలాన్నిస్తాయనే ఉద్దేశంతోనే మన పెద్దలు ఈ పండక్కి ఈ పిండివంటలను నిర్దేశించి ఉండచ్చని వీటిలోని పోషకాలను బట్టి తెలుస్తోంది. ఏయే పిండివంటల్లో ఏయే పోషకాలున్నాయో చూద్దాం.



అరిసెలు

సంక్రాంతి పండగ అనగానే ముందుగా గుర్తుకొచ్చేవి అరిసెలు. వీటిని పంచదారతో, బెల్లంతో కూడా చేస్తారు కానీ, బెల్లంతో చేసిన అరిసెలు ఆరోగ్యానికి మంచిది. వీటి తయారీలో కొత్త బియ్యపు పిండి, నూనె, బెల్లం, నువ్వులు వాడతారు. ఇందులో వాడే బెల్లం రక్తాన్ని శుద్ధి చేయడంతోపాటు శరీరంలోని వ్యర్థాలను తొలగిస్తుంది. వీటిలో కార్బోహైడ్రేట్లు, ఐరన్‌తోపాటు ఇతర పోషకాలు కూడా లభిస్తాయి.

కొబ్బరి బూరెలు

అరిసెల తరవాత అంతటి ప్రధానమైన వంటకం కొబ్బరి బూరెలు. దీంట్లో కొత్త బియ్యపుపిండి, కొబ్బరి, యాలకుల పొడి, బెల్లం వాడతారు. అరిసెలలో ఉన్న పోషకాలతో పాటు కార్బోహైడ్రేట్లు కూడా పుష్కలంగా ఈ కొబ్బరి బూరెల్లో లభిస్తాయి.

నువ్వుల ఉండలు

పరస్పరం నువ్వుల ఉండలు పంచుకోవడం సంక్రాంతి సంప్రదాయాలలో ఒకటి. మంచి బలవర్ధకమైన ఆహారం నువ్వుల ఉండలు. శీతాకాలంలో శరీరం పొడిబారిపోతూ ఉంటుంది. ఈ సమయంలో నువ్వులు ఆహారంగా తీసుకోవడం ద్వారా దానిలో ఉండే నూనె శరీరాన్ని కాంతిమంతంగా ఉండేలా దోహదం చేస్తుంది. టీనేజీ బాలికల్లో రక్తహీనతను నివారించడానికి ఉపకరిస్తుంది. శరీరంలో వేడి పుట్టించేందుకు ఇవి ఎంతగానో దోహదపడతాయి. విటమిన్ ఎ, డి, ఇ, కెలు లభిస్తాయి. దేహదారుఢ్యానికి నువ్వుండలను మించింది లేదు.

కజ్జికాయలు

అరిసెలు అంతగా పడని వారు, అంత శ్రమ తీసుకోలేనివారు కజ్జికాయలు చేసుకుంటారు. ఇవి కొంచెం ఎక్కువ కాలం నిల్వ ఉండటంతోపాటు పిల్లలు వీటిని ఇష్టంగా తింటారు. దీనిలో కొబ్బరి, రవ్వ, పంచదార లేదా పల్లీలు, పుట్నాలు, నువ్వులతో పాటు సుగంధ ద్రవ్యాలైన యాలకులు, జీడిపప్పు వంటివి కూడా వినియోగిస్తారు. కజ్జికాయల ద్వారా శరీరానికి కావాల్సిన ప్రొటీన్స్, ఐరన్, ఖనిజ లవణాలు అందుతాయి.



జంతికలు

తియ్యటి పదార్థాలు తిన్న జిహ్వ, ఆ వెంటనే కారకారంగా ఉండే వాటిని తినాలనుకోవడం సహజం. కారపు పిండివంటల్లో జంతికలు లేదా సకినాలు ప్రధానమైనవి. బియ్యపు పిండి, శనగ పిండి, నువ్వులు, వాము ఇందులో వాడతారు. శనగపిండి, బియ్యపు పిండి కార్బోహైడ్రేట్లను, ప్రొటీన్లను అందిస్తే నువ్వులు చర్మాన్ని కాంతివంతం చేసేందుకు సహకరిస్తాయి. చిన్నపిల్లలు వీటిని ఎక్కువ తింటారు. వీటిలో వాడే వాము సుఖ విరోచనానికి తోడ్పడి.. జీర్ణ ప్రక్రియ చురుగ్గా ఉండేందుకు దోహదపడుతుంది.



సున్ని ఉండలు

బలవర్ధకమైన ఆహారంలో సున్నిఉండలు మొదటిస్థానంలో ఉంటాయి. మినప పిండి, నెయ్యి, బెల్లం వాడతారు. బెల్లం రక్తాన్ని శుద్ధిచేస్తే, సున్ని, నెయ్యి ద్వారా ప్రొటీన్లు, పలు రకాల పోషకాలను, శక్తిని అందిస్తాయి. కొత్త అల్లుళ్లకు సున్ని ఉండలు కొసరి కొసరి వడ్డిస్తారు. హార్మోన్లను సమతుల్యంగా ఉంచడానికి సహకరిస్తుంది. విద్యార్థుల్లో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి మెరుగుపడేందుకు ఇవి ఎంతో తోడ్పడతాయి.

అతి సర్వత్ర వర్జయేత్ అన్నారు. అంటే దేనిలోనూ అతి పనికి రాదు. వంటికి మంచిది కదా.. రుచిగా ఉన్నాయి కదా అని మధుమేహులు, శరీర తత్వానికి పడని వాళ్లు తగిన మోతాదులో తీసుకోవడమే ఆరోగ్యకరం అని గుర్తుంచుకోవడం మంచిది.

గారెలు



సంక్రాంతికి తప్పనిసరిగా వండుకునే వాటిల్లో గారెలు ఒకటి. కనుము నాడు మినుము తింటే మంచిదని పెద్దలు చెబుతారు. అలాగే మినుము తిన్నవాళ్లు ఇనుములా ఉంటారని మరో సామెత. పొట్టు తియ్యని మినుముల్లో పోషకాలు చాలానే ఉంటాయి. రాను రాను పొట్టు తీసిన మినపప్పు గారెలకు వాడుతున్నారు. కానీ మినప పొట్టుతో ఉన్న గారెలే ఆరోగ్యానికి శ్రేష్ఠం. మినుములో మాంసకృత్తులతోపాటు అనేక రకాల ప్రొటీన్లు, పోషకాలు శరీరానికి లభిస్తాయి.



జీవితాన్ని సఫలం చేసుకోవడానికి ఒక్కొక్కరు ఒక్కోవిధమైన లక్ష్యాలను నిర్దేశించుకుంటారు. ఆ లక్ష్యాలను అందుకోవడం కోసం రకరకాల ప్రణాళికలు వేసుకుంటారు. అయితే కేవలం లక్ష్యాలు, ప్రణాళికలు మాత్రమే ఉంటే సరిపోదు. వాటిని సరిగా... సక్రమంగా అమలు చేస్తేనే కదా అనుకున్న వాటిని సాధించగలిగేది! జీవితంలో విజయం సాధించిన కొందరు వ్యక్తుల్లో సర్వసాధారణంగా కనిపించే కొన్ని మంచి అలవాట్ల గురించి తెలుసుకుందాం. వాటిని పిల్లలకు అలవరచే ప్రయత్నం చేద్దాం.

పిల్లలకు ఈ ఆరూ అలవాటు చేశారా?

1. ప్రణాళిక... జీవితంలో ఏం సాధించాలనుకున్నా, దానికి ఒక ప్రణాళిక అవసరం. అంతేకాదు, ఆ ప్రణాళికకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలి. అప్పుడే కదా దానిని అమలు చేయగలిగేది!

2. విశ్రాంతి... కొందరు లక్ష్యాలు ఏర్పాటు చేసుకుంటారు. కానీ ఒత్తిడితో ఉక్కిరి బిక్కిరి అవుతుంటారు. అప్పుడప్పుడు విశ్రాంతి తీసుకోవడం ద్వారా కొత్త ఉత్సాహం పుంజుకుంటుంది. అప్పుడే లక్ష్యాల మీద ఆసక్తి పెరుగుతుంది.

3.ప్రణాళికలను అమలు పరచడం... కేవలం లక్ష్యాలు, ప్రణాళికలు ఉంటే సరిపోదు. వాటిని సరిగా అమలు చేయాలి. అంటే వాటిమీద పనిచేయాలి.

4. వ్యక్తిగత శ్రద్ధ... మనం ఎన్ని లక్ష్యాలు పెట్టుకున్నా వాటిని సాధించే క్రమంలో వ్యక్తిగత శ్రద్ధ అనేది అవసరం. శారీరక, మానసిక ఆరోగ్యాలకు ప్రాముఖ్యత ఇవ్వడం, వీలైనంతగా వ్యాయామం చేయడం ద్వారా తమ శరీరం మీద శ్రద్ధ చూపగలుగుతారు.

5. సానుకూల దృక్పథం... కొందరిలో పాజిటివ్ యాటిట్యూడ్ తక్కువగా ఉంటుంది. తమ లక్ష్యాలపై తమకే నమ్మకం ఉండదు. అలా కాకుండా అనుకున్నది సాధిస్తామనే నమ్మకంతో ముందుకి సాగితే లక్ష్యాలను సాధించడానికి అది ఎంతో సహాయకారిగా ఉంటుంది.

6. నెట్ వర్కింగ్... ఇది విజయం సాధించడంలో ఎంతో సహకరిస్తుంది. ఇతరులతో మన ఆలోచనలు, అభిప్రాయాలు పంచుకోవడం ద్వారా కొత్త విషయాలు తెలుసుకోగలుగుతాం. కొందరి ఐడియాలు మనం విజయం సాధించడానికి ఎంతగానో సహకరిస్తాయి.

ఈ ఆరు అలవాట్లు చాలామంది విజయం సాధించిన వ్యక్తుల్లో కనిపిస్తాయి. ఈ లక్షణాలు మనకు లేవని కానీ, మనం అలవరచుకునే సమయం లేదని కానీ బాధపడనక్కరలేదు. కనీసం మన పిల్లలైనా వాటిని అలవరచుకునేలా చూస్తే మన కళ్లముందు వారు ఎత్తుకు ఎదగడం, విజయపథంలో పయనించడం కూడా మనకు సంతోషకరమే కదా!



సినిమా

హిట్ డేట్ సెట్


● ప్రభాస్

ఈ వేసవిలో థియేటర్స్‌కు వస్తున్నాడు కల్కి. ప్రభాస్ హీరోగా నటిస్తున్న సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ 'కల్కి 2898 ఏడీ'. దీపికా పదుకోన్ నాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దిశా పటానీ కీలక పాత్రధారులు. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో సి. అశ్వనీదత్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని మే 9న విడుదల చేయనున్నట్లుగా చిత్ర యూనిట్ శుక్రవారం ప్రకటించింది. ఈ సందర్భంగా నిర్మాత అశ్వనీదత్ మాట్లాడుతూ– "యాభై ఏళ్లు పూర్తి చేసుకున్న మా వైజయంతీ నిర్మాణ సంస్థలో 'కల్కి 2898 ఏడీ' స్పెషల్ ఫిల్మ్. అలాగే మా ప్రయాణంలో మే 9కి ప్రాముఖ్యత ఉంది. 'జగదేక వీరుడు అతిలోక సుందరి' నుంచి అవార్డులు గెలుచుకున్న 'మహానటి', 'మహర్షి' సినిమాలు ఈ తేదీలో విడుదలై, చరిత్రలో సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకున్నాయి. ఇప్పుడు 'కల్కి 2898 ఏడీ' విడుదల ఒక ప్రత్యేక ముద్ర వేసుకుంటుంది" అని పేర్కొన్నారు.

"నా సామిరంగ' సినిమా కథలోని ప్రేమ, స్నేహం, త్యాగం, ద్వేషం వంటి నాలుగు అంశాలు నాకు బాగా నచ్చాయి. కథలో ఇవే మూల స్తంభాలు. భోగి, మకర సంక్రాంతి, కనుమ.. ఇలా మూడు రోజుల సంక్రాంతి పండగ నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుంది" అన్నారు హీరో నాగార్జున. ఆయన హీరోగా, ఆషికా రంగనాథ్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'నా సామిరంగ'. విజయ్ బిన్నీ దర్శకత్వం వహించారు. 'అల్లరి' నరేశ్, రాజ్ తరుణ్, మిర్నా మీనన్, రుక్సార్ ధిల్లాన్ కీలక పాత్రధారులు. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ సినిమా రేపు (ఆదివారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా నాగార్జున చెప్పిన విశేషాలు.

అలా అనుకుని ఉంటే శివ.. అన్నమయ్య వచ్చేవి కావు

– నాగార్జున



● 'నా సామిరంగ' సినిమా షూటింగ్ 72 రోజులు జరిగితే నా భాగం 60 రోజుల్లో పూర్తి చేశారు. ప్రీ ప్రొడక్షన్ పనులకు 5 నెలలు పట్టింది. సినిమాను త్వరగా పూర్తి చేయాలనుకుంటే తప్పులు ఎక్కువ అవుతాయి. ప్రీ ప్రొడక్షన్ వర్క్ పక్కాగా చేసుకుంటే ఎవరికైనా ఇంత వేగంగా పూర్తి చేయడం సాధ్యపడుతుంది. పైగా కీరవాణిగారు షూటింగ్‌కి ముందే మూడు పాటలు, ఫైట్ సీక్వెన్స్‌కి నేపథ్య సంగీతం చేశారు. ఇంత వేగంగా, భారీ బడ్జెట్‌లో సినిమా చేశామంటే దానికి కీరవాణిగారు ఒక కారణం. ఇందులోని ఏడు పాటలూ అద్భుతంగా ఉంటాయి. ● మనకి సంక్రాంతి పెద్ద పండగ. పైగా ఇది 1980 నేపథ్యంలో జరిగే కథ. తెలుగు తెరపై తొలి సారి సంక్రాంతి ప్రభల తీర్థం నేపథ్యాన్ని తీసుకొస్తున్నాం. ఇది పేరుకే మలయాళ రీమేక్. తెలుగు ప్రేక్షకులకు తగినట్లు కథలో మార్పులు, చేర్పులు చేశారు. ఈ క్రెడిట్ దర్శకుడు విజయ్ బిన్నీకి, రచయిత ప్రసన్నకుమార్ బెజవాడకి దక్కుతుంది. విజయ్ బిన్నీ కొరియోగ్రఫీ చేసిన పాటలు చూశాను. పాటలోనే కథని చెప్పే నేర్పు తనలో ఉంది. స్పష్టత ఉన్న దర్శకుడు.. చెప్పింది చెప్పినట్టు తీశాడు. ● ఈ సినిమాలో నా ఊతపదం నా సామిరంగ. సినిమా మొత్తం 2 గంటల 35 నిమిషాలు వచ్చింది. అందులో 15 నిమిషాలు కట్ చేయడానికి కష్టపడ్డాం.. ఎందుకంటే ప్రతి సీన్ ముఖ్యమైనదిగానే కనిపించింది. నా ప్రతి సినిమానీ ఎడిటింగ్ జరిగాక చూస్తా. అవసరం అనుకుంటే సలహా ఇస్తాను.. కావాలని మార్పులు చెప్పను. అలా చెబితే వాళ్ల క్రియేటివిటీని తక్కువ చేసినట్లవుతుంది. కథకు అవసరం కాబట్టి ఈ మూవీలో చాలా రోజుల తర్వాత మాస్ లుక్‌లో కనిపించాను. ● ఈ చిత్రంలో కిష్టయ్య పాత్రలో కనిపిస్తాను. సినిమాలో నాకు, ఆషికాకి మధ్య 12 ఏళ్ల నుంచి ఒక ప్రేమకథ నడుస్తుంది. చాలా వైవిధ్యమైన ప్రేమకథ ఇది. ఈ మూవీలో సోదర భావం ఉన్న పాత్రకు 'అల్లరి' నరేశ్ సరిపోతాడనిపించి తీసుకున్నాం. రాజ్ తరుణ్‌ది కీలకమైన పాత్రే. అలాగే మిర్నా, రుక్సార్‌ల పాత్రలూ బాగుంటాయి. ● సంక్రాంతికి ఎక్కువ సినిమాలు ఉండటంతో మేం అనుకున్నన్ని థియేటర్లు దొరకలేదు. 'సోగ్గాడే చిన్నినాయనా' అప్పుడూ ఇదే సమస్య. ఆ సినిమాను 300 థియేటర్లలో విడుదల చేశాం. ఇప్పుడు 'నా సామిరంగ' కూడా 300 థియేటర్లలో విడుదలవుతోంది. ● నా నూరవ సినిమా స్టార్ హీరోతో కలిసి మల్టీస్టారర్‌గా చేయాలనే ఆలోచన లేదు. కెరీర్‌లోని మైలురాయి సినిమాలు స్టార్ హీరోలతో కలిసి చేయాలనుకుని ఉంటే నా నుంచి 'శివ, అన్నమయ్య, నిన్నే పెళ్లాడతా' వంటి సినిమాలు వచ్చేవి కావు. వెబ్ సిరీస్ ఆఫర్లు వస్తున్నాయి. రొటీన్‌గా ఉండటంతో చేయడం లేదు. నాగచైతన్యకి వచ్చిన 'దూత' లాంటి కథ కుదిరితే చేస్తాను. నేను, నాగచైతన్య, అఖిల్ కలిసి మల్టీస్టారర్ చేయాలనే ఆలోచన ప్రస్తుతానికి లేదు. నేను, మహేశ్‌బాబు కలసి నటించి, నాగేశ్వర రావు-కృష్ణగార్ల వారసత్వాన్ని కొనసాగించాలని గతంలో ట్వీట్ చేశాను. రాజమౌళిగారి సినిమాని మహేశ్ పూర్తి చేశాక దాని గురించి ఆలోచించాలి (నవ్వుతూ) ● నా తర్వాతి సినిమా శేఖర్ కమ్ములగారి దర్శకత్వంలో ఉంటుంది. తమిళ డైరెక్టర్ నవీన్‌తో ఓ సినిమా ఉంది. డైరెక్టర్ అయాన్ ముఖర్జీ 'వార్ 2' షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. అది పూర్తయ్యాక 'బ్రహ్మాస్త్ర 2' మొదలు పెట్టే చాన్స్ ఉంది.


● కమల్‌హాసన్

ఫైటర్స్ డైరెక్షన్‌లో...

ఏడు పదుల వయసులోనూ కమల్‌హాసన్ మాంచి జోరు మీద ఉన్నారు. వరుస సినిమాలు సైన్ చేస్తూ కుర్ర హీరోలతో పోటీ పడుతున్నారు. ఇప్పటికే దర్శకుడు శంకర్‌తో 'ఇండియన్ 2' చేస్తున్నారు. మణిరత్నంతో 'థగ్ లైఫ్', హెచ్. వినోద్ దర్శకత్వంలో సినిమాలు కమిట్ అయ్యారు. అలాగే ప్రభాస్ 'కల్కి 2898 ఏడీ'లో కీ రోల్ చేస్తున్నారు. ఈ సినిమాలన్నీ చేతిలో ఉండగానే శుక్రవారం తన కెరీర్‌లోని 237వ సినిమాను ప్రకటించారు కమల్‌హాసన్. ఈ సినిమాతో ఫైట్ మాస్టర్స్ ద్వయం అన్బు మణి, అరివు మణిలను దర్శకులుగా పరిచయం చేస్తున్నారు కమల్. "రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్‌నేషనల్ సంస్థలో మరోసారి అన్బు, అరివులకు స్వాగతం. ఈసారి దర్శకులుగా కొత్త బాధ్యతలు తీసుకోనున్నారు. 2025లో ఈ సినిమా చిత్రీకరణ మొదలుపెడతాం" అన్నారు కమల్.

ఓటింగ్ ఆరంభం



ఆస్కార్ ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. 96వ ఆస్కార్ అవార్డుల వేడుక మార్చి 10న లాస్ ఏంజెల్స్‌లో జరగనుంది. కాగా ఓటింగ్ ప్రక్రియను శుక్రవారం మొదలుపెట్టినట్లు ఆస్కార్ అకాడమీ వెల్లడించింది. జనవరి 12న మొదలైన ఈ ఓటింగ్ జనవరి 16 సాయంత్రం 5 గంటల వరకు సాగుతుంది. ఆస్కార్ అకాడమీలో పదివేల మందికి పైగా సభ్యులు ఉన్నారు. వీరందరూ వారికి కేటాయించిన విభాగాల్లోని వారికి ఓటు వేస్తారు. అకాడమీలో సభ్యులుగా ఉన్న యాక్టర్స్ యాక్టింగ్ విభాగానికి మాత్రమే ఓటు వేస్తారు. అలాగే మిగతా విభాగాల వారు కూడా. 23 విభాగాల్లో ఆస్కార్ అవార్డుల విజేతలను ప్రకటిస్తారు. అయితే 'ఇంటర్‌నేషనల్ ఫీచర్ ఫిల్మ్', 'డాక్యుమెంటరీ షార్ట్ సబ్జెక్ట్', 'డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్' విభాగాలకు చెందిన ఓటింగ్‌కు మాత్రం ప్రత్యేకమైన నిబంధనలు ఉంటాయట. ఈ నెల 23న ఆస్కార్ నామినేషన్స్‌ను ప్రకటిస్తారు. ఇప్పటికే పది విభాగాల్లోని షార్ట్ లిస్ట్ జాబితాను ప్రకటించారు ఆస్కార్ నిర్వాహకులు.


● అమృత

తొలిసారి అలాంటి అనుభూతి దక్కింది

"'హను-మాన్' సినిమా ప్రేక్షకులకు నచ్చాలనే లక్ష్యంతోనే యూనిట్ అంతా పని చేశాం. ఆడియన్స్‌తో కలిసి ఈ సినిమా చూశాను. వారి స్పందన చూస్తుంటే గూస్ బంప్స్ వచ్చాయి. నా కెరీర్‌లో తొలిసారి అలాంటి అనుభూతి దక్కింది" అని హీరోయిన్ అమృతా అయ్యర్ అన్నారు. తేజ సజ్జా, అమృతా అయ్యర్ జంటగా ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించిన చిత్రం 'హను-మాన్'. శ్రీమతి చైతన్య సమర్పణలో కె. నిరంజన్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా శుక్రవారం రిలీజైంది. ఈ సందర్భంగా అమృతా అయ్యర్ మాట్లాడుతూ– "ప్రశాంత్ వర్మగారు 'హను-మాన్'ని అద్భుతంగా తీశారు. ఈ మూవీలో మీనాక్షి పాత్రని చక్కగా చేశావని ప్రేక్షకులు చెబుతుంటే హ్యాపీగా ఉంది. ఈ మూవీ జర్నీలో సహనంగా ఉండటం నేర్చుకున్నాను.. నటీనటులకు సహనం చాలా ముఖ్యం. 'హను-మాన్ 2' ఉంటుందని నాకూ తెలియదు. స్క్రీన్‌పై చూసి, సర్‌ప్రైజ్ అయ్యాను. ప్రస్తుతం తెలుగులో 'అల్లరి' నరేశ్‌కి జోడీగా ఓ సినిమా చేస్తున్నాను" అన్నారు.


● ప్రియాంక, ధనుష్

కెప్టెన్ మిల్లర్ రెడీ

ధనుష్ టైటిల్ రోల్‌లో నటించిన పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'కెప్టెన్ మిల్లర్'. ప్రియాంకా అరుళ్ మోహన్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, సందీప్ కిషన్ కీలక పాత్రల్లో నటించారు. టీజీ త్యాగరాజన్, సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మించిన ఈ చిత్రం తమిళ, హిందీ భాషల్లో ఈ నెల 12న విడుదలైంది. తెలుగు వెర్షన్ ఈ నెల 25న విడుదల కానుంది. ఏషియన్ మల్టీప్లెక్స్, సురేష్ ప్రొడక్షన్స్ సంస్థలు 'కెప్టెన్ మిల్లర్' సినిమాను తెలుగులో విడుదల చేయనున్నాయి.

ఫిబ్రవరిలో తిరగబడరా!

రాజ్ తరుణ్, మాల్వీ మల్హోత్రా జంటగా నటించిన చిత్రం 'తిరగబడర సామీ'. ఏఎస్ రవికుమార్ చౌదరి దర్శకత్వంలో మల్కాపురం శివకుమార్ నిర్మించారు. ఈ చిత్రం విడుదల తేదీని ప్రకటించారు మేకర్స్. ఫిబ్రవరి 23న సినిమా రిలీజ్ కానుంది. "పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రం 'తిరగబడర సామీ'. యువతని ఆకట్టుకునే రొమాన్స్‌తో పాటు ఫ్యామిలీని ఆకర్షించే సెంటిమెంట్, మాస్‌ని అలరించే హై ఓల్టేజ్ యాక్షన్, ఎమోషనల్ ఎలిమెంట్స్‌తో ఈ చిత్రాన్ని రూపొందించాం. నటి మన్నారా చోప్రా ఈ చిత్రంలో ఓ విభిన్నమైన పాత్రతో పాటు ప్రత్యేక గీతంతో అలరించనున్నారు. ఈ చిత్రానికి యువతని ఉర్రూతలూగించే పాటలు, అద్భుతమైన నేపథ్య సంగీతం అందించారు సంగీత దర్శకుడు జేబీ" అని చిత్రబృందం పేర్కొంది.


● రాజ్ తరుణ్, మాల్వీ

వెండితెర సౌరవ్


● ఆయుష్మాన్ ఖురానా

భారత మాజీ క్రికెటర్ సౌరవ్ గంగూలీ బయోపిక్ గురించి కొన్ని రోజులుగా వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. వెండితెర సౌరవ్‌గా రణ్‌బీర్ కపూర్, రణ్‌వీర్ సింగ్, ఆయుష్మాన్ ఖురానాల పేర్లు వినిపించాయి. అయితే ఆయుష్మాన్ ఖురానా దాదాపు ఖరారై పోయారని, త్వరలో క్రికెట్ శిక్షణను మొదలుపెడతారని బాలీవుడ్ సర్కిల్స్‌లో వినిపిస్తున్న తాజా మాట. హిందీలో 'ఉడ్తాన్', 'ట్రాప్డ్', 'భవేష్ జోషి సూపర్ హీరో' వంటి సినిమాలకు దర్శకత్వం వహించిన విక్రమాదిత్య మొత్వాని ఈ బయోపిక్‌ను తెరకెక్కించనున్నారు. ఈ సినిమాను లవ్ రంజన్, అంకుర్ గార్గ్ నిర్మించనున్నారట. మరి.. సౌరవ్ పాత్రలో ఆయుష్మాన్ ఖురానా కనిపిస్తారా? లెట్స్ వెయిట్ అండ్ సీ.

సాక్షి బిజినెస్
శనివారం
13-1-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
847	247
72,568	21,895

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	14,954	▼ 16
డోజోన్స్	37,502	▼ 209
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,625	▲ 48
డాక్స్	16,705	▲ 158
షాంఘై	2,881	▼ 5
నికాయ్	35,557	▲ 527

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	62,515	▼ 86
బంగారం (99.5 స్వచ్ఛత)	62,265	▼ 85
వెండి (కిలో)	71,530	▲ 85

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.68	83.70
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	105.01	107.59
€	యూరో	ఒకటి	92.38	92.56
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	56.74	58.04
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	56.69	56.81
S$	సింగపూర్ డాలర్	ఒకటి	61.69	63.49
SAR	సౌదీ రియాల్	పదింటికి	21.21	22.64
UAE D	యూఏఈ దిర్హామ్	పదింటికి	21.59	23.22
¥	చైనా యువాన్	పదింటికి	10.41	12.36

ఇంజినీర్లకు రిలయన్స్‌లో అవకాశాలు

గెట్ 2024 ప్రోగ్రాంకు దరఖాస్తులు షురూ

న్యూఢిల్లీ: పెట్రోకెమికల్స్ నుంచి న్యూ ఎనర్జీ వరకు వివిధ విభాగాల్లో నియామకాలు చేపట్టేందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్ తాజాగా గ్రాడ్యుయేట్ ఇంజినీర్ ట్రైనీ (గెట్)–2024 ప్రోగ్రాంను ఆవిష్కరించింది. యువ ఇంజినీర్లకు దేశవ్యాప్తంగా ఎంట్రీ స్థాయి రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను చేపట్టినట్లు సంస్థ తెలిపింది. జనవరి 11న ప్రారంభమైన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ 19 వరకు కొనసాగుతుందని కంపెనీ తమ వెబ్‌సైట్‌లో పేర్కొంది. ఏఐసీటీఈ అనుమతి ఉన్న విద్యా సంస్థల్లో కెమికల్, ఎలక్ట్రికల్, మెకానికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్ మొదలైన స్ట్రీమ్స్‌లో చదివిన 2024 బీటెక్, బీఈ గ్రాడ్యుయేట్లు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. 10వ, 12వ తరగతుల్లో, డిప్లొమాలో (వర్తిస్తే) కనీసం 60 శాతం మార్కులు లేదా 6 సీజీపీఏ ఉండాలి. షార్ట్‌లిస్ట్ అయిన విద్యార్థులకు ఫిబ్రవరి 5 నుంచి 8 వరకు ఆన్‌లైన్ అసెస్‌మెంట్ ఉంటుంది. తర్వాత ఫిబ్రవరి 23 నుంచి మార్చి 1 వరకు వ్యక్తిగత ఇంటర్వ్యూలు ఉంటాయి. మార్చి ఆఖరులో నియామకాలను ఖరారు చేస్తారు.



స్కైడ్రైవ్‌తో సైయంట్ జట్టు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇంజినీరింగ్, టెక్నాలజీ సొల్యూషన్స్ సంస్థ సైయంట్ తాజాగా జపాన్‌కి చెందిన ఈవీటీవోఎల్ విమానాల తయారీ సంస్థ స్కైడ్రైవ్‌తో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. దీని ప్రకారం ఉత్పత్తుల అభివృద్ధి, ఇంజినీరింగ్, తయారీ, డిజిటల్ సర్వీసులు మొదలైన అంశాల్లో రెండు సంస్థలు కలిసి పని చేస్తాయి. పట్టణీకరణ, జనాభా, ఈ–కామర్స్ పెరుగుతున్న నేపథ్యంలో చౌకైన, సురక్షితమైన, ఆధునికమైన రవాణా మాధ్యమాల అవసరం ఏర్పడిందని సైయంట్ వ్యవస్థాపక చైర్మన్ బీవీఆర్ మోహన్ రెడ్డి తెలిపారు. భారత్ సహా అంతర్జాతీయంగా అర్బన్ ఎయిర్ మొబిలిటీ (యూఏఎం) మార్కెట్‌లో విస్తరించేందుకు స్కైడ్రైవ్‌కు సైయంట్‌తో భాగస్వామ్యం తోడ్పడగలదని ఆయన పేర్కొన్నారు. తమ ఈవీటీవోఎల్ కోసం అధునాతన సాంకేతికతను అభివృద్ధి చేసేందుకు సైయంట్‌తో జట్టు కట్టినట్లు స్కైడ్రైవ్ సీఈవో తొమొహిరో తెలిపారు.



ఐటీ షేర్ల అండ.. కొత్త శిఖరాలు

- పీఎస్‌యూ బ్యాంకులు, ఇంధన, రియల్టీ షేర్లకూ డిమాండ్
- ఇంట్రాడే, ముగింపుల్లో సరికొత్త రికార్డుల నమోదు
- ఇన్వెస్టర్ల సంపద ఆల్‌టైం హైకి



న్యూఢిల్లీ: ఐటీ షేర్లలో నెలకొన్న కొనుగోళ్ల అండతో స్టాక్ సూచీలు శుక్రవారం ఇంట్రాడే, ముగింపుల్లోనూ సరికొత్త జీవితకాల గరిష్టాలను నమోదు చేశాయి. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి విలువ బలపడటమూ కలిసొచ్చింది. ఐటీతో పాటు అధిక వెయిటేజీ ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఇంధన షేర్లు, అలాగే సర్వీసెస్, రియల్టీ, ఎఫ్‌ఎంసీజీ, మెటల్, వినిమయ షేర్లు రాణించి సూచీల రికార్డుల ర్యాలీకి దన్నుగా నిలిచాయి. ఫలితంగా సెన్సెక్స్ 847 పాయింట్లు పెరిగి 72,568 వద్ద, నిఫ్టీ 247 పాయింట్లు బలపడి 21,895 వద్ద స్థిరపడ్డాయి. ఈ ముగింపు ఇరు సూచీలకు సరికొత్త రికార్డు స్థాయిలు కావడం విశేషం. విస్తృత స్థాయి మార్కెట్లో చిన్న, మధ్య తరహా షేర్లకు స్వల్పంగా కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్‌ఈ స్మాల్, మిడ్ సూచీలు 0.41%, 0.36% లాభపడ్డాయి. రికార్డుల ర్యాలీలోనూ ఫార్మా, ఆటో, మీడియా షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అమెరికా డిసెంబర్ రిటైల్ ద్రవ్యోల్బణ, ఉపాధి కల్పన అంచనాలకు మించిన నమోదు కారణంగా 'ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపు వాయిదా' ఆందోళనలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.


ఇంట్రాడేలో సెన్సెక్స్ 1,000 పాయింట్లు జంప్

ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని ప్రతికూలతలను విస్మరిస్తూ ఉదయం సూచీలు లాభాల్లో మొదలయ్యాయి. సెన్సెక్స్ 427 పాయింట్ల లాభంతో 72,148 వద్ద, నిఫ్టీ 127 పాయింట్లు పెరిగి 21,774 వద్ద ట్రేడింగ్ ప్రారంభించాయి. ఉత్సాహంగా మొదలైన సూచీలు రోజంతా అదే రోజు కనబరిచాయి. ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 1000 పాయింట్లు ఎగసి 72,721 వద్ద, నిఫ్టీ 282 పాయింట్లు బలపడి 21,928 వద్ద కొత్త జీవితకాల గరిష్టాలకు చేరాయి.

- సెన్సెక్స్ ర్యాలీతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ 4 సెషన్లలో రూ.6.88 లక్షల కోట్లు పెరిగి ఆల్ టైం హై రూ.373.29 లక్షల కోట్లకు చేరింది.
- ఐటీ రంగ షేర్లు 8% ర్యాలీ చేసి సూచీలను సరికొత్త శిఖరాల వైపు నడిపించాయి. దేశీయ దిగ్గజ ఐటీ కంపెనీలైన ఇన్ఫోసిస్, టీసీఎస్‌ల క్యూ3 ఆర్థిక ఫలితాలు మెప్పించడంతో ఈ రంగ షేర్లకు డిమాండ్ పెంచింది. కోఫోర్జ్ 6%, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్‌టెక్, ఎల్‌టీఐఎం షేర్లు 5%, విప్రో, ఎంఫసీస్‌లు 4%, పెర్సిస్టెంట్ 3.50%, ఎల్‌టీటీఎస్ 2% లాభపడ్డాయి.
- అంచనాలకు తగ్గట్టు డిసెంబర్ క్వార్టర్ ఆర్థిక ఫలితాలు ప్రకటించడంతో ఇన్ఫోసిస్ షేరు 8% ఎగసి రూ.1612 వద్ద ముగిసింది.
- ఇదే క్యూ3లో మెరుగైన పనితీరుతో పటిష్టమైన ఆర్థిక ఫలితాలు సాధించిన టీసీఎస్ షేరు 4% లాభపడి రూ.3,882 వద్ద స్థిరపడింది.
- బ్యాంక్ ఆఫ్ ఇండియా 6%, యూనియన్ బ్యాంక్, మహారాష్ట్ర బ్యాంక్‌లు 5%, పీఎస్‌బీ, యూకో బ్యాంక్, పీఎస్‌బీ, సెంట్రల్ బ్యాంక్‌లు 3% పెరిగాయి. ఎస్‌బీఐ, ఐఓబీ, కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ బ్యాంక్ షేర్లు 2–1% మధ్య లాభపడ్డాయి.

విప్రో లాభం డౌన్...

- నికర లాభం రూ. 2,694 కోట్లు
- ఆదాయం రూ. 22,205 కోట్లు



న్యూఢిల్లీ: సాఫ్ట్‌వేర్ సేవల దిగ్గజం విప్రో లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) మూడో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం దాదాపు 12 శాతం క్షీణించి రూ. 2,694 కోట్లకు పరిమితమైంది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 3,053 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 4 శాతం వెనకడుగుతో రూ. 22,205 కోట్లకు చేరింది. గత క్యూ3లో రూ. 23,229 కోట్ల టర్నోవర్ సాధించింది. ఐటీ సర్వీసుల విభాగం 4.5 శాతం తక్కువగా రూ. 22,151 కోట్ల ఆదాయం అందుకుంది.

గైడెన్స్ ఇలా


ఈ ఏడాది చివరి త్రైమాసికం(జనవరి–మార్చి)లో ఐటీ సర్వీసుల బిజినెస్ 261.5–266.9 కోట్ల డాలర్ల(రూ. 21,845–22,296 కోట్లు) మధ్య టర్నోవర్‌ను సాధించే వీలున్నట్లు విప్రో తాజాగా అంచనా వేసింది. వాటాదారులకు ప్రతీ షేరుకీ రూ. 1 చొప్పున మధ్యంతర డివిడెండును ప్రకటించింది.

ఇతర విశేషాలు

- ఐటీ సర్వీసుల నిర్వహణ లాభం(ఇబిట్) త్రైమాసికవారీగా 2 శాతం తగ్గి రూ. 3,540 కోట్లుగా నమోదైంది.
- బీఎఫ్‌ఎస్‌ఐ సర్వీసుల విభాగం ఆదాయం 12.1% క్షీణించగా.. కన్జూమర్ 6.9%, తయారీ 9.1% చొప్పున నీరసించాయి. కమ్యూనికేషన్స్ నుంచి మాత్రం 18.8 శాతం జంప్‌చేసింది.
- ఆర్డర్ బుక్ 0.2 శాతం బలపడి 3.8 బిలియన్ డాలర్లుగా నమోదైంది. వీటిలో భారీ డీల్స్ విలువ 0.9 బిలియన్ డాలర్లు.
- ఉద్యోగ వలసల(అట్రిషన్) రేటు గత 6 క్వార్టర్లకల్లా కనిష్టంగా 14.2 శాతంగా నమోదైంది.
- డిసెంబర్‌కల్లా 4,473 మంది ఉద్యోగులు తగ్గారు. దీంతో మొత్తం సిబ్బంది సంఖ్య 2,40,234గా నమోదైంది.

ఫలితాల నేపథ్యంలో విప్రో షేరు దాదాపు 4 శాతం జంప్‌చేసి రూ. 465 వద్ద ముగిసింది.

నాలుగు నెలల గరిష్టానికి ద్రవ్యోల్బణం



న్యూఢిల్లీ: రిటైల్ ద్రవ్యోల్బణం మళ్లీ ఎగువ బాట పట్టింది. కూరగాయాలు, పప్పులు, వంట దినుసుల ధరల మంటతో డిసెంబర్ మాసానికి 5.69%కి పెరిగింది. ఇది నాలుగు నెలల గరిష్ఠ స్థాయి కావడం గమనించాలి. వినియోగ ధరల సూచీ (సీపీఐ/రిటైల్) ఆధారిత ద్రవ్యోల్బణం 2023 నవంబర్ నెలలో 5.55%గా ఉంటే, 2022 డిసెంబర్ నెలకు 5.72%గా ఉంది. ఈ వివరాలను జాతీయ గణాంక కార్యాలయం విడుదల చేసింది. రిటైల్ ద్రవ్యోల్బణంలో సగం వాటా కలిగిన ఆహారోత్పత్తుల ధరలు (కూరగాయలతో కూడిన).. గతేడాది నవంబర్ నెలలో 8.7%గా ఉంటే, డిసెంబర్ నెలలో 9.53%కి పెరిగిపోయాయి. 2022 డిసెంబర్‌లో వీటి ధరలు సూచీలో 4.19% వద్దే ఉండడం గమనార్హం. 2023 ఆగస్ట్‌లో ద్రవ్యోల్బణం 6.83% గరిష్ఠ స్థాయిని తాకిన తర్వాత నుంచి కొంత తగ్గుతూ వచ్చింది. కూరగాయల విభాగం ద్రవ్యోల్బణం 27.64%గా ఉంది. పప్పులకు సంబంధించి 20.73%, వంట దినుసుల ద్రవ్యోల్బణం 19.69% చొప్పున నమోదైంది.

ఆహార విభాగంలోనే...

సీపీఐ ద్రవ్యోల్బణం త్రైమాసికం వారీగా పెరిగిపోవడం అన్నది ఆహారం, పానీయాల విభాగం వల్లేనని ఇక్రా ముఖ్య ఆర్థికవేత్త అదితి నాయర్ పేర్కొన్నారు. మిగిలిన అన్ని విభాగాల్లో ద్రవ్యోల్బణం కొంత తగ్గడం లేదంటే అదే స్థాయిలో కొనసాగినట్టు తెలిపారు. రిటైల్ ద్రవ్యోల్బణాన్ని దీర్ఘకాలంలో 4% స్థాయిలో (2 శాతం అటూ ఇటూ దాటకుండా) పరిమితం చేయాలన్నది ఆర్‌బీఐ లక్ష్యం.

హెచ్‌సీఎల్ టెక్.. లాభం ప్లస్

- క్యూ3లో రూ. 4,350 కోట్లు
- ఆదాయం రూ. 28,446 కోట్లు



న్యూఢిల్లీ: సాఫ్ట్‌వేర్ సేవల దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 6 శాతంపైగా బలపడి రూ. 4,350 కోట్లను తాకింది. త్రైమాసికవారీగా కంపెనీ చరిత్రలోనే ఇది అత్యధికంకాగా.. గతేడాది (2022–23) ఇదే కాలంలో రూ. 4,096 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 6.5 శాతం వృద్ధితో రూ. 28,446 కోట్లకు చేరింది. గత క్యూ3లో రూ. 26,700 కోట్ల టర్నోవర్ సాధించింది.

గైడెన్స్ ఇలా..: మార్చితో ముగిసే పూర్తి ఏడాది(2023–24)కి ఐటీ సర్వీసుల ఆదాయం 5–5.5 శాతం స్థాయిలో పురోగమించగలదని కంపెనీ అంచనా వేసింది. 2023 జూలైలో సొంతం చేసుకున్న జర్మన్ ఇంజినీరింగ్ సంస్థ అసాప్ ఆదాయాన్ని కలుపుకుని తాజా గైడెన్స్ ప్రకటించింది. కాగా.. వాటాదారులకు రూ. 12 చొప్పున మధ్యంతర డివిడెండును ప్రకటించింది.


ఇతర విశేషాలు...

- మొత్తం 192.7 కోట్ల డాలర్ల ఆర్డర్లను సాధించింది. 18 భారీ డీల్స్ కుదుర్చుకుంది.
- ఉద్యోగ వలసల(అట్రిషన్) రేటు 14.2 శాతం నుంచి తగ్గి 12.8 శాతానికి పరిమితమైంది.
- డిసెంబర్‌కల్లా 3,617 మంది జత కావడంతో మొత్తం సిబ్బంది సంఖ్య 2,24,756కు చేరింది. 3,818 మంది ఫ్రెషర్స్‌ను తీసుకుంది.

ఫలితాల నేపథ్యంలో హెచ్‌సీఎల్ టెక్ షేరు 4 శాతం జంప్‌చేసి రూ. 1,543 వద్ద ముగిసింది.

మందగించిన పారిశ్రామికోత్పత్తి

నవంబర్‌లో 2.4 శాతం • 8 నెలల కనిష్టానికి తగ్గుదల



న్యూఢిల్లీ: తయారీ రంగ పేలవ పనితీరు కారణంగా దేశీయంగా 2023 నవంబర్‌లో పారిశ్రామికోత్పత్తి (ఐఐపీ) వృద్ధి మందగించింది. 8 నెలల కనిష్ఠ స్థాయి 2.4 శాతంగా నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు ఇదే తక్కువ స్థాయి వృద్ధి. చివరిసారిగా 2023 మార్చిలో అత్యంత తక్కువగా 1.9% స్థాయిలో ఐఐపీ వృద్ధి నమోదైంది. గతేడాది నవంబర్‌లో ఇది 7.6%. 2023–24 ఏప్రిల్–నవంబర్ మధ్య ఐఐపీ వృద్ధి 6.4%. అంతక్రితం ఆర్థిక సంవత్సరం అదే వ్యవధిలో వృద్ధి 5.6%. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్‌వో) శుక్రవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. తయారీ రంగం వృద్ధి 1.2 శాతానికి పరిమితమైంది. అంతక్రితం నవంబర్‌లో ఇది 6.7%గా ఉంది. విద్యుదుత్పత్తి వృద్ధి కూడా 12.7% నుంచి 5.8 శాతానికి నెమ్మదించింది. మైనింగ్ రంగ ఉత్పత్తి వృద్ధి 9.7% నుంచి 6.8 శాతానికి తగ్గింది. కన్జూమర్ డ్యూరబుల్స్ ఉత్పత్తి 5.4% మేర క్షీణించింది. అంతక్రితం నవంబర్‌లో 5% వృద్ధి నమోదైంది. కన్జూమర్ నాన్–డ్యూరబుల్ గూడ్స్ ఉత్పత్తి 3.6 శాతం క్షీణించింది. గత నవంబర్‌లో 10% వృద్ధి నమోదైంది. మౌలిక సదుపాయాలు/నిర్మాణ రంగ ఉత్పత్తుల విభాగం స్వల్పంగా 1.5% వృద్ధి చెందింది.

సాక్షి స్పోర్ట్స్



ఆస్ట్రేలియన్ ఓపెన్ మెయిన్ 'డ్రా'కు సుమిత్ అర్హత

టెన్నిస్ సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఆస్ట్రేలియన్ ఓపెన్ మెయిన్ 'డ్రా'కు భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ అర్హత సాధించాడు. మెల్‌బోర్న్‌లో శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్ ఫైనల్ రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ 139వ ర్యాంకర్ సుమిత్ 6–4, 6–4తో ప్రపంచ 118వ ర్యాంకర్ అలెక్స్ మోల్కన్ (స్లొవేకియా)పై నెగ్గాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ మెయిన్ 'డ్రా'కు అర్హత పొందడం సుమిత్‌కిది రెండోసారి. 2021లోనూ అతను అర్హత సాధించాడు. అలెక్స్‌తో 2 గంటల 3 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో సుమిత్ ఐదు ఏస్‌లు సంధించాడు. తన సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశాడు. 22 విన్నర్స్ కొట్టిన సుమిత్ నెట్ వద్ద 12 సార్లు పాయింట్లు గెలిచాడు. ఆదివారం మొదలయ్యే ప్రధాన టోర్నీ మెయిన్ 'డ్రా' తొలి రౌండ్‌లో ప్రపంచ 31వ ర్యాంకర్ బుబ్లిక్ (కజకిస్తాన్)తో సుమిత్ తలపడతాడు.

ఫైనల్లో బోపన్న ద్వయం



అడిలైడ్: కొత్త ఏడాదిని టైటిల్‌తో ప్రారంభించేందుకు భారత వెటరన్ టెన్నిస్ స్టార్ రోహన్ బోపన్న విజయం దూరంలో నిలిచాడు. అడిలైడ్ ఇంటర్నేషనల్ ఏటీపీ–250 టోర్నీలో బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ ఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో బోపన్న–ఎబ్డెన్ ద్వయం 6–4, 6–4తో గొంజాలో ఎస్కోబార్ (కొలంబియా)–అలెగ్జాండర్ నెదోవ్‌యెసోవ్ (కజకిస్తాన్) జంటపై గెలిచింది. నేడు జరిగే ఫైనల్లో రాజీవ్ రామ్ (అమెరికా)–జో సాలిస్‌బరీ (బ్రిటన్)లతో బోపన్న–ఎబ్డెన్ తలపడతారు. 43 ఏళ్ల బోపన్న ఇప్పటి వరకు 24 ఏటీపీ డబుల్స్ టైటిల్స్ సాధించాడు.

'పారిస్' బెర్త్ లక్ష్యంగా...

- అమెరికాతో భారత్ తొలి మ్యాచ్
- మహిళల హాకీ ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీ



రాంచీ: ఆసియా క్రీడల ద్వారా నేరుగా పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత పొందలేకపోయిన భారత మహిళల హాకీ జట్టు... అందుబాటులో ఉన్న రెండో అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనే పట్టుదలతో ఉంది. రాంచీలో నేటి నుంచి జరిగే మహిళల హాకీ ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీలో సవితా పూనియా సారథ్యంలో భారత జట్టు బరిలోకి దిగనుంది. మొత్తం 8 జట్లు పాల్గొంటున్న ఈ టోర్నీలో టాప్–3లో నిలిచిన జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తాయి. గ్రూప్ 'ఎ'లో చిలీ, చెక్ రిపబ్లిక్, జర్మనీ, జపాన్... గ్రూప్ 'బి'లో భారత్, అమెరికా, న్యూజిలాండ్, ఇటలీ జట్లున్నాయి. నేడు జరిగే తొలి రౌండ్ లీగ్ మ్యాచ్‌ల్లో అమెరికాతో భారత్; న్యూజిలాండ్‌తో ఇటలీ; చిలీతో జర్మనీ; చెక్ రిపబ్లిక్‌తో జపాన్ తలపడతాయి. భారత్, అమెరికా మ్యాచ్ రాత్రి 7 గంటల 30 నిమిషాలకు మొదలవుతుంది. ఈ మ్యాచ్‌ను స్పోర్ట్స్ 18 చానెల్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

అఖిల్ పసిడి గురి

వ్యక్తిగత, టీమ్ విభాగాల్లో స్వర్ణ పతకాలు

జకార్తా: ఆసియా ఒలింపిక్ క్వాలిఫయింగ్ షూటింగ్ టోర్నమెంట్‌లో భారత క్రీడాకారుల పతకాల వేట కొనసాగుతోంది. శుక్రవారం భారత షూటర్లు రెండు స్వర్ణ పతకాలు, ఒక రజత పతకం సొంతం చేసుకున్నారు. పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ విభాగంలో అఖిల్ షెరోన్ పసిడి పతకం నెగ్గగా... ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్ రజత పతకం కైవసం చేసుకున్నాడు. అఖిల్, ఐశ్వర్య ప్రతాప్, స్వప్నిల్ కుసాలేలతో కూడిన భారత జట్టు టీమ్ విభాగంలో బంగారు పతకం దక్కించుకుంది. ఎనిమిది మంది షూటర్లు పోటీపడ్డ ఫైనల్లో అఖిల్ 460.2 పాయింట్లు స్కోరు చేసి విజేతగా నిలిచాడు. ఐశ్వర్య ప్రతాప్ 459 పాయింట్లతో రెండో స్థానాన్ని పొందగా... తోంగ్‌ఫాపుమ్ (థాయ్‌లాండ్; 448.8 పాయింట్లు) మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని గెలిచాడు. అఖిల్, ఐశ్వర్య ప్రతాప్, స్వప్నిల్ బృందం టీమ్ విభాగంలో 1758 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో నిలిచింది. ప్రస్తుతం భారత్ 11 స్వర్ణాలు, 8 రజతాలు, 7 కాంస్యాలతో కలిపి మొత్తం 26 పతకాలతో అగ్రస్థానంలో కొనసాగుతోంది.



భారత షూటర్లు ఐశ్వర్య ప్రతాప్ సింగ్, అఖిల్ షెరోన్, స్వప్నిల్

మళ్లీ ఓడిన టైటాన్స్

జైపూర్: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో తెలుగు టైటాన్స్ జట్టు పరాజయాల పరంపర కొనసాగుతోంది. జైపూర్ పింక్ పాంథర్స్‌తో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 35–38తో పోరాడి ఓడిపోయింది. ఈ లీగ్‌లో టైటాన్స్‌కిది 11వ ఓటమి కావడం గమనార్హం. టైటాన్స్ తరఫున కెప్టెన్ పవన్ సెహ్రావత్ 12 పాయింట్లు స్కోరు చేయగా... సందీప్ ధుల్, రాబిన్ 5 పాయింట్ల చొప్పున సాధించారు. జైపూర్ తరఫున అర్జున్ దేశ్వాల్ అత్యధికంగా 14 పాయింట్లతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. మరో మ్యాచ్‌లో పుణేరి పల్టన్ 37–17తో గుజరాత్ జెయింట్స్‌ను ఓడించింది. పుణేరి పల్టన్ కెప్టెన్ అస్లమ్ ముస్తఫా 10 పాయింట్లు సాధించాడు. నేడు జరిగే మ్యాచ్‌ల్లో జైపూర్ పింక్ పాంథర్స్‌తో పుణేరి పల్టన్; యూపీ యోధాస్‌తో బెంగాల్ వారియర్స్ తలపడతాయి.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
పుణేరి పల్టన్	11	10	1	0	51
జైపూర్ పింక్ పాంథర్స్	11	7	2	2	43
దబంగ్ ఢిల్లీ	11	7	3	1	40
గుజరాత్ జెయింట్స్	12	7	5	0	39
యు ముంబా	11	6	4	1	35
హరియాణా స్టీలర్స్	11	6	4	1	34
బెంగళూరు బుల్స్	12	5	7	0	31
పట్నా పైరేట్స్	11	5	6	0	29
బెంగాల్ వారియర్స్	11	4	5	2	28
యూపీ యోధాస్	12	3	8	1	21
తమిళ్ తలైవాస్	11	3	8	0	19
తెలుగు టైటాన్స్	12	1	11	0	10

నోట్: ఆ–ఆడినవి, గె–గెలిచినవి, ఓ–ఓడినవి, పా–పాయింట్లు

తొలి టి20లో పాక్ ఓటమి

46 పరుగులతో న్యూజిలాండ్ గెలుపు

ఆక్లాండ్: పాకిస్తాన్‌తో శుక్రవారం జరిగిన తొలి టి20లో న్యూజిలాండ్ 46 పరుగులతో గెలిచింది. ముందుగా న్యూజిలాండ్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 226 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' డారైల్ మిచెల్ (27 బంతుల్లో 61; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు), విలియమ్సన్ (42 బంతుల్లో 57; 9 ఫోర్లు) అర్ధ సెంచరీలు సాధించగా... ఫిన్ అలెన్ (15 బంతుల్లో 34; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) చెలరేగాడు. షాహిన్ అఫ్రిది వేసిన మూడో ఓవర్లో అలెన్ తొలి ఐదు బంతుల్లో వరుసగా 6, 4, 4, 4, 6తో 24 పరుగులు రాబట్టడం విశేషం. అనంతరం పాక్ 18 ఓవర్లలో 180 పరుగులకే ఆలౌటైంది. పాక్‌ను కట్టడి చేసిన టిమ్ సౌతీ (4/25) ఈ మ్యాచ్‌తో అంతర్జాతీయ టి20ల్లో 150 వికెట్లు సాధించిన తొలి బౌలర్‌గా నిలిచాడు.

హైదరాబాద్‌కు ఆధిక్యం

- తొలి ఇన్నింగ్స్‌లో 182/4
- మేఘాలయాతో రంజీ మ్యాచ్



రోహిత్

షిల్లాంగ్: రంజీ ట్రోఫీ 'ప్లేట్' గ్రూప్‌లో భాగంగా మేఘాలయాతో జరుగుతున్న మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు మొదటి రోజే ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. శుక్రవారం మొదలైన ఈ పోరులో ముందుగా మేఘాలయ తొలి ఇన్నింగ్స్‌లో 33.1 ఓవర్లలో 111 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ కిషన్ లింగ్డో (51) మినహా అంతా విఫలమయ్యారు. పాలకోడేటి సాకేత్ సాయిరామ్ (4/33) నాలుగు వికెట్లు పడగొట్టగా... సీవీ మిలింద్, తనయ్ త్యాగరాజన్, రవితేజ తలా 2 వికెట్లు తీశారు. అనంతరం హైదరాబాద్ ఆట ముగిసే సమయానికి 47 ఓవర్లలో 4 వికెట్లకు 182 పరుగులు సాధించింది. ఫలితంగా 71 పరుగుల ఆధిక్యం లభించింది. రోహిత్ రాయుడు (54 నాటౌట్), చందన్ సహని (52) అర్ధ సెంచరీలు చేశారు.

ముంబై 281/6...

ముంబై: 'ఎలైట్' గ్రూప్‌లో ఆంధ్ర జట్టుతో జరుగుతున్న మ్యాచ్‌లో శుక్రవారం ఆట ముగిసేసరికి ముంబై తమ తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్ల నష్టానికి 281 పరుగులు సాధించింది. భూపేన్ లాల్వాని (61) అర్ధ సెంచరీ చేయగా... శ్రేయస్ అయ్యర్ (48), సువేద్ పార్కర్ (41) ఫర్వాలేదనిపించారు. గత మ్యాచ్‌కు దూరమై ఈసారి కెప్టెన్‌గా బరిలోకి దిగిన సీనియర్ ప్లేయర్ అజింక్య రహానే (0) తొలి బంతికే నితీశ్ కుమార్ రెడ్డి బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యూగా వెనుదిరగడం విశేషం. నితీశ్‌కు 3, షోయబ్ మొహమ్మద్ ఖాన్‌కు 2 వికెట్లు దక్కాయి.

కెప్టెన్సీకి విహారి రాజీనామా...



ఆంధ్ర రంజీ జట్టు నాయకత్వ బాధ్యతల నుంచి సీనియర్ బ్యాటర్ హనుమ విహారి తప్పుకున్నాడు. బ్యాటింగ్‌పై పూర్తిగా దృష్టి పెట్టేందుకే కెప్టెన్సీకి రాజీనామా చేసినట్లు సమాచారం. బెంగాల్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో విహారి కెప్టెన్‌గా వ్యవహరించగా... అతని స్థానంలో ఈ మ్యాచ్ నుంచి రికీ భుయ్ సారథ్య బాధ్యతలు చేపట్టాడు.

సాత్విక్–చిరాగ్ జోరు

మలేసియా ఓపెన్‌లో సెమీఫైనల్లోకి ప్రవేశం



కౌలాలంపూర్: గత ఏడాది అద్భుతమైన ఫలితాలు సాధించిన భారత బ్యాడ్మింటన్ జోడీ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి కొత్త సీజన్‌లో కూడా తమ జోరు కొనసాగిస్తోంది. ప్రతిష్టాత్మక మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–1000 టోర్నీలో సాత్విక్–చిరాగ్ ద్వయం వరుసగా రెండో ఏడాది సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ రెండో ర్యాంక్‌లో ఉన్న సాత్విక్–చిరాగ్ 21–11, 21–8తో ప్రపంచ 32వ ర్యాంక్‌లో ఉన్న హి జి టింగ్–రెన్ జియాంగ్ యు (చైనా)లపై విజయం సాధించారు. కేవలం 35 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో సాత్విక్–చిరాగ్ ఆద్యంతం ఆధిపత్యం చలాయించారు. తొలి గేమ్‌లో వరుసగా ఏడు పాయింట్లు గెలిచిన సాత్విక్–చిరాగ్ అదే ఊపులో గేమ్‌ను దక్కించుకున్నారు. రెండో గేమ్‌లోనూ భారత జంట దూకుడు కొనసాగించింది. స్కోరు 7–3 వద్ద సాత్విక్–చిరాగ్ ఒక్కసారిగా చెలరేగి వరుసగా ఏడు పాయింట్లు నెగ్గి 14–3తో ఆధిక్యంలోకి వెళ్లి వెనుదిరిగి చూడలేదు. నేడు జరిగే సెమీఫైనల్లో ప్రపంచ మూడో ర్యాంక్ జంట కాంగ్ మిన్ హైక్–సియో సెయుంగ్ జే (దక్షిణ కొరియా)తో సాత్విక్–చిరాగ్ జంట తలపడుతుంది. ముఖాముఖి రికార్డులో సాత్విక్–చిరాగ్ 3–1తో ఆధిక్యంలో ఉన్నారు. మరోవైపు మహిళల డబుల్స్ విభాగంలో అశ్విని పొన్నప్ప–తనీషా క్రాస్టో (భారత్) ద్వయం పోరాటం ముగిసింది. క్వార్టర్ ఫైనల్లో అశ్విని–తనీషా జంట 15–21, 13–21తో రిన్ ఇవనాగ–కీ నకనిషి (జపాన్) జోడీ చేతిలో ఓడిపోయింది. అశ్విని–తనీషా జోడీకి 8,125 డాలర్ల (రూ. 6 లక్షల 73 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 6,600 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

ధ్రువ్ జురేల్‌కు చోటు

ఇంగ్లండ్‌తో తొలి రెండు టెస్టులకు భారత జట్టు ప్రకటన



ధ్రువ్

ముంబై: స్వదేశంలో ఇంగ్లండ్ జట్టుతో జరిగే ఐదు టెస్టుల సిరీస్ కోసం తొలి రెండు టెస్టుల్లో పాల్గొనే భారత జట్టును శుక్రవారం రాత్రి బీసీసీఐ ప్రకటించింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన యువ వికెట్ కీపర్ ధ్రువ్ జురేల్‌కు తొలిసారి జాతీయ జట్టులో చోటు లభించింది. 22 ఏళ్ల ధ్రువ్ భారత అండర్–19 జట్టుకు ఆడటంతోపాటు ఐపీఎల్‌లో రాజస్తాన్ రాయల్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు. భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య తొలి టెస్టు ఈనెల 25 నుంచి 29 వరకు హైదరాబాద్‌లో... రెండో టెస్టు ఫిబ్రవరి 2 నుంచి 6 వరకు విశాఖపట్నంలో జరుగుతాయి.

భారత టెస్టు జట్టు: రోహిత్ శర్మ (కెప్టెన్), బుమ్రా (వైస్ కెప్టెన్), గిల్, యశస్వి, కోహ్లి, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), కేఎస్ భరత్ (వికెట్ కీపర్), ధ్రువ్ జురేల్ (వికెట్ కీపర్), అశ్విన్, జడేజా, అక్షర్ పటేల్, కుల్దీప్, సిరాజ్, ముకేశ్ కుమార్, అవేశ్ ఖాన్.

ఆకాశాన్నంటుతున్న ఫ్లైట్ చార్జీలు..

- సంక్రాంతి ప్రయాణికులతో రాజమండ్రి, వైజాగ్, విజయవాడ విమానాలు ఫుల్

శంషాబాద్: సంక్రాంతి పండుగ ప్రయాణ సందడి ఆకాశయానంపై కూడా పడింది. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి, విశాఖపట్నం, విజయవాడకు హైదరాబాద్ నుంచి బయలుదేరే విమానాలు ప్రయాణికులతో రద్దీగా ఉంటున్నాయి. శని, ఆది, సోమవారాల్లో ఆయా ప్రాంతాలకు వెళ్లాల్సిన విమానాల్లో దాదాపుగా సీట్లన్నీ బుక్ అయ్యాయి. ఒకటి, రెండు సీట్లు ఉన్న వాటిలోని ప్రయాణచార్జీలు చుక్కలనంటుతున్నాయి. విశాఖపట్నానికి సాధారణ సమయాల్లో మూడు వేల నుంచి నాలుగు వేల రూపాయలు ఉండగా ఇప్పుడు ఏకంగా ముప్పైవేల పైచిలుకు చార్జీలు వసూలు చేస్తున్నారు. విజయవాడ, రాజమండ్రి వెళ్లే విమానాల్లో కూడా కనీసం పదివేల రూపాయలకు తగ్గకుండా చార్జీలున్నాయి. ఇందులో కూడా నేరుగా కాకుండా వయా ఢిల్లీ, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి వెళ్లే విమానాలు మాత్రమే ఎక్కువ సంఖ్యలో అందుబాటులో ఉన్నాయి. వీటిలో ప్రయాణ సమయం కనీసం 10 నుంచి 16 గంటల వరకు ఉంది.

చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం ఉదయం వాహనాల రద్దీ



హైవేపై 'సంక్రాంతి' రద్దీ

హైదరాబాద్- విజయవాడ మార్గంపై కిక్కిరిసిన వాహనాలు

చౌటుప్పల్: హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై వాహనాలు కిక్కిరిసిపోయాయి. హైదరాబాద్‌తోపాటు పరిసర ప్రాంతాల్లో నివాసం ఉండే ప్రజలు పండుగ కోసం స్వస్థలాలకు వెళ్తున్న క్రమంలో ఈ రద్దీ ఏర్పడింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే వాహనాల రద్దీ పెరిగిపోయింది. పంతంగి టోల్‌ప్లాజా వద్ద గురువారం అర్ధరాత్రి 12 నుంచి శుక్రవారం సాయంత్రం 6 గంటల వరకు 53 వేల వాహనాల రాకపోకలు సాగించాయి. గతేడాది రోజంతా(24 గంటలు) కలిపి అరవై వేల వాహనాలు మాత్రమే ప్రయాణించగా.. ఈ ఏడాది కేవలం 18 గంటల్లోనే 50వేలకుపైగా వాహనాలు వెళ్లడం గమనార్హం.

కళ్లెదుటే ఎద్దును చంపిందని...

పశువు కళేబరానికి విషం పెట్టి పులిని హతమార్చిన కాపరులు • మిగతా పులుల జాడ దొరికినట్టు సమాచారం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: వాంకిడి మండలం వెల్గి పరిధి రింగరేట్‌కు చెందిన ఇద్దరు కాపర్లు పశువులను మేతకని అడవికి తీసుకెళ్లారు. పశువుల మందపై పులి దాడి చేసి అందులో ఓ ఎద్దును చంపింది. ఈ విషయాన్ని కాపర్లు పశు యాజమాని జంగుకు చెప్పారు. తెల్లారి ఎద్దు చనిపోయిన చోటు వెళ్లి చూశారు. గత ఏడాది సైతం ఇదే తీరుగా ఓ పశువును పులి చంపేసింది. మరోవైపు వచ్చే వేసవిలో అడవుల్లో మేతకు పశువులను కాపర్లు లేకుండా వదులుతారు. ఈ క్రమంలో పులులు ఉంటే పశువులన్నింటిని చంపేస్తాయని భావించారు. మళ్లీ తినేందుకు వస్తుందనే నమ్మకంతో ఇంటికి వచ్చిన జంగు, జలపతి, బాలుడితో కలసి పురుగుల మందు ఎద్దు కళేబరంపై చల్లారు. అది తిన్న మగపులి నీటి ప్రవాహం వద్ద గత నెల 31న చనిపోయినట్టు సమాచారం. తమ పశువు చనిపోయిన విషయం అటు అధికారులు, ఇటు స్థానికులకు చెప్పలేదు. ఈ క్రమంలోనే ఈ నెల 6న కే15 ఆడపులి, 8న ఎస్9 మగపులి మరణాలు వెలుగులోకి వచ్చాయి. వీటిలో మగపులిపైనే విష ప్రయోగం జరిగినట్టు అనుమానం రావడంతో అధికారులు ఆ దిశగా విచారణ చేశారు. దీంతో అసలు విషయం వెలుగు చూసింది.

మిగతా పులులకు తప్పిన ముప్పు

దరిగాం అడవుల్లో ఎస్9 మగ, ఎస్6 ఆడపులి తోపాటు తమ రెండేళ్ల పిల్లలు కే15, కే16, కే17, కే18 సంచరిస్తున్నాయి. విష కళేబరం వద్ద మూడు పులులు ఉన్నట్టు కెమెరాకు చిక్కాయి. కెమెరాలో కనిపించిన ఫొటోల ప్రకారం నాలుగు పులులు కళేబరం వద్ద ఉన్నాయి. వీటిలో ఎస్9తోపాటు మరో మూడు పులులు ఉన్నాయి. ఆ పశువును తల్లి ఎస్6 పిల్లల కోసం వేటాడిందా? లేక మగపులి వేటాడిందా? అనే దానిపై స్పష్టత లేదు. ఆ కళేబరాన్ని మాత్రం ఎస్9 పులి తినడంతో చనిపోయింది. పశువును ఒకవైపు బోర్లా పడడమో లేక, వాసన పసిగట్టి తినకుండా ఉండడమో వల్ల మిగతా పులులు బతికి బయటపడ్డాయి. లేకపోతే మరో నాలుగు పులులు కూడా ప్రాణాలు కోల్పోయేవి. మరో వైపు ఏడాదిన్నర కే15 పులి ఆధిపత్య పోరులో మొదట చనిపోయినట్టు గుర్తించారు. వాస్తవానికి ఇప్పటి వరకు కవ్వాల్‌లో ఎప్పుడూ ఆధిపత్య పోరు పులుల మధ్య జరగలేదు. విషం తిన్న పులి విలవిల కొట్టుకుంటూ శరీర భాగాలకు గాయాలైనట్టుగా అనుమానాలు వస్తున్నాయి. ఇది కూడా విషం కారణంగానే చనిపోయిందా అనేది తేలాలంటే ఫోరెన్సిక్ ల్యాబ్ నుంచి ఫలితాలు వస్తే స్పష్టత వస్తుంది.

అంతర్రాష్ట్ర అధికారుల చర్చలు

మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దులో తడోబా, తిప్పేశ్వర్ నుంచి కవ్వాల్ టైగర్ కారిడార్‌లో పులుల రక్షణ, భద్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇరు రాష్ట్రాల అటవీ అధికారులు చర్చించారు. ఎన్‌టీసీఏ సూచనల మేరకు ఇరు రాష్ట్రాల అధికారులు అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ నెలలోనే సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు.



రెండేళ్ల క్రితం పశు కళేబరాన్ని తింటున్న ఎస్6, తన పిల్లలు (ఫైల్)

11 ఏళ్ల బాలుడి సహా నిందితులకు జ్యుడీషియల్ కస్టడీ

కాగజ్‌నగర్ రూరల్: కుమురంభీం జిల్లా దరిగాం అడవిలో పెద్దపులిని చంపిన ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్టు జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్ టోబ్రివాల్ తెలిపారు. కాగజ్‌నగర్ అటవీశాఖ కార్యాలయంలో శుక్రవారం ఆ వివరాలు వెల్లడించారు. జనవరి 8న మగపులి(ఎస్9) కళేబరం గుర్తించి, విచారణ చేపట్టారు. ఈ ఘటనలో వాంకిడి మండలం రింగరేట్ గ్రామానికి చెందిన ఇద్దరితోపాటు మరో మైనర్ బాలుడు(11) పాలుపంచుకున్నారన్నారు. పులిని చంపాలనే ఉద్దేశంతోనే పశువుపై కోవ గంగు, ఆత్రం జలపతి విషం చల్లినట్టు పేర్కొన్నారు. వీరిని గురువారం సాయంత్రం అదుపులోకి తీసుకొని శుక్రవారం కోర్టులో ప్రవేశపెట్టగా, నిందితులకు 12 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించినట్టు తెలిపారు. బాలుడిని తల్లిదండ్రుల వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేసినట్టు చెప్పారు.

నాంపల్లిలోనే ఇలా అయితే ఎలా?

- నిత్యం ఈ స్టేషన్ నుంచి పదుల సంఖ్యలో రైళ్లు, వేలాదిమంది ప్రయాణికుల రాకపోకలు
- డెడ్‌ఎండ్‌లో ఇసుక దంప్ ఎందుకు లేదు...సాంకేతిక, మానవ తప్పిదాలపై ఆరా
- విచారణ చేపట్టిన రైల్వే సేఫ్టీ కమిషన్



సాక్షి, హైదరాబాద్: 'చార్మినార్ ఎక్స్‌ప్రెస్' ప్రమాద ఘటనపై రైల్వే భద్రతా కమిషన్ విచారణ చేపట్టింది. ప్రమాదానికి దారితీసిన కారణాలపై సమగ్ర దర్యాప్తు ప్రారంభించింది. రైళ్ల నిర్వహణలో భాగస్వాములైన అన్ని విభాగాలపైనా భద్రతాకమిషన్ విచారణ షురూ చేసింది. సాధారణంగా ట్రైన్ స్టేషన్‌కు చేరుకోవడానికి ఒక కిలోమీటర్ ముందే వేగాన్ని పూర్తిగా తగ్గించి..ప్లాట్‌ఫాంపైకి చేరుకొనే సమయానికి నిలిచిపోయే విధంగా లోకోపైలట్ వేగాన్ని నియంత్రిస్తాడు. కానీ చార్మినార్ ఎక్స్‌ప్రెస్ డెడ్‌ఎండ్ (గోడ)ను ఢీకొట్టిన సమయానికి సుమారుగా 10 నుంచి 15 కిలోమీటర్ల వేగంతో ఉన్నట్టు అంచనా. డ్రైవర్ నిర్లక్ష్యమా, లేకపోతే మంచు కారణంగా సిగ్నల్స్ ముందస్తుగా గుర్తించకపోవడం వంటి కారణాల వల్ల వేగాన్ని పూర్తిగా అదుపు చేయలేకపోయారా అనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ఒకవేళ రైలు ఢీకొట్టినా, ఎలాంటి నష్టం జరగకుండా నివారించేందుకు అవసరమైన ఇసుక డంప్ డెడ్‌ఎండ్‌లో ఏర్పాటు చేయకపోవడం కూడా ప్రధానలోపంగా అధికారులు భావిస్తున్నారు. అదృష్టవశాత్తు ఎక్కువమంది ప్రయాణికులు సికింద్రాబాద్ స్టేషన్‌లోనే దిగిపోయారు. కొద్దిమంది మాత్రమే నాంపల్లిలో దిగారు. దీంతో నష్టం తీవ్రత తక్కువగా ఉంది. ఒకవేళ పట్టాలు తప్పిన మూడు కోచ్‌ల నిండా ప్రయాణికులుంటే పరిస్థితి వేరేలా ఉండేది. ప్రతిరోజూ పదుల సంఖ్యలో రైళ్లు, వేలాదిమంది ప్రయాణికులు రాకపోకలు సాగించే నాంపల్లి వంటి ప్రధాన రైల్వేస్టేషన్‌లోనే ఇలాంటి భద్రతాపరమైన సమస్యలు తలెత్తడంపై ఉన్నతాధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

700 కిలోమీటర్లు...20కి పైగా స్టేషన్లు

తాంబరం నుంచి నాంపల్లికి రాకపోకలు సాగించే చార్మినార్ ఎక్స్‌ప్రెస్ 20కి పైగా రైల్వేస్టేషన్‌ల మీదుగా నగరానికి చేరుకుంటుంది. అంటే 700 కిలోమీటర్లకు పైగా ప్రయాణిస్తుంది. ఇద్దరు లోకో పైలట్‌లు, మరో ఇద్దరు సహాయ లోకో పైలట్‌లు విధులు నిర్వర్తిస్తారు. ఒక టీమ్ తర్వాత మరో టీమ్ విధుల్లో చేరుతుంది. 20 స్టేషన్లలో వేగ నియంత్రణ కోల్పోకుండా నిర్ణీత ప్లాట్‌ఫాంపైనే ట్రైన్‌ను నిలిపిన వారు ఆఖరి గమ్యస్థానమైన నాంపల్లికి చేరుకున్న తర్వాత రైలు డెడ్‌ఎండ్‌ను ఢీకొట్టడం రైల్వే భద్రతా అధికారులు, నిపుణులను విస్మయానికి గురిచేస్తోంది. రైలు నిలపాల్సిన సమయంలో లోకోపైలట్ ఏమరుపాటుగా ఉండొచ్చనే అభిప్రాయం వినిపిస్తోంది. మరోవైపు వేగాన్ని అదుపు చేయడంలో నిర్లక్ష్యం వహించి ఉండొచ్చని భావిస్తున్నారు.

గోల్కొండ ఎక్స్‌ప్రెస్ ఘటన నుంచి

పాఠాలు నేర్వని వైనం

ఇరవై ఏళ్ల క్రితం వరంగల్ రైల్వేస్టేషన్‌లో గోల్కొండ ఎక్స్‌ప్రెస్ డెడ్‌ఎండ్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో 20 మందికిపైగా చనిపోగా, వందమందికి పైగా గాయపడ్డారు. రైలు వేగానికి ఇసుక డంప్‌లు, డెడ్ ఎండ్ కూలిపోయాయి. రైలు ఇంజిన్ బ్రిడ్జిపైకి వచ్చింది. అప్పట్లో ఇదో సంచలనం. ప్రస్తుతం ఇదే తరహాలో చార్మినార్ ఎక్స్‌ప్రెస్ డెడ్‌ఎండ్‌ను ఢీకొట్టింది. వేగం తక్కువగా ఉండడం వల్ల నష్టం జరగలేదు. నాంపల్లిలో ఇసుక డంప్‌ను ఏర్పాటు చేసి ఉంటే తక్కువ వేగంతో వచ్చే రైళ్లు డెడ్‌ఎండ్‌కు ఢీకొట్టినా ఇసుక బస్తాలపైనే ఒత్తిడి పడుతుందని, నష్టం ఉండదని నిపుణులు పేర్కొంటున్నారు.

యూఏఈలో ఉపాధికోసం ఉచిత వీసాలు

- ఏడీఎస్‌హెచ్ కంపాస్ కంపెనీ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్
- జగిత్యాల, నిజామాబాద్‌లలో ఇంటర్వ్యూలు



మోర్తాడ్ (బాల్కొండ): యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లోని ఏడీఎస్‌హెచ్ కంపాస్ కంపెనీ జీటీఎం ఇంటర్నేషనల్ సంస్థ భాగస్వామ్యంతో ఉచిత వీసాల జారీకి స్పెషల్ డ్రైవ్ నిర్వహించడానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకు యూఏఈ, ఖతర్‌లలో ఉపాధి కల్పించడానికి ఉచిత వీసాల జారీకి పలుమార్లు రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించిన ఈ కంపెనీ మరోసారి రెండు రోజుల పాటు స్పెషల్ డ్రైవ్‌ను కొనసాగించనుంది. ఈనెల 19న జగిత్యాలలో, 20న నిజామాబాద్‌లో క్లీనింగ్ సెక్షన్‌లో ఉపాధి అవకాశాలు కల్పించడానికి ఇంటర్వ్యూలను నిర్వహించనున్నారు. వలస కార్మికులకు పూర్తిగా ఉచితంగానే వీసాల జారీతో పాటు విమాన టికెట్, యూఏఈ వెళ్లిన తరువాత వసతి, భోజన సదుపాయం కల్పించనున్నట్లు రెండు సంస్థల వర్గాలు వెల్లడించాయి. ఈసీఎన్ఆర్ పాస్‌పోర్టు కలిగి.. 21 ఏళ్ల నుంచి 35 ఏళ్లలోపు వయసు ఉన్న అభ్యర్థులు ఇంటర్వ్యూలలో పాల్గొనడానికి జీటీఎం కంపెనీ శాఖలలో పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంది. వివరాల కోసం సిరిసిల్ల (9347661522), ఆర్మూర్ (8332062299), నిజామాబాద్ (8686860999), జగిత్యాలలోని (8332042299) నంబర్లలో సంప్రదించాలని జీటీఎం సంస్థ చైర్మన్ చీటీ సతీష్‌రావు 'సాక్షి'తో చెప్పారు. ఎవరికీ పైసా ఇవ్వకుండానే ఉచితంగా వీసాలు పొందే అవకాశం ఉన్నందున దీనిని వలస కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.